





శ్రీరస్తు

శుభమస్తు　　అవిఘ్నమస్తు



# హరి నీమయమే అంతాను

(సంపుటి - II)

## ఎన్నుకొన్న
## అన్నమయ్య మధురకీర్తనలకు

**ఉపోద్ఘాతము మరియు తాత్పర్యవివరణ**

రచన

**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**

**M.Tech.**

# హరి నీమయమే అంతాను

(సంపుటి - II)

మొదటి ప్రచురణ

**ఆగష్టు 2013**

రచన

**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**

వెల : **అమూల్యం**

ప్రతులకు :

ఫ్లాట్ నెం. 5, ప్లాట్ నెం. 61, సిద్ధార్థ నగర్,

హైదరాబాద్ - 38. ఫోన్ : 093930 21360

డి.టి.పి. ప్రింటింగ్ :

**కె.వి.ఆర్.**

98495 79345



హరి నీమయమే అంతాను

## అంకితము

## దశరథుని కంటివెలుగు అయిన

# శ్రీరామచంద్ర మూర్తికి..



నా ఇష్టదైవము, శ్రీ వేంకటేశ్వరుని త్రేతాయుగ రూపమైన కౌసల్యానందనుడు దశరథుని కంటివెలుగు అయిన శ్రీరామచంద్రమూర్తికి...

మ॥ **నరుడై పుట్టి వసించ మానవునిగా నారాయణుండే ధరన్**
**పరమాన్నంబు భుజించ తాను కలిగెన్ పాపండు కౌసల్యకై**
**సిరితావచ్చెను సీతవోలె దనుజుల్ క్షీణించ లంకేశుతో**
**కరుణాసింధుని కంకితమ్ము నిడెదన్ కావ్యంబునిద్దానిన్.**

తా॥ మానవుడై పుట్టి జీవిస్తేగాని రావణాసురుడు తన చేతిలో చావడని శ్రీమన్నారాయణుడంతటివాడు పరమాన్నము తిన్న కౌసల్యకు పాపనివలె జన్మించాడు. లక్ష్మీదేవి సీతయై రాక్షస సంహార కార్యక్రమానికై తాను సిరులరాణియైకూడా కన్నీరు కార్చింది. ఆమెతో ఈయనా శోకించాడు. ఆ కరుణా సముద్రుడు శ్రీరామచంద్రునికి ఈ కావ్యం అంకితమిచ్చి తరించెదగాక!

# హరి నీమయమే అంతాను

## (సంపుటి - II)

## ఎన్నుకొన్న అన్నమయ్య మధుర కీర్తనలకు ఉపోద్ఘాతము మరియు తాత్పర్య వివరణ

## విషయ సూచిక


| క్ర.సం. | విషయం | పేజి |
|---|---|---|
| 1. | అంతరాత్మ హరిగలడ | 171 |
| 2. | అంతవానికింతసేయ | 159 |
| 3. | అచ్చపురాలయమునలో | 141 |
| 4. | అదివో నిత్యశూరులు | 163 |
| 5. | అదెవాడెయిదెవీడె | 173 |
| 6. | అరుదరుదీగతి యహోబల | 131 |
| 7. | అడ్డములేని నాలుక నాది | 177 |
| 8. | అనుచు బొగడెజొచ్చె | 175 |
| 9. | అన్నిటా భాగ్యవంతుడవవుదువయ్యా | 51 |
| 10. | ఇంకనైనా కరుణించవేమయ్యా | 27 |
| 11. | ఇందరి గాచిన నీవు యిట్టే నీవు | 85 |
| 12. | ఇందిరకునురము మీద | 145 |
| 13. | ఇటునిను దెలియగ నెంతటి | 187 |
| 14. | ఇటువలె నుండవద్దా యిరవై | 43 |
| 15. | ఇట్టే నీమోము చూచిమోవినవ్వేవు | 19 |
| 16. | ఇదివో తెలుసుకోమ్మా యీరెంటికీ | 07 |
| 17. | ఈకె కలుగగ గదా! ఇన్నియును నెలవెట్టి | 39 |
| 18. | ఉవిదలాల చూడరే | 129 |
| 19. | ఎంచుకొమ్మా నీకు నీవే ఈ తగవులు | 41 |
| 20. | ఎంతప్రతాపము వాడు యెంతటి నేర్పరి | 109 |
| 21. | ఎంత మోహమో ఇతడు నీమీదను | 37 |
| 22. | ఎంత భాగ్యవంతులమో | 139 |
| 23. | ఎక్కడి పరాకు నీకు యెందాకాను | 11 |
| 24. | ఎక్కడి పురాకృతమేమి | 189 |
| 25. | ఎట్టయినా జేయుము | 199 |
| 26. | ఎట్టున్నదో నీ చిత్తమెదురాడ నేవెఱతు | 99 |
| 27. | ఎదిరించిపోట్లాడ | 101 |
| 28. | ఎన్నడు నేగందు నిందు నిందిరాపతి | 89 |
| 29. | ఎరిగితి నమ్మితి నితడు | 169 |
| 30. | ఎరిగీనెరుగదు ఏమిసేతు | 113 |
| 31. | ఎల్లలోకములవారికేలిక | 149 |
| 32. | ఎదుటనే వున్నది ఇంతి గడుబిన్నది | 15 |
| 33. | ఏమిసేయుదు నింతయు నీమాయ | 91 |
| 34. | ఏలమమ్ముగాసి సేసేరింకా | 193 |
| 35. | ఔభళేశ వోగునూతలౌభళేశ | 23 |
| 36. | కంటిరా వోజనులాల | 123 |
| 37. | కందము విందముగాక కన్నులారను | 75 |
| 38. | కటకటా యీప్రాణి గతిగనుట | 185 |

| | | |
|---|---|---|
| 39. | కలది యీ మూర్తి వల్లగతెగ | 153 |
| 40. | కలదొక్కటే గురి కమలాక్షునీకరుణ | 93 |
| 41. | కలుషపు చీకటి | 147 |
| 42. | కైకొంటే కాక కమలనాభుని | 181 |
| 43. | కొలచిన వారికి | 121 |
| 44. | చొక్కపు నీ పెండ్లినాడే సుక్కురారము | 17 |
| 45. | తలచరో జనులు యీతని | 191 |
| 46. | తల్లి బాసినబిడ్డ | 137 |
| 47. | తాపసులడవియేడ తరుణియేడ | 33 |
| 48. | తెగక పరమునకు తెరువు | 119 |
| 49. | తెగగోయుటకు హరిదివ్య | 195 |
| 50. | దానికేమి దోసమా తగినగేస్తురాలవు | 03 |
| 51. | దైవమా నీకు వెలితా తలపువెలితేగాని | 01 |
| 52. | దైవమొక్కడే సంతత భజనీయుడు | 83 |
| 53. | నదువరో జడియక | 105 |
| 54. | నదులొల్లవు నాస్నానము | 167 |
| 55. | నమ్మితిజుమ్మీ ఓమనసా | 115 |
| 56. | నమో నారాయణ నా విన్నపమిదివో | 87 |
| 57. | నారాయణ నీదాసుల నడకలివి | 117 |
| 58. | నిండు కంతటా నున్నది | 135 |
| 59. | నిఖిలమంతయు మేలు | 111 |
| 60. | నిన్ను గొసరేటి యట్టి నేనే యెడ్డె | 05 |







| | | |
|---|---|---|
| 61. | నిన్ను గూడిన విభుని నిలువెల్లా | 49 |
| 62. | నిన్ను బాయగలడటే నిమషమైనా | 47 |
| 63. | నీకు నీవే వలసితే నీవు నన్నుగాచుకొమ్ము | 201 |
| 64. | నీకునాకునెట్టు గూడె నీవెట్టు నన్నేలితి | 97 |
| 65. | నీటముంచు పాలముంచు నీ చిత్తమికను | 79 |
| 66. | నీడల చూపులు నీకేలే యీ | 57 |
| 67. | నీతో నవ్వగలమా నెఱజాణవు | 09 |
| 68. | నీవెకా చెప్పుజూప | 161 |
| 69. | నీవారైన వారికి నీపై | 127 |
| 70. | నీవెఱగవా చెలియా నెఱజాణవు | 45 |
| 71. | నేనన్నిటా గ్రూరుడ | 155 |
| 72. | నెరబిరు దిన్నిటాను నీ బంటు | 143 |
| 73. | పరమ పురుషుడీ బాలుడట | 165 |
| 74. | పలుయోనులందు పుట్టి | 197 |
| 75. | పొదలెనిండుకళల పున్నమినేడు | 55 |
| 76. | పొద్దిక నెన్నడు వొడచునోపోయిన | 53 |
| 77. | బాపుబాపు కృష్ణా బాలకృష్ణా | 31 |
| 78. | బిరుదు బంటీతడు | 107 |
| 79. | మదన రాగము నీకు మదనాతురము నాకు | 77 |
| 80. | మానరెమాయలు మగువలు | 65 |
| 81. | మేటి నేరుపరులాల మెలతలాల | 61 |

| | | |
|---|---|---|
| 82. | మేమెరుగమాయేమి మీ సుద్దులు | 69 |
| 83. | మొక్కలీడువయ్య నీవు ముద్దువిట్ఠలా | 13 |
| 84. | రట్టడి కడపరాయడిట్టె వీడు | 21 |
| 85. | రాతి బతిమసేసిన రామచంద్ర | 29 |
| 86. | లేదందువల్ల తెలివి | 125 |
| 87. | వలదను నొరులకు వసమటవే | 73 |
| 88. | వాడుగదే ప్రహ్లాదవరదుడు | 35 |
| 89. | వాదమేల సారెసారెవడి | 183 |
| 90. | విరులదండతోడి విట్ఠలేశా! | 25 |
| 91. | విశ్వరూప నీమూర్తి | 133 |
| 92. | వెక్కసమగు కుచవిభవము | 71 |
| 93. | వెలది సొబగులివి విన్నవించితిమి | 67 |
| 94. | శ్రీపతీ నీకెదురుచూచేనాకు నిట్టనే | 81 |
| 95. | సమసె రావణుడు సమరము | 151 |
| 96. | సర్వేశ్వరా నీకు శరణుచొచ్చితిమిదె | 95 |
| 97. | సేయగల విన్నపము సేసితిమి నీతోడి | 63 |
| 98. | హరిగొలిచియు మరీ | 179 |
| 99. | హరిదాసులతోడ | 157 |
| 100. | హరి నిన్ను పిలిచీని అదివో అమ్మా | 59 |
| 101. | మంగళం | 203 |






# ప్రార్థన

కం॥ శ్రీ వేంకటగిరివాసా!
నీ విరహము నీ చతురత నీ సరసములన్
కావించె అన్నమార్యుడు
చేవగు విందాయె, మాకు జీవన భృతియున్

ఉ॥ కూడెను వేంకటేశ్వరుడు కోమలి పద్మను జాలువారెబో
వేడుకతీరు భోగములు వెన్నెలతాపము వింతచేష్టలున్
తోడగు నెచ్చెలై రతుల తోయజనాభుని గుట్టు విప్పెరా
వీడని అన్నమయ్యకిది విష్ణుని సేవయె వేదఘోషయే.

చం॥ తిరుమల వేంకటేశ్వరుడు తీయని ప్రేమలముంచె దేవులన్
వరముగ అన్నమయ్య కిటు పాడుము నారతి వైభవం బనెన్
సురుచిర లీల తెల్పె కవి సుద్దుల ముద్దుల మోవి తేనెలన్
విరియును మాధురీ భకితి విందుగ మున్నుడి భావముల్ వినన్.

సీ॥ కరుణామయా! హరీ! కనకాంబరా! హరీ
కరుణించు కడదాక శరణు శరణు
తిరువేంకటాధీశ! పురుషోత్తమా! హరీ!
శమియించునేరాలు శరణు శరణు
కరిరాజవరద! శ్రీకర! చారుదరహాస!
హరి నాకు వరమిమ్ము శరణు శరణు
మరణమ్ము దరిజేర చిరునాల్కపై జేరి
హరిహరీ! అననిమ్ము శరణు శరణు

ఆ.వె॥ భక్తి నిలువనిమ్ము పరమాత్మ శరణంటి
భ్రమలపాశద్రోలు పనిచి శరణు
దిక్కు నీవె తండ్రి! దేవోత్తమ! శరణు
చక్కజేయుమయ్య! శరణు శరణు

మ॥ హరి నీమాయనెరుంగ మాకు వశమే! అజ్ఞానికెట్లౌనురా?
కురిపించంగదవే! కృపన్ నిలుచుచున్ కూటస్థుడౌ శ్రీపతీ!
ధర నీకెవ్వరు సాటిరాగలరురా! తండ్రీ! జగన్మోహనా!
వర శ్రీవేంకటనాయకా! విడువ నీ పాదంబులన్ జుట్టెదన్.

తే.గీ.॥ కనుల గోచరమవనట్టి కమలనాభు
వేదరాశులకందని విశ్వరూపు
భక్తిలేకున్న స్థిరముగా మనసునందు
తెలియసాధ్యమా!! యేరికి, కలను గాదు.

కం॥ తిరుమలరాయని గొలువుడు
తరుగునురా పాపరాశి ధన్యత కలుగున్
తరగని వరములు కురియును
తరియించును వంగడంబు తరతరములకున్

శా॥ నాదోపాసన గొప్పసాధనమురా నారాయణున్ జేరగా
వాదం బేటికి? ప్రాప్యస్థానమతడే వాంఛించకైవల్యమున్
ఏదో జన్మసుకృత్యమిట్లు వెలసెన్ హే శ్రీపతీ! ధన్యుడన్
తాదాత్మ్యంబుగ అన్నమయ్య కృతులన్ తర్కించి నే జెప్పెదన్

ఆ.వె.॥ కాదు అన్నమయ్య, కాదురా త్యాగయ్య
కారు రామదాసు ధరణి నరులు
కూనిరాగములతో కొలిచినా హరి మెచ్చు
భక్తిలేని నోట భజనలేల?

ఉ॥ పాదరసంబు వోలెవడి బట్టగ కాదుర చంచలంబు, ఆ
వేదన జిక్కు నా మనసు వేంకటనాయక యేమిసేతురా
పాదము బట్టి వేడెదను పాయక కట్టుము నీదు ధ్యాసలో
కాదనకయ్య! నీచమగు కావిరి జన్మలనెత్తలేను రా!





సీ॥ శోధించి వేధించి శుష్కింప జేసిన
"హరి ఆర్తరక్షకు" డనుటయెట్లు?
కర్మగిర్మయటించు కథలన్ని నాకేల
నాదు భారము నీది నందకధర!
తొలగించి వేదన తుడువక కన్నీరు
దీనబంధుడవెట్లు తిరుమలేశ!
శరణాగతత్రాణ బిరుదంబదేలరా?
కరుణగావకయున్న కమలనాభ!

ఆ.వె॥ బిడ్డ తప్పుజేయ బిగియించునా తండ్రి?
తప్పు దిద్ది మంచి దారి జూపు
జగతినెందునైన సర్వసామాన్యమే
వెకలిజెప్పుటేల వేంకటేశ!

**మత్తకోకిల:**

ఏమిటీ హరిమాయ దెల్పను యేమి నాగతి శ్రీపతీ!
కామక్రోధములొగ్గనైతిని కండకావరమెక్కగా
ఏమిసేతును కాలుడొచ్చెను ఇంటివాకిట నిల్చెనే
రామచంద్రుని గొల్వనైతిని లక్షబుద్ధుల జెప్పినన్.

కం॥ నమ్మి చెడినవాడెవ్వడు
ఇమ్ముగ శ్రీవేంకటేశు నిహపరములకున్
అమ్మలకమ్మగు అమ్మను
నెమ్మదిలో నిల్పుకొన్న నిపుణుండితడే.

# ముందుమాట

“హరినీమయమే అంతాను” అనబడే ఈ సంకీర్తనా స్రవంతిని మొదలుపెట్టినప్పుడు నా మనస్సులో వున్న ఆలోచన నా అంతిమ శ్వాసదాకా యెన్ని కీర్తనలు అన్నమాచార్యులవారివి వివరించగలిగితే అన్ని వివరిద్దామని మాత్రమే. గతంలో 1010 అన్నమాచార్యులవారి కీర్తనలను ఉపోద్ఘాత సహితముగా తాత్పర్యవివరణ ఇచ్చి, **భావయామి వేంకటేశం – హరి నామమే కదా! అన్నమయ్య వరము** అనే రెండు ప్రతులుగా 30 కాపీలు ప్రింటు (డి.టి.పి) చేయించి శ్రీ వేంకటేశ్వరుని ఆలయాలలో పంచిపెట్టాను. అంతకు మించి నాకు ఆర్థిక స్తోమత లేదు.

నాకు భగవత్కృప కలిగి తిరుమల సందర్శించటానికి వెళ్ళి నా వెంట కొన్ని ప్రతులను అక్కడి పెద్దలకిచ్చి కంప్యూటర్ సి.డి.నందించి నా అశక్తతను మొరవెట్టి దానిని వెలుగులోకి తేవలసినదిగా అర్థించాను. శ్రీవేంకటేశ్వరుడు ఆ మహానుభావుల రూపంలో నన్ను అనుగ్రహించి దానిని వెలువరించ నిశ్చయించారు. నా జీవితం ధన్యమయింది.

ఈ కార్యక్రమానికి నాలుగు నెలల సమయం పట్టింది. ఈలోగా 108 అన్నమాచార్యులవారి ప్రత్యేక కీర్తనలు యెన్నుకొని వాటికి ఉపోదాతసహిత తాత్పర్య వివరణనందించాను. అవి అన్నీ అతిపొడవైన (సుదీర్ఘమైన) అందుకనే ఆ నా ప్రయత్నానికి “పొడవుకు పొడవైన పురుషోత్తమా” అని పేరుపెట్టాను. దానిని “సుజనరంజని” హైదరాబాదు వారికి అందించాను. ఎందుకంటే “సుజనరంజని” వారి “అన్నమయ్య పదామృత వర్షిణి” నాకు మార్గదర్శకంగా తొలినాళ్ళలో నిలిచింది. అదే నాకు స్ఫూర్తి అయింది. ఏ చేతిని పట్టుకొని అడుగులేయటం నేర్చుకొని ఆ చేతిని మఱచేవాడు నా దృష్టిలో మనిషే కాదు. మనిషి స్వార్థ జీవి అనే మాట నిజమే కాని ప్రతిక్షణం బేరీజు వేసికొంటూ స్వార్థాన్ని నియంత్రించుకోవటమే “బ్రతకటం” అంటే.





ఈ నా ప్రస్తుత ప్రయత్నము “హరి నీ మయమే అంతాను” గురించి ముచ్చటిస్తాను. నాకు పద్యరచన అంటే చాలా మక్కువ. ఇది యే జన్మ సిద్ధియో నాకు తెలియదు. కబీరుదాసు దోహాలను ఆటవెలది పద్యాలుగా తాత్పర్యసహిత వివరణ నిచ్చినప్పుడు నాకు కలిగిన తృప్తిని మాటలలో వర్ణించలేను.

మనము చేసిన యే పనినైనా కాగితంపై పెడితే అది యేనాటికైనా, యెవరికో ఒకరికి, యేదో ఒక విధంగా వుపయోగిస్తుందని నమ్మే ఆశావాదిని నేను. అందుకనే నాచేత భగవంతుడు చేయించిన రచనలన్నింటినీ నా వెబ్‌సైట్‌లో పెట్టాను “గూగుల్” నెట్‌వర్క్ ద్వారా ప్రపంచంలో యెక్కడవున్నా దానిని మీరు చదువుకోవచ్చు. “geetadeeksha” అనే సైట్‌కి లాగ్‌ఆన్ అయితే చాలు. వినాయక చవితి వచ్చింది. మీకు ఒక్క శ్లోకమూ రాదు అనుకోండి వెంటనే నా వెబ్‌సైట్‌ను చూడండి. “భగవద్గీత” అంటే యేమిటి అనే జనరేషన్ రాబోతున్నది. మీ తర్వాతి జనరేషన్‌ను ఎలా కాపాడుకుంటారో మీ చేతిలోనే వున్నది. నన్ను నమ్మండి. సంస్కృతిని మరిచే వాడు, కన్నతల్లిని మరచేవాడు పుట్టినా ఒకటే చచ్చినా ఒకటే. లెక్కపెట్టలేనన్ని కోట్లు సంపాదించి జీవచ్ఛవాలలాగా బ్రతుకుతూ యెప్పుడు చస్తాడో తెలియని బ్రతుకు దేనికి? ఏ ఒక్కడికీ ఉపయోగించని జీవితం యెందుకు? అందుకని, ఇప్పటికైనా ఆ సర్వేశ్వరుడు మెచ్చే పనిచేద్దాం. తోటి వారికి సహాయం చేయండి. కనీసం వారికి మంచిని చెప్పండి. పరనింద చేయకండి. నేను చెప్పేదే కరెక్ట్ అనే మొండితనం మానండి. కళ్ళుమూసుకొనేది మీరే... కానీ ఆ కళ్ళు తెరుచుకోవాలంటే మనలోని అంతర్యామి అవుననాల్సిందే. లేకపోతే మూసిన కన్ను తెరుచుకోదు. ఇది సత్యం. కనుక “హరి నీమయమే అంతాను” అనుకొంటూ జీవించండి. చక్కటి మానసిక వైభవం పొందండి. నిరంతరం ఆనందంగా వుండండి. ఒక చక్కటి ఇంగ్లీషు సూక్తి వినండి. If it has to happen, it will happen.

Otherwise it will never happen. It is Gods will. ఈ సృష్టిలో సర్వమూ హరిమయమే. ఆయన చైతన్య స్వరూపుడు. ఆది మధ్యాంతరహితుడు. గుణాతీతుడు. అవదనుకొన్న పనిని అయ్యేట్లుగాను అవుతుందనుకొన్న పనిని అవకుండాను చేస్తాడు. అంటే యేమిటి? సంకల్ప వికల్పాలు ఆయనవే కాని మనవి కావు. మనం కేవలం నిమిత్తమాత్రులం. ఆయన కావాలనుకొన్నది, ఆయన అనుకొన్నప్పుడు, ఆయనకనుగుణంగా, ఆయనకెవరిపై దయగలిగితే వారితో చేయించుకోగలడు. వద్దనుకుంటే ఒకే ఒక్క సెకనులో సర్వమూ ఆపించగలడు. ఇంత తెలిశాక ఇంకా విచారము, ఆనందము, నిరాశ, ఆశ వేధిస్తాయా? 'హరి నీమయమే అంతాను' అని భావించేవాడు ఒక నాటికి రాగాతీతుడై నిత్యముక్తుడవుతాడు. వాడి శరీరం పడిపోవటం కేవలం ఒక పరిణామమవుతుంది అంతే.

నేటి నవీనయుగంలో జియ్యరులవంటి మహామహులకే సంఘంలో జరుగుతున్న పరిణామాలను అవసరం మేరకు ఖండించాల్సి వస్తోంది. శృంగేరివంటి పీఠాధిపతులకే సంఘంలో జరుగుతున్న అసామాన్యతలను తెగడవలసి వస్తోంది. సామాజిక అవసరాలు తీరక సంపాదన చాలక అక్రమాలు చేసేస్తున్నారు. చేయలేనివారు నిరాశా నిస్పృహలతో జీవిస్తున్నారు. కానీ శ్రీకృష్ణ భగవానుడు గీతలో చెప్పినట్లు యెవరినివారే ఉద్ధరించుకోవాలి. పక్కవాడు యెలాగైనా వుండనీ, నేను మాత్రం నిజాయితీతో వుంటాను అనే దృఢ నిశ్చయంతో ప్రతివాడూ వుంటే ఈ సంఘం చూస్తుండగానే బాగుపడుతుంది. అరే! వాడు లంచం తీసికొని బాగుపడుతున్నాడు నేను ఎదుగూ బొదుగూ లేకుండా అఘోరిస్తున్నాను అని ప్రతివాడూ అనుకోబట్టే లంచగొండులు పెరిగిపోయారు. మనిషి రక్తం రుచి మరిగిన పులుల్లా వీళ్ళు మనుష్యుల్ని పీక్కుతింటున్నారు. మరి వీరిలో ఒక్కడన్నా మారవలెనంటే ఒకే ఒక సాధనం భక్తి. ఆ భక్తి న్యాయంపైన వుండాలి. సంఘంపైన వుండాలి. తన గురువుపై వుండాలి. పరిపాలకులపై వుండాలి. అన్నిటినీ మించి





ఇంతటికీ కారణమైన దైవంపై వుండాలి. ప్రభుత్వంపై వుండాలి. తన యజమానిపై వుండాలి. తన వృత్తిపై వుండాలి. నేటి సమాజంలో ఇవన్నీ కొరవడుతున్నాయి కాబట్టే చెప్పిన మాటవినని ఉద్యోగులు, భార్యలు, పిల్లలు, సేవకులు పుంఖానుపుంఖాలుగా తయారవుతున్నారు. వీరందరి అంతరాత్ముడు శ్రీహరే. కాబట్టే వీరందరికీ తాము చేస్తున్నది తప్పు అని తెలుసు. కానీ అహంకారం అంతరాత్ముని నోరుమూయించి చెడగొడుతున్నది. ఆ అపరాధ భావననుంచి తప్పుకోవాలనే అందరి తాపత్రయం. బెంబేలెత్తిపోతున్న యువత మత్తుకు లొంగిపోయింది. స్త్రీత్వం విశృంఖలత నేర్చుకొన్నది. సామాన్య ప్రజ చట్టవ్యతిరేకి అయింది. ఇప్పుడేది దారి? వీటిలో యెన్నడూ చెడనివాడు దైవం ఒక్కడే. ఆయనను శరణనండి ముందు మీరు మారండి. ప్రతిదీ దానంతట అదే సర్దుకొంటుంది. "హరి నీమయమే అంతాను" అనుకున్నవాడు తన యెదురుగానే శ్రీహరి వున్నాడని యెన్నటికీ తప్పు చేయడు.

ఇందులో నేనెన్నుకున్న అన్నమయ్య కీర్తనలకు భావక్రోడీకరణతో వివరించిన పద్య వివరణ అనుబంధంగా ప్రతి కీర్తన చివరిగా యిచ్చాను. ఇది నా ఆత్మతృప్తికి నేనెన్నుకొన్న హరిమార్గం. తాత్పర్య వివరణలో కూడా కొంత వ్యత్యాసం చూపించాను. తెలియని పదములకు పాఠకులు అర్థం తేలికగా గుర్తుపట్టి అర్థం చేసికొనగలరు.

అలాగే ఉపోద్ఘాతంలో ఆ కీర్తన ప్రాశస్త్యం గురించి, ప్రత్యేకంగా నేర్వవలసిన సంగతుల గురించి తెలుసుకోవచ్చును. ప్రతి కీర్తనకు టి.టి.డి. సంపుటి సంఖ్య రోమన్ లెటర్సులోను కీర్తన సంఖ్య ఇంగ్లీషు సంఖ్యలలోనూ ఇవ్వబడింది. IV/209 అంటే. అన్నమయ్య కీర్తనల నాలుగవ సంపుటిలోని 209వ కీర్తన అని అర్థం. భక్తి కంటే తరించే మార్గం జ్ఞానం కానీ భక్తి లేని జ్ఞానం పరిమళంలేని పుష్పం. భక్తి జ్ఞానం రెండూ వున్నవాడికి మోక్షం ఇంకా సుగమం అవుతుంది. ఈ కీర్తనలు భక్తి ఇనుమడింపజేసికోవటానికి ఉపయోగపడితే వీటి తాత్పర్యవివరణ జ్ఞానం పెంపొందించుకోవటానికి దోహద పడుతుంది అనే మాట నిజం.

ఇకపోతే, ఈ సంపుటి– II గురించి రెండు మాటలు ప్రస్తావిస్తాను. అన్నమయ్య చేపట్టిన శృంగార వర్ణన అంతా అమలినమే. పైకి స్త్రీ, పురుష రతి సమాగమం వలె అనిపించినా అది ఆత్మ – పరమాత్మల ఐక్యమే. మనోవాక్కాయ కర్మలా పరమాత్మలో ఐక్యమవ్వాలని ఆత్మపడే తహతహలే, మనకి స్త్రీ పురుష విరహవేదనవలె అనిపిస్తున్నది. కాని అన్నమాచార్యులంతటి యోగికి రతిలీలా వర్ణన, ఆత్మ, పరమాత్మల అనుసంధానమే.

అందుచేత ఈ కీర్తనలను శృంగారకీర్తనలని కాక మధురభక్తి కీర్తనలు లేక మధుర కీర్తనలు అని వ్యవహరిద్దాం. అన్నమయ్యవలె నాకు పరమాత్మ తత్త్వం అవగతమే కాలేదు. నేను ఒక జగన్నాయకుని సేవలో తుదిశ్వాస విడువాలనే ఆశతో జీవిస్తున్న అసంఖ్యాకులలో అతి సామాన్యుడను. అన్నమయ్యకు కైవల్యాన్ని ప్రసాదించిన ఆ శృంగారరాయడు నాబోటివానిని కనీసం ఎవడురా వీడు అని చూస్తాడా అంటే... అవుననే అర్హతే లేదు. అయినా నా కర్తవ్యం నేను నెరవేరుస్తాను. ఫలితాన్ని ఆశించను. పరమాత్ముడైన శ్రీవేంకటేశ్వరుడు తన దేవేరితో గూడి రతులదేలి భారతావనిని నిరంతరం శాంతి సౌభాగ్యాలతో వుంచుగాక!

ఇంకొక్క విషయం మనః పూర్వకంగా మనవి చేస్తున్నాను. అన్నమయ్య వాడిని కొన్ని మాటలకి నిఘంటువుల్లో అర్థం లభించదు. అథవా లభించినా ఆ అర్థం సూటిగా అన్వయించలేము. కొన్ని కొన్ని ఆనాటి వాడుక పదాలు ఈనాడు వాడుకలోలేవు. అందుకని ఊహకూడా ఉపకారే అవుతుంది.















## హరి నీమయమే అంతాను సంకీర్తనలు

సంఖ్య: IV/407 రాగం : సాళంగనాట
కీర్తన : దైవమా నీకు వెలితా తలఁపువెలితేకాక

### సాళంగనాట

**1 దైవమా నీకు వెలితా తలఁపువెలితేకాక**
**వేవేలుకర్మాల వేసారఁగవలసె** ॥పల్లవి॥

**హరియంటేఁ బాపేటి అన్ని పాపాలు సేసిన**
**పొరి నందుపై నమ్మిక పుట్టదుగాక**
**నరసింహాయంటే వచ్చేనానాపుణ్యాలకు**
**తిరముగా ఋణములు దీర్చుకొనఁగలనా** ॥దైవ॥

**దేవ జగన్నాథయంటే తెగనిజన్మములేవి**
**కైవశము నామనసు గాదుగాక**
**గోవిందయనియంటేఁ గూడనిపదవు లేవి**
**కావిరిఁ గాల మూరకె కడపేము నేము** ॥దైవ॥

**వేదనారాయణయంటే వీడేటిబంధములు**
**ఆదిగా మూఁడులోకాలనైనా నున్నదా**
**శ్రీదేవిపతియైన శ్రీవేంకటేశ్వరుఁడా**
**యేదెసా నీవే నన్ను యీడేర్తువుగాక** ॥దైవ॥ **407**

**ఉపోద్ఘాతము:**
ఓ దేవదేవా! నీకు యేమితక్కువయ్యా! మా తలపులలో వెలితివుంటుంది కానీ, నీలో వెలితి వుంటుందా? ఆలోపమువలననే మేము వేవేల (అనేకములైన) కర్మల నాచరించుచు వేసారిపోవలసివస్తున్నది, అని అంటున్నారు అన్నమయ్య ఈ కీర్తనలో.

ఒక్కసారి మనస్ఫూర్తిగా హరీ అంటే అన్ని పాపాలు ఆయనే పోగొడతాడట. గోవిందా అంటే మనల్ని కూడని పదవులే వుండవు. వేద





నారాయణుడా అని వేడుకొంటే భవ బంధములన్నీ వీడిపోతాయి. ఆ శ్రీమన్నారాయణుని ధ్యానించకపోవటం మన నేరము కానీ ఆ స్వామిలోపమా?

**తాత్పర్య వివరణ:**

ఓ దైవమా! నీకు వెలితా (నీకేమితక్కువయ్యా) వెలితి అంటూవుంటే అది మా తలపులలో కాక (ధ్యానములోవున్న లోపమే గానీ) నీవు యేలోపమూలేని నిష్కళంకుడవు. మేము నిన్ను సరిగా ధ్యానించక, వేవేల (అనేకమైన) కర్మబంధములలో వేసారవలెసె (తపించవలసి వచ్చింది).

"హరి" అన్నంతమాత్రాన మన పాపములనన్నింటినీ ఆయన నిర్మూలిస్తాడు. అయితే మన దౌర్భాగ్యం యేమంటే అందుపై (ఆమాటమీద) నమ్మకం కలుగనే కలుగదు. దానికి ఆయనేంచేస్తాడు? నరహరీ! అంటే నానాపుణ్యాలు వస్తాయి. నా ఋణములైన పాపములను స్థిరముగా తీర్చుకోవచ్చుకదా!

ప్రభూ! నా మనస్సు నా స్వాధీనంలో వుండదు గానీ, మనస్ఫూర్తిగా దేవా! జగన్నాథా! అంటే తెగిపోని జన్మములు (భవబంధములు) వుంటాయా? స్వామీ! మేము మాకున్న కొద్దిపాటి కాలమును వ్యర్థము చేస్తూనేవున్నాంగాని, దానిబదులు గోవిందా! అని అంటే దక్కని పదవులు వుంటాయా?

దేవా! మా జీవితాంతము పీచువంటి బంధుత్వాలను పెట్టుకొని తెగతాపత్రయపడిపోతుంటాం. ఆ బంధాలన్నీ మనసారా వేదనారాయణుడా అంటే సడలిపోతాయి. అట్లా సడలిపోని బంధం, మూడులోకాలలోనైనా వుంటుందా? ఉండదు. శ్రీదేవీవల్లభుడవైన ఓ శ్రీవేంకటేశ్వరా! యేదెస (దిక్కు) చూచినా నీవే నన్ను ఈడేర్చు (కాపాడు)చుందువుగాక!

**పద్యవివరణ:**
తే.గీ.॥ **దైవమా నీకు వెలితియా? తలపు వెలితి**
**వివిధకర్మాలవేసారి అవియవలసె**
**శ్రీపతైనట్టి తిరుమల శ్రీహరివట**
**నీవె ఈడేర్చవలెనయ్య! నిశ్చయముగ.**

సంఖ్య: VII/571 రాగం : బౌళి
కీర్తన : దానికేమి దోసమా తగిన గేస్తురాలవు

**బౌళి**

**2 దానికేమి దోసమా తగిన గేస్తురాలవు**
**నేను నిన్ను నేమనేను నీకేలే సిగ్గులు ॥పల్లవి॥**

**కొండవంటిదొర నిన్ను కొంగువట్టి తీసితేను**
**వొండేమీననలేక వొద్దికైతివే**
**అండనుండి సారెసారె నాతఁడే పిలువఁగాను**
**బండుబండు గాలేక పలికితివే ॥దాని॥**

**చక్కని జాణఁడు నీజవ్వనము దడవఁగ**
**గక్కన విడువలేక కైకొంటివే**
**వెక్కసానఁ గమ్మటిని వీడె మాతఁడియ్యఁగాను**
**అక్కరఁ దోయలేక అందుకొంటివే ॥దాని॥**

**శ్రీవెంకటేశ్వరుఁడు చెక్కు నిన్ను నొక్కఁగాను**
**కైవశమై అంతలోనఁ గరఁగితివే**
**యీవేళ నన్నేలి వచ్చె నిద్దరి సవతులగా**
**కావించి నవ్వితినిట్టే కదిసితివే. ॥దాని॥**

**ఉపోద్ఘాతము:**

ఈ కీర్తన శృంగార సౌరభాలను నింపే మధురు భక్తి కీర్తన. ఇలాంటి కీర్తనలు చెప్పటంలో అన్నమయ్య సిద్ధహస్తులు. ఈ సరసశృంగార సాహిత్యమంతా జానపదులు వాడే తెలుగు అవటంవల్ల కొన్ని పదములకు సరిఅయిన అవగాహన కొంచెము కష్టమే. "అండనుండి సారెసారెకు నాతడే పిలువగ బండు బండు గాలేక పలికితివే" – అనే తెలుగు





పదప్రయోగాలు కోకొల్లలు వీటిని నేటి నాగరికులు అర్థం చేసికోవటం ఇబ్బందే. అన్నమయ్య అలమేల్మంగ చెలికత్తెయై హితోపదేశం చేస్తున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ దేవీ! దానికి (నీవు స్వామికి లొంగిపోవటంలో) యేమి దోసము (అపరాధము) వుందమ్మా? నీవు తగినగేస్తురాలవు (భోజ్యేషుమాతా, శయనేషు రంభా అని బుధ జనులు మెచ్చుకొనే ఇల్లాలివి. నేను నీ చెలికత్తెనమ్మా! నేను నీకు చెప్పగలదాననా? కానీ ఒక మాట జెప్పెదను. ఇన్ని సిగ్గులు నీకేలనమ్మా?

కొండవలె సమోన్నతుడైన దొర (స్వామి) నిన్ను పైట చెంగుపట్టి నిలువరిస్తే, ఒండేమీననలేక (అన్యమైన సాకులు చెప్పలేక) ఒద్దికైతివి (స్వామికి అనుకూలవతివైనావు). ఆయన రాజప్రసాదమునకు నిన్ను సారెసారెకు (మాటిమాటికి) పిలువనంపగా బండు బండుగా లేక (సిగ్గుతో చితికిపోలేక) పలికితివే (ఆయనతో మాటలు కలిపినావు). ఇట్లా అయితే యెట్లాగమ్మా?

ఓ దేవీ! నీ స్వామి గొప్ప జాణడు (చతురుడు) శృంగారకళా ప్రావీణ్యుడు. ఆయన నీ జవ్వనమును (నీ యౌవనమును) తడవగా (స్పృశిస్తే) విడువలేక (ఆ స్వామిని నిరాకరించలేక) గక్కున కైకొంటివి (చటక్కున స్వీకరించితివి). అధికమైన అనురాగంతో ఆయన నీకు తాంబూలమునీయగానే, అవకాశాన్ని వదలుకోలేక అందుకొని స్వీకరించావు.

ఓ దేవీ! ఆ శ్రీవేంకటేశ్వరుడు సుతారముగా నీచెక్కిలి నొక్కగానే ఆయనకు స్వాధీనమై కరగిపోతివి. మరీ ఇంత బేలవైతే యెలాగమ్మా? ఆ ముచ్చట్లన్నీ అటుంచి నేడు ఆ శ్రీవేంకటేశుడే నన్నేలగా (నన్ను అనుగ్రహించుటకు) శ్రీదేవి భూదేవీ, ఇద్దరి సహితుడై కామించివచ్చినాడు ఆయనను సమీపించి నేను కూడా నవ్వితిని.

**పద్యవివరణ:**

కం॥ **తగినట్టి గేస్తురాలవు**
**ఒగినీకిక నేలనమ్మ! ఓపని సిగ్గుల్**
**జగపతి చతురుడు నీపతి**
**మగడవుటకు నాశపడని మగువుండునటే?**

సంఖ్య: VII/457 రాగం : కాంబోధి
కీర్తన : నిన్ను గొసరేటియట్టి నేనే యెడ్డనింతే

**కాంబోధి**

**3. నిన్నుఁ గొసరేటియట్టి నేనే యెడ్డనింతేకాక**
**యెన్ని మాటలాడినా నీకేడ మొకదాకిరి ॥పల్లవి॥**

**సిగ్గులనే తెరగట్టి చెలిమోవివిందువెట్టె**
**కగ్గనిచనవులుడుగరలిచ్చెను**
**అగ్గలమై ఆపెకడ ఆడకెట్టు మానేవు**
**నిగ్గుల నిచ్చకునికి నీకేడ నిజము ॥నిన్ను॥**

**కన్నుల నివాళిచ్చె కాఁగిట విడిది వెట్టె**
**కన్నె దనకుచముల కప్పము వట్టె**
**చెన్ను మీరనాపెపంపు సేయకెట్టు మానవచ్చు**
**మన్ననఁ బక్షపాతికి మరియేడ తగవు ॥నిన్ను॥**

**ఇచ్చుకానఁ బోఁకవెట్టి యింపులనె పెండ్లాడె**
**మెచ్చెను శ్రీ వెంకటేశ మేలములను**
**ఇచ్చుట నన్నుఁ గూడితివిరుమొనసూదివైతి**
**విచ్చన విడికాఁడవు వెరపేల యిఁకను. ॥నిన్ను॥ 457**

**ఉపోద్ఘాతము:**

'మొకదాకిరి' అంటే మోమాటము లేక బిడియము అని అర్ధము. 'ఎడ్డె' అంటే ఇబ్బందిపెట్టేవారు అని అర్థం. నాయిక స్వామితో నిష్ఠూరమాడుతున్నది. "సరే! నేనే యెప్పుడూ కొసరుకొనే ఎడ్డెదానను. నీవు నన్నెన్ని మాటలనినా క్షణంలో నన్ను కరిగిస్తావు. నీకు అసలు బిడియం అనేది వున్నదా ప్రభూ?" అంటున్నది. అన్నమయ్యే ఆ నాయిక. ఈ కీర్తన అర్థంచేసికొని వివరించాలంటే పాండిత్యం కొంత, పరమాత్ముని దయ అంతా వుండాలి. రుచిచూడండి మరి.



హరి నీమయమే అంతాను

**తాత్పర్య వివరణ:**

స్వామీ! నిన్ను కొసరేటియట్టి (దేబిరించే) నేనే ఎడ్డెను (ఇబ్బందిపెట్టే ఆడుదానను). ఇంతేకాక నన్ను యెన్నిమాటలాడినా (యెన్ని నిష్ఠూరాలు పలికినా) నీకేడ మొకదాకిరి? (నీకేమి మోమాటము వున్నదిలే).

సిగ్గులనే తెరచాటున ఇప్పటిదాకా దాగిన నీ చెలి నీవు ఆశించిన మోవివిందు పెట్టినది. కగ్గని (వెనుకాడని) చనవులుడు (చొరవతీసికొనే సాహసి) గరలిచ్చెను (ఘర్షణ పడుతున్నాడు). ఆమె కడ (ఆమెవద్ద) అగ్గలమై (ఎంతో వినయ విధేయతలు కలవాడవై) ఆడకెట్టుమానేవు (ఆమె చెప్పినట్లెల్లా ఆడక యెట్లు మానుతావు? నీవు నిగ్గుదేరిన ఇచ్చకాలరాయుడవు. నీకేడ నిజము (నీవు నిజం చెప్పటమూ నేను వినడమూ).

ప్రభూ! ఆమె అయితే కన్నులతోనే నీకు హారతులిస్తుంది. తన కౌగిలి నీకు విడిది చేసి సంతోషపెడుతుంది. తన కుచగిరులను నీకు కప్పముగా కూడా కడుతుంది. అందాలొలికే ఆమె, పంపుసేయక (నిన్ను ఆజ్ఞాపించక) మానుతుందా? నీవు పక్షపాతముగలవాడవని చూస్తూనే తెలుస్తున్నది కదా! మరి ఇంకా నీతో నాకు తగవెందుకయ్యా?

స్వామీ! ముఖస్తుతిచేసి, అదేపోకవెట్టి (బహుమానముగా ఇచ్చి) శోభాయమానంగా పెండ్లాడతావు. శ్రీవేంకటేశ్వరుడు మెప్పును పొందునట్లుగా మేలమాడె (సరసోక్తులను చెప్పెను). ప్రభూ ! నీవు నన్నునూ ఇచ్చటనే కూడితివి. నీవు ఇరుమొన సూదివైతివి (రెండదువైపులా వాడిగల సూదివైనావు. నీవు విచ్చలవిడి విటుడవు. ఇక నీకు వెరపేలనయ్యా?

**పద్యవివరణ:**

ఆ.వె॥ **నిన్ను గొసరుదాన నేనె'యెడ్డెను,' కాక**
**యెన్నిమాటలనిన యేమినీకు?**
**ముందు విడచినావు 'మొకదాకిరి'ని ప్రభూ!**
**మేలమాడునట్టి వేంకటేశ!**

సంఖ్య: VII/458 రాగం : శంకరాభరణం
కీర్తన : ఇదివో తెలుసుకొమ్మా యీరెంటికి నీవేగురి

**శంకరాభరణం**

**4 ఇదివో తెలుసుకొమ్మా యీరెంటికి నీవేగురి**
**పదివేలు విన్నపాలు భావించుకోనీవే ॥పల్లవి॥**

**సరవితో నడచితే జగడముఁ జవులే**
**విరసాన నడచితే వెగటౌఁ బొందు**
**నిరతి నావద్దనుంటే నీవేమన్నా నాకునింపౌ**
**పరులవొద్దనుంటే నీపలుకే వేసటలు ॥ఇది॥**

**తగవులు దప్పకుంటే తమవారే యిందరును**
**యెగసక్యమైతే తనయిల్లే యెరవు**
**నగుతా నీవూరకుంటే ననుపులీడేరును**
**మొగము మునుచుకొంటే మోపులౌఁ బ్రియములు ॥ఇది॥**

**కాఁగలించుకొంటేను కపటమంతయుఁ బాసు**
**ఆఁగుక వూరకుండితే అదియే కాఁక**
**వీగక శ్రీవేంకటేశ వెసనన్నుఁ గూడితివి**
**మాగిన నీ నామనము మాఁటువే యిన్నియును ॥ఇది॥ 458**

**ఉపోద్ఘాతము:**

అన్నమయ్య సరసమధురశృంగారకీర్తనలకు ప్రతిపదార్ధం వివరిస్తే చాలామందికి అందులోని మధురభక్తి అవగాహనకు రాదు. మన మనస్సులు పరిపక్వంకాక జీవాత్మ పరమాత్మల చేరికను స్త్రీ పురుషశృంగార సమాగమములాగా భావిస్తుంటాము. మన పరిపక్వత అంతేమరి. బహుశా అన్నమయ్య సాళ్వనరసింహరాయల ప్రాపకంలో వున్నప్పుడు ఆ రాజుని 'ఉల్లాస' పరచుటకు కొన్ని కీర్తనలలో మోతాదుకి మించిన శృంగారం తొంగి చూస్తుంది. కానీ ఒక్కమాటనిజం శ్రీవేంకటేశ్వరునిగా పరమాత్మను భావించినపుడు ఆ స్వామిని వాంఛించని పడుచు వుంటుందా చెప్పండి. ఈ





కీర్తనలో పల్లవి అర్ధమయ్యే సరికి గగనమయిందంటే నమ్మండి. ఇందులో అన్నమయ్య దేవి చెలికత్తె.

**తాత్పర్య వివరణ:**

ఇదిగో ఓదేవీ! ఇది తెలుసుకోవమ్మా! ఈ రెంటికీ (నీ మంచికి, నీ చెడుకు) నీవేగురి (నీవే లక్ష్యం). అది నీ చేతిలోనే వున్నది. నీవు ఆయనకు పదివేల విన్నపాలు చేస్తున్నట్లు ఆయనను భావించుకోనీవమ్మా. దీనితో ఆయనకు నీపై ప్రేమ ఇనుమడిస్తుంది. అయినా నా సలహా వినవమ్మా!

సరవితో (ఒక క్రమపద్ధతిలో) నడిస్తే శృంగారంలో జగడాలుకూడా మధురంగా వుంటాయి. అదే ఆడది విరసము కలిగినదైతే ఆమె పొందు పురుషునికి వెగటవుతుంది. నాకు నీమీద "ఆసక్తి" వుంటే నీవేమన్నా నాకు ఇష్టముగానే వుంటుంది. అదే నీవు నాకు నచ్చనివారి ప్రాపకంలో వుంటే నీ పలుకులు నాకు తీయగా వుండవు. పైగా వెగటుగా వుంటాయి.

ఓ దేవీ! తగవులు, తప్పకుంటే (తప్పుకుంటే అని వుంటే బాగుంటుంది) నీ స్వామికి ఆశ్రితములైన వారందరూ నీవారే అనిపిస్తుంది. అదే ఎగసక్కెమైతే (ఒకరినొకరు అవమానించుకొంటుంటే) ఆ ఇల్లే యెరవు (అన్యుల ఇల్లులాగా కనుపిస్తుంది). నీవు నవ్వుతూ ఆయనను సంతోషబెడితే నీ ననుపులు (అనురాగములు) ఈడేరుతాయి. అదే నీవు మొగము ముడుచుకొనివుంటే, నీ ప్రేమలన్నీ మోపులు (భారము) అవుతాయి.

ఓ దేవీ! నీవు స్వామిని ప్రేమగా కౌగలించుకుంటే విభేదాలన్నీ సమసిపోతాయి కదా! నీవు నాకేం పట్టిందని నిర్లిప్తంగా వుంటే, కాక (వేడి) ఎక్కువైపోతుంది. సరే! ఆ గొడవ అట్లావుంటే... ఓ శ్రీవేంకటేశ్వరా పనిలోపనిగా నీవు నన్నునూ కూడినావు. కానీ నా మనస్సు నీ మనస్సు మాగినా అది ఆమె ముందు చాటుమాటు వ్యవహారాలేనయ్యా!

**పద్యవివరణ:**

చం॥ **తెలియుము రెంటికిన్ నెలత! దీటుగ బాధ్యత నీదెయౌ సుమా**
**పలువిధముల్ కదా! వినతి భావన జూపుట వానిగెల్చుటల్**
**చిలుకలకొల్కిరో! వినుము శ్రీపతిగెల్తువు ప్రేమ చేతనే**
**నెలతలు నాదు బోంట్లు హరినెమ్మది కోరరె సంగమించరే?**

సంఖ్య: XVIII/516    రాగం : లలిత
కీర్తన : నీతో నవ్వగలమా నెరజాణవు

**లలిత**

**5 నీతో నవ్వఁగలమా నెరజాణవు**
**గాతసేయ కెట్టైనాఁ గరుణించవయ్యా** ॥పల్లవి॥

**గోవులనెల్లాఁ గాచి గొల్లెతలపొందు సేసి**
**కోవిదుఁడ వైతివి గోవిందరాజా**
**వావు లొక్కటిగాఁ జేసి వన్నెకాఁడవై తిరిగి**
**గోవాళుఁడ వైతివి గోవిందరాజ** ॥నీతో॥

**దూడలఁ గొన్నాళ్లు గాచి తూలేటివుట్లు గొట్టి**
**కూడుకొంటివి బాలుల గోవిందరాజ**
**వేడుకకాఁడవై వేవేలు సేఁతలు సేసి**
**కోడెకాఁడ వైతివి గోవిందరాజ** ॥నీతో॥

**చిఱుతవాఁడవై నీవు చీరలు దొంగిలుకొని**
**కొఱతలు మాన్పితివి గోవిందరాజ**
**యెఱిఁగి శ్రీవేంకటాద్రి నిందరినిఁ బెండ్లాడి**
**గుఱిగా నిలిచితివి గోవిందరాజ** ॥నీతో॥ **516**

**ఉపోద్ఘాతము:**

తిరుపతిలో వెలసిన గోవిందరాజస్వామిపై మధురభక్తి ప్రతీకయైన కీర్తన చెబుతున్నారు అన్నమయ్య. నీవు నెరజాణవు స్వామీ! నీతో నవ్వగలమా అంటున్నారు. మాతో దెబ్బలాడ మమ్ము కరుణించవయ్యా! అని ప్రాధేయపడుతున్నారు. అన్నమయ్య కూడా గోవిందుని సాంగత్యం కోరుకొనే గొల్లెతే ఇక్కడ. ఆయన (అన్నమయ్య) భావనా సామ్రాజ్యంలో గోవిందునికి ప్రియురాలై కొన్నిసార్లు ఆయన దేవేరికి నెచ్చెలియై, కొన్నిసార్లు ఆయన ఇష్టసఖియై కొన్నిసార్లు ఆయాపాత్రలలో జీవించి ఈ కీర్తనలు చెప్పారు. అందుకే ఇవి అజరామరము.





**తాత్పర్య వివరణ:**

ఓ గోవిందరాజా! నీవు గొప్పనెరజాణవు (నేర్పరియైన చతురుడవు). ప్రభూ! నన్ను గాతసేయక (దెబ్బలాడక) యెట్టైనా కరుణించవయ్యా!

ఓ గోవిందరాజా! చిన్నపిల్లవాడిగా గోవులనెల్లా కాచినావు. కొంతవయసు రాంగానే గొల్లెతల (గోపికల) పొందుసేసి (రమించి) శృంగార కళలో కోవిదుడవైతివి (అమోఘమైనట్టి ప్రావీణ్యముకలవాడవైతివి). ఏమి చెప్పను స్వామీ? ఓ గోవిందరాజా! నీవు వావులొక్కటిగా చేశావు. ప్రతిగొల్లెతకు భర్త అయినందువల్ల అందరూ అక్కచెల్లెళ్లయి ఒకే వావిగలవారైనారు. నీవు అట్లా చేసిన వన్నెకాడవైనావు (సౌందర్యవంతుడైనావు). ప్రభూ! ఈ విధముగా కొన్నాళ్ళకు నీవు గోవాళుడవైతివి. (యౌవన పండితుడవైతివి.)

ఓ గోవిందరాజా! నీవు కొన్నాళ్ళు లేగదూడలనుకాచినావు ఆ రోజుల్లో తూలేటివుట్లు (కదులుతున్న వుట్లను) కఱ్ఱలతోకొట్టి, గొల్లపిల్లలను కూడుకొని విపరీతమైన అల్లరి చేసితివి. వేడుకకాడవై (వినోదప్రియుడవై) అనేకములైన పనులు చేసి మెల్లగా కోడెకాడవైతివి (కోడెవయసు కుఱ్ఱవాడివైతివి). ఓ గోవిందరాజా! నీ లీలలను యేమని వర్ణించనయ్యా?

ఓ గోవిందరాజా! నీవు చిరుతవాడవై (చిన్నవాడవై) యున్నప్పుడే యమునలో స్నానము చేయుచున్న గోపికల చీరెలు దొంగిలించి చెట్టెక్కి కూర్చుని వారిని బలవంతంగా నగ్నంగా యమున ఒడ్డునకు వచ్చునట్లు చేసి వారికి దేహాభిమానమనే కొఱత (లోటు) లేకుండా చేశావు. ఓ గోవిందరాజా! నేడు అందరికీ తెలియునట్లుగానే నిత్యపెళ్ళికొడుకువై శ్రీవేంకటాద్రిపైన వెలిసినావు.

**పద్యవివరణ:**

కం॥ **నీతోనవ్వగనగునే**
**గాతను సేయంగబోకు కరుణించవయా!**
**చేతలనెరజాణవురా**
**ఆతల గోవిందరాజ! అతివల రేడా!**

సంఖ్య: XVIII/567 రాగం : గుండక్రియ
కీర్తన : ఎక్కడి పరాకు నీకు నెందాకాను

## గుండక్రియ

**6** **ఎక్కడి పరాకు నీకు నెందాఁకాను**
**చక్కనిరమణి కిట్టు నచవియ్యవయ్యా** ॥పల్లవి॥

**సానఁబట్టినచూపులు చల్లఁగా నీపైఁ జల్లి**
**తేనెలమాటలెల్లా నొద్దికతో ముంచె**
**కానుక సెలవినవ్వు కప్పురముగా నిచ్చె**
**మానవతి నిఁకనైన మన్నించవయ్యా** ॥ఎక్క॥

**సరి చన్నులు మీఁదెత్తి సమ్మతిఁ గాచుకున్నది**
**యిరవై చెమటపన్నీ రిదివో నించె**
**మురిపెపుసిగ్గులనే ముగ్గులు నీకుఁ బెట్టె**
**తరుణి నింతట నిట్టె దయఁజూడవయ్యా** ॥ఎక్క॥

**నిండుజవ్వనపాయమే నిలువు సేసలు వెట్టి**
**దండిసరసపుఁదమి దయిలువోసె**
**అండనె శ్రీవేంకటేశ అన్నిటా నేలితివి**
**మెండైనవనిత నింకా మెప్పించవయ్యా** ॥ఎక్క॥ **567**

**ఉపోద్ఘాతము:**

పరాకు అంటే అన్యమనస్కంగా వుండటం లేదా పరధ్యానముగా వుండటం అని అర్థం. ఈ నాయిక మీద ఇంత నిర్లక్ష్యమెందుకు స్వామీ? ఇట్లా యెందాకా ఆమెను బాధిస్తూవుంటావు? నీ రమణి చక్కనిచుక్క. ఇక ఆమెకు అనురాగం పంచి ఇయ్యవయ్యా! అని నచ్చచెబుతున్నారు అన్నమయ్య తానూ స్వామికి అంతరంగిక చెలికత్తెయై. ఇకపోతే ఇది అన్నమయ్య మధురకీర్తన కాబట్టి ఒకటికి నాలుగుసార్లు చదివితేనే కానీ అర్థంకాదు. అంతా శ్రీనివాసకృప.





**తాత్పర్య వివరణ:**

దేవా! నీకు యెక్కడి పరాకు (పరధ్యానము)? ఇట్లా యెంతదాకా వుంటావు? ఈ నీ దేవేరి చక్కటి రమణి (సుందరాంగి). ఇట్లు (ఇకపైన)ఆమెకు చనవు (అనురాగము) నియ్యవయ్యా!

సానబట్టిన చూపులు (తన నిశితదృష్టి) నీపై చల్లగా నిలిపినది, ఆ రమణి. నిన్ను తేనెలూరు తన తీయని మాటలతో, ఒద్దికగా (అనుకూలవతియై) ముంచినది (తలమునకలు చేసినది). ఎవరైనా గొప్పవారు ఇంటికి యేతెంచినవారిని స్వాగతించి కర్పూరతాంబూలమివ్వటం మన ఆచారము. మరి ఈ దేవి నీకిచ్చిన కర్పూరతాంబూలమేమిటో తెలుసునా స్వామీ? తన సెలవినవ్వులే (మధురమైన చిరునవ్వులే). ప్రభూ! ఈ మానవతిని (అభిమానధనురాలిని) ఇకనైనా మన్నించవయ్యా!

స్వామీ! ఆమె పొంకమైన తన స్తనములనెత్తి బిగించి కచబంధమును కట్టి ప్రశాంత చిత్తయై నీ కొరకు వేచియున్నది. అధికముగా చెమటపట్టినందున సువాసనాభరితమై పన్నీట జలకములాడినదా అనిపించుచున్నది. ఆమె తన ప్రాంగణమున నీ కొరకు పెట్టిన రంగవల్లులే ఆమెకు నిను చూడగానే కలిగిన సిగ్గులు. ప్రభూ! ఆతరుణిని ఇకనైనా దయజూడవయ్యా!

దేవా! ఆమె తన నిండు యౌవన ప్రాయమే నీకు నిలువు నీరాజనమునిచ్చినది. దండి సరసము (అధికమైన సరసముల) యొక్క తమి (ఆపేక్షను) ఆమె నీకు ధారవోసినది. ఆమెకు అండవై ఓ శ్రీవేంకటేశ్వరా ఆమెను అన్నిటిలోనూ యేలితివి. శ్రేష్ఠమైన ఆవనితమనమును ఇంకా మెప్పించి అలరించవయ్యా!

**పద్యవివరణ:**

తే.గీ॥ **ఎక్కడి పరధ్యానంబులు యెంతదాక?**
**వనితదరిజేరవయ్య నీ చనవునిమ్ము**
**వేంకటేశ యేలుము నీవు వెలదినిపుడు**
**మెండు అయిన వనితనిన్ను మెచ్చగాను.**

సంఖ్య: XVIII/369 రాగం : సాళంగనాట
కీర్తన : మొక్కలీడవయ్య నీవు ముద్దు విఠ్ఠలా

**సాళంగనాట**

**7 మొక్క లీఁడవయ్య నీవు ముద్దు విఠ్ఠలా మా-**
**పక్క వాయ వెప్పుదును పండరంగివిఠ్ఠలా ॥పల్లవి॥**

**చిక్కనిచల్ల లమ్మఁగాఁ జేరి విఠ్ఠలా మా-**
**జక్కవచన్నులంటేవు సారె విఠ్ఠలా**
**తొక్కేవు మాపాదాలు దొమ్మివిఠ్ఠలా**
**పక్కన మై చెమరించెఁ బండరంగివిఠ్ఠలా ॥మొక్క॥**

**వేళగాచి వచ్చేవు మావెంట విఠ్ఠలా కదు-**
**మేలములాడఁ జేరేవు మేటివిఠ్ఠలా**
**కోలుముందై చెనకేవు గొంటువిఠ్ఠలా**
**పాలుగాంచి(చే?) వేళనే పండరంగివిఠ్ఠలా ॥మొక్క॥**

**సొరిది గచ్చకాయలు చూపి విఠ్ఠలా**
**సరిబేసులాడేవు జాణవిఠ్ఠలా**
**దొరబై శ్రీవేంకటాద్రిఁ గూడి విఠ్ఠలా**
**పరగ మావద్దనుంటి పండరంగి విఠ్ఠలా ॥మొక్క॥ 369**

**ఉపోద్ఘాతము:**

మొక్కలీడు అంటే కుటిలుడు లేక మాయావి అని అర్థం. శూరుడు అని ఇంకొక అర్థం వుంది. అందుకే అన్నమయ్య విఠ్ఠల ప్రభువును, మొక్కలీడు అని సంబోధిస్తున్నారు. స్వామిని నిందించటం చేసినా ముద్దుతోనే చేశారు. ఈ పండురంగిలో (రాయలసీమ పల్లెటూరు) లో నెలకొన్న విఠ్ఠలా నీకున్న గుణమేమిటంటే, ఎట్లా దూరిపోతావోగానీ, మా పక్కలు వదిలిపెట్టవు అంటున్నారు. ఇది సరసభక్తి. స్వామి యేమిచేసినా గోపికల కిష్టమే. నీవెంత టక్కరివంటే గచ్చకాయలతో మాయచేసి అన్ని పందేలూ నీవే గెలుస్తావు.





ఎందుకంటే నీవు దొరబైవేంకటాద్రి మీద మా అందరినీ కూడెదవు అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ ముద్దులొలికే విఠ్ఠలా! నీవు మొక్కలీడవయ్యా (కుటిలుడవయ్యా!) పండరంగిలో నెలకొన్న ఓ దేవా! ఇదేమి చిక్కు? నీవు మా పక్కల్లో దూరి వాయవు (మమ్మల్ని వదలిపెట్టవు). ఎప్పుడూ ఇదేగోల.

ఓ విఠ్ఠలా! మేము చిక్కనైన చల్లలమ్ముటకు మధురానగరం పోతుంటే నీవు మా పక్కన చేరి పొంకమైన స్తనగిరులను మాటిమాటికీ తాకుతావు. నీవెంత దొమ్మికాడవు (సందడిచేసేవాడు) అంటే యేదో ఒక నెపంతో కావాలనే మా పాదాలు తొక్కుతావు. నీవు మా పక్కన చేరి మామేను చెమరించునట్లు చేస్తావు. ఓ పండరంగి విఠ్ఠలా నిన్ను వారించుట దుస్సాధ్యము.

ఓ విఠ్ఠలా! నీవు మేటివి (నేర్పరివి). ఎందులో తెలుసా? మాబోటి గొల్లెతలతో, మేలములాడ (సరసములాడుటకు) ఎట్లా వస్తావోగాని దారిగాచి సరైన వేళకు వచ్చి పట్టుకొంటావు. ఓ గొంటు విఠ్ఠలా! (కుత్సితుడవైన విఠ్ఠలా) మేము పాలు కాస్తుంటే మా పాలన్నీ నేలపాలు చేస్తావు. నీకిది తగునా? ఈ పాలు అమ్ముకొనుటే మా జీవనభృతి కదా! పండరంగి విఠ్ఠలా!

ఓ విఠ్ఠలా! గచ్చకాయలాట ఆడుటలో నీకు నీవే సాటి. సొరిది (ఒక వరుసలో) గచ్చకాయలను చూపి నీకు కావలసిన పందెంవేసుకొని 'సరిబేసి' లనే ఆట ఆడెదవు. నీవెంత జాణవంటే, యెప్పుడూ నీకు కావలసిన 'పందెమే' పడుతుంది. అట్లా నాతో పందెంగెలిచి దొరబై (దొరవలె) శ్రీవేంకటాద్రిమీద నన్ను గూడితివి. ఓ పండరంగి విఠ్ఠలా! జగత్ప్రసిద్ధుడవై అటుపైన మావద్దనే వుంటివి.

**పద్యవివరణ:**

ఆ.వె॥ **మొక్కలీడువయ్య! ముద్దుల విఠ్ఠలా!**
**పక్కవాయవెపుడు పండరంగి!**
**వేంకటాద్రిపైన వేడ్క గూడితివయ్య!**
**పరగ మాదుబోంట్ల వద్దనుండి.**

సంఖ్య: XVIII/559 రాగం : శ్రీరాగం
కీర్తన : ఎదుటనే వున్నది యింతి గడుబిన్నది

## శ్రీరాగం

**8 ఎదుటనే వున్నది యింతి గడుఁబిన్నది**
**ఇదివో మావిన్నపా లిచ్చగించవయ్యా ॥పల్లవి॥**

**సెలవుల నవ్వుగారీ చెక్కులఁ జెమట జారీ**
**నిలువెల్లా సిగ్గుదేరీ నెలఁతకు**
**పలుకులఁ దేనె లూరీ భావములోఁ దమి మీరీ**
**కలసి మెలసి యీకెఁ గాఁగిలించవయ్యా ॥ఎదు॥**

**కన్నుల వెరగుమించీ కళలు మోమునఁ బొంచీ**
**చన్నులపైఁబులకలు సారెకు ముంచీ**
**సన్నలు బొమ్మల వంచీ చవు లాసలనుఁ బెంచీ**
**మన్ననల నీకెను మరిగించవయ్యా ॥ఎదు॥**

**మోవి నమృతము చిందీ మూఁపునఁ దురుము చెందీ**
**సేవలుగా చెనకులు చేతికి నందీ**
**యీవేళ నలమేల్మంగ ఇన్నిటాను నిన్నుఁ బొందీ**
**శ్రీవేంకటేశ యీకెఁ జేకొంటివేలవయ్యా ॥ఎదు॥ 559**

**ఉపోద్ఘాతము:**

ఓ శ్రీవేంకటేశ్వరా! నీయెదుటనే వున్న ఈ యింతిని చూచినావా? ఈమె కడుపిన్నది (చాలా చిన్నవయసుగల జవరాలు). ఇదిగో స్వామి ఇటుచూచి మా విన్నపవములనాలకింపవయ్యా! ఈమె మోవి అమృతముల జాలువారుతుంది. ఆమె సిగలో కొప్పు కొట్టవచ్చినట్లు కానవచ్చుచున్నది. ఈవేళ యీ అలమేల్మంగను అన్నిటా గూడుమయ్యా! ఈమెను నీ సతిగా స్వీకరించావు. ఇక ఆమె బాధ్యత నీదే ప్రభూ! అంటున్నారు అన్నమయ్య.





**తాత్పర్య వివరణ:**

ఓ ప్రభూ! అతిపిన్న వయసులోనున్న యీ యింతి నీ ఎదుటనేవున్నదయ్యా! ఇదివోమేము వినమ్రులమై చేయు మా విన్నపములను ఇచ్చగించవయ్యా! (అంగీకరించవయ్యా!)

స్వామీ! ఆమె పరిస్థితిని గమనించితివా? ఆమె లేత పెదవులపై చిరునవ్వు చెదరలేదు. అద్దములవంటి చెక్కిళ్ళనుండి చిరుచెమట కారిపోవుచున్నది. ఆ నెలతకు (భామినికి) యెక్కడ చూచినా నిలువెల్లా సిగ్గులు మొగ్గలు తొడుగుచున్నది. ఆమె పలుకులు దేనెలూరునట్లు మధురముగానున్నవి. ఆమె భావములో తమి (ఆపేక్ష) తొణికసలాడుచున్నది. ఇటువంటి చిన్నదానిని చింతకు గురిచేయవచ్చునా? ఇకనైనా కలసి మెలసి ఈమెను నీ కౌగిలిలో కరిగించవయ్యా!

దేవా! ఆమె కన్నులలో అంతులేని వెరగు (అచ్చెరవు) తొంగిచూస్తున్నది. చక్కటి ఆ వదనమున కళలు పొంచి చూస్తున్నాయి. నీ తలపులతో ఆమె చనుగవ పలుమారు పులకలతో వింతశోభలీనుచున్నది. ముడివడిన ఆమె కనుబొమలు యేదో సంకేతమును నీకందజేయుచున్నది. నీపై చవులు (ప్రీతి) కల ఆమె నీపై అనురాగము పెంచుకొన్నది. ఈకెను (ఈమెను) నీ మన్ననలతో మరగించవయ్యా! (ఆశలలో ముంచవయ్యా!)

ఓ శ్రీవేంకటేశ్వరా! ఈమె పెదవులు అమృతము చిందించుచున్నవి. ఆమె తరుము (కేశబంధము) ఆమె మూపురమున స్థిరముగా నిలిచినది. ఆమెకు శృంగారసేవయనునట్లు నఖక్షతముల నందిమ్ము. ఈ వేళ అలమేల్మంగ త్రికరణశుద్ధిగా నిన్ను పొందినది ప్రభూ! ఈకెను (ఈమెను) చేపట్టిన నీవు ఆమెను యేలుకో దేవదేవా!

**పద్యవివరణ:**

కం॥ **ఎదుటనె వున్నది చిన్నది**
**ఇదివో మా విన్నపాలనిక వినుమయ్యా!**
**అదె నీ అలమేల్మంగను**
**సదనంబునగూడుమయ్య! సప్తగిరీశా!**

సంఖ్య: XVIII/558 రాగం : సామంతం
కీర్తన : చొక్కపునీపెండ్లి నేడె సుక్కురారము

## సామంతం

9 **చొక్కపునీపెండ్లి నేఁడె సుక్కురారము**
**అక్కరతో నిన్నియు నవధరించవయ్యా** ||పల్లవి||

**పడఁతిచెమటలే పన్నీటిజలకము**
**వెడగుముద్దుమాటలు వేదమంత్రాలు**
**యెడయనియాకె పయ్యెదకొంగే తడియొత్తు**
**ఆడియాలపుమజ్జన మవధరించవయ్యా** ||చొక్క||

**తరుణిసెలవినవ్వు తగినకప్పురకాపు**
**తరమైనకనుచూపు తట్టుపుణుఁగు**
**విరులతావివూర్పులే విసరేటిచల్లగాలి**
**అరుదైనవుపచార మవధరించవయ్యా** ||చొక్క||

**అలమేలుమంగకాఁగి లంటుదామెరల పూజ**
**పొలివోనిమేనికాంతి భూషణములు**
**యెలమి శ్రీవేంకటేశ ఇద్దరునుఁ గూడితిరి**
**అలవడె విభవము లవధరించవయ్యా** ||చొక్క|| **558**

**ఉపోద్ఘాతము:**

నేడు శుక్రవారము. శోభాయమానమైన మీపెండ్లి నేడే జరుగుచున్నది. మాకందరికీ ఇది గొప్ప వేడుక. నీవు బహుశ్రద్ధగా ఇవన్నియు అవధరింపుము స్వామీ అంటున్నారు అన్నమయ్య. అలమేల్మంగ కౌగిలి అంటుదామెరపూల పూజవలె నీకు అత్యంత ప్రియమైనది. తరగని ఆమె మేనికాంతి ఏ భూషణములకాంతితోటి సరిపోల్చలేనిది. ఓ శ్రీవేంకటేశ్వరా! మీరిద్దరు సమరతిగూడగా వైభవములన్నియు అలవడినవి, చిత్తగించుము స్వామీ! అంటున్నారు.





**తాత్పర్య వివరణ:**

నేడు సుక్కరారము (శుక్రవారము). తిరుమలలో స్వామివారికీ, అమ్మవారికి చొక్కపు (దోష రహితమైన) పెండ్లి జరుగుతున్నది. ఇన్నియు (ఈ నీ కర్తవ్యములను) అక్కరతో (బహుశ్రద్ధగా) అవధరించవయ్యా (చిత్తగించవయ్యా!)

స్వామీ! జగదేకపతితో తన పెండ్లి జరుగుతున్నదని సంభ్రమంతో ఆ పడతి పన్నీటి పరిమలభరితమైన తన చెమటలలో స్నానమాడినట్లుంది. వెడగు (అమాయకమైన ఆమె ముద్దుమాటలే ఆ పెండ్లిలో వేదమంత్రములైనవి. అవిశ్రాంతముగా ఆమె తన పయ్యెదతో తన చెమటనొత్తుకొనుచున్నందున ఆ చిత్తడి మజ్జనమునకు (స్నానమునకు) గురుతుగానున్నది. ప్రభూ! ఈ మజ్జనము నవధరించవయ్యా!

ఆరోజుల్లో పెదవులతడి ఆరిపోకుండా కర్పూరముతో ఒక 'కాపు' లేతపూతవేసికొనేవారు. ఈమెకు (అలమేల్మంగకు) ఆ అవసరమే లేదు. తరమైన (స్థిరమైన) ఆమెకనుచూపులు, స్వామివారికి తట్టుపుణుగు (సుగంధద్రవ్యము) అద్దినట్లున్నది. సుగంధపరిమళభరిత పుష్పములపైనుండి వచ్చే చల్లని మధురమైన వాయువువలె ఆమె వూర్పుల (శ్వాస) పరిమళం అంతటా అల్లుకొనినది. అరుదైన ఆమె యీ వుపచారములనన్నీ స్వీకరించి ఆమెను అవధరించవయ్యా!

ప్రభూ! దేవి అలమేల్మంగ బిగికౌగిలి నీకు జంటతామెరపూవులతో పూజగావించినట్లున్నది. పొలివోని (యెన్నడూ తరుగని ఆమె శరీరద్యుతి అసంఖ్యాకమైన భూషణముల మిలమిలలా అన్నట్లున్నవి. నేడు ఈ తిరుమలలో శ్రీవేంకటేశ్వరుడూఅలమేల్మంగ ఇద్దరూ కూడినారు.ఇక యెన్నియో విభవములు (వైభవములు) సిద్ధించినవి. అవధరించి మమ్ము తరింపజేయము తండ్రీ!

**పద్యవివరణ:**

కం|| **చొక్కపుపెండిలినేడే**
**సుక్కురవారంబుమీకు శుభమగునయ్యా!**
**అక్కరతొ౦అవధరింపుము**
**చక్కని వేంకటవిభుండు సమరతి గూడున్.**

సంఖ్య: XVIII/150    రాగం : సాళంగనాట
కీర్తన : ఇట్టినామోము చూచి యేమినవ్వేవు

## సాళంగనాట

**10 ఇట్టె నామోము చూచి యేమినవ్వేవు**
**చుట్టమవై వూరికెల్లాఁ జూపట్టినవాఁడవు** ॥పల్లవి॥

**ఆసపడేవారి నెంత అలయించేవు పెండ్లి -**
**సేసుకోరాదా యేల సిగ్గువడేవు**
**దోసముగా దెందరైనా దొడ్డిఁ బెట్టుకొనవచ్చు**
**బేసబెల్లిరేపల్లెఁ బెరిగినవాఁడవు** ॥ఇట్టె॥

**తోడనే మాటాడేవారిఁ దోయనేల సరసము-**
**లాడరాదా యేఁటికి నీవందుకాచేవు**
**వాడికగా వలపులవల్లెలు వేయఁగవచ్చు**
**కోడెల నావులఁ గాచేగొల్లమందవాఁడవు** ॥ఇట్టె॥

**ననిచి చుట్టాలై మొక్కినవారిఁ గాఁగలించు -**
**కొనరాదా మరియేమి గుట్టుసేసేవు**
**పెనఁగులాడఁగవచ్చు బెట్టుగా శ్రీవేంకటేశ**
**యెనసితి గోవర్ధనమెత్తినట్టివాఁడవు** ॥ఇట్టె॥ **150**

**ఉపోద్ఘాతము:**

ఓ కృష్ణా నీవు వూళ్లో అందరికీ చుట్టానివై కనుపిస్తావు. ఇప్పుడు నీపై ఆసపడనివారెవరు వుండరు నిజమే. అంతమాత్రాన నామొకముచూచి నీకు అంతనవ్వు యెందుకువస్తున్నదయ్యా? అంటున్నారు అన్నమయ్య. నీపై ఆశపడే వారినెందుకు అన్నివిధములుగా శ్రమపెడతావు? వారిని పెండ్లాడరాదా? నిన్ను కాదనేవారెవరున్నారు? నీవెంతమందినైనా రహస్యంగా పెళ్ళాడవచ్చును. నిన్ను కాదనగలజవ్వని యెవ్వరు, అంటున్నారు.



హరి నీమయమే అంతాను

**తాత్పర్య వివరణ:**

ఓ గోపీకృష్ణా! నీతో ప్రతివారూ చుట్టరికం కలుపుకోవాలనే ఆలోచిస్తుంటారు. అందువలన నీకు వూరినిండా చుట్టాలే. అదంతా అటుంచి నా మోము (మొకము) చూచి ఇట్టే (తేలికగా) యెందుకు నవ్వుతున్నావు? ముందు ఆ సంగతి చెప్పు, స్వామీ!

కృష్ణా! నీవంటే ఆసపడేవారు చాలామంది వుండవచ్చును. వారినెందుకంత అలయించేవు. (శ్రమపెడుతున్నావయ్యా?) ఇంకా నీవు సిగ్గుపడెదవేల? నీవు వలచిన దానిని పెండ్లియాడరాదా? నీవు రేపల్లెలోనే పెరిగి, రేపో మాపో దీని ఏలిక అవబోతున్నావు. మరి ఇంకా నీకు బేసబెల్లి (నంగనాచివేషాలు) యెందుకయ్యా? దోసము గాదు. నీవెందరినైనా నీ దొడ్డిబెట్టవచ్చు (నీ స్వాధీనములో ఉంచుకోవచ్చును).

కృష్ణా! నీవంటే ఇష్టపడి, మాటలు కలిపి నీతో మాటలాడదలచిన ఆడదంటే నీకు లక్ష్యములేదు. ఒకింత వారితో సరసములాడరాదా? వారిని దోయగనేల (అలక్ష్యపెట్టుట యెందులకు?) పైగా మా రహస్యాలను కూపీలాగాలని చూస్తావు. నీకు ఇదేమిబుద్ధి? నీవు కోడెగిత్తలను,ఆవులను (పొగరుబోతువారినని సాధువర్తనలను) కాచే గొల్లవాడివి (పరబ్రహ్మావు). నీకు అడ్డుచెప్పేదెవరు? అందరికీ వలపుల వల్లెవాటు వేసేయవయ్యా!

ఓ గోవర్ధనధరా! కృష్ణా! మరియేమి గుట్టు సేసేవు? నీకు మొక్కినవారంతా చుట్టాలే (ఆప్తబంధువులే). ననిచి (చిగురించి లేక, పులకించి) వారంతా నీకు వశమైనవారే. ఆనాడు గోవర్ధనమెత్తి మా గోపికల ప్రాణములను కాపాడిన నాడే త్రికరణశుద్ధిగా గోపికలమందరమూ నీవారమైతిమి. నేడు ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు మాతో యెంత పెనగులాడినా నిన్ను కాదనగలవారెవరు తండ్రీ!

**పద్యవివరణ:**

తే.గీ॥ **ఏమినవ్వేవు నామోము నిట్టెచూచి?**
**ఊరికెల్లను చుట్టమై వుంటివయ్య!**
**నీవు గోవర్ధనమునెత్తి నిలిచినావు**
**నేడు వేంకటేశుడవయ్య! ఏడుగిరుల.**

సంఖ్య: XXVI/298 రాగం : దేసాళం
కీర్తన : రట్టడి కడపరాయ డిట్టె వీడు

## దేసాళం

**11 రట్టడి కడపరాయఁ డిట్టెవీఁడు**
**గట్టిగా నేడిపుడు తగవుదేర్చరే ||పల్లవి||**

**చలము సాదించరాదు సముకానఁ గొంచరాదు**
**పలుమారు మాటలాడి పదరీ వీఁడు**
**మొలకచన్నులు నావి మొనలెత్తీఁదనమీఁద**
**చెలులూర మాకు బుద్ధిచెప్పఁగదరే ||రట్ట||**

**పందెములడువరాదు పంతము విడువరాదు**
**కందువలు చూసి పొత్తుగలసీ వీఁడు**
**అందపు నాచూపు లివి అంటుకొనీఁ దనమీద**
**చందపు మావలపులు చక్కఁబెట్టరే ||రట్ట||**

**తమక మాఁపఁగరాదు తాలిమి చూపఁగరాదు**
**అమర గూడె శ్రీవెంకటప్పఁడు వీఁడు**
**చెమటల నామేను చేఁతసేసీఁ దనమీఁద**
**జమళి మమ్మిద్దరిని సారె మెచ్చరే ||రట్ట||**

**ఉపోద్ఘాతము:**

వీడు ఆగడాలమారియైన కడపరాయడు. గొప్పతగవులమారివాడు. నేడు యిప్పుడే మీరూ గట్టిగానే వుండండి అంటున్నారు, అన్నమయ్య. ఈతడు కలిగించు తన్మయత్వము ఆపుట దుస్సాధ్యము. పోనీ ధైర్యము చూపింతుమా అంటే అదీ కుదురుట లేదు. అప్పుడు నన్ను వేంకటేశుడు జంటగా గూడినాడు మమ్మల్నిద్దరినీ బాగుగా మెచ్చరే అంటున్నారు.





**తాత్పర్య వివరణ:**

ఈ రట్టడి కడపరాయుడు (ఆగడాలమారి, దేవుడు గడప శ్రీవేంకటేశ్వరుడు) నేడు ఇపుడు ఇట్టే తగవుదీరే (గిల్లికజ్జాలకు సిద్ధమగుచున్నాడు). వీడు (ఈ స్వామి) వలె మీరూ గట్టిగానే (బెట్టుసరిగానే) వుండండమ్మా చెలులూ!

అయినా మీకు తగని పనులు కొన్ని వున్నాయి. వాటిని ఆలకించండి. చలము సాధించరాదు (మత్సరమును ప్రదర్శించరాదు). సముకాన గొంచరాదు (ప్రత్యక్షముగానే కించపరచరాదు). అలా చేస్తే ఈ కడపరాయనికి యెంత కోపము వస్తుందంటే రకరకములైన మాటలతో అనేకమార్లు నొప్పించుచునే వుంటాడు. నా మొలకచన్నులను వానికి మొనలు తాకునట్లు ఆనించినాము. చెలులారా! మాకు బుద్ధిచెప్పి యేమి ప్రయోజనం?

ఈ కడపరాయనితో యెన్నడూ పందెములడువవరాదు. (పందెము కట్టరాదు). అట్లని వీనితో పంతమువీడి వెంటనే రాజీకి రాకూడదు. ఎందుకంటే వీడు యేదో ఒక కందువలు చూపి (చమత్కారం చేసి) తను కోరుకొన్నవారిని పొందుతాడు. మనోహరమైన నా చూపులు ఈతనిపై అంటుకొనినవి. ఇక చందపు మావలపులు (న్యాయసమ్మతమైన మా వలపులను) చక్కబెట్టినాకు న్యాయం చేయండి.

ఈ కడపరాయుడే అల్లదే ఆ తిరుమల శ్రీవేంకటేశ్వరుడు. ఈయనను జూచిన తమకము (తన్మయత్వము) నాపుకొనుట దుస్సాధ్యము. అట్లని తాలిమి (ధైర్యము) ప్రదర్శింతనా అంటే అదీ సాధ్యమగుటలేదు. నా మేను విపరీతముగా స్వేదించుచున్నది. జమళి (జంటగా) కూడిన మమ్మిద్దరినీ సారె (చక్కగా) మెచ్చరే (కీర్తింపుడు).

**పద్యవివరణ:**

కం|| **రట్టడిగ కడపరాయడ**
**ఇట్టే తీర్చేవుతగవు ఇంతుల నడుమన్**
**గట్టిగ పంతములాడుట**
**యెట్టవునుర వేంకటేశ యేలికకైనన్?**

సంఖ్య: XXVII/3 రాగం : సాళంగనాట
కీర్తన : ఔభళేశ వోగునూతులౌభళేశ

**సాళంగనాట**

**12 ఔభళేశ వోఁగునూతులౌభళేశ**
**శోభనము నీకు నాకు జోడుగూడెఁగాదా** ||పల్లవి||

**వున్నతి గిరు లెక్కితి వోఁగునూఁతులౌభళేశ**
**యెన్నిక నాకుచగిరు లెక్కరాదా**
**యెన్నఁగ నిట్టూరుపులతో యేఁటికైనా నలసేవు**
**అన్నిటా నారతులలో నలయరాదా** ||ఔభ||

**ఆకసము మోవ రూప మందితి విందరిలోన**
**ఆకసము నానడుము నంటరాదా**
**పైకొని వెన్నెలలోనఁ బతి గాఁగ నవ్వేవు**
**మేకొని నాసరసాన మించి నవ్వరాదా** ||ఔభ||

**తెరచి నోరు ముయ్యవు తియ్యని ఆసలతోడ**
**సారిది నామోని చవిచూడరాదా**
**అరిది శ్రీవేంకటాద్రి నటు గూడి నేఁడీడ**
**నరసింహరూపమైతి నాటకము గాదా** ||ఔభ|| 3

**ఉపోద్ఘాతము:**

అహోబల శ్రీనరసింహునిపై జానపదుల శృంగార కీర్తన చెబుతున్నారు అన్నమయ్య. జానపదులు అహోబలేశ్వరుని ఔభళేశుడు అంటారు. ఆక్షేత్రం వెలసిన ప్రదేశంపేరు ఓగునూతుల, ఓగునూతులుఅంటే కీడు కలిగించే నూతులున్న ప్రదేశం అని అర్థం. అక్కడ తొమ్మిదిరూపాలలో నరసింహుడు వెలిశాడు. నేటి కర్నూలు జిల్లాలో గొప్ప పుణ్యక్షేత్రం అది. చదివినకొద్దీ మాధుర్యం తెలిసే కీర్తన ఇది.





**తాత్పర్య వివరణ:**

ఔభళేశా! ఓగునూతులలో భక్త జనోద్ధరణకై వెలసిన ఔభళేశా! నేడు నీకు నాకు శోభనము యేర్పాటు చేయబడినది. మనిద్దరిదీ యెంత చక్కటి జోడీయో (జంటయో) యేమి చెప్పమంటావు?

ఔభళేశా! నీవు ఓగునూతులలో ఉన్నతమైన గిరులనెక్కి కూర్చున్నావు. దానికి బదులు సమున్నతమైన నా కుచగిరులనధిరోహించరాదా? (అహోబలనృసింహుడు నిట్టూర్పులువదిలిపెడుతుంటాడని ప్రతీతి). దీర్ఘమైన నిట్టూర్పులువిడచుచు,యేటికైనా (యెందులకు) అలసేవు. ఆ అలసిపోయేదేదో నాతో రతులు సాగించి అలిసిపోరాదా?

ఔభళేశా! నీవెంత యెత్తుకి యెదిగినావంటే ఆకాశమునే నీవు మోస్తున్నావా అన్న భ్రమ కలుగుతున్నది. కనీసం అప్పుడన్నా నీకు ఆకాశమువలె శూన్యమైన నానడుము గుర్తుకు రాలేదా? అట్టి నానడుమును ఒక్కసారి తాకరాదటయ్యా? వెన్నెలలోనన్నాక్రమించి నేను నీ మగడిని అన్నట్లు నవ్వుతావు. నా సరసములతో మేకొని (సమ్మతించి) అలాగే యెప్పుడూ నవ్వుతూ వుండరాదా స్వామీ?

ఔభళేశా! నీవు సింహస్వరూపుడవు. తెరచిన నీ నోటిని మూయవు. తీపి తీపి ఆశలతో నెమ్మదిగా నా మధురాధరమును రుచి చూడరాదా? అరుదైన శ్రీవేంకటాద్రిమీద కూడా నీవే నెలకొనివున్నావు. నేడు ఇక్కడ నరసింహరూపముతో ఈడవున్నావు. ఇదంతా నాటకము కాక ఇంకేమిటి ప్రభూ!

**పద్యవివరణ:**

ఆ.వె|| **ఓగినూతులందు ఒగి ఔభలేశుడా!**
**శోభనంబు మనకు జోడు కుదిరె**
**వేంకటాద్రి దొరవు వింతసింగమ రూప**
**నాటకంబుగాదె ఆటకాదె?**

సంఖ్య: XXVII/277 రాగం : దేసాళం
కీర్తన : విరులదండలతోడి విట్ఠలేశా నీవు

## దేసాళం

**13 విరులదండలతోడి విట్ఠలేశా| నీవు**
**యెరవులేనివాఁడవు యెపుడు విట్ఠలేశా ॥పల్లవి॥**

**విచ్చేయు మా ఇంటికి విట్ఠలేశా| నీకు**
**విచ్చనవిడాయ నిది విట్ఠలేశా**
**విచ్చి చెప్పే నిటు నీకు విట్ఠలేశా| నాకు-**
**నిచ్చినబాసదప్పకు మిఁక విట్ఠలేశా ॥విరు॥**

**వీడె మియ్యఁగదవోయి విట్ఠలేశా| కదు-**
**వేదుకకాఁడవు నీవు విట్ఠలేశా**
**వీదుజోడాయ వలపు విట్ఠలేశా**
**పాడిఁ బంతాలెల్లఁ జెల్లె బాపు విట్ఠలేశా ॥విరు॥**

**విడిచేవు పోఁకముడి విట్ఠలేశా| యెంత**
**వెడమాయకాఁడవయ్య విట్ఠలేశా**
**కడఁగి శ్రీవేంకటాద్రిఁ గలసితివి**
**అడియాలముగ నన్నునౌర విట్ఠలేశా ॥విరు॥ 277**

**ఉపోద్ఘాతము:**

పూలదండలతో అలంకరించుకొన్న విట్ఠలేశ్వరా! నీవు యెపుడు భేదభావము లేనివాడివయ్యా! అంటున్నారు అన్నమయ్య. ఓ విట్ఠలేశ్వరా! నీకేముంది అడ్డు? విచ్చలవిడితనము నీ ప్రత్యేకత. నిన్ను కాదనేవారు లేరు మరికనేమి? మా ఇంటికి విచ్చేసి యధేచ్ఛగావుండి, పూనుకొని శ్రీవేంకటాద్రిమీద నన్ను కూడితివి. ఔరా! అదే రసికతకు తిరుగులేని గురుతు అంటున్నారు.





**తాత్పర్య వివరణ:**

ఓవిట్ఠలేశా! నీవు చక్కటి విరులదండలతోడ (పూలదండలతో) శోభిల్లుతున్నావయ్యా! ఓదేవదేవా! నీవు యెప్పుడూ, యెరవులేని వాడివే (నీవారు పెరవారు అను భేదభావము లేని జనార్దనుడవు).

ఓవిట్ఠలేశ్వరా! మేము హృదయపూర్వకంగా నిన్ను ఆహ్వానిస్తున్నాము. దయచేసి మాఇంటికి విచ్చేయవయ్యా? నీకు అడ్డుచెప్పగలవారెవరు? విచ్చన విడాయె (విచ్చలవిడితనమంతా నీదే). మరి ఇంక ఆలోచించకు. నీకు ఇదివరకే, ఇటువిచ్చి చెప్పెను. (ఇదంతా వివరించి చెప్పాను). నాకు నీవిచ్చిన బాసలు (వాగ్దానములు) తప్పుతావా స్వామీ! వద్దు నీమాట నిలబెట్టుకో.

ఓ విట్ఠలేశ్వరా! నన్ను స్వీకరించినందుకు గుర్తుగా నాకు వీడెమియ్యగదవోయి (తాంబూలము నా నోటికందించు). నీవు సహజంగానే కడు వేడుకకాడవు (గొప్ప విలాస పురుషుడవు). ఓ విట్ఠలేశ్వరా! మన వలపు వీడూ జోడాయె (సరికాని జంట మధ్య ప్రణయం అంకురించడం వల్ల అది పరిమళించదు). ఇక నీకేది న్యాయమనిపిస్తే అలా చేసి నీ పంతాలెల్లా నెగ్గించుకో. నిన్ను కాదనేదెవరయ్యా?

ఓ విట్ఠలేశ్వరా! చూస్తుండంగానే మా చీరెలకు మేము బిగించుకొన్న పోకముడిని వదులు చేస్తావు. నీవు యెంత వెడమాయకాడవయ్యా? (వికృతచేష్టలు గల మాయదారివాడవయ్యా) ఔరా! నన్ను శ్రీవేంకటాద్రి మీద కలసితివి. ఆపైన అడియాలముగ (తిరుగులేని గురుతుగా) నన్నాదరించితివి.

**పద్యవివరణ:**

తే.గీ॥ **విరులదండలతోనున్న విట్ఠలేశ!**
**యెరవులేనివాడవు నీవు యెపుడు గాని**
**కడగి శ్రీవేంకటాద్రిపై గలసినావు**
**నన్ను అడియాలముగ నౌరచెన్ను విఠల**

సంఖ్య: XXVII/17 రాగం : ఆహిరి
కీర్తన : ఇంకనైన గరుణించవేమయ్య

**ఆహిరి**

**14** **ఇంకనైనఁ గరుణించవేమయ్య శ్రీ-**
**వేంకటేశ మా ఇంటికి విచ్చేయవయ్యా** ||**పల్లవి**||

**చింతాజలధి దాఁటఁ జెక్కు చేయి తేపసేసి**
**కాంత నీ కెదురుచూచీఁ గదవయ్యా**
**కొంతపుఁ గోరికలనే కొండవాఁకఁ దనజడ**
**ఇంతలో నిచ్చెనసేసీ నిది చూడవయ్యా** ||**ఇంక**||

**వెడ చింతచీఁకటికి వెలుగుగా నిట్టచూపు**
**కడఁగి పంజువట్టె రాఁగదవయ్య**
**అదరి తమకమనేఅడవి దాఁట నిట్టూర్పు**
**యెడ గుఱ్ఱముగఁ జేసి యెక్కె నిదె కోవయ్యా** ||**ఇంక**||

**మదనానలం బార్చ మంతనానఁ జెమటల-**
**నదులు వరపి నిన్ను నవ్వెనయ్య**
**యిదివో శ్రీవేంకటేశ యింతలోఁ గూడఁగ నిన్ను**
**మదిరాక్షి నీపొందు మరువలేదయ్యా** ||**ఇంక**|| **17**

**ఉపోద్ఘాతము:**

ఓ శ్రీవేంకటేశ్వరా! ఇంకనైనా నన్ను అనుగ్రహించవేమయ్యా? మా ఇంటికి విచ్చేయవయ్యా! నన్ను కృపజూడవయ్యా! అని విన్నపంతో వేడుకొంటున్నారు అన్నమయ్య. స్వామీ! నీ దేవిని చింత అనే జలధిలో ముంచి యెన్నడు బయటపడనీయవు. కోరికల నిచ్చెనలను యెక్కించేదీ నీవే చటుక్కున దించేదీ నీవే. ఈ చింత అనే చిమ్మ చీకటిలోంచి ఆమె బయటకు రాలేకపోతున్నది.





ఆమెను బయటపడేయవయ్యా! ఆమె మదనాగ్నిని నివారించటానికి నీ చెమటల చిత్తడితో ఆర్పి మురిసి పోతున్నావు. ఆమెకు దిక్కు చూపవయ్యా అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ శ్రీవేంకటేశ్వరా! నన్ను ఇంకమీదటైనా కరుణించవేమయ్యా? దయచేసి మా ఇంటికి విచ్చేయవయ్యా!

ఒక్కసారి నీ విరహమనే చింతాజలధిని దాటటానికి ఆదేవి తన చెక్కిలిపై చేర్చిన చేతినే తెప్పగా చేసినదయ్యా! ఆమె 'జడ' ఆమెను కల్లోలపరచుచున్న కోరికలనే పర్వతఝురిపై నిచ్చెనవలె సేసి, కాస్త నీ దృష్టిలో వుంచుకోవయ్యా!

ఆమె వెడ (తుచ్ఛమైన) చింత అనే చీకటికి వెలుగువలె నిట్టచూపు చక్కటి దివిటీ చేపట్టి ఆమెకు సాయము రారాదుటయ్యా? పాపం ఏమిచేయాలో తోచక ఆమె తమకము అనే అడవిని దాటటానికి తన సుదీర్ఘమైన నిట్టూర్పనే ఒక అశ్వమును చేసినది. ఎట్లాగో యెక్కి పయనిస్తున్నది. ఇదే ఆమెను యేలుకోవయ్యా!

స్వామీ నీకు తెలియందేముంది? నీ విరహమనే అనలమున (అగ్నిలలో) బడి ఆమె సతమతమగుచున్నది. మంతనాన (సమయస్ఫూర్తితో) దాన్ని ఆర్పుటకు తన చెమటలనే నదుల సహకారము ఆమె తీసికొనుచున్నది. అట్లు చేసి నేను జయించాను సుమా! అన్నట్లు చిరునవ్వు నవ్వుచున్నది. ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు మాత్రం తక్కువవాడివా? ఆమెను మనస్సు పులకరించునట్లు కూడితివి. ఇక ఆ మధిరాక్షి (మదము కప్పిన కన్నులుగల స్త్రీ) నీ పొందు యెన్నడూ మరువలేదయ్యా.

**పద్యవివరణ:**

ఆ.వె|| **ఇంకనైన బ్రోచి ఇంటికి విచ్చేయి**
**వేంకటేశ! నీకు విన్నపమిదె**
**ఎన్నగలుగునీవు ఇంతలోనే కూడ**
**మదిరనయన పొందు మరువలేవు.**

సంఖ్య: XXVII/36 రాగం : రామక్రియ
కీర్తన : రాతి బతిమసేసిన రామచంద్ర

## రామక్రియ

**15 రాతిఁ బతిమసేసినరామచంద్ర నీ-**
**చేతిలోనిదాన నింతే శ్రీరామచంద్ర ॥పల్లవి॥**

**వట్టిరట్టు సేయ కిఁక వద్దు రామచంద్ర**
**నెట్టన నే దూరనోప నిను రామచంద్ర**
**వొట్టితిఁ బ్రేమము నీపై వో రామచంద్ర మమ్ము**
**వట్టిజాలిఁ బెట్ట కిఁక వద్దు రామచంద్ర ॥రాతిఁ॥**

**విన్నపాలు వేయునేల విను రామచంద్ర నా-**
**కన్నులకు నీవె గురి ఘనరామచంద్ర**
**యెన్నిక నన్నుఁ బాయకు మిఁక రామచంద్ర**
**నిన్ను నన్ను నెంచుకొమ్మీ నీవు రామచంద్ర ॥రాతిఁ॥**

**ఆయము లంటితివి నెయ్యపురామచంద్ర వొక్క-**
**పాయమే ఇద్దరికిని బలురామచంద్ర**
**ఆయెడ వావిలిపాటి హరిరామచంద్ర**
**చేయార శ్రీవేంకటాద్రిఁ జెందితి రామచంద్ర ॥రాతిఁ॥ 36**

**ఉపోద్ఘాతము:**

రాతినే ప్రతిమవంటి స్త్రీమూర్తినిచేసిన ఓ శ్రీరామచంద్ర నేను నీ చేతిలోని దాననింతే నయ్యా! శ్రీరామచంద్రా అంటున్నారు అన్నమయ్య, తాను సీతాదేవిగా భావించుకొంటూ కలిగిన భావావేశంలో. వావిలిపాటి వీరరాఘవునిపై చెప్పిన కీర్తన ఇది. అన్నమయ్య ప్రత్యేకత అది. సీతాదేవి రాఘవునితో సంభాషించడం నిజంగా ఒక ప్రత్యేకతే.





**తాత్పర్య వివరణ:**

ఓ శ్రీరామచంద్రా! రాతిని నీ పదస్పర్శతో ప్రతిమవంటి స్త్రీ మూర్తిని చేసినావు. నేను సీతను. నీ చేతిలోని దానను (వశవర్తనురాలను). ఇంతే ప్రభూ! రామచంద్రా! నన్నూ కరుణించుము.

ఓ శ్రీరామచంద్రా! వట్టిరట్టు (నిష్ప్రయోజనమైన ఆగడము) జేయవద్దు. నిన్ను నేను నెట్టన (అనివార్యముగా) నిందించగలనా? ఓ రామచంద్రప్రభూ! నా ప్రేమనంతా నీపై ఒట్టితిని (ఉంచితిని). ప్రభూ! నాపై వట్టిజాలి (నిష్ప్రయోజనమైన సానుభూతి) పెట్టకిక (ప్రదర్శించవలదు). అయినా నీవు కోసలేంద్రుడవు. ప్రజావాక్యమే నీకు శిరోధార్యము. మాబోటి వారి మనోవేదన నిన్నేల బాధించవలె.

ఓ శ్రీరామచంద్రా! నీవు పరమాత్మ మానవ రూపంలో అవతరించినవాడవు. ఇది వినవయ్యా! నీకు వేయి విన్నపములను చేసికొనవలెనా? ఘనుడవైన ఓ రామచంద్రా! నా కన్నులకు నీవే గురివి (లక్ష్యానివి). నేను అన్యములను కన్నెత్తి చూడను. ఇప్పటివరకు అయినదేదో అయినది. ఇకనైనా యెన్నికతో నన్ను మన్నించి నాతోడు విడనాడకుము. నిన్ను నన్ను యెంచబడిన జంటవలె నాకు కీర్తిననుగ్రహింపుము.

ఓ శ్రీరామచంద్రా! నెయ్యపు (ప్రేమాస్పదమైన భావనలతో) నీవు నా ఆయములంటితివి (మర్మములను తాకితివి). బలిష్ఠుడవైన రామచంద్రా! ఇద్దరమూ ప్రాయములోనే వున్న ప్రేమికులము. అక్కడ వావిలిపాడులో వెలసిన శ్రీహరివి వీరరాఘవుడవూ నీవే. చేయార (మా చేతిలోనున్న) శ్రీవేంకటాద్రికి చెందిన రామచంద్రుడవు నీవే.

**పద్యవివరణ:**

కం॥ **రాతిఁబతిమ సేసిననీ-**
**చేతిని వున్నట్టిదాన శ్రీరామప్రభో!**
**ప్రీతిగవావిలిపాటిలో**
**సీతాపతి, వేంకటేశ! సిరిపతివయ్యా!**

సంఖ్య: XXVII/152 రాగం : బౌళి
కీర్తన : బాపు బాపు కృష్ణా బాలకృష్ణా

**బౌళి**

**16 బాపు బాపు కృష్ణా బాలకృష్ణా**
**బాపురే నీ ప్రతాప భాగ్యము లివివో ॥పల్లవి॥**

**బాలుఁడవై రేపల్లెఁ బాలు నీ వారగించఁగ**
**పాల జలనిధి యెంత భయపడెనో**
**ఆలించి తొడలుమాట లాడనేరుచుకొనఁగ**
**యీలీల ననురసతు లెంత భ్రమసిరో ॥బాపు॥**

**తప్పటడుగులు నీవు ధరమీఁదఁ బెట్టఁగాను**
**తప్పక బలీంద్రుఁ డేమి దలఁచినాఁడో**
**అప్పుడే దాఁగిలిముచ్చు లందరితో నాడఁగాను**
**చెప్పేటివేదాలు నిన్నుఁ జేరి యెంత నగునో ॥బాపు॥**

**సందడి గోపికల చంకలెక్కి వున్ననాఁడు**
**చెంది నీ వురము మీఁది శ్రీసతి యేమనెనో**
**విందుగ శ్రీవేంకటాద్రి విభుఁడవై యున్న నేఁడు**
**కందువైన దేవతలఘనత యెట్టుండునో ॥బాపు॥ 152**

**ఉపోద్ఘాతము:**

అన్నమయ్యనోటినుండి ఇంత అపురూపమైన కీర్త యెలావచ్చిందంటారు? “పలికెడిది విష్ణుకీర్తన, పలికించెడివాడు గిరులవల్లభుడట ఆ, తలపే రాదట ఒరులకు, కలరే అన్నయ్య సాటి కవులీజగతిన్”? ఎంత చక్కటి కందపద్యం వచ్చేసిందో చూడండి. దీని తాత్పర్యవివరణ చదివి మీరు పులకించకపోతే “బాపుబాపు కృష్ణ బాలకృష్ణా” అనటం తప్ప నేనేం చేయగలను? అన్నట్లు, “బాపు” అంటే “భళీ”! అని అర్థం.





**తాత్పర్య వివరణ:**

బాపు బాపు (భళి భళీ!) కృష్ణా! ఓ బాలకృష్ణా! బాపురే (అమ్మయ్యో!) నీప్రతాపము యొక్క భాగ్యమును వివరించే రమ్యమైన వుదాహరణలివివో (ఇవిగో) ఆలకించుతండ్రీ!

బాలుడవై (పసిపాపడివై) రేపల్లెలో నీవు పాలుత్రాగేరోజుల్లో, నీవు పాలుతాగే వేగము, పాలంటే నీకున్నఇష్టము చూచి బహుశా నీవు శ్రీమన్నారాయణుడవై తిరిగివచ్చినప్పుడు ఆపాలజలనిధిలో ఒక చుక్కఅయినా వుండదేమోనని క్షీరసాగరము యెంత భయపడెనో కదా! కొంచెము పెద్దవాడివి అయ్యాక నీవు తొదలు మాటలాడ నేర్చితివి, (మాటలు రాని పాపాయిలు తొస్సి మాటలు మాట్లాడతారు). వాటని ఆలించి (విని) కంసుడివద్దనుండే రాక్షస స్త్రీలు వీడు మా అసురుల పాపాయే అని భ్రమపడి నీలీలకు భ్రమసిరయ్యా!

ప్రభూ! బుల్లిబుల్లి పాదాలతో నీవు తప్పటడుగులు, భూమిపై వేస్తుంటే బలిచక్రవర్తి రసాతలమునుంచి దాన్ని చూచి యేమితలచినాడో? అయ్యో! ఈ బుల్లి అడుగులే మూడడుగులు ఆనాడు నేను దానం ఇచ్చివుంటే పృధ్వినే పరిపాలించేవాడిని కదా! అనుకొనివుంటాడు. కొంచెము పెద్దయ్యాక అందరితో దాగిలిముచ్చులు (దాగుడుమూతలు) ఆడుతుంటే, నీవు దొంగవై దాక్కుంటుంటే, వేదములన్నీ పకపకా నవ్వుకొన్నాయి. వేదరక్షకుడు జగన్నాథుడూదొంగా మరి ఇక సృష్టిలో దొరయెవరు?

స్వామీ! రేపల్లె గోపికలంతా తమ చంకల్లో నిన్నెత్తుకొని తిరుగుతుంటే నీ వురముపైనున్న శ్రీదేవి నిన్ను వాళ్ళు పడవేస్తే తనగతియేమిటని యెన్ని మాటలన్నదో నిన్ను? నేడు విందుగా శ్రీవేంకటాద్రి విభుడవై యున్నావు. మరి ఇతర దేవతలని కొలిచేవారెవరు? కందువైన (మలినమైన) తమ ఘనత యెట్లుండునో అని ఒకటే బెంగపడివుంటారు.

**పద్యవివరణ:**

ఆ.వె॥ **బాపు బాపు కృష్ణ! బాలకృష్ణా! నీదు**
**బాపురే! ప్రతాప భాగ్యములివి**
**వేంకటాద్రి విభుడు విందుగనున్నాడు**
**కందువైన సురులఘనతయెటులొ?**

సంఖ్య: XXVII/76    రాగం : సాళంగనాట
కీర్తన : తాపసులడవి యేడ తరుణి యేడ

**సాళంగనాట**

**17. తాపసులడవి యేడ తరుణి యేడ**
**బాపుబాపు రామచంద్రభావించి చూడుమా** ॥పల్లవి॥

**సీతఁ బాసిబంగారు సీతఁ బెండ్లియాడితివి**
**ఆతలఁ బరస్త్రీల నంట వందురు**
**చేతులార ముత్తేలసేస వెట్టె నీకు ఆ-**
**చేతనుఁజెక్కుమోఁపి చింతించే కొరకా** ॥తాప॥

**వెంటనే భూమిజఁ బాసి వేరేభూమి చేకొంటి**
**జంటనే సత్యముగలజాణ వందురు**
**వింటివంక నీకు నాకె వేడుకఁ జేరి మరు-**
**వింటిబారిఁబడి యొంటి వేఁగేటికొరకా** ॥తాప॥

**కొడుకులవంకఁ బెండ్లికొడుకవైజానకి-**
**నదరి కమ్మరఁ బెండ్లియాడితివి**
**తొడరి శ్రీవేంకటాద్రిఁ దోడనె వావిలిపాట**
**కడఁగి రాముఁడవై కరుణించే కారకా** ॥తాప॥ **76**

**ఉపోద్ఘాతము:**

ఓ శ్రీరామచంద్రా! తపస్సు చేసికొనే వారు ఉండవలసిన అడవి యెక్కడ? ఎండకన్నెరగని సుకుమారమైనతరుణి జానకి యెక్కడ? భళిభళీ! ఓ రామచంద్రా! నీవే భావించి చూడవయ్యా! అంటున్నారు అన్నమయ్య. అసలు సీతను విడనాడి బంగారు సీతను చేపట్టావు, మరువింటి బారిబడి ఒంటరిగా వేసారినావు. నీ ధర్మదీక్ష నిరుపమానమయ్యా! నీవు ఏకపత్నీవ్రతుడవైనా మాకోసంవావిలిపాటిలో యెన్నో పెండ్లిండ్లు చేసికొన్నావు. అదే నీకు వేంకటాద్రిపై నిత్యకళ్యాణం పచ్చతోరణం అయింది అంటున్నారు.





**తాత్పర్య వివరణ:**

బాపుబాపు (భళి భళీ!) శ్రీరామచంద్రా! తాపసులడవియేడ (తపస్సు చేసుకొనే మునీశ్వరులుండవలసిన అడవి (అరణ్యము యెక్కడ) తరుణియేడ (ఎండ కన్నెరగని సీతాదేవి యెక్కడ)? భావించి చూడుమా! (ఒక్కసారి ఆలోచించి చూడవయ్యా! మహానుభావా!

ఏకపత్నీవ్రతుడవు అయినా నిన్నువిధి వదలలేదు. రాజ్యాభిషిక్తుడవై రజకునిమాటకు వెఱచి సీతను బాసినావు. ప్రజలకోసం అశ్వమేధయాగం చేసి బంగారు శిల్పరూపి సీతను పెండ్లియాడితివి. అందుకనే పరస్త్రీని తాకవనే ఖ్యాతి నీకు వచ్చింది. ఆమెపై ఏ చేతులతో ముత్యాల తలంబ్రాలు చల్లావో నేడు ఆ చేతులనే నీ చెక్కిళ్ళకానించుకొని చింతిస్తున్నావు. అందుకేనా శివధనస్సువిరిచి ఆమెను చేపట్టినది? బాపు బాపురఘునాథా!

దేవా! భూమిజ (సీత)ను బాసి భూవల్లభుడవు (చక్రవర్తి) అయితివి. అయినా నిన్ను సత్యవాక్య పరిపాలకుడవనే కీర్తించారు. రాజులు భోగులు, అసత్యం వారికి వెన్నతో పెట్టిన విద్య అంటారు. కానీ నీకు సత్యమే యెన్నడూ వీడని జంట. నీవు నిత్య కోదండ దీక్షాదక్షుడవు. అట్టి నీకు ఆకె (ఆమె... సీత) వేడుకగా తోడై సుఖించాలనుకొన్నది. ఆమెకు దక్కిన సుఖమేమిటి రావణుని చెరలో మరువిలుకాని బాధను ఒంటరిగా సైచి యెంతకుమిలిపోయింది? ఇందుకేనా ఆమె నీ మెడలో వరమాల వేసినది?

ఓ శ్రీరామచంద్రా! కొడుకులకు పెండ్లి చేయవలసిన వాడివి మా అమ్మ జానకమ్మను మళ్ళీమళ్ళీ పెళ్ళాడుతున్నావు. ఇదెక్కడి వింత ప్రభూ! అదరి కమ్మర బెండ్లియాడ (అతిశయముతో తిరిగి మళ్ళీ పెళ్ళాడుతున్న నిన్ను చూచి, వావిలిపాటి వీరరాఘవుడవైన నీవు శ్రీవేంకటేశ్వరుడవైనందువల్ల ఇన్ని పెళ్ళిళ్ళు చేసికొంటున్నావు. ఇది మమ్మల్ని కరుణించేకొరకు కాక నీకే కోరికవుంటుందయ్యా?

**పద్యవివరణ:**

ఉ॥ **తాపసులుండుకారడవి తానదియెక్కడ తన్వి యేడనో**
**కాపురముండ వచ్చినది కర్కశ దానవ చిత్రకూటమా**
**బాపుభళారె! రాఘవుడ భావన సుంతయుజేయవైతివే**
**తోపెను వేంకటేశ్వరుడె తోయజనేత్రుడు రామచంద్రుడున్**

సంఖ్య: XXVII/276 రాగం : మాళవి
కీర్తన : వాడు గదె ప్రహ్లాదవరదుడు

**మాళవి**

**18 వాఁడు గదె ప్రహ్లాదవరదుఁడు**
**నాఁడాడినమాటలకు నవ్వీని చూడరే** ||పల్లవి||

**పంతములెల్లాఁ జెల్లించె ప్రహ్లాదవరదుఁడు**
**వంతుకెక్కించెఁ బ్రహ్లాదవరదుఁడు**
**బంతి విడేలు వెట్టెను ప్రహ్లాదవరదుఁడు**
**ఇంతటి నారమణుని నేమని చెప్పుదునే** ||వాఁడు||

**బలిమిఁ జన్ను లంటె నీ ప్రహ్లాదవరదుఁడు**
**వలపు నించెఁ బ్రహ్లాదవరదుఁడు**
**పలుకుఁబంత మీదేర్చెఁ బ్రహ్లాదవరదుఁడు**
**అలరించె నిన్నిటా నేమని పొగడుదునే** ||వాఁడు||

**పన్నుగ శ్రీవేంకటాద్రి ప్రహ్లాదవరదుఁడు**
**వన్నెగాఁ గూడెఁ బ్రహ్లాదవరదుఁడు**
**పన్నినమాయ దెలిపె ప్రహ్లాదవరదుఁడు**
**యిన్నిటా నీతనిసుద్దు లెన్నెని నే మెత్తునే** ||వాఁడు|| **276**

**ఉపోద్ఘాతము:**

ప్రహ్లాదవరదుడైన నరసింహునిపై కనీ, వినీ, యెరుగని శృంగారకీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. నాడు ఆడిన మాటలకు (తన దేవిని వురముపై పెట్టుకొంటాను,... యెన్నడూ విడువను వంటి అనేక వాగ్దానాలను గుర్తుకు తెచ్చుకొని, నవ్వీని చూడరే అంటున్నారు.

ఆయన పంతములెల్లా జెల్లించుకొని తన మాట నెగ్గించుకొంటాడట. బలవంతంగా శ్రీలక్ష్మి వురోజాలను స్పృశిస్తాడట. అన్ని రకాలుగాను అలరించగల ఆ స్వామిని యేమని పొగడాలే... అంటున్నారు. ఈ





వేంకటాద్రి ప్రహ్లాదవరదుడు పన్నిన మాయలు యెన్నని చెప్పము? యేమని చెప్పము అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

అమ్మలారా! ప్రహ్లాదవరదుడంటే వాడేగదే. శ్రీలక్ష్మిని సతిగా స్వీకరించినవాడు ఆమెస్థానం తనఉరముపైన అని నాడుఆడిన మాటలు, నేటి ఈ భీకరావతారంతో యెలా పోల్చనా! అని "నవ్వీని" (నవ్వుకొంటున్నాడు) చూడరే (చూడండమ్మా!)

ఈయనేమీ సామాన్యుడనుకొంటున్నారా? ఈయన పంతములెల్లా జెల్లించుకొని (హిరణ్యకశిపుడి షరతులన్నింటినీ నెరవేర్చి, వానిని చంపి) ప్రహ్లాదవరదుడై అనుగ్రహించినాడు. ఆ ప్రహ్లాదుని వంతుకెక్కించినాడు (అతనిని తన భక్త శిఖామణిని చేసినాడు). బంతి విడేలువెట్టె (వీరు వారని గాక) తన ఆశ్రితులందరికీ ఒకే వరుసలో తాంబూలమునిచ్చాడు. ఓ అమ్మలారా! ఇంతటి వుద్దండుడైన నా రమణుని (నా నాథుని) యేమని చెప్పెదనే?

అమ్మలారా! అతి గోప్యమైన మాటను చెబుతాను ఆలకించండి. ఏదో మిషతో ఈయన బలవంతాన నా వురోజములను స్పృసిస్తాడు. ఆపైన నా హృదయంనిండా వలపుల అలజడి కలిగిస్తాడు. పలుకు పంతము తను అన్నట్టి మాటను పంతముగా తీసికొని తన పట్టుదల ఈడేర్చుకొన్నాడు. అటు శత్రు సంహారములోనూ, ఆశ్రిత రక్షణలోనూ, తన హృదయేశ్వరిని రంజింప చేయటంలోనూ అలరినాడు. ఈ స్వామిని యేమని పొగడనే

నేడు పన్నుగ (ఒక ఆశయముతో) శ్రీవేంకటాద్రిపై ప్రహ్లాదవరదుడైనాడు. నన్ను అనుగ్రహించి, వన్నెగా (శోభాయమానంగా) కూడినాడు. తాను పన్నిన మాయను తన భక్తులకు తెలిపి అనుగ్రహిస్తాడు. ఈ విధముగా ఈతని సుద్దులు (లీలలు) యెన్నని నేను మెచ్చుకోనమ్మా?

**పద్యవివరణ:**

తే.గీ|| **వాడు ప్రహ్లాదవరదుడు పకపకమనె**
**నాడు నేనాడుమాటకు చూడరమ్మ!**
**వన్నెగా గూడెనే నన్ను పన్నిమాయ**
**వేంకటాద్రిపై ఆ సుద్ది పేరుకొనరె!**

సంఖ్య: XXVIII/65 రాగం : హిందోళం
కీర్తన : ఎంత మోహమోగాని ఇతడు నీమీదను

## హిందోళం

**19 ఎంత మోహమోగాని ఇతడు నీమీదను**
**సంతతము బాయకిటు సరుసనున్నాడు** ॥పల్లవి॥

**పలుకవేపతితోడ పగడ వాతెర దెరచి**
**చిలుకవే సెలవులను చిరునవ్వులు**
**మొలక సిగ్గులివేల మోనంబులింకనేల**
**కలయికకు వచ్చి ఇదె కాచుకొన్నాడు** ॥ఎంత॥

**కనుగొనవె వొకమాటు కలువకన్నులనితని**
**పెనగవే కరములను ప్రియము చల్లి**
**పొనిగేటి తమక మేల పొసగిగుట్టిక నేల**
**నినుగదియువేడుకను నిలుచున్నవాడు** ॥ఎంత॥

**కొసరవే యీవేళ కూరిములు సారెకును**
**విసరవే సణగులిటు వేమారును**
**వెసరతుల మరిగి శ్రీ వేంకటేశుడుగూడి**
**సుసరమున నీతోడ జొక్కుచున్నాడు** ॥ఎంత॥

**ఉపోద్ఘాతము:**

ఈ సరస శృంగార కీర్తనలో అన్నమయ్య, ఎంత మోహమోగాని ఇతడు నీపై అనురాగముతో ఎప్పుడూ వదిలిపెట్టక ఇట్లు నీ సరసననే వుంటాడు అంటున్నారు. ఇది సరసకీర్తన అయినందువల్ల కొన్ని పదాలకు అర్ధము మరీ విడమరచే ప్రయత్నం చేయటం లేదు. కొన్ని పడకటింటి రహస్యాలు రహస్యంగా వుంటేనే అందం. దిశమొలలో అందమేముంటుంది? పాపం స్వామి సుసరమున దేవితో జొక్కుచున్నాడట.





**తాత్పర్య వివరణ:**

ఓ దేవీ! ఇతడు (ఈ శ్రీవేంకటేశ్వరుడు) నీమీద ఎంత మోహముతోనున్నాడో గాని, నిన్ను సంతతము (ఎల్లవేళలా) పాయక (వదలివుండలేక) ఇటు (ఇట్లా) నీ సరసనున్నాడు. (నిన్ను అంటిపెట్టుకొనేవున్నాడు).

ఓ దేవీ! పగడవాతెర తెరచి (పగడముల కాంతిగల నీ నోటిని కొద్దిగా తెరచి) నీ పతితోడ, పలుకవే (మాట్లాడవమ్మా!) సెలవులను (నీ లేతపెదవుల మూలలనుండి) చిరునవ్వులు చిలికించవమ్మా! ఈ సమయంలో నీకు వుండకూడనిదే మోనంబు (ముంగిలా మౌనంగా వుండటం.) మరియు మొలక సిగ్గులు (సిగ్గుల మొగ్గ అయ్యే దురలవాటు). నీ భర్త యెవరనుకున్నావు? జగదేకపతి.ఆయనే నిన్ను కూడవలెనని వస్తేఇట్లా కాచుకొని నిరీక్షింపజేస్తావా? ఏమిటి తల్లీ ఇది.

ఓ దేవీ! తెల్లకలువలవంటి కన్నులుగల ఇతనిని ఒక మాటు కనుగొనవే. ప్రియములన్నీ చల్లి అతని బాహువులమధ్య పెనగవే. ఓ దేవీ! పొనిగేటి (నిస్తేజమైన) తన్మయత్వము యెందుకమ్మా? ఇద్దరు కూడినాక గుటకలు మింగుతావు దేనికమ్మా? ఇదిగో ఈ జగదేకపతి నిన్ను తన కౌగిలలో తీసికొనవలెనని యెంత వేడుకతో నిలుచున్నాడో ఒకపరి పరికింపరాదా?

ఓ దేవీ! ఈవేళ ప్రతిసారీ అతనిపై నీ కూరిమి కొసరి కొసరి చూపించవమ్మా!ఆయనపైవేమారు (పలుమార్లు) ఇటు సణుగులు (సణిగేమాటలు) విసరవే (కుమ్మరించవమ్మా!) శ్రీవేంకటేశ్వరుడు నీ రతుల మరిగి ఆపై నిన్ను కూడినాడమ్మా! నీతోడుతో సుసరమున (మధుర నిశ్వాసములవలన) జొక్కుచున్నాడు అలిసియున్నాడు.

**పద్యవివరణ:**

కం॥ **ఎంతటిమోహమొ ఇతనికి**
**సంతతమును బాయడాయె సరసనెకూడున్**
**చెంతనె రతులను మఱగిన**
**కాంతుడు వేంకట విభుండు కౌగిలిపెనగన్.**

సంఖ్య: XXIX/104 రాగం : తిలంగ్
కీర్తన : ఈకె కలుగగ గదా యిన్నియును నెలవెట్టి

**తిలంగ్**

**20 ఈకె కలుగగ గదా యిన్నియును నెలవెట్టి**
**దాకొని వొందొకటితో దారుకాణలాయనే ॥పల్లవి॥**

**పొలతి మోమును పోలు పున్నమ చందురుడు**
**కలికి కన్నుల పోలు కలువలివి**
**నిలువు తురుము పోలు నెమ్మది తుమ్మిదగుంపు**
**యెలమి మదను సిరులెంత నోమునోచెనో ॥ఈకె॥**

**వనిత బొమ్మల పోలు వరుస చెరకుటిల్లు**
**చను గుబ్బలను పోలు చక్రవాకాలు**
**తనువున పోలును తాలిమితో చిగురాకు**
**యెనలేని మరుసిరులెంత నోము నోచెనో ॥ఈకె॥**

**యింతి పిరుదుల పోలు యీతని బండి కండ్లు**
**చెంత పాదాల పోలు చెందామరలు**
**సంతోసాన శ్రీవేంకటేశ్వరుడు కాగిట కూడె**
**యింతటా కంతుని సిరులెంత నోము నోచెనో ॥ఈకె॥**

**ఉపోద్ఘాతము:**
ఈమె మన కనులయెదుట కలుగుట చేతనే ఇన్నియునునెలవెట్టి (సంభవించి) ఈమెలో ఆ లక్షణములన్నియు దాగికొని ఒకదానికింకొటి కారణభూతములైనవి అంటున్నారు అన్నమయ్య. కీర్తనలోని విశేషాలన్నీ ఇదివరకుచాలా మధురకీర్తనలలో అన్నమయ్య యేకరువుపెట్టినవే. కాని దేని మాధుర్యం దానితే. దేనిప్రత్యేకత దానిదే. ఆమె జగదేకపతి కౌగిటకరిగే భాగ్యంపొందింది. ఇంతటి మదనవైభవమును అనుభవించుటకు ఆమె యేమి నోము నోచెనో కదా! అని అబ్బురపడిపోతున్నారు పదకవితా పితామహులు.





**తాత్పర్య వివరణ:**

ఈకె (ఈమె... అలమేల్మంగ) ఇతనికి కలుగగ గదా (దక్కుట చేతనే కదా!) నెలవుగా ఈతనిని, దాకొని (సమీపించి) వొందొకటితో (ఒకరి చేతులకింకొరు) తారుకాణాలాయెనే (దృష్టాంతములైనవికదా!) (భావం చదివిన కొద్దీ మీకే స్ఫురిస్తుంది).

ఈ పొలతి (యువతి) పున్నమి చందురుని పోలియున్నది. ఈ కలికి (యువతి) కన్నులున్నాయే అవి తెల్ల కలువల జంటను పోలియున్నది. ఈమె ఘననీలకేశముల తురుము (కొప్పు) వున్నది చూశారా, ఇది నెమ్మదిగా గుమిగూడిన తుమ్మెదల గుంపువలెనున్నది. ఈమె ఇంత మదన సిరులతో (మన్మథుని వైభవములతో) అలరారుటకు యేమి నోములు నోచినదో కదా!

ఈ వనిత కనుబొమ్మలు చెరకుటిల్లు (చెరకు విలుకాడైన మన్మథుని) విల్లును పోలియున్నది. ఈమె స్తనయుగ్మము చక్రవాక పక్షులజంటను పోలియున్నది. సుకుమారమైన ఈమె తనువు, తాలిమితో (మృదుత్వంలో... అనే... భావించాలి) చిగురాకును బోలియున్నది. ఎనలేని (గణించశక్యముకాని) మన్మథ శోభలతో శృంగారమూర్తియై విరాజిల్లుటకు ఈమె యేమి నోములు నోచినదో కదా!

"బండి కండ్లు" అంటే బండిలో ఉన్నవారు బయట దృశ్యములను చూచుటకు అమర్చిన పెద్దపెద్ద కిటికీలు. ఈమె ఘననితంబములు, వేంకటరమణుని తేరుకుగల బండికండ్లవలెనున్నవి. ఈమె పాదములు ఎఱ్ఱని తామరపూవులను పోలియున్నవి. ఈమె శ్రీవేంకటేశ్వరుని సంతోషముతో కూడినది. ఇంతటి కంతుని (మన్మథ) సిరులు పొందుటకు ఈమె యేనోము నోచెనో కదా!

**పద్యవివరణ:**

తే.గీ॥ **దాగి వొందొక్కటితొ నాయె దారుకాణ-**
**ములుగ, ఇదియెల్ల నెలకొనె ముదితవలన**
**సంతసంబున వేంకన్న సకియగూడె**
**కంతుని సిరికై నోములు యెంత నోచె!!**

సంఖ్య: XXV/185 రాగం : భౌళి
కీర్తన : ఎంచుకొమ్మా నీకునీవే యీ తగవులు

**భౌళి**

**21 ఎంచుకొమ్మా నీకునీవే యీ తగవులు**
**మంచితనాన చెలిని మన్నించవయ్యా** ॥పల్లవి॥

**వంతలకు వాసులకు వనితలు సొలసితే**
**పంతమాడిరంటూ యెగ్గు పట్ట తగునా**
**వింతలుగా తీగెలు వసంత కాలాన చిగురు**
**యెంత పెంచినా నందు కిచ్చగించవలదా** ॥ఎంచు॥

**ననుపైన రమణులు నవ్వులెంత నవ్వినాను**
**ఘనగర్వములంటాను కాదందురా**
**యెనసి వానాకాలాన యేరులు మించి పారితే**
**యెనలేని వేడుకతో నీదులాడ వలదా** ॥ఎంచు॥

**రతివేళ వనితలు రాపు నిన్ను చేసితేను**
**తతిగొని నీవూ కడుదమకింతురా**
**క్షితి నాడు కోవిలలు చెలగి యెంత వుండినా**
**సతమై శ్రీవేంకటేశ సారెవినవలదా** ॥ఎంచు॥

**ఉపోద్ఘాతము:**

స్త్రీలన్నాక యేవో చిట్టిపొట్టి తగవులు తమ ప్రియునితో ఆడుతూనే వుంటారు. ఈ తగవులకెంత ప్రాముఖ్యం ఇవ్వాలన్న విషయం నీకు నీవే ఎంచుకొమ్మా (నిర్ణయించుకోవయ్యా!) ఏది ఏమైనా మంచితనాన నీ చెలియను మన్నించావంటే ఆమె నీకు వశవర్తనురాలవుతుంది కదయ్యా! అంటున్నారు అన్నమయ్య. స్త్రీలతో ఎంతలలితంగా వుండాలో స్వామికి ఉద్బోధిస్తున్నారు. ఈ కీర్తనలోని అమలిన శృంగారం రసహృదయాలను పరవళ్ళు తొక్కిస్తుంది.





**తాత్పర్య వివరణ:**

ఓ సప్తగిరీంద్రా! యీ తగవులు (చిటిపొటి పంతములు, పోట్లాటలు) మీ దంపతులకు మేలు చేస్తాయా నీవే ఆలోచించు. నీకు నీవే జగదేకపతివి. ఏదియుక్తమో ఏది కాదో నీవే ఎంచుకొమ్మా (బేరీజు వేసికొనుము ప్రభూ!) ఏది ఏమైనా నీ చెలిని నీమంచితనముతో మన్నించవయ్యా!

ప్రభూ! స్త్రీలు ఏడుస్తుంటే తమమాట నెగ్గించుకోవాలని బెట్టుచేసి సొలసితే (నైరాశ్యత చెందితే) అబ్బా! ఈమెకు ఇంత పంతమేమిటి? అని యెగ్గు పట్టదగునా (నేరారోపణ చేయవచ్చునా?) వసంతకాలమున చిగురులు లతలు వింతగా తీగెలల్లుకుపోతుంటే వాటిని యెంత పెంచినా అందుకు సమ్మతించి ఆమెను సంతోషపెట్టవలదా? ఇది నీకు తెలియనిదా స్వామీ!

దేవా! ననుపైన రమణులు (ఇంపైన వనితలు) పకపకా నవ్వుతుంటే ఆమె ప్రియుడు ఇంకా అధికముగా ఆనందించాలి. అట్లా కాక ఆమె గర్విష్ఠి అని తలచి ఆమెను నిరాకరింతురా? ఇది నీకు తగునా ప్రభూ! వానాకాలములో యేరులన్నియు ఉరకలెత్తి పారుతుంటే, యెనలేని (చెప్పలేని) వేడుకతో ఈదులాడి రంజింపచేయవలెను. నీకు నీవే స్తబ్దుగా వుండదగునా ప్రభూ!

స్వామీ! రతివేళ వనితలకు రాపులు (రకరకములైన ఒరిపిడి, వత్తిడులు) సహజంగానే కలిగిస్తుంటారు. పంతముపూని నీవు కూడా ఆమెను తమకించవచ్చునా (ఉద్వేగపరచవచ్చునా) లోకంలో ఆడుకోకిలలు యెన్ని వున్నా ప్రయోజనమేమిటి? శాశ్వతుడైన శ్రీవేంకటేశ్వరుడనే గండుకోయిల కూజితము చక్కగా వినవలదా?

**పద్యవివరణ:**

కం॥ **ఈ తగవులెంచుకొమ్మా**
**ఆ తరుణిని నీకు నీవె అలరించదగున్**
**ప్రీతిని మన్నించు విభో!**
**చేతల నీమంచితనము చెలి మరువదికన్**

సంఖ్య: XXIX/143    రాగం : వలజ
కీర్తన : ఇటువలెనుండ వద్దా యిరవైన మోహము

**వలజ**

**22 ఇటువలె నుండవద్దా యిరవైన మోహము**
**తటుకన నీమీది తగులెంతోకాని** ||పల్లవి||

**సొరిది నీమోము సారె జూచియును తనియదు**
**తరుణి మాటలాడియు తనియదు**
**సరసము లాడియాడి చాలునని తనియదు**
**అరుదైన మదిలోని యాస యం(యెం)తోకాని** ||ఇటు||

**ననుపుసేసుక చెలి నవ్వియును తనియదు**
**తనువుసోక పెనగి తనియదు**
**మునుకొని చేతులెత్తి మొక్కియును తనియదు**
**యెనసి నీపై వలపింకా నెంతోకాని** ||ఇటు||

**నీకాగిట రతిసేసి తనియదు**
**తమితో గుబ్బలనొత్తి తనియదు**
**జమళి శ్రీవేంకటేశ సన్నసేసి తనియదు**
**అమరిన సంతోసమది యెంతోకాని** ||ఇటు||

**ఉపోద్ఘాతము:**

తటాలుమని నీమీద అతనికి యెంత ఆసక్తి కలిగిందో చెప్పలేము కానీ ఒక్కమాట చెబుతాను వినవమ్మా! ఒకసారి సుస్థిరమైన మోహము ఇటువలె (ఇట్లా వినమ్రతతో) వుండవద్దా? తమకము బరిదాట వచ్చునా అని అంటున్నారు దేవితో అన్నమయ్య. ఈ కీర్తనలో మధురభక్తి పరవళ్ళు తొక్కి శృంగారపుటంచులను తాకి రతి సామ్రాజ్యంలో గతులెన్నో చూచింది. బాలబాలికలు దీనిమీద కొన్నేళ్ళు వేచివుంటే, యెంతో మంచిది. ఇందులో అన్నమయ్య అలమేల్మంగ చెలికత్తె.





**తాత్పర్య వివరణ:**

ఓ దేవీ! యిరవైనమోహము (సుస్థిరమైన మోహము) ఇటువలెనుండవద్దా (ఇట్లా వినమ్రతతో వుండవలదా)? ఆయనకు తటకున (తటాలున... అంటే... హఠాత్తుగా) నీమీద, తగులెంతో కాని (యెంత ఆసక్తి కలిగిందో చెప్పలేము కానీ) ఆయన నిన్ను యెంచుకొనుటే నీ భాగ్యము తల్లీ!

ప్రభూ! ప్రతిసారీ మెల్లిమెల్లిగా నీ మొగమును చూడ ప్రయత్నిస్తుంది. కాని అదేమిటో యెంత చూచినా తనియదు (తృప్తిచెందదు). నీతో యెంతసేపు మాట్లాడినా ఆమె తృప్తి జెందదు. నీతో చిలిపి సరసాలు యెంత ఆడినా ఆమెకు గొప్ప ఆనందం కలిగే మాట నిజమే కాని తృప్తి మాత్రం కలుగుట లేదు. అరుదైన (అంచనా వేయలేని) ఆమె మనస్సులో నీపై ఆశ యెంత వున్నదో కాని, ఆమె నిను విడచి వుండలేదు.

స్వామీ! ఆ చెలి, ననుపు సేసుక (నీపై అనురాగము ప్రదర్శించుచూ) నవ్వి నిన్ను మత్తెక్కిస్తుంది కాని దానితో ఆమెకు తృప్తి కలుగుటలేదు. నీ శరీరాన్ని పైనవైచికొని తాకినా, ఆ తరుణి తనియదాయెను. వెంటనే నీకు దాసోహమని, మునుకొని (ముందుకువచ్చి చేతులెత్తి నీకు మొక్కుతుంది. అదేమి వింతయో దానికీ ఆమె తృప్తిచెందదు. ఎనసి (నిన్ను పొంది) నీపై ఆమె వలపు ఇంకా యెంత పెరిగిందో అంచనా వేయలేము.

దేవా! ఆమె నీకౌగిలిలో యెంత రతివుద్విగ్నత జెందినా తనియదు. అనురాగాతిరేకమున తన గబ్బిగుబ్బలను నీకెంత ఒత్తినా తనియదు. ఓ శ్రీవేంకటేశ్వరా! జమళి (నీతో జతగూడి) ఆమె యెన్ని సైగలు చేసినా తనియదు. మరి ఆమె యెదలో యెంత సంతోషము రంజిల్లినదోగాని ఆమె నీవు లేక తనియదు.

**పద్యవివరణ:**

కం|| **ఇటువలె యుండగ వద్దా?**
**తటుకుననీపైన యెంత తగులున్నా? నీ**
**సటకారిప్రియుడు జగపతి**
**కిటుకున కౌగిటను కరగి కిలకిలనగుమా!**

సంఖ్య: XXVIII/94 రాగం : ఖమాస్
కీర్తన : నీవెఱగవా చెలియా నెఱజాణ విన్నిటాను

**ఖమాస్**

**23 నీవెఱగవా చెలియా నెఱజాణ విన్నిటాను**
**వావిరి నే జెప్పనేల వలపుజాడలివి** ॥పల్లవి॥

**వినయము కలిగితే వేడుకలు సమకూరు**
**మనసెనసితేను ప్రేమము పుట్టును**
**ననుపు గలిగితేను నాటుకొను మోహము**
**వనితకు పతికిని వలపుజాడలివి** ॥నీవె॥

**వోరుపుగలిగితేనేవొనరు చుట్టరికాలు**
**నేరుపే కలిగితేను నేస్తమీడేరు**
**కూరిమి గలిగితేను కొనసాగు భోగములు**
**వారక యెవ్వరికైనా వలపు జాడలివి** ॥నీవె॥

**యిచ్చకము గలిగితే నింపులెల్లా నిండుకొను**
**ముచ్చట లొనరితేను ముదమలరు**
**యిచ్చట శ్రీవేంకటేశుడేలె నిన్ను నింతలోనె**
**వచ్చి యిదెవున్నాడు మీవలపుజాడలివి** ॥నీవె॥

**ఉపోద్ఘాతము:**

దేవి చెలికత్తె అయిన అన్నమయ్య ఆమెతో “ఓ చెలియ! నీవెఱగవటమ్మా! నీవేం తక్కువదానవా? నెఱజాణవు. నేను ఎక్కువగా చెప్పవలసిన పనేలేదు. ఇవివలపు చిగురించిన వారిలో కనుపించే జాడలేనమ్మా” అని అంటున్నారు. స్త్రీ వినయముతో వుంటేనే పురుషునికి వేడుక కలుగుతుంది. మనసు నీపై తగులు కొంటేనే ప్రేమ పుడుతుంది. ఓరుపు కలిగిన స్త్రీయే చుట్టరికాలను గౌరవిస్తుంది. అప్పుడే నీపై ముచ్చట గలిగి శ్రీవేంకటేశ్వరుడు నీవాడై నీవలపు మన్నిస్తాడు, అంటున్నారు.





**తాత్పర్య వివరణ:**

ఓ చెలియా! ఇది నీవెఱగవా? నీవేం తక్కువదానవా? నీవు ఇన్నిటాను (ఈ వలపు తలపులలో) అన్నీ తెలిసిన నెఱజాణవు. నేను నీగురించి, వావిరి (ఎక్కువగా) చెప్పవలసిన పనిలేదు. నీకూ తెలుసును. ఇవి (ఈ సంకేతాలు) వలపు జాడలు.

నేనొకటి చెబుతాను విను. స్త్రీకి వినయము వుంటేనే పురుషునికి వేడుక పుడుతుంది. మనస్సుపొందు కోరుకుంటేనే ప్రేమ పుట్టి చిగురిస్తుంది. ననుపు (అనురాగము) కలిగితేనే మగనిపై మోహము నాటుకొని వర్ధిల్లుతుంది. వనితకు ఆమె భర్తకు మధ్య ఇటువంటి వలపు జాడలు గోచరిస్తే వారు ప్రేమకై తహతహలాడుతున్నారని వెంటనే గుర్తించాలి.

ఓ దేవీ! స్త్రీకి ఓర్పు ఉండాలి. తన భర్తవైపు బంధువులను గౌరవంగా చూస్తేనే...వారు మీ ఇంటికి వచ్చిపోతూ ఉంటారు. వారు నీ స్నేహితులుగా మారవలెనంటే నీవు ఎంతో నేర్పరితనము చూపించవలసి వుంటుంది. అప్పుడు మీ భార్యాభర్తలకు ఒకరికింకొరిపై కూరిమిగలిగి అంతులేని భోగాలు అనుభవిస్తారు. దేవీ! వారక (అనివార్యముగా) యెవ్వరికైనా వలపు జాడలు ఇలాగే వుంటాయమ్మా!

ఓ దేవీ! సతీపతులమధ్య యిచ్చకములు (ప్రియ సంభాషణములు) కలిగితే వారి సంసారములో ఇంపులెల్లా (ఇష్టములన్నీ) పరిపూర్ణంగా నెరవేరుతాయి. ముచ్చటలు తీరితే ముదములు వృద్ధి చెందకపోవటం వుంటుందా? ఇంతలోనే శ్రీవేంకటేశ్వరుని కృప నీపై కలిగి నిన్ను స్వీకరింపజేసినది. నీకోసమే వచ్చి అదిగో యెలా వేచియున్నాడో చూడు. ఇవేనమ్మా! మీ వలపు జాడలు.

**పద్యవివరణ:**

తే.గీ॥ **చెలియ! నీవెఱగవా ఇది? చెప్పలేని**
**జాణవిన్నిటా, వలపుల జాడలివియె**
**వేంకటేశుడు నినుగూడ విడిసినాడు**
**ముచ్చటలదీర్చి ముదితరో! ముదము నిమ్ము.**

సంఖ్య: XXIX/179 రాగం : తిలంగ్
కీర్తన : నిన్ను బాయగలడటే నిమిషమైనా నీతడు

**తిలంగ్**

**24 నిన్ను బాయగలడటే నిమిషమైన నీతడు**
**వున్నతి నీ కతలనే వోలలాడు నీతడు** ॥పల్లవి॥

**తాపము విరహమేలే తలవంచుకొననేలే**
**నీపై బత్తిగలడు నీమగడు**
**మాపు దాకా చింతేలే మమ్ము నింతడుగనేలే**
**యేపొద్దు నీ గుణములే యెంచుకొను నీతడు** ॥నిన్ను॥

**లేకలు వా (వ్రా?) యించనేలే లేమల నంపగనేలే**
**వాకిటికి నింతలోనే వచ్చె నీతడు**
**జోకతో సగినాలేలే చూచి తమకించనేలే**
**నీకుగానే యాకారు నిచ్చ నిచ్చా నీతడు** ॥నిన్ను॥

**చెక్కిట చేయికనేలే సిగ్గులు వడిగనేలే**
**ఇక్కడ శ్రీవేంకటేశుడేలె నిన్నును**
**మొక్కులు మొక్కగ నేలే ముసిముసి నవ్వులేలే**
**మక్కువ నీరతులే మరిగినాడితడు.** ॥నిన్ను॥

**ఉపోద్ఘాతము:**

ఈ కీర్తనలో కూడా అన్నమయ్య, దేవికి ఆంతరంగిక చెలికత్తెయై, ఆమెను అధైర్యపడవద్దనీ శ్రీనివాసుడు నిన్ను వదలి నిముషమైనా వుండలేడని బుజ్జగిస్తున్నారు. ఇతడు పైకి ఇలా గంభీరంగా వుంటాడు గానీ మాచేత నీకతలు (కథలు) కొసరి కొసరి చెప్పించుకొని మురిసిపోతుంటాడమ్మా! అయినా యేమాటకామాటే చెప్పుకోవాలి, ఆయనంటే నీకెందుకమ్మా! అంత విరహతాపం. ఇంత వేగముగా నీ సందిట జేరవచ్చేవానికి ఇంతలోనే లేఖలు





పంపించడం స్త్రీలను రాయబారం పంపటం యెందుకమ్మా! ఏమీలేదు మక్కువతో నీరతులను మఱగినాడమ్మా ఆ శృంగారరాయుడు అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ దేవీ! ఈతడు నిముషమైనా నిన్ను పాయగలడటే (నిన్ను వదలి వుండగలడా?) దేవీ! అది జరిగే పనికాదు. ఈతడు నిరంతరం నీ కతలనే (కథలనే) చెప్పించుకొని విని తనలో తానే మురిసిపోతుంటాడు.

ఓ దేవీ! ఆయన నిన్ను సమీపించగానే తలవంచుకొని సిగ్గుపడిపోతావు. మరి ఆయన కనుమరుగవంగానే ఇంత విరహతాపమెందుకమ్మా? నీ మగడు నీపై బత్తి (భక్తితో కూడిన ఆరాధన) కలిగియున్నాడు. మమ్మల్ని ఇంత అడుగవలెనటమ్మా? రాతిరి యెంతో పొద్దుపోయినదాక ఈ చింతలన్నీ నీకెందుకమ్మా? ఈతడు పొద్దు యేదయినా నీ గుణగణాలు వింటూ పరవశించిపోతుంటాడు.

ఓ దేవీ! ఈయన నీవాకిటిలోనే నీ కొరకు నిరీక్షిస్తున్నాడు. ఇంతలోనే నీ చెలికత్తెలను అతని కోసం పంపించాలా? ప్రేమలేఖలు పంపించాలా? ఏమి చోద్యమమ్మా? జోకతో (బాగుగా) శకునములన్నీ చూసుకొంటావు. మంచిదే. కానీ ఇంత తమకించనేల (తొందరపాటు యెందుకమ్మా?) ఇతడు, నిచ్చనిచ్చ (ప్రతినిత్యమూ) నీకుగానే ఆకారు (పిలుపునందుకొంటాడు).

ఓ దేవీ! ఇక్కడే శ్రీవేంకటేశ్వరుడు నిన్ను ఏలినాడు. ఇంకా నీకు చెక్కిట చేయిబెట్టుకొని చింతయెందులకే? దానికితోడు అంతులేని ఈ సిగ్గులు దేనికమ్మా?ఆయనకు అంతులేని మొక్కులు మొక్కుతున్నావు మళ్ళీ ముసిముసి నవ్వులను ఒలకబోస్తున్నావు. ఇతడు మక్కువతో నీరతులను మఱగినాడు మరి ఇక నిన్నెట్లు వదలగలడు?

**పద్యవివరణ:**

ఆ.వె॥ **నిన్ను బాయగలడె నిముసమైనా హరి**
**నీదుకతలలోనె నీదులాడు**
**మరిగినంత రతుల మక్కువనితనికి**
**వేంకటేశుడైన వెలదిప్రియుడె.**

సంఖ్య: V/376 రాగం : చంద్రజ్యోతి
కీర్తన : నిన్ను గూడిన విభుని నిలువెల్ల సొంపాయ

**చంద్రజ్యోతి**

**25 నిన్ను గూడిన విభుని నిలువెల్ల సొంపాయ**
**నిన్నియునునొనగూడె నింతలోపలనె** ॥పల్లవి॥

**సొలపు నీకడగంటి చూపు హృదయము గాడి**
**లలినితడు శ్రీ వత్సలాంఛనుండాయ**
**వెలది నిను బెడబాసి విరహంపు మెయికాక**
**వలన నీతడు నీల వర్ణుడై నాడు** ॥నిన్ను॥

**అదన నీ చను గుబ్బలను చక్రములచేత**
**బదిల పరపుచు చక్రపాణియైనాడు**
**సుదతి నీ దేహమున సొబగు కుంకుమపూత**
**లెదిగి పీతాంబరం బీతనికి నాయ** ॥నిన్ను॥

**ఆలింగనాపేక్ష ననయంబు నినుగూడ**
**లోలుడటుగాన నాలుగు చేతులాయ**
**శ్రీలలిత మూర్తియగు శ్రీవేంకటేశ్వరుడు**
**పాలించె నిను నీకు బరి తోషమాయ** ॥నిన్ను॥

**ఉపోద్ఘాతము:**

అన్నమయ్య శ్రీదేవికి ధైర్యం చెబుతున్నారు. తల్లీ! నిన్ను కూడిన తక్షణమే నీ విభునికి నిలువెల్లా చెప్పలేని సొబగులు అద్ది నాయమ్మా! ఆయనకేమేమి యొనగూడినవో వివరిస్తాను వినవమ్మా! తల్లీ! నీ కడగంటి చూపులోని వేడిమి ఆయన హృదయమున్నచోట తొలిచి ఆ వేడికి నల్లటి మచ్చ అయినదమ్మా! అదే మేము భక్తితో నమస్కరించే శ్రీవత్సము అనే పుట్టుమచ్చ. అన్నమయ్యకు ఈ ఊహలెలాతట్టి స్వామిని అలరిస్తాయో... ఆ తిరుమలేశునికే తెలియాలి.





**తాత్పర్య వివరణ:**

ఓ దేవీ! నిన్ను గూడిన నీ విభునికి నిలువెల్లా (ఆయన వంటినిండా) సొంపాయె (వింత వింత సొగసులు అబ్బినవమ్మా!) ఇవన్నీ ఒనగూడుటకు ఏమాత్రము సమయం పట్టలేదు. ఇంతలోనే (చిటికెలో) అవి కలిగినవమ్మా!

ఓ దేవీ! నిశితమైన నీ కడగంటిచూపు (ఓరచూపు) సొలపు (వాడిగా) నాటుకొనుట చేత ఆయన హృదయము గాడి (తొలచి) నల్లబడినది. మరి ఇతడు లలి (అందమైన) శ్రీవత్సమనే పుట్టుమచ్చ లాంఛనముగా గలవాడైనాడు. ఓ వెలదీ! నిన్ను యెడబాసివిరహమువలన స్వామి శరీరం తాపానికి కమిలిపోయి చివరికి ఈయన నీలవర్ణుడైనాడు (నల్లనయ్య అయిపోయాడు). ఇందులో ఆయన తప్పేముందమ్మా?

ఓ దేవీ! సుదర్శన చక్రపాణి అయినందువల్ల ఈయనకు చక్రధారి అన్నపేరు రాలేదు, చ్రకములవంటి నీచనుగుబ్బలను పదిలపరచుకొనుచున్నాడా యన్నట్లు ఒడిసిపట్టుట చేత ఈయన చక్రపాణి అయినాడమ్మా! ఓ సుదతీ! అనేకమార్లు నీ చెమటతో తడిసిన నీ దేహమున అద్దుకొనిన కుంకుమ చిట్టచివరికి పీతాంబర వర్ణము (పసుపురంగు) గా యెదిగి ఇతడు పీతాంబరధరుడాయెను.

ఓ దేవీ! ఇంకొక పరమాద్భుత రహస్యం చెబుతాను వినవమ్మా! అవి శంఖ చక్రగదా పద్మములను ధరించుటకు కాదమ్మా! అవి ఆపేక్షతో బిగి కౌగిలిలో నిన్ను నించుటకు రెండు చేతులు, తమకమాగక లోలుడై నీతో పెనగుటకు తక్కిన రెండు చేతులూ ఉపయోగిస్తాడమ్మా! శ్రీలలితమూర్తియైన శ్రీవేంకటేశ్వరుడు నిను పాలించినాడమ్మా! అదే నీకు “బరితోషమాయ” (మిక్కిలి సంతోషదాయకమాయెను).

**పద్యవివరణ:**

ఆ.వె॥ **నిన్నుగూడు విభుని నిలువెల్ల సొంపాయె**
**నిన్నియు నొనగూడెనింతలోనె**
**వేంకటేశ్వరుండు వెలది నిన్పాలించె**
**సకియ! గొప్ప సంతసంబులాయె.**

సంఖ్య: VII/168 రాగం : హరికాంభోజి
కీర్తన : అన్నిటా భాగ్యవంతుడవవుదువయ్యా

**హరికాంభోజి**

**26 అన్నిటా భాగ్యవంతుడ వవుదువయ్యా**
**పనిన్నందుకల్లా వచ్చు భామ నీ కిపుడు** ||పల్లవి||

**పడతి మోహరసము పన్నీటి మజ్జనము**
**కడలేని ఆపె సిగ్గు కప్పురకాపు**
**నిడుదకన్ను చూపులు నించినతట్టుపునుగు**
**తొడిబడ సులభాన దొరకె నీ కిపుడు** ||అన్నిటా||

**కామిని కెమ్మోవికాంతి కట్టుకొనే చంద్రకావి**
**ఆముకొన్న మోముకళలు ఆభరణాలు**
**దోమటి మాటలవిందు ధూపదీప నైవేద్యాలు**
**కామించినటువలెనే కలిగె నీ కిపుడు** ||అన్నిటా||

**అలమేలు మంగ నవ్వులు అంగపు పువ్వుదండలు**
**కలసి వురాన నీకె కట్టిన తాళి**
**చలపట్టి ఈకె రతి సకలసంపదలు**
**ఇలనబ్బె శ్రీవేంకటేశ నీకు నిపుడు** ||అన్నిటా||

**ఉపోద్ఘాతము:**

పురుషులకు రకరకాలైన భాగ్యములు సమకూడుతుంటాయి. వస్తు, వాహన, ధన, ధాన్య, పరివార, వైభవములన్నీ దాదాపు శ్రీమంతులందరూ అనుభవించే వైభోగాలే. కానీ కావాలనుకొన్నప్పుడల్లా కోరుకున్న స్త్రీ అతని పన్నిక (వ్యూహం) ప్రకారం వచ్చి ఆయనకు సురత సౌఖ్యమునీయుట అందరికీ ఒనగూడే నేర్పుకాదు. ఓ శ్రీవేంకటేశ్వరా! నీకేమయ్యా? నీవు అన్నిటా భాగ్యవంతుడవు అవుదువు అంటున్నారు అన్నమయ్య.





**తాత్పర్య వివరణ:**

ప్రభూ! నీవు అన్నిటా (అన్ని విషయములలోను) భాగ్యవంతుడవవుదువయ్యా! నీకు ఇప్పుడు పన్నిన (కావాలని వ్యూహరచన చేస్తే) భామ (నీవు వలచిన చిన్నది) అందుకల్లా వచ్చును (అందుకే తహతహలాడుతూ వస్తుంది.)

ఈ దేవికి నిమజ్జనం జరుగుతున్నది. ఆమె మజ్జనమాడుచున్న పన్నీరు యెక్కడిదనుకొన్నావు స్వామీ! ఆ పడతి మోహరసమే అది. మరి ఆమెకు వేస్తున్న కర్పూరపుకాపు పరిమళములొలుకుతున్న, కడలేని (అంతులేని) ఆమె సిగ్గే. ఆమె నిడుద కనుచూపు (రెప్పవాల్చక నిన్ను చూచే చూపు) బాగా అలముకొనిన తట్టు పునుగు నించినట్లువున్నది. నీ సౌభాగ్యమేమని చెప్పను? తొడిబడ (చలించిపోవుచున్న) ఈమె సులభముగా నీకు దొరికినది.

ప్రభూ! ఆమె కట్టుకొన్న "చంద్రకావి" (సింధూరవర్ణము గల వస్త్రము), ఆ కామిని యొక్క అరుణాధరమును గుర్తుచేయుచున్నది. ఆమె ఆముకొనిన (పైకొనిన) వదనపు కళలే ఆమెకు ఆభరణములు. ప్రియ సంభాషణలతో ఆమె చేయు మాటల విందే ముప్పిరిగొనినట్లు వేసిన ధూప, దీప నైవేద్యములు. దేవీ! నీకిపుడితడు కామించినటువలెనే (కోరినట్లే) లభించినాడు.

ఓ దేవదేవా! ఆమె మెడలో కనుపించుచున్న పూలదండలు మరేవో కాదయ్యా! అలమేల్మంగ నవ్వులే. పురుషుడు స్త్రీ మెడలో తాళి కడతాడు అది జగద్విదితమే. కానీ ఈమె నీవురముపై వెలసి నీకే కట్టినతాళియైనది. ఈకె (ఈమె) చలపట్టి (మత్సరముతో) నీతో రతిలోని సకల సంపదలను పొందినది. ఓ శ్రీవేంకటేశ్వరా! ఇపుడు నీకు సమస్తము స్వాధీనమే.

**పద్యవివరణ:**

తే.గీ|| **అన్నిటా భాగ్యవంతడవవుదువయ్య!**
**పన్నినందుకు వత్తురు భామలెల్ల**
**ముదితరతినీకు సర్వసంపదలనిచ్చె**
**వేంకటేశ్వరా! అవి నీకు విరివినబ్బె.**

సంఖ్య: V/138 రాగం : రేవతి
కీర్తన : పొద్దికనెన్నడు వొడచునొ పోయిన చెలిరాదాయను

## రేవతి

27 పొద్దిక నెన్నడు వొడచునొ పోయిన చెలిరాదాయను
నిద్దురగంటికి తోపదు నిమిషం బొక యేడు ॥పల్లవి॥

కన్నులనవ్వెడి నవ్వులు గబ్బితనంబుల మాటలు
నున్నవి యొయ్యారంబులు నొచ్చిన చూపులును
విన్నతనంబుల మఱపులు వేడుక మీరిన యలపులు
సన్నపు చెమటలు తలచిన ఝల్లనె నామనసు ॥పొద్దిక॥

ఆగినరెప్పల నీరును నగ్గలమగు పన్నీటను
దోకియు తోగని భావము దోచిన పయ్యెదయు
కాగిన దేహపు సెకలును కప్పిన పువ్వుల సొరబులు
వేగిన చెలితాపమునకు వెన్నెల మండెడిని ॥పొద్దిక॥

దేవశిఖామణి తిరుమలదేవుని తలచిన బాయక
భావించిన యీ కామిని భావములోపలను
ఆ విభుడే తానుండిక నాతడెతానెఱగగవలె
నీవెలదికిగల విరహంబేమని చెప్పదము ॥పొద్దిక॥

**ఉపోద్ఘాతము:**
ఇంకా యెప్పుడు పొద్దుపొడుస్తుందో ఆయన సమాచారం తెలుసుకోవటానికి ప్రయత్నం చేస్తున్న చెలియ ఇంకారాదాయెను అని దేవి విచారపడుతున్నది. ఆమెకు కంటికి నిద్దురరాదు. నిముషమొక ఏడుగా (ఒక ఏడాదిగా) అనిపిస్తున్నది అంటున్నారు అన్నమయ్య. కీర్తనలోని చరణాలలో నేటి తెలుగు నుడికారములో లేని పదములు కోకొల్లలు. జాగ్రత్తగా ఒకటికి రెండుసార్లు చదివితేనేగాని అవగతం కాని కీర్తన ఇది. వేంకటపతిని విడిచి ఈ వెలది హద్దెరగని విరహతాపానికి గురి అయినది.





**తాత్పర్య వివరణ:**

ఈపొద్దు యెంతకీ పొడవదేమిటి? ఇక పొద్దు యెప్పుడు వొడచునో తెలియుటలేదు. నా ప్రియుని సమాచారం తెలిసికొనివస్తానని పోయిన చెలియ రాదాయెను. ఇప్పుడేం చేయాలి? కంటి నిద్దుర తోపదు (వచ్చుటలేదు). నిముషంబొక యేడు (ఏడాది) అనిపిస్తున్నది.

నా మనస్సుఝల్లుమని పులికిపడుతున్నది. దీనికి ప్రియుని తలపులె పరవశం కలిగిస్తున్నది. నవ్వుతున్నట్లున్న ఆ కన్నుల నవ్వులు,గబ్బితనము (గర్వము తొంగిచూచే మాటలు, చెప్పలేని ఒయ్యారము, ఆయన ప్రవర్తనకునొచ్చినట్లున్న ఆమె చూపులు, విన్నతనంబులు (ఆయనకే అర్థమయ్యే విజ్ఞాపనములు) వాటిని ఆయనే మరచుట, వేడుకలధికమవగా కలిగిన అలసటలు,సన్నని చిరుచెమటలు. ఇవన్నీ ఆమె తలపులను కలచివేస్తున్నాయి.

అప్పుడే ఆగిన కనురెప్పల మాటున నీరు, చల్లటి పన్నీటి స్నానముచేసినా చేయనట్లే చిరాకుగాఅనిపించుట వేంకటరమణుడు అపహరించిన తన పయ్యెద, దాని వలన కాగిపోయిన తన దేహమునుండి వెలువడే సెకలును (వేడి నిట్టూర్పులు), ఆమె ఒంటినిండా కప్పిన పూమాలల సౌరభములు. ఓ చెలులారా! ఇంకా యెక్కువగా వేగిన ఆమె తాపము చెప్పనేల? ఆమెకు వెన్నెలమండెడిని (మండిపోతున్నది).

చెలులారా! అప్పుడు ఈ కామిని యేమిచేసిందనుకొన్నారు? పాయక తన భావములోపలనే తన స్వామిని భావించినది. దేవశిఖామణియైన తిరుమలదేవుని తలపులలో నిలిపినది. అప్పుడు ఆమె తాను వేరొకరుకాదని తానే ఆతడని, ఆతడే తానని గ్రహించినది. ఈ వెలదికి కలిగిన నూతన విరహంబేమని చెప్పెదము.

**పద్యవివరణ:**

కం॥ **పొద్దికనెన్నడు వొడచునొ**
**నిద్దురరాదాయె తోచి నిముషంబేడై**
**గద్దరి వేంకటపతి విడి**
**హద్దెరగక వెలదికి విరహంబాయె చెలీ!**

సంఖ్య: XXIX/434 రాగం : ఆనందభైరవి
కీర్తన : పొదలె నిండుకళల పున్నమనేడు

**ఆనందభైరవి**

**28 పొదలె నిండుకళల పున్నమనేడు**
**అదనుతప్పక జాజరాడుదువురావయ్య** ||పల్లవి||

**జలజాక్షి మోముననను చంద్రోదయమాయ**
**నెలకొన్ననవ్వుల వెన్నెలగాసెను**
**కలికి కన్నుల నల్ల కలువలు వికసించె**
**అలరి ఈకెతో జాజరాడుదువు రావయ్య** ||పొదలె||

**ఎనసి జవ్వనమున ఏతెంచె వసంతకాల**
**మొనరి మోవి చిగురులుప్ప తిల్లెను**
**గొనకొన్నతురుమున కూడె తుమ్మిదమూక**
**అనుమానించక జాజరాడుదువు రావయ్య** ||పొదలె||

**కుంకుమ చెమట చనుకొప్పెరల నిండుకొనె**
**కొంకక గోళ్ళే బుఱ్ఱట కొమ్ములాయను**
**లంకెలైశ్రీవేంకటేశ లలనతో కూడితివి**
**అంకెల నేపొద్దూ జాజరాడుదువు రావయ్య** ||పొదలె||

**ఉపోద్ఘాతము:**
నేడునిండుకళలున్న పున్నమరేయి వర్ధిల్లుచున్నది. సమయము వ్యర్థపరచక ఆమెతో జాజర అనబడే వసంతములాడుదువు రావయ్యా అని ఏడుకొండలవాడిని ఆహ్వానిస్తున్నారు అన్నమయ్య. కుంకుమాంకిత స్తనముల గుండ్రని పాత్రలలో చెమటలు నిండుకొనెను. భయపడక తన వాడి గోళ్ళతో ఎదుర్కొనుటే విజయ సూచకమగు నీళ్ళు చిమ్ముగొట్టమాయెను. ఓ వేంకటేశా లలనతో నీకూటమే ఒక గొప్ప జాజర ప్రభూ!





**తాత్పర్య వివరణ:**

ఓ శృంగారరాయా! నేడు కళలున్న పున్నమి పొదలె (వర్ధిల్లుతున్నది). అదన తప్పక (సమయము వ్యర్థము కానీయక) జాజరలాడుదువు (వసంతోత్సవము జరుపుకొందువుగాని) రావయ్యా!

ఆ సంతోషానికి జలజాక్షియైన నీ పద్మమోము (ముఖమున) చంద్రోదయమైనట్లుంది. వెన్నెల వలె కనుపించుచున్న ఈమె నవ్వులే, నిండిపోయిన వెన్నెలకాసినట్లుంది. మరి అంత అద్భుతమైన చంద్రోదయంతో కలువలు వికసించాలి కదా! ఆ కలికి (భామిని) కన్నులనే నల్లకలువలు కూడా తన ప్రియుని చూచి వికసించినవి.అన్నీ అమరినవి. అలరి (అతిశయించి) ఈకెతో (ఈమెతో) జాజరలాడరావయ్యా!

ప్రభూ!వసంతకాలమువచ్చినట్లు తెలియుచునే వున్నది. జవ్వనముకదా! మరి ఇక్కడ యేమి చిగురించుచున్నది? ఆమె లేమోవి చిగురులు, వుప్పతిల్లెను (మొలకలెత్తుచున్నవి). నల్లని ఆమె కొప్పు సుగంధ పరిమళములు వెదజల్లి తుమ్మెదలమూకను ఆకర్షించుచున్నవి. ఈ తుమ్మెదలు జగదేక విభుడవైన నిన్నేం చేస్తాయి? దేవితో జాజరలాడుదువు రావయ్యా!

స్వామి! వుద్వేగానికి లోనై, ఈమె చనుగవపై అలదిన కుంకుమ చెమటతో మిళితమై కొప్పెరలు (గుండ్రనిపెద్దపాత్రలలో) నిండుకొనిపోయింది. ఏమాత్రమూ జంకక ఆమె వాడిగోళ్ళే బుఱ్ఱటకొమ్ములాయె (యెలుగెత్తి పిలుచు కొమ్ముబూరలైనవి). ఓ శ్రీవేంకటేశ్వరా! లంకె వేసికొని ఈ లలనను గూడితివి. మరి నీకు ఏ పొద్దునైనా అంకెలేని జాజరలే. రావయ్యా! మరి ఏ భోగమైనా నీదే.

**పద్యవివరణ:**
ఆ.వె|| **పొదలె నిండు కళల పున్నమి ఈనాడు**
**జాజరాడుదువులె జాణతోటి**
**లలనతోటి విభుడు రమ్యంబుగా గూడె**
**పొద్దు యేదయినను వద్దనవుగ!**

సంఖ్య: VI/66 రాగం : బేహాగ్
కీర్తన : నీడల చూపులు నీకేలే యీ

**బేహాగ్**

**29 నీడల చూపులు నీకేలే యీ**
**వాడుక వాడెడి వడ నీకేలె** ॥పల్లవి॥

**నిలువుల నటనలు నీకేలే యీ**
**వెలుగుల నడపులు నీకేలే**
**నలెవులకరగులు నీకేలే యీ**
**కులికెటి నును సిగ్గులు నీకేలే** ॥నీడల॥

**నెఱుల చెదరులివి నీకేలే యీ**
**నెఱువగు చదరులు నీకేలే**
**నెఱతనపుసరులు నీకేలే యిదె**
**చఱగునమూసెదు చెలి నీకేలే** ॥నీడల॥

**నిక్కపు బొంకులు నీకేలే యిదె**
**నిక్కలగంటివి నీకేలే**
**నిక్కితి వొరపుల నీకేలే యిదె**
**దక్కె వేంకటోత్తముడు నీకేలే** ॥నీడల॥

**ఉపోద్ఘాతము:**

ఈ కీర్తన వివరణ నా భావనా పరిధికి తట్టిన ఆలోచన.ఇదే సరయిన భావము అని నిర్ద్వంద్వంగా చెప్పగల పాండిత్యం నాకు లేదు.ఇది నాకు తోచిన భావన. నీడల చూపులు అంటే రహస్యంగా ఏమి జరుగుతున్నదో తెలుసుకోవాలనే చూపులు. ఆ చూపులు నీకెందుకే? అనవసరమైన శ్రమతో వడలిపోయే దౌర్బల్యం నీకెందుకే అంటున్నారు దేవితో ఆమె





నెచ్చెలియైన అన్నమయ్య. చివరికి యేదియేమైనా ఆ వేంకటోత్తముడు దక్కేది మాత్రం నీకేలే అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ చెలియా! నీడల చూపులు (రహస్యంగా యేమి జరుగుతున్నదో తెలుసుకోవాలనే చూపులు) నీకేలే? (నీకెందుకమ్మా?) యీ వాడక వాడెడివడ (ఈ అనవసరమైన శ్రమతో వడలిపోయే దౌర్భాగ్యం) నీకెందుకమా?

ఓ దేవీ! సుదీర్ఘమైన నాట్య విన్యాసములు నీకేలనమ్మా? ఈ బాహాటమైన ప్రవర్తన నీకెందుకమ్మా? మరి ఇంతాచేసి పరిచయంలోనే కరగిపోవుటలు దేనికమ్మా? అదంతా అటుంచి నీ ప్రియుని చూడగానే కులికేటి నీ లేత సిగ్గులు అన్ని యెందులకమ్మా?

ఓ దేవీ! చెదరిపోయిన ముంగురులతో ఇంత సౌందర్యం ప్రదర్శించడం దేనికమ్మా? అంతులేని చమత్కారాలు నీకెందుకమ్మా! నీ పెత్తనం చూపించుకోవాలనే సరులు (పద్ధతులు) నీకెందుకమ్మా? పోనీ నీ ఆ పెత్తందారితనము చూపిస్తావా అంటే లేదు. దానిని నీ చెఱగున మూసేస్తావు. నీవు అంత సిగ్గరివి. చెలీ! నీనాథుడుండగా ఇవన్నీ నీకేలనమ్మా?

ఓ దేవీ! నిక్కపు బొంకులు (నిజమనునట్లు భ్రమ కలిగించు అబద్ధాలు) నీకేలనమ్మా? నీవు జగదేకపతి రాణివి. తల్లీ! నీవు నిక్కలుగంటివి (నీవు కన్న కలలు నిజముగా అనుభవంలోకి వచ్చేస్తాయి). ఇక నీకు వ్యాకులత యెందుకమ్మా? నిక్కితి వొరపుల (భేషజముగల ఘర్షణ) లన్నీ నీకెందుకమ్మా? ఇదె వేంకటోత్తముడు (శ్రీవేంకటేశ్వరుడు) నీకు దక్కినాడు. ఇక తక్కిన వ్యర్థమైన విషయాలు నీకెందుకు తల్లీ!

**పద్యవివరణ:**

కం॥ **నీడల చూపులు యేలనె**
**వాడుకతో వడలిపోవు వడ నీకేలే?**
**పాడగు బొంకులు యేలనె**
**కూడెను వేంకటవిభుండు కొఱతింకేలే?**

సంఖ్య: XXVI/112 రాగం : ఖరహరప్రియ
కీర్తన : హరినిన్ను పిలిచీని అదివో అమ్మా

**ఖరహరప్రియ**

**30 హరినిన్ను పిలిచీని అదివో అమ్మా**
**తెరమరుగికనేల తియ్యవమ్మా ॥పల్లవి॥**

**చిత్తరు పతిమ వంటి చెలియా నీవు**
**ఇత్తల పతికి విడెమీయవమ్మా**
**కొత్తమెరుగు బోలిన కోమలీ నీవు**
**మొత్తమి కూరిమి పతిమోముజూడవమ్మా ॥హరి॥**

**బంగారు బొమ్మవంటి పడతి నీవు**
**అంగవించి పతితో మాటాడవమ్మా**
**అంగజుశరము వంటి అతివె నీకే**
**నంగతన ముదియేల నవ్వవమ్మా ॥హరి॥**

**చంచుల చిగురువంటి జవ్వని నీవు**
**కొంచక శ్రీ వేంకటేశు కూడితివమ్మా**
**మించుతమ్మిలోని అలమేలుమంగా**
**ఎంచి ఇద్దరును మమ్ము ఏలరమ్మా ॥హరి॥**

**ఉపోద్ఘాతము:**

అమ్మా! అలమేల్మంగా! అదివో హరి నిన్ను పిలిచినాడమా! ఇంకా నీకు తెరమరుగు యెందుకమా! ఆ మరుగు తీసివేసి స్వామిని అలరించవమ్మా! అంటున్నారు అన్నమయ్య. చిత్తరువులోని ప్రతిమవంటిదానవు నీవు కూరిమితో నీపతి మోమును తిలకించవమ్మా! బంగారు బొమ్మవంటి పడతివి నీకునంగతనమెందుకమ్మా?నీవు వేంకటపతిని కూడినావు కనుక ఇద్దరూకలసి మమ్మేలరావమ్మా!





**తాత్పర్య వివరణ:**

ఓ అలమేల్మంగమ్మా! నిన్ను హరిపిలిచీని (పిలిచినాడమ్మా). ఇక తెరమరుగు (నీ అంతఃపురంలో తెరల చాటున వుండటం దేనికమ్మా? ఆ తెరలను తొలగించవమ్మా!)

ఓ చెలియా!చిత్తరువులో గీసినఅందాల ప్రతిమ వంటి నీవు ఇత్తల (ఇప్పుడు) నీ పతికి విడెమియ్యవమ్మా! (ఆహ్వాన తాంబూలము నందించవమ్మా!) కొత్తమెరుగుల (అనూహ్యము, నూతనమూ అయిన తేజసును) బోలిన, ఓ కోమలీ! నీ మొత్తమి కూరిమి (నీ మొత్తము వలపును)తొణికిసలాడగా నీ పతి మోము (ముఖము)ను చూడవమ్మా! నీవు దేవేరివి ఆయన నీ మనోహరుడు.

దేవీ! నీవు బంగారు బొమ్మవంటి పడతివే. అంతమాత్రాన మాటలాడని ప్రతిమవైతే ఎలా తల్లీ! అంగవించి (ఉత్సాహముతో) మాట్లాడవమ్మా! జగదేకపతియైనవాడే నీ పతి కదమ్మా! నీవు అంగజుశరము (మన్మథుని బాణము) వంటి దానవు. నీకు నంగతనము (నంగనాచి ప్రవర్తన) దేనికమ్మా! నీ పతి మదిని యేలునట్లు చిరునవ్వు చిందించవమ్మా!

దేవీ! నీవు చలాకీతనము పొంగిపొరలే చిగురువంటి జవ్వనివి (యౌవన శోభగలదానవు) నీవు కొంచక (సంకోచించక) శ్రీవేంకటేశ్వరుని కూడితివమ్మా! శ్రేష్ఠమైన పద్మములో నెలకొనిన ఓ అలమేల్మంగా! మీ సతీపతులిద్దరూ మమ్మల్ని యెంచుకొని దయానురాగములతో మమ్ము యేలండి తల్లీ!

**పద్యవివరణ:**

కం॥ **హరి నిన్ను పిలిచెనమ్మా!**
**తెరమరుగిక నేల తెరలు తీయవె తల్లీ!**
**తరుణివి బంగరుబొమ్మవు**
**తిరువేంకటశిఖరపతికి దేవివి నీవే.**

సంఖ్య: XXVIII/93 రాగం : శుద్ధ ధన్యాసి
కీర్తన : మేటి నేరుపరులాల మెలుతలాల

**శుద్ధ ధన్యాసి**

**31 మేటి నేరుపరులాల మెలుతలాల**
**కూటములిద్దరికిని గూరుచరె యెపుడు** ||పల్లవి||

**చెప్పగానే నోరూరీ చెలువుని చేతలు**
**చొప్పులెత్తెతని నాకు జూపగదరే**
**కుప్పవడీ కోరికలు గుణములు వింటేను**
**వొప్పుగా పొందులు నాకు నొనరించరే** ||మేటి||

**వినవే వేడుకవుట్టీ విభుని చక్కదనాలు**
**అనువుగా నిద్దరి మాటాడించరే**
**మనసయ్యీనాతని మంచితనాలు చూడగా**
**యెనయగ నాతని నింటికి దోడి తేరే** ||మేటి||

**తలచగానే వచ్చెతానె శ్రీవేంకటేశుడు**
**తెలుపరే నామోహము దేవునికిని**
**తిలకించి చూచి ఇట్టె తిరముగా పెండ్లాడె**
**కలకాలమును నన్నుకరుణించుమనరే** ||మేటి||

**ఉపోద్ఘాతము:**

ఈ కీర్తనలో అన్నమయ్య తాను ఒక చెలికత్తె. దేవి ఆమెతోను తోటి చెలికత్తెలను తనకూ శ్రీనివాసునికీ మీరు గొప్ప నేర్పరులు కనుక మీ నేర్పు ప్రదర్శించి జతకలపండి అంటున్నది. ఆ శ్రీరమణుని చేష్టల గురించి మీరు చెబుతుంటేనే నోరూరిపోతున్నది. ఒప్పుగా పొందులు నాకు నొనరించరే అని బ్రతిమిలాడుతున్నది. ఇదంతా తిలకించి ప్రసన్నుడై శ్రీవేంకటేశ్వరుడు ఇట్టే వచ్చి ఆమెను పెండ్లియాడినాడు.





**తాత్పర్య వివరణ:**

మేటి నేర్పరులారా! మెలతలార! (తరుణీమణులారా!) ఇద్దరికి (నాకూ ఆ శ్రీనివాసునికి) కూటములు గూరుచరే (కలయిక నేర్పాటు చేయండి) యెపుడు (ఇంకా యెప్పుడు చేస్తారు?)

చెలులారా! ఆయన చిలిపి చేష్టలను గురించి మీరు చెబుతుంటేనే నాకు నోరూరిపోతున్నది. చొప్పలెత్తి (ఏదో ఒక విధమున) నాకు అతనిని చూపగదరే (చూపించరాదటే!) ఆయన గుణగణములు వింటుంటేనే కోరికలు కుప్పవడీ (కుప్పలు తెప్పలుగా ముంచుకొస్తున్నాయి. ఒప్పుగా (తగినరీతిలో)ఆయనతో పొందులు (కూటములు) ఒనరించరే (కలిపించండమ్మా!)

ఓ చెలియలారా!నా విభుని చక్కదనము గురించి నాకు వేడుక కలుగుతున్నది. అనువుగా (తగు సమయం చూచి) మా ఇద్దరిచేతా మాట్లాడించండమ్మా! ఆయన మంచితనము ప్రత్యక్షముగా చూడాలని నాకు మనసుపుట్టుచున్నదే. ఆయనను యెలాగైనా నచ్చజెప్పి నాతోటి యెనయగ (పొందుకు), ఒప్పించి ఈ ఇంటికి తోడితేరే (ఈ నా గృహమునకు తోడుండి తీసుకురాండమ్మా!)

ఓ సఖీ! ఈ వింత తమాషా చూశావా? నీవు ఆ శ్రీవేంకటేశ్వరుని అట్లా తలుచుకున్నావు ఆయన ఇట్లా వేంచేసినాడు. ఆ దేవదేవునికి నాకు ఆయనపైగల మోహమును వివరించండే. ఇక చాల్లే, మీరు చేసేదేమిటి! నా వేదనను తిలకించి, మనస్సు కరిగినవాడై ఆ శ్రీవేంకటేశుడు నన్ను ఇట్టే తిరముగా (స్థిర చిత్తముతో) పెండ్లియాడినాడు. పోనీ, కలకాలము నన్ను కరుణించమనరే! నా ప్రియ సఖియలు కదా!

**పద్యవివరణ:**

తే.గీ|| **మేటి నేర్పరులైనట్టి మెలతలార!**
**కూటములు ఇరువురికిని గూర్పరమ్మ!**
**తలచినంతనె వచ్చిన వలపురేడు**
**తిరముగా పెండ్లియాడెను తరుణినిపుడె**

సంఖ్య: XXVIII/72 రాగం : కేదారగౌళ

కీర్తన : సేయగల విన్నపము సేసితిమి నీతోడి

**కేదారగౌళ**

**32 సేయగల విన్నపము సేసితిమి నీతోడి**
**పాయకిక నీయింతిని పాలించవయ్యా ॥పల్లవి॥**

**అడియాసలను కొంత ఆతుమను నొక కొంత**
**ఎడమాటలను కొంత ఇంపొందును**
**కడు తమకముల కొంత గడపు పొద్దులు సారె**
**పదతి చందంబులివి పరికించవయ్యా ॥సేయ॥**

**ఎదురుచూపులకొంత యెసగి సంతోషించు**
**మదరాగమునకొంత మనసు పట్టు**
**వెదకేటి గతులకొంత వేడుకల చెలరేగు**
**సుదతి భావంబులివి చూడగదవయ్యా ॥సేయ॥**

**తలపోతలను కొంత తడవు మిక్కిలి చెలగు**
**వలపులను వొకకొంత వాడుదేరు**
**ఎలమిగూడితివి నీవిపుడె శ్రీవేంకటేశ**
**చెలియనిటు వలెనె దయసేయగదవయ్యా ॥సేయ॥**

**ఉపోద్ఘాతము:**

బ్రతిమిలాడి అలసిపోయిన చెలికత్తెలు స్వామితో తెగవేసి చెబుతున్నారు. ఆ చెలికత్తెలలో ఒకరైన అన్నమయ్య మధురకీర్తన రూపంలో మనకు అందిస్తున్నారు. ప్రభూ! నీతో చేయగల విన్నపాలన్నీ చేశాము. మా ఆఖరిమాట మన్నించవయ్యా! ఈ యింతిని వదలక ప్రేమతో పాలించవయ్యా! ఈమె విరహవేదన మేము చూడలేకున్నామయ్యా!





**తాత్పర్య వివరణ:**

ఓ దేవా! నీతోడి మేము సేయగల విన్నపములన్నీ చేసినాము. ఇకనైనా యీ యింతిని పాయక (వదలక) పాలించవయ్యా! (ఏలుకోవయ్యా!)

ప్రభూ! ఈ పదతి చందంబులు (చేష్టలను) పరికించవయ్యా! (గమనించవయ్యా!) ఈమె పొద్దులు (రేబవళ్ళు) యెలాగడుపుచున్నదో గమనించు. కొంత అడియాసలతో (నీవామెను వదలవనే పేరాశతో) గడుపుతుంది. ఆత్మలో పరమాత్మ స్వరూపుడుగా నిన్ను భావించి కొంత సమయం గడుపుతుంది. మళ్ళీ ఇంతలోనేనీపై అలిగి యెడమాటలతో (విభేదించి మాట్లాడుతుంది, కొంతసేపు. మళ్ళీ ఇంపొందు మాటలు చెబుతుంటుంది. ఇవన్నీ అటుంచి కదుతమకమున (మిక్కిలి తన్మయత్వంతో) కొంతసేపు వుంటుంది.

ప్రభూ! ఇన్ని భావాలు ఆమెను ముప్పిరి గొనుచున్నప్పటికి ఆమె మనస్సులో వేడుకలు చెలరేగుతూనే వున్నాయి. నేను చెప్పబోయే సుదతి భావంబులు (వనిత ఆలోచనలు) పరికించవయ్యా! ఆమె కొంతసేపు నీకై యెదురు చూపులు చూస్తుంటుంది. కొంతసేపు తలపులు కలిగించిన సంతోషంతో గడుపుతుంది. కొంతసేపు మన్మథావస్థలో గడుపుతుంది. మనస్సులో పట్టుదల యెలావస్తుందా అని రకరకాల గతుల (విధానముల) వెదకుతూ కొంతసమయం గడుపుతుంది. ఇకనైనా ఈమెను కరుణించవయ్యా!

స్వామీ! ఆమె కొంతసేపు, తలపోతలను (అనేక రకములైన ఆలోచనలతో) గడుపుతున్నది. ఒక కొంత తడవు (సమయము) వలపులలో, మిక్కిలి చెలగి (అతిశయించి) వాడుదేరు (వడలిపోతుంది). ఓ శ్రీవేంకటేశ్వరా! నీవిపుడే యెలమి గూడితివి సంతోషంతో దేవిని పొందినావు. ఇకపై ఆమెను ఇటువలెనే (ఇలాగే) దయచేసి నీ కృప చూపించవయ్యా!

**పద్యవివరణ:**

కం॥ **సేయగల విన్నపములను**
**ఈయెడ సేసితిమి మేము ఇక నీ ఇచ్ఛే**
**శ్రీయుత వేంకటరమణా!**
**పాయక నీ యింతి నింక పాలింపుమయా!**

సంఖ్య: V/215 రాగం : అభేరి
కీర్తన : మానరెమాయలు మగువలు-నే

**అభేరి**

**33 మానరెమాయలు మగువలు-నే**
**గాను గాననుచు కనలీ శిశువు** ||పల్లవి||

**పాలట దొంగిలె బాలుడు గో-**
**పాలుల గూడుక పలుమరును**
**పోలవీ మాటలు బొంకులు యిది**
**యేలె యేలె మీరెల జవ్వనులు** ||మానరె||

**సారెకు వెన్నలు చవులట యీ**
**దూరులు మీకిక దొసగులును**
**చేరువ గరిమలు చెల్లవు - మీరు**
**పోరె పోరె వొరపుల నెర సతులు** ||మానరె||

**కింకలు మీకివి గెలుపులు - నెల**
**వంకలు మీకివి వన్నెలును**
**వేంకటపతి మీ విభుడట మీరు**
**బొంకక బొంకక పొలతులు మనరే** ||మానరె||

**ఉపోద్ఘాతము:**

ఇవి బాలకృష్ణుని గురించి గోపికలు చెప్పుకొనే సుద్దులు. ఎంతో తేలిక అనిపించే బహుక్లిష్టమైన కీర్తన ఇది. ఓ మగువల్లారా! మీరు మాయ వేషాలు మానేయండి. పాపం ఈ శిశువును చూడండి. ఆపని చేసింది నేగాను (నేనుకాదు). గౌననుచు (కానేకాదు అనుచు) ఎలా కందిపోతున్నాడో చూడండి. మీకు జాలి వేయటంలేదూ అంటున్నారు అన్నమయ్య. తానూ ఒక గోపికయై తోటి గోపికలతో చెబుతున్నారు.





**తాత్పర్య వివరణ:**

ఓ మగువలూ! (వనితల్లారా) ఈ బాలకృష్ణుడు శిశువు. ఆ పనిచేసింది నేగాను (నేనుకాదు) గాననచు (కాదనుచు) ఈ శిశువు కనలీ (ఆగ్రహించుచున్నాడు). ఇంకా యెందుకు పట్టుబడతారమ్మా?

ఈ బాలుడు అట (అక్కడ) పాలుదొంగిలె (పాలను దొంగిలించినాడు. ఈ పని యేదో ఒకసారి చేయలేదు. పలుమార్లు గోపాలురను కూడుకొని దొంగిలించినాడు. మేము చెప్పే ఈ మాటలు బొంకులపోలవు (అబద్ధాలు కావు). ఓ జవ్వనులారా! ఇదంతా మీరేల చేయుచున్నారు. ఏలె, ఏలె (ఎందుకే ఎందుకే)?

సారెకు (ప్రతిసారీ) వెన్నలు దొంగిలించి, చవులట (అందరికీ రుచి చూపుతాడట). ఈ దూరులు (తిట్లు) మీకు ఇక దొసగులును (విఘ్నములునూ) తప్పవట. మీ చేరువనే అతను యెన్ని గరిమలు (మహిమలు) చూపినా అవి చెల్లవు (నమ్మబడవు). ఓ నెరసతులూ (నేర్పరులైన సతులారా!) మీరు వొరపుల (ఘర్షణలను) వీడి పోరెపోరె (పొండి పొండి). ఈ బాలునితో గొడవెందుకు?

ఓ గోపికలారా! మీరు ప్రదర్శిస్తున్న కింకలు (కపట కోపములు) ఇవే మీకు గెలుపుకు ఆలంబనాలవుతున్నాయి. గోవిందుడు మీకు ఇవ్వబోయే అనురాగం ఎట్లాంటిదంటే, మీ గెలుపే, నెలవంక (చందమామ)లోని వన్నెలును (కళల సంపదలును). ఓ పొలతులారా (గోపికలారా) మీరు బొంకులు (పచ్చి అబద్ధాలు) మానండమ్మా! మీ యెదుటనున్న ఈ వేంకట విభుడే మీ విభుడట. ఇంకా యెందుకమ్మా! బొంకులు.

**పద్యవివరణ:**

కం|| **మానరెమాయలు మగువలు**
**తానాపని చేయలేదు తానెరుగననెన్**
**కానేకాదని కనలీ**
**ఈ నటనల శిశువుజాణ ఏపుగ బొంకున్.**

సంఖ్య: XXIX/230 రాగం : గానమూర్తి
కీర్తన : వెలది సొబగులివి విన్నవించితిమి

## గానమూర్తి

34 వెలది సొబగులివి విన్నవించితిమి
నెలకొని ఇక గరుణించవయా ||పల్లవి||

చెలపల చెలపల చెమటలు గారీ
వలపున బొడమిన వానలివి
సొలపుల సొలపుల చూపులు వొదలీ
తెలుపుగ వెన్నెల తేటలివి ||వెలది||

బుసబుసమను నూర్పులు చిగిరించీ
వసంతకాలపువరుసలివి
మిస మిస కాంతులు మెరుగులు వారీ
యెసగిన విరహపు టెండలివి ||వెలది||

మది మది గోర్కుల మంచులు గురిసీ
మదనుని యలహేమంత మిది
యిదె యిదె శ్రీవేంకటేశ యింతి గూడితి
వదలనికాగిళ్ళవాడికలివి ||వెలది||

**ఉపోద్ఘాతము:**

ఓ శ్రీవేంకటేశ్వరా! ఈ భామిని సొగసులనన్నింటినీ ఏకరువుపెట్టాము. సుస్థిరచిత్తుడవై ఇక ఆమెను కరుణించే బాధ్యత నీదేనయ్యా! అంటున్నారు. తానుకూడా దేవికి ఆంతరంగిక చెలికత్తెయై. ఆకాలములోని కీర్తనలన్నీ ఇది వరకే వినినట్లు వుంటాయి. అందుకనే ఉపోద్ఘాతములో కీర్తన చరణాలను ప్రస్తావించటంలేదు. అన్నమయ్య భావన చాలా చోట్ల ఊహించవలసి





వస్తున్నది. ఇది హేమంత ఋతువవటంవల్ల మదిలోని కోర్కెలు మంచులాగా కురుస్తున్నది అంటున్నారు. అద్భుతం కదా!

**తాత్పర్య వివరణ:**

స్వామీ! ఈ వెలది (యువతి) సొబగులను (అందములను) నీకు విన్నవించితిమి. ఇక నెలకొని (నిశ్చయించుకొని) ఈమెను కరుణించుము తండ్రీ!

ప్రభూ! వ్యాకులపాటుతో ఆమెకు చెమటలు యెలా కారిపోతున్నాయంటే చెలపల చెలపలుగా (చిలువలు పలవులుగా) హఠాత్తుగా చూసేవారికి ఇవి వలపులు పొడచూపినందువల్ల కురిసిన వానలా అనిపిస్తున్నాయి. ఆమె చూసే సొలపుల చూపులు (ముగ్ధమోహనమైన చూడ్కులు) నీకు తెలుపవలెనంటే అవి వెన్నెల తేటలు (తరకలు).

దేవా! అసలే వసంతకాలము వరుసగా వచ్చేసింది. ఆమె బుసబుసమని నిట్టూరుస్తుంది. ఆ నిట్టూర్పులు వలపుతమకంలోంచి చిగురించిందా అనిపిస్తున్నది. సరే! వానలు పోయాక యెండలు రావాలి గదా? అవీ వచ్చాయి. ఆమె విరహము మిసమిస కాంతులతో యెసగిన (కూడుకొన్న) యెండ కాయిస్తున్నదా? అన్నట్లుంది.

ఇక హేమంత ఋతువువచ్చేసింది. ఇది మన్మథుడు విజృంభించే సమయం. వాడి పంచబాణాలు సామాన్యమైనవి కావు. మదిలో కోర్కు(ర్కె)లనే మంచు కురుస్తూనే వుంటుంది.ఓ శ్రీవేంకటేశ్వరా! పనిలోపనిగా నీవు ఈ ఇంతిని కూడితివి. ఏమో అనుకున్నాముకానీ నీ బిగికౌగిళ్ళు మంచి వాడితనము కలిగినవే ప్రభూ! కాకపోతేకాస్త చూసుకో దేవి వదలిపోగలదు.

**పద్యవివరణ:**

ఆ.వె|| **వెలది సొబగులివియె విన్నవించితిమయ్య!**
**కరుణజూపుమింక తరుణిపైన**
**ఇదె తిరుమలనాథ! ఇంతిగూడితివయ్య!**
**వాడి కౌగిలింత వదలవాయె.**

సంఖ్య: XXVIII/2 రాగం : కళ్యాణవసంతం
కీర్తన : మేమెరుగమా యేమి మీ సుద్దులన్నియును

## కళ్యాణవసంతం

**35 మేమెఱగమాయేమి మీ సుద్దులన్నియును**
**ప్రేమములు దమకములు పెనగొనీ మీకు ॥పల్లవి॥**

**పలుకవే పతితోడ పగడవాతెరనోర**
**కులుకవే మచ్చికలు కొసరి కొసరి**
**చిలుకవే మోహములు సెలవినవ్వుల తేట**
**నెలకొన్న వేడుకలు నీయందే కలవు ॥మేమె॥**

**చూడవే నిడువాలు సోగ చూపులనితని**
**ఆడవే సరసంబు లంటివుట్టి**
**కూడవే కాగిటను గుబ్బ చనుగవనొత్తి**
**వాడికెలు మిగుల నీవలననే కలవు ॥మేమె॥**

**కలయవే పొన్నుపై కళలు మోమున పొదల**
**వెయవే రతిరాచ విభవములను**
**యెలమి శ్రీవేంకటేశు డితడిపుడె నినునేలె**
**కలికి చందములు నీకతననె కలవు ॥మేమె॥**

**ఉపోద్ఘాతము:**

ఓ దేవీ! మేమెరుగమా యేమి? ఈ కథలన్నీ మాకు బాగా తెలుసును లేవమా! మీ ఇరువురికి ప్రేమ, తన్మయత్వమూ పెనవేసికొనిపోయినవి. ప్రణయ కళలన్నీ నీలోనే వేడుకతో నెలకొనినవమ్మా! పొన్నుపై కళలు చిందే మోముతో నీస్వామితో రతిసీమలేలవమ్మా! శ్రీవేంకటేశుడు నిన్ను యేలుకొన్నాడు ఓ ప్రభూ! ఈ కలికి చందములన్నియు నీవలననే కలిగినవయ్యా!





**తాత్పర్య వివరణ:**

ఓ దేవీ! మీ సుద్దులు (మీ భార్యాభర్తల ముచ్చట్లు) మేమెరుగమా యేమి? (మాకు తెలియనివా యేమిటి?) మీకు ఒకరినొకరు చూడగానే ప్రేమములు (వలపులు) కలుగుతాయి. ఆ తరువాత ప్రేమవలన తమకములు (తన్మయత్వములు) కలుగుతాయి. ఆపైన మీరు ఒకరినొకరు పెనవేసుకొంటారు.

ఓ దేవీ! పగడవా తెరనోరు (పగడపు తెరవంటి ఎఱ్ఱని నీ నోరు తెరచి నీపతితో పలుకవే. కొసరి కొసరి అతనిపై మచ్చికలు చూపి కులుకవే (నీ కులుకును ప్రదర్శించవమ్మా!) తేట సెలవినవ్వులు (స్వచ్ఛమైన మందస్మితమువంటి నవ్వులు) నవ్వి మోహములు చిలుకరింపవమ్మా! అసలు వుండవలసినవేడుకలన్నీ నీయందే కలవు తల్లీ!

ఓ దేవీ! దీర్ఘమైన వాలు సోగచూపులతో ఆతని నొకపరి చూడవే.అంటివుట్టి (ఉత్సాహము తెచ్చుకొని) ఆతనితో సరసములనాడవే. చూసే వాళ్ళందరూ తన్మయత్వం చెందుతారు. దేవీ! నీ గుబ్బచన్నుగవనెత్తి స్వామి కౌగిటనుకూడుమమా! ఈ సరస, చతుర, ప్రవర్తన స్వామికి నీవలననే మిగుల అభ్యాసమైనవేమో?

సరే! నీ నిరీక్షణ ఫలించింది. నీ రమణుడు నిన్ను చేరవచ్చుచున్నాడు. కథ సుఖాంతం కాబోతున్నది. ఓ దేవీ! నీమోమున (వదనమున) కళలు పొదల (పదునారుకళలు పొడచూప) రతిరాజవిభవములను (మన్మథుని వైభవము) కన్నుల పండుగ చేయుచందమున వెలయవే (వర్ధిల్లవమ్మా!) అతిశయించిన శ్రీవేంకటేశ్వరుడు, అతడిపుడే నిన్ను కూడినాడమ్మా! ఆ మనోహరికి ఆ చందములు (నేర్పులు) నీకతననే (నీమూలంగానే) కలవు (సిద్ధించినవి).

**పద్యవివరణ:**

కం॥ **మేమెరుగమటనె సుద్దులు**
**ప్రేమములును తమకములును పెనగొని మీకున్**
**మోమునకళలే విరియగ**
**స్వామికి నీ చందములన వలపులు నెగడున్.**

సంఖ్య: V/174 రాగం : రేతిగౌళ
కీర్తన : వెక్కసమగు కుచ విభవములు

**రేతిగౌళ**

**36 వెక్కసమగు కుచ విభవములు**
**జక్కవ పులుగుల జగడములే** ॥పల్లవి॥

**చింత చేతనిదె చెలియనుదుటిపై**
**చెంతల చెదరిన చిరునెరులు**
**కాంత కన్నులను గండుమీలకును**
**కంతుడు వేసిన గాలములే** ॥వెక్క॥

**తమకంబున కాంతకు కరమూలపు**
**చెమటల తావుల చెలువములు**
**మమతల పెంచిన మరుని కొంతముల**
**జమళి తీగెలకు జలకములే** ॥వెక్క॥

**తెఱమోవిపై తిరువేంకటపతి**
**గుఱుతులు సేసిన కురుపసలు**
**ఒఱిగి వివశతల నుండగ సురతపు**
**మఱపులు దెలిపిన మర్మములే** ॥వెక్క॥

**ఉపోద్ఘాతము:**

ఆమె అధికమైన కుచవైభవములు చక్రవాకపక్షుల జంట జగడమాడుచున్నవా అన్నట్లున్నది అంటున్నారు అన్నమయ్య. శృంగార కీర్తనలలో అగ్రతాంబూలం ఇవ్వాల్సిన కీర్తన ఇది అంటే అతిశయోక్తి కాదు. ప్రౌఢలు కానివారి సౌకర్యార్థం గోప్యం అవసరమైనది. పదపదానికి పసందైన వివరణ ఇవ్వవచ్చును. కానీ ఆ ప్రయత్నం చేయలేదు. ధ్యాస





పరమాత్మునిపై లగ్నంజేసి, భారం తిరుమలేశునిపై వేస్తే, ఆయనకృప వలన ఈ కీర్తన మీకు అవగతమవుతుంది.

**తాత్పర్య వివరణ:**

ఓ చెలియలారా! ఇవి వెక్కసమగు (అధికంబని తోచుచున్న) ఈ దేవి కుచవిభవంబులు (స్తనయుగ్మముల వైభవములు) జక్కవ పులుగుల (చక్రవాకపక్షులు) జగడములె (కుమ్ములాటలే) అనిపించుచున్నవి.

ఆ సుందరిని చూచినారా? ఇదె చింతచేత (విచారమువలన) చెలియ నుదుటిపై చిరునెరులు (లేతముంగురులు) చెంతల (చేరువుగానుండి) చెదరిపోయినవి. ఈ కాంత కన్నులనబడే పెద్దపెద్ద మీలకు (చేపలకు) కంతుడు (మన్మధుడు) తీరికగా గాలము వేసినాడా అనిపించి, ఔను అవి గాలములే అనిపించుచున్నవి.

తన్మయత్వంలోనున్న ఈ కాంతకు బాహుమూలములనుంచి స్వేదము తావుల కనుపించుచూ చెలువములు (అందములను) ఇనుమడింపజేయుచున్నది. ఆమె వద్ద అటువంటి మరునికొంతములు (మన్మధుని ఆయుధసామాగ్రి) పుష్కలంగావున్నది. ఆమె మమతలతో పెంచిన పూలతీగెల జంటకు నీళ్ళు పోస్తుంటే, ఆమె వాటితో జలకములాడుచున్నది అనిపించుచున్నది.

చెలీ! తెఱమోవిపై (తెఱచియుండిన ఆమె అధరములపై) తిరువేంకటపతి గురుతులు సేసినాడు. అవి స్వామివారి కురుపసలు (గొప్ప చమత్కారములు... అని... నా భావన) సురతపు వివశత్వముతో బలహీనపడిన ఆ భామిని మఱపులగురించి వివరించాలంటే ఆమె మర్మములన్నీ తెలిపినట్లే మరి.

**పద్యవివరణ:**

తే.గీ॥ **వెక్కసంబగు కుచముల విభవములవి**
**జక్కువపులుగుల జతల జగడమేమో?**
**మోవిపై తిరువేంకటమూర్తి గుఱుతు**
**మర్మముల దెల్పె దేవికి మఱవరాని.**

సంఖ్య: VI/17 రాగం : కల్యాణి
కీర్తన : వలదననొరులకు వసమటవే

**కల్యాణి**

**37 వలదన నొరులకువసమటవే**
**తలచినట్ల నిది దైవమె చేసె** ॥పల్లవి॥

**తరుణి కుచములను తామర మొగుడలు**
**విరిసేనో యని వెరపునను**
**సరగునపతి నఖ చంద్రశకలములు**
**దరులగలుగ నివి దైవమె చేసె** ॥వలదను॥

**పొలతి వదనమను పున్నమ చంద్రుడు**
**బలిమి నెగయునని భయమునను**
**మెలుత చికుర ధమ్మిలపు రాహువు**
**తలజెదరగ నిది దైవమె సేసె** ॥వలదను॥

**వనితకు వాడునో వలపు తాపమున**
**తనులతిక యనుచు తమకమున**
**ఘన వేంకటపతి కౌగిట చెమటల**
**తనివి దీర్చనిది దైవమె సేసె** ॥వలదను॥

**ఉపోద్ఘాతము:**

ఓ దేవీ! ఘటనా ఘటన సమర్థుడైన ఆ దైవము తలచినట్లు జరుగుతుంది కాని, ఆయన నిర్ణయాన్ని వలదని తిరస్కరించుటకు ఇతరులకు సాధ్యమయే పనేనా తల్లీ! అంటున్నారు. దేవి చెలికత్తె అయిన అన్నమయ్య. తరుణి కుచములను తామెరల వికశిస్తున్నాయని దానిని నివారించడానికి చంద్రశకలములను బోలిన స్వామి నఖక్షతములను చూపి అవి వికసించి





తనను తాపానికి గురిచేయకుండా నివారించిందట. చూశారా దేవి సమయస్ఫూర్తి. ఈమెకా సమయస్ఫూర్తి కూడ దైవమే చేసె అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఇది (ఈ చెప్పబోవు) దేవి అగచాట్లను, దైవమే కల్పించినాడు. ఏదైనా ఆయన తలచినట్లే జరుగుతుంది. దానిని వలదన (కాదనుటకు) ఒరులకు ఇతరులకు వసమటవే (సాధ్యపడుతుందటనమ్మా?)

తరుణి కుచములను తామర మొగుడలు (మొగ్గలు) విరిసేనేమోయని వెరపునను (భీతితో) సరగున (వేగముగా) ఆదేవి సమయస్ఫూర్తితో ఆయన తన కుచములపై చేసిన చంద్రశకలములను బోలిన నఖ క్షతములను ఆతామెరలకు చూపినది. ఆమెకు ఈ దరులగలుగ (తరుణోపాయములు స్ఫురించుటకు ఆ దైవము చేతలే కారణము.

స్వామి రాకను వూహించినదేమో ఆ పొలతి (దేవి) వదనమను (ముఖమను) పున్నమి చంద్రుడు యెక్కడ బలముగ వుదయిస్తాడోనని భయపడి, ఆ మెలత (తరుణి) చికుర ధమ్మిల్లము (విరిసిన కొప్పు) రాహువువలె ఆమె వదన చంద్రికకు అడ్డము వచ్చింది. బుబ్బ తిరిగిపోయేట్లు చేసేఇటువంటి సంఘటనలన్నీ ఆ దైవ నిర్ణయాలు కాక మరేమిటమ్మా?

ఈ లోపుగాఘనుడైన శ్రీవేంకటపతి యేమిచేశాడో తెలియునా?ఆ వనిత వలపుతాపమున వాడిపోతుందేమో, ఆమె తనూలతిక (లత) చిగురించదేమో అన్న సందియము కలిగినవాడై ఆమెను తన కౌగిట చెమటల తడిపినాడు. మరి ఇక వారి తనివి తీరనేలేదు. ఇది దైవముసేతలు కాక మరేమి?

**పద్యవివరణ:**

ఆ.వె॥ **తలచినట్లె జరుపదైవంబునకె చెల్లు,**
**వలదుయనగ యొరుల వశము కాదు**
**దేవి తనువులతకు దేవుని కౌగిటి**
**చెమటలే జలములు చేవనీయ.**

సంఖ్య: IX/105 రాగం : రామక్రియ
కీర్తన : కందము విందముగాక కన్నులారను

**రామక్రియ**

**38 కందము విందము గాక కన్నులారను**
**అంది యెండ వెన్నె లైతే నదెవ్వరి మేలు** ॥పల్లవి॥

**కానీవె అందు కేమి కా దనఁగ వచ్చునా**
**మోనానఁ దాన(ను?)ంటేఁ జాలు మొక్కే నేను**
**పోనీ పోనీ వీరి వారి బద్దులైన వినెఁగా**
**అని వేము దియ్య నైతి నదెవ్వరి మేలు** ॥కందము॥

**తనలోనె నవ్వనీవె దాని కేమి దోసమా**
**వొనర మమ్ముఁ జెనకకుంటేఁ జాలు**
**కననీ కననీ తన కడలచుట్టరికాలు**
**అనుమె మిను మైతే నదెవ్వరి మేలు** ॥కందము॥

**మేలు మేలు యిది మేమె మేనవావి బలువా**
**యీలీల నన్నుఁ గడె నింతే చాలు**
**ఆలరి శ్రీవేంకటేశుఁ డంతటివాఁ డౌఁ గా**
**ఆలు మగఁ డొక్క టైతే నదెవ్వరి మేలు.** ॥కందము॥

**ఉపోద్ఘాతము:**

మన కన్నులారా ఈ వింత గురించి కనెదము, వినెదము అది సరే, ప్రపంచంలో యెండ అంతా వెన్నెలైతే అది యెవ్వరికి మేలు చేస్తుందండీ! అంటున్నారు అన్నమయ్య. ఇదేమిటి? ఇతనికి నాకు మేనరికంవున్న మాట నిజమే. మరి అది అతని బలువా, గుత్తాధిపత్యమా? ఏది ఏమైతేనేమి ఈ విధంగా నన్నా ఆ శృంగారరాయుడు నన్ను కూడినాడు. ఇదే నాకు పదివేలు. ఓసి! పిచ్చిపిల్లా! శ్రీవేంకటేశ్వరుడంతటివాడు, మగడై ఆ యాలుమగలు ఒక్కటైతే అదెవ్వరికి మేలు?





**తాత్పర్య వివరణ:**

ఒక చెలికత్తె, దేవితో అంటున్నది. సఖీ! నేడు మనం కనులారా కందము విందముగాక (చూచెదము, వినెదములెండు). అయినా అంది నీకు తేలికగా లభ్యమైన యెండెంత అవసరం? ఆ యెండే వెన్నెలైతే అదెవ్వరికి మేలు?

చెలీ! అందుకేమి? కానీవే (జరిగేది జరగనీ) కాదనటానికి మనం యెవ్వరము? ఆతడు మోనాన (మాట్లాడక) వుంటే చాలు మొక్కేము (శతకోటి వందనాలు). పోనీవే! ఆయన మొండివాడు. వీరువారు మంచి బుద్ధులు చెబుతే వింటాడటమ్మా? వేము (వేపచెట్టు) చేదైతే కనీసం ఔషధంగానన్నా పనికివస్తుంది. అది తియ్యనైతే ఎవరికి మేలు? ఆయన సహజగుణాలను ఆయన్నే అట్టేపెట్టుకోమనవే.

చెలీ! నన్ను చూచి తనలో తను యెలా నవ్వుకొంటున్నాడో చూడండే. కానీలే దానికేమి దోసము? మమ్మి యేదో ఒక నెపంతో చెనకకుండా వుంటే (తాకకుండా వుంటే) చాలు. మాకు అదే పదివేలు. తనకూ నాకూ మధ్యను కడల చుట్టరికాలు (అతిశయించిన బంధుత్వాలను) కననీ కననీ లెక్కచేస్తాడేమో చెయ్యనీ చూద్దాం. ఓ చెలీ! మినుములు అనుములు అయితే యెవరికి మేలు జరగుతుందే?

చెలీ! మేలు మేలు (చాలా బాగున్నదమ్మా!) అతనికి నాపై అంత అధికారమేమిటే? ఎంత మేనరికపు మరదలినైనా మరీ అంత బలువా (గుత్తాధిపత్యమా)? సరే! పోనీలే. ఈ విధంగానన్నా ఆ శృంగారరాయుడు నన్ను గూడినాడు. నాకు అదే చాలు. శ్రీవేంకటేశ్వరుడంతటివాడు మగడైతే ఆ దంపతులు ఒక్కటైతే అదెవ్వరి మేలే? ఆత్మకా? పరమాత్మకా?

**పద్యవివరణ:**

కం॥ **కందము విందము కనులన్**
**అందిన యెండాయె వెన్నెలది మేలానే**
**పొందెనను వేంకటేశుడు**
**అందముగా ఆలుమగలు అవరెయొకటిగా?**

సంఖ్య: IX/77 రాగం : లలిత
కీర్తన : మదనరాగము నీకు మదనాతురము నాకు

**లలిత**

**39 మదనరాగము నీకు మదనాతురము నాకు**
**యెదు రెదురఁ గలిగె నిందుకే మెచ్చితిఁ బో** ||పల్లవి||

**నిలువుల చెమటల నీమేను చూచి నా**
**నిలువెల్ల జెమరించె నేఁ డిదివో**
**కలువ కన్నుల నీ కావి చూచి నా కన్నుఁ**
**గలువలు కావి దేరీఁ గాఁకల కోపమునా** ||మద||

**వేఁడి నిట్టూరుపుల నీ వేషము చూచి నాకు**
**వేఁడినిట్టూర్పులు రేఁగె వెల్లవిరి**
**వాడుదేరెకళల నీ వదనము చూచి నేఁడు**
**వాడుదేరి చిన్నఁబోయ వదనము నాకు** ||మద||

**యెవ్వతో కాఁగిటి నీ యీ మేనిపచ్చి చూచి**
**యివ్వల నీ కాఁగిలి నీ కెక్కె నిపుడు**
**రవ్వల శ్రీ వెంకటేశ రతుల సంగడి నిట్టె**
**నివ్వటిల్ల నిన్నంటి నీయంత నైతి** ||మద|| **77**

**ఉపోద్ఘాతము:**

ప్రభూ! మనిద్దరికి మదనతాపము కలిగినట్లు అనుపించినా నీది వున్నతమైన అనుభూతి. నాది సర్వసాధారణమైన అనుభూతి. నీకు మదనరాగము, నాకు మదనాతురత. ఎంత తేడా వున్నది. మళ్ళీ మనము యెక్కడో దూరదూరముగా నున్నామా అంటే యెదురెదురుగానే వున్నాము. ఇందుకే నిన్ను మెచ్చితిని బో, అంటున్నది నాయిక. ఆవిడ మరెవరో కాదు





అన్నమయ్యే. కొన్ని తావులనా వివరణ సామాన్యంగా వుంటే, అది నా నేరము కాదు. ఇది అనంత సాగరాన్ని తెప్పలో దాటాలనే దుస్సాహసమే.

**తాత్పర్య వివరణ:**

స్వామీ! నీకు మదనరాగము (మన్మథలీలవలన కలిగిన అనురాగము). మరి నాకు మదనాతురము (మన్మథ తాపము). వింత యేమంటే, మన మిరువురము యెదురెదురుగానే వుండటం కలిగినది. ఇందుకే నేను నిన్ను మెచ్చితినిపో.

ఇదివో నేడు చూచితివా? నీ శరీరంపై నిలువెల్లా చెమటలు చూచి నా తనువు నిలువెల్లా చెమరించినది. నీ కలువకనులు యెరుపెక్కినవి. అది చూచి సంతోషించాలి కానీ, కాకలు తీరిన కోపముతోనున్న నాకు, నా కన్నులు కూడా అరుణిమలైనవనే విచక్షణ నశించినది.

స్వామీ! నీవు శృంగారరాయడివి. నీ వేషము చూస్తే ఈ అలంకరణ యెవ్వతెకోసమోనని నేను వేడి నిట్టూర్పులను వదలలేక తిప్పలు పడుతున్నాను. రేగిన ఆ వేడి నిట్టూర్పులు వెల్లివిరిసినవి (అతిశయించినవి). కళలు శోభిల్లు నీ వదనమును చూచి నాలోని కళలన్నియు వాడుదేరె (వాడి అయినవి). కానీ నేడు నీపై అలిగినందువల్ల నాకు కళలన్నీ వడలిపోయి నా వదనము చిన్నబోయినది.

స్వామీ! ఎవ్వతో నీ కౌగిలిలో నీ మేనిపచ్చి (శరీర సౌందర్యం) చూచిందని ఇక్కడ నీ కౌగిలిలో నీకే ఇప్పుడు ప్రేమోద్రేకము అధికమైనది. వజ్ర సమానుడవైన ఓ శ్రీవేంకటేశ్వరా! సంగడిరతుల (జంటరతులతో) ఇట్టే నివ్వటిల్ల (అతిశయించగా) నీకే చెల్లినది అనుకోకు. నిన్నంటి (నీ సహచర్యములో) నేనూ నీయంతనైతిని. అది నేను నీకు వేరుగా వివరించవలెనా ప్రభూ!

**పద్యవివరణ:**

తే.గీ|| **మదనరాగము నీకాయె మదనతపన**
**నాకు మిగిలె, యెదురెదురు నయమునున్న**
**ఇందుకే మెచ్చితిని బొమ్ము ఇందిరేశ!**
**రతుల నీయంతనైతిని పతివి నీవె.**

సంఖ్య: IX/39 రాగం : వరాళి
కీర్తన : నీటముంచు పాలముంచు నీ చిత్తమికను

**వరాళి**

**40 నీట ముంచు పాల ముంచు నీచిత్త మిఁకను**
**యీటగు నీపతిభావ మిది గలది ॥పల్లవి॥**

**తప్పక చూచుఁ జూచు తలవంచు నంతలోనె**
**వుప్పతిల్లఁ బులకించు నుస్సు రనును**
**కప్పురగంధి నీవుఁ గదిసి కూడిన కాఁక**
**చెప్పరాదు విరహము చెంతల నీపతికి ॥నీట॥**

**చిన్నఁబోవు నంతలోనె చెలులపైఁ గోపగించు**
**కన్నచో వెదకు మేనఁ గప్పు కప్పును**
**కన్నెరో విభుఁడు నీవు కళ లంటినదాఁక**
**మిన్నక చింతాజలధి మీరరాదో యమ్మ ॥నీట॥**

**బుద్దు లెంచుకొను లోలో పోసరించి కల్లపడు**
**అద్దివో శ్రీవేంకటేశుఁ డాడ నాడనె**
**వొద్దికై నీ విటువలె వొనగూడి వుండుదాఁక**
**చద్దికి వేఁడికి వెదచల్లు లాయ వలపు. ॥నీట॥**

**ఉపోద్ఘాతము:**

ఓ దేవీ! శుష్కవచనములు చెప్పే అలవాటున్న నీపతి భావమేదో విన్నావా? ప్రియా! నీటముంచినా పాలముంచినా ఇక నీ చిత్తము అంటున్నాడు. ఆయన భావమిట్లావున్నది. ఎంత మాయగాడమ్మా! నీ పతి వేంకటేశ్వరుడు. ఒద్దికై నీవు కూడగానే యెంత ఆడినాడే!! పైగా చద్దికి వేడికి వలపులు వెదచల్లుతాడాయె. నీవు లొంగిపోక యేమి చేయగలవు? అంటున్నది దేవి చెలికత్తె. ఆవిడ యెవరో తెలియనిదికాదు. మన అన్నమయ్యే ఇంతకీ చద్దికి వేడికి అంటే యేమిటి?





**తాత్పర్య వివరణ:**

దేవీ! యీటగు నీపతి (శుష్కవచనములు చెప్పే నీ నాథుడి) భావము, ఇది గలది (ఇలావున్నది). నీటముంచినా పాలముంచినా ఇకను (ఇకపై) నీ చిత్తము (నీ ఇష్టము). ఎంత జాణయో చూచినావా?

ఆయన చేష్టలు చూచినావా? ఒక్కొక్కసారి తప్పక (తదేకంగా) నీకేసి చూస్తూనే వుంటాడు. అంతలోనే తలవంచుకొంటాడు. పులకించి పోతాడు. ఉస్సురని నిట్టూరుస్తాడు. ఓ కర్పూరగంధీ! నీవు చేరువయై ఆయనను కూడితే వేడెక్కిపోతాడు. ఆయన విరహవేదన ఇక చెప్పరాదు తల్లీ! నీ పతికి నీవెంత చేరువైతే ఆయన అంత వేడెక్కిపోతాడు.

దేవీ! ఇంకా చెప్పటానికి చాలా వున్నది. అంతలోనే చిన్నబుచ్చుకొంటాడు. తన చెలికత్తెలపై చిరాకుపడి కోపగించుకొంటాడు. ఎదురుగా కనుపిస్తున్నా తన వస్తువులను వెదకుతాడు. ఒక్కొక్కసారి తన శరీరం కప్పేసికొంటాడు. ఓ అమ్మాయీ! నీ విభుడు నీవు కళలంటినదాకా (కళ కళలాడినదాకా) వూరకనే చింతాజలధి (దుఃఖసాగరంలో) వుండిపోతాడు. ఓయమ్మా! ఆయనను నెగ్గటం చాలా కష్టం.

దేవీ! ఈయన సంగతి ఇంకా చెబుతాను విను. నీవు ఆయనగారిపై అలిగినవేళ, లోలోన (తన మనస్సులోనే) నీ బుద్దులు (సద్గుణములను) గుర్తుకు తెచ్చుకొని తృప్తిపడతాడు. మళ్ళీ అంతలోనే పోసరించు (పురుషాహంకారముతో మాట్లాడతాడు). అంతలో కల్లపడు (తనెంత తప్పుచేశాడోనని తనను తానే నిందించుకొంటాడు). నీవు ఆహ్వానించావని నేడు శ్రీవేంకటేశ్వరుడు సంతోషంతో ఎలా నర్తిస్తున్నాడో చూడు. ఒనగూడి ఒద్దికయై నీవిట్లా ఆయనను కూడగానే, చద్దికి వేడికి (తెల్లవారుఝామున మరియు మధ్యాహ్నమువేళ) నీపై వలపు వెదచల్లులాయె ఇకనేమి?

**పద్యవివరణ:**

ఆ.వె॥ **నీట ముంచు పాల నిలువునా ముంచుము**
**నీదు చిత్తమికను నీపతియును,**
**వేంకటేశుడాడె వెలది వొద్దికజేర**
**చద్దె వేడికి వెదచల్లె వలపు.**

సంఖ్య: IV/427 రాగం : వరాళి
కీర్తన : శ్రీపతి నీ కెదురుచూచేనాకు నిట్లనే

### వరాళి

**41 శ్రీపతి నీ కెదురుచూచేనాకు నిట్లనే**
**దాపై నేఁడిపుడె ప్రత్యక్షముగావే ॥పల్లవి॥**

**పదునాలుగేండ్లును బాసి నీ కెదురుచూచే**
**యదన గుహునికిఁ బ్రత్యక్షమైతివి**
**కదిసి నీశరణంటే కరిరాజునెదుటను**
**అదివో తొల్లియుఁ బ్రత్యక్షమైతివి ॥శ్రీప॥**

**ప్రక్కన నహల్య శాపవిమోచనముగాఁగ**
**అక్కరతోడుతను బ్రత్యక్షమైతివి**
**చక్కఁగాఁ దపముసేసేశబరియెదుట నీవు**
**అక్కడ నాఁ డందునుఁ బ్రత్యక్షమైతివి ॥శ్రీప॥**

**భావించినట్టు మతిఁ బరమయోగులకెల్ల**
**తావుకొని నిచ్చలుఁ బ్రత్యక్షమైతివి**
**శ్రీవేంకటేశ నిన్నుఁ జింతించు మాబోంట్లకు**
**దైవమవై యిప్పుడే ప్రత్యక్షమైతివి ॥శ్రీప॥**

**ఉపోద్ఘాతము:**

"ఓ శ్రీపతీ! నీకు యెదురుచూచేనాకు ఇట్లనే దాపై నేడు ఇప్పుడే ప్రత్యక్షము కావయ్యా!" అని పల్లవిని విడదీస్తే యెంత తేలికగా అర్ధమయిందో చూడండి. అయితే అన్నమాచార్యులవారిని అంత తేలికగా తీసికొనరాదు. చరణాలు మొదలుపెట్టగానే నీవే తప్ప నితః పరంబెరుగ మన్నింపన్ దగున్ దీనునిన్ అనవలసిందే. తినబోతూ రుచి అడగటం దేనికండీ! మొదలు పెట్టండి. ఈ కీర్తన మీకెన్నో పౌరాణిక వాఙ్మయం పరిచయం చేస్తుంది.





**తాత్పర్య వివరణ:**

ఓ శ్రీపతీ! నీ కొరకై యెదురుచూచే నాకు ఇట్లనే (ఇలాగే) దాపై (నన్ను సమీపించి) నేడు, ఇప్పుడే ప్రత్యక్షముగావయ్యా! నా కనువిందుజేయుము తండ్రీ!

ప్రభూ! ఆనాడు నీరామావతారములో పదునాలుగేండ్లు వనవాసము పోవుచు గుహుని ఆతిధ్యం స్వీకరించి మరల పదునాలుగు సంవత్సరాల తరువాత అదన (తగు సమయానికి) ప్రత్యక్షమైతివి. అదే నీ వాగ్దానం అంటే. నిన్ను శరణువేడి రోదించు కరిరాజునెదుట (కాననములో మొసలిచే) పీడించబడుతున్న గజేంద్రునికి, అదివో తొల్లియు (అంతకుమునుపే) ప్రత్యక్షమైతివి. నీవు శరణాగత రక్షకుడవనుటకు వేరే ఆధారములు కావలెనా?

స్వామీ! ఆనాడు గౌతముని శాపగ్రస్తయైన అహల్య అచేతన శిలవోలెనుండగా ఆమెను కరునించి రామావతారంలో నీపద స్పర్శచే తిరిగి నాతిని చేసి ఆమె భర్తకిచ్చి ఆమెకు ప్రత్యక్షమై నీవెవరవో స్ఫురణ నిచ్చితివి. నీ కొరకు యేండ్లును పూండ్లును తపస్సు చేస్తూ జీవిత చరమాంకానికి వచ్చిన శబరి యెదుటకు వచ్చి, అక్కడ నాడు అందును (ఆ సందర్భంలోనూ) ఆమె మనోనేత్రానికి ప్రత్యక్షమై ముక్తి నొసంగితివి.

దేవా! నిచ్చలు (ప్రతినిత్యము) తావుకొని (వారున్నచోటికే వెళ్ళి) పరమయోగీంద్రులు నిన్ను యే విధంగా భావిస్తే ఆ విధంగా ఆ రూపంతో ప్రత్యక్షమవుతావు. అంతెందుకు, నేడు శ్రీవేంకటేశ్వరుడవై తిరుమలలో నిన్ను జింతించు (ధ్యానించు) మా బోంట్లకు (మావంటివారికి) కనులయెదుట దైవమవై ఇప్పుడే ప్రత్యక్షమైతివి. ధన్యుడను తండ్రీ!

**పద్యవివరణ:**

ఉ॥ **శ్రీపతి నిన్నుజూచుటకు చేసి నిరీక్షణ యుంటినయ్య నా**
**దాపునకొచ్చి కన్పడవె తామరకన్నుల నీలవర్ణుడా**
**ఓపికతోడ నెందరినొ ఒద్దకు చేరుచు బ్రోచినాడవే**
**ఏపుగ వేంకటేశ్వరుడ ఏలుము నాసరి ఆర్తశ్రేణులన్.**

సంఖ్య: IV/311 రాగం : సామంతం
కీర్తన : దైవమొక్కడే సంతత భజనీయుడు

## సామంతం

**42 దైవమొక్కఁడే సంతత భజనీయుఁడు**
**భావము సమబుద్ధిఁ బాయఁగఁదగదు** ॥పల్లవి॥

**హరియే నకలాంతరాత్మకుఁ డటుగాన**
**తిరమై యొకరి నిందింపఁదగదు**
**అరయఁగ లోకములనిత్య మటుగాన**
**మరిగి కొందరిమీఁదిమమతయు వలదు** ॥దైవ॥

**బహుకల్పితములెల్లఁ బ్రకృతిమూలమే కాన**
**గహనపుఁదనవుద్యోగము వలదు**
**సహజవిహారుఁడు సర్వేశ్వరుఁడుగాన**
**వహిఁ దానేఇచ్చినవి వలదనఁదగదు** ॥దైవ॥

**తపములు జపములు దాస్యమూలమె కాన**
**వుపమల సందేహమొగి వలదు**
**యెపుడును శ్రీవేంకటేశ్వరు సేవించి**
**చపలచిత్తమువారి సంగమిఁక వలదు** ॥దైవ॥

**ఉపోద్ఘాతము:**

ఎంత అధికారమూ సంపదావున్నా తోటి నరులను దేహి అనరాదు. అహర్నిశలూ భజింపదగినవాడు ఆ దైవమొక్కడే. ఇక ఆయన మననుంచి ఆశించేది యేమిటి? భావంలో కూడా సమబుద్ధి కలిగియుండటం. తరువాత కలిగిన ఆ సమభావన పాయగతగదు. జీవితాంతం అంతా ఈశ్వరసృష్టియే అందరూ సమానులే అంటున్నారు అన్నమయ్య. నవవిధభక్తి మార్గాలలో వేంకటేశునిదాస్యమును మించినది లేదు. ఎందుకంటే అది చపలచిత్తాన్ని అణచివేస్తుంది.





**తాత్పర్య వివరణ:**

ఓ నరులారా! ఈ సృష్టిలో సంతత భజనీయుడు (నిరంతరం భజింపదగినవాడు) ఒక దైవమే. ఆ తరువాత మనదైనందిన జీవితంలో, సమబుద్ధి (సృష్టిలో ప్రాణులన్నియూ సమానమే) అనే భావనను వదలరాదు. ఆ భావన పాయగదగదు (మరచుట తగినపనికాదు).

ఓ నరులారా! శ్రీహరియే సకలాంతరాత్మకుడు (సర్వుల ఆత్మలలో ఆత్మరూపిగానెలకొనియున్నాడు) అటుగాన (అందుచేత). ఈ భావన తిరమై మనస్సులో స్థిరపడి) యొకరి నిందించదగదు (పరులను నిందించరాదు). అరయ (అదే విధంగా) లోకములనిత్యములు (పదునాలుగు భువనాలు అశాశ్వతమైనవే. మరి కొందరిపై మరిగిన (పెల్లుబికిన) మమకారములు నిరుపయోగము కదా!

అనేక వైవిధ్యములతో కృత్రిమంగా కల్పింపబడిన వాటికి మూలము యేది? ప్రకృతియే. గహనపు తన వుద్యోగము (ఎఱుకలేని వుద్యోగమును) చేపట్ట తగదు. సర్శ్వేరుడు, సహజ విహారుడు (యధేచ్ఛగా యెక్కడైనా విహరించుటకు సర్వసమర్ధుడు). వహి (అందుచేత) తానే అనుగ్రహించినవి, కాదనుటకు మనకే అర్హతా లేదు. అవునా?

ఓ మానవులారా! భగవంతుని సేవించుటకు నవవిధ భక్తి మార్గాలను జ్ఞానులు తెలిపినారు. తపములు, జపములు ఇవన్నియూ శ్రేష్ఠమైనవే అయినా అంతులేని సందేహాలను కలిగిస్తుంటాయి. ఈ నవ విధభక్తి మార్గాలకు మూలము ఆ దైవమును దాస్యముతో సేవించుట. ఎప్పుడైతే శ్రీవేంకటేశ్వరుని సేవించి చపలచిత్తము గలిగినవారి (రుచులు కావాలని కోరుకొనేవారి) సాంగత్యము వదలి నిరంతరం దేవుని శరణాగతిలో జీవించుట, మేలు.

**పద్యవివరణ:**

కం॥ **సతతము దైవంబొక్కడె**
**హితముగ భజనీయుడైన హితకరుడతడే**
**జతయై సమబుద్దిగుణం-**
**బతులితముగ బాయదగదు హరినన్నెపుడున్.**

సంఖ్య: IV/350 రాగం : సామంతం
కీర్తన : ఇందరిగాచిన నీవు యిట్టే నీవు నాకు

**సామంతం**

**43 ఇందరిగాచిన నీవు యిట్టే నీవు నాకు**
**కందువ నిధానమవై కలవుగా నీవు ||పల్లవి||**

**అరసి ధ్రువుని గాచినట్టి నీవు**
**కరుణతోఁ బ్రహ్లాదుఁ గాచిన నీవు**
**కరిరాజు శరణంటేఁ గాచిన నీవు**
**కరతలామలకమై కలవుగా నీవు ||ఇందరి||**

**గట్టిగా విభీషణుఁగాచిన నీవు**
**అట్టె ద్రౌపదిఁ గాచినప్పటి నీవు**
**చెట్టవట్టి బలిఁగాచిన నీవు నాకు**
**కట్టిన ముడుపవై కలవుగా నీవు ||ఇందరి||**

**కమ్మర సుగ్రీవునిఁ గాచిన నీవు నేఁడు**
**కిమ్ముల లోకములు రక్షించే నీవు**
**నెమ్మది శ్రీవేంకటనిలయ నీవు మాకు**
**కమ్ముకొని దాపుదండై కలవుగా నీవు ||ఇందరి||**

**ఉపోద్ఘాతము:**

నీవు యెంతమందిని కాపాడినావు ప్రభూ! ధ్రువుడు, ప్రహ్లాదుడు, గజేంద్రుడు, విభీషణుడు, ద్రౌపది, బలిచక్రవర్తి, సుగ్రీవుడు ఇలా యెంత వెతికితే అంతమంది నీ శరణాగతులున్నారు. ఓ శ్రీవేంకటనిలయా! నీవు మా మనస్సులోనేనెలకొనియున్నావు. మమ్మల్ని ఆక్రమించుకొని మా సమీపముననే నున్న అండదండై నీవు మాకు కలవు తండ్రీ! అంటున్నారు అన్నమయ్య. ఇందరిగాచిన యట్టి నీవు నాకు ఇట్టే నిధానమవైకలవు అంటున్నారు.





**తాత్పర్య వివరణ:**

ప్రభూ! ఇట్టే ఇందరిని, గాచిన (రక్షించిన) నీవు నాకును కందువ (సామర్థ్యముతో) నిధానమవై (నిక్షేపమువలె) కలవు. నీవుండగా నాకు భయమేల తండ్రీ!

స్వామీ! నీ దీనజనోద్ధరణ ఈనాటిదా? యుగాల నాటిది. అరసి (చూచి) ధ్రువుని సంరక్షించిన నీవు ఆ తరువాత దుష్టదానవుడైన హిరణ్యకశిపుని బారినుండి ప్రహ్లాదుని రక్షించితివి. కరిరాజు (కాననములో మొసలిచే పీడించబడుచున్న గజేంద్రుని) పరుగు పరుగున వెళ్ళి కాచితివి. నీ శరణాగతులకు కరతలామలకమై (అరచేతిలోని ఉసిరికాయవలె)అప్పటికప్పుడు అందుకొనుటకు నీవుకలవుగా! ఇక భయమేల?

ఓ దేవదేవా! ఆనాడు విభీషణుని గట్టిగా (కృతనిశ్చయుడవై) రక్షించిన నీవు, తదుపరి ద్వాపరయుగమున ద్రౌపదీ వస్త్రాపహరణమునాడు ఆమె మానమును సంరక్షించితివి. బలి బలమును నిర్జించి మూడడుగులు చాలని వామనమూర్తివి త్రివిక్రముడవై సద్గతినిచ్చి ఆ బలిచక్రవర్తిని రక్షించితివి.నాబోటి బలహీనులకు కూడా కట్టిన ముడుపు (మొక్కుబడివలె) కలవుగా (వుంటివి కదా!)

ఓ వేంకట నిలయా! కమ్మర (ఆ వెనుక) వాలిని వధించి సుగ్రీవుని కాపాడితివి. కిమ్ముల (అనేక పర్యాయములు అనేక విధముల ఈ లోకములను రక్షించితివి. కమ్ముకొని (ఆక్రమించుకొని) నీవుమాకు దాపుదండై (సమీపముననేవున్న ప్రాపకమువలె) కలవుగా (ఉంటివి కదా!)

**పద్యవివరణ:**

తే.గీ|| **ఇందరినిగాచినట్టి నీవిట్టె నాకు**
**కందువ నిధానమైతివి కలిగినాకు**
**నెమ్మదిని వేంకటనిలయ నీవు మాకు**
**కమ్ముకొని దాపుదండౌచు కలవు దేవ!**

సంఖ్య: III/199 రాగం : లలిత
కీర్తన : నమో నారాయణ నావిన్నప మిదివో

**లలిత**

**44** **నమో నారాయణ నావిన్నప మిదివో**
**సమానుఁడఁ గాను నీకు సర్వేశ రక్షించవే.** ||పల్లవి||

**మనసు నీయాధీనము మాటలు నీ వాడేటివే**
**తనువు నీపుట్టించిన ధనమిది**
**మును నీపంపున నిన్ని మోచుకున్న వాఁడ నింతే**
**వెనక నన్ను నేరాలు వేయక రక్షించవే.** ||నమో||

**భోగములెల్లా నీవి బుద్ధులు నీ విచ్చినవి**
**యీగతి నాబతుకు నీవిరవైనది**
**చేగదేర నీవు నన్నుఁ జేసినమానిసి నింతే**
**సోగల నాయజ్ఞానము చూడక రక్షించవే.** ||నమో||

**వెలి నీవే లో నీవే వేడుకలెల్లా నీవే**
**కలకాలమును నీకరుణే నాకు**
**యిల శ్రీవేంకటేశ నీవేలుకొన్నబంట నింతే**
**నెలవు దప్పించక నీవే రక్షించవే.** ||నమో|| **199**

**ఉపోద్ఘాతము:**

భక్తిజాలువారే అన్నమయ్య కీర్తననాస్వాదించండి. ఓ నారాయణుడా! నీకు నమోవాకములు. ఇదివో నా విన్నపములాలకింపుము తండ్రీ! నీకు నేనెట్లు సమానమైతాను ప్రభూ!ఓ సర్వేశ! నన్ను రక్షించవయ్యా! అంటున్నారు.

నా మనస్సు నీ అధీనంలో వుంటుంది కాబట్టే అది నీవేం మాట్లాడమంటే అది మాట్లాడుతుంది (మంచైనా, చెడైనా). మరి నా మీద నేరాలెందుకేస్తావు స్వామీ! అంటున్నారు. నేను భోగాలనుభవిస్తున్నానంటే





నీవిచ్చిన బుద్ధితోనే కదా! నా శరీరం వెలుపలా నీవే, లోనా నీవే కదా! ఇక నాకు నీ కరుణవుంటే చాలదా?

**తాత్పర్య వివరణ:**

ఓ శ్రీమన్నారాయణుడా! నీకు నమస్కరించుచున్నాను. ఇదిగో నా విన్నపమునాలకింపుము. నేను నీకు సమానుడగాను (సరిపోల్చదగినవాడను కాను). ఓ సర్వేశ్వరా!నన్ను రక్షింపుము తండ్రీ!

ప్రభూ! నా మనస్సు నీ ఆధీనములో వుంటుంది. అందుకే నేను మాట్లాడే మాటలు నావి కావు. అవి, నీవే. నా తనువు (శరీరము) నీవు పుట్టించిన ధనము. అయితే ఇవన్నీ నావనే భ్రమ కలుగుతున్నది. కానీ నీ పంపున (ఆజ్ఞపై) నేను ఇవన్నీ మోస్తున్నాను. ఇందులో నా తప్పేముందయ్యా? ఇక నా వెనకటి నేరాలన్నీ యెంచి శిక్షించక, రక్షించుము స్వామీ!

స్వామీ! నేను భోగాలు అనుభవిస్తున్నానంటే అది నీవిచ్చిన బుద్ధులతోనే కదా! ఈ విధంగా నా బ్రతుకంతా నీ ఇరవైనది (అధీనమైనది). చేగదీర (కావాలని) నీవు చేసిన మనిషినే నేను. ఇంతేకదా! ప్రభూ! నాలో యెంత వెదకితే అంత అజ్ఞానం వున్నది. దాన్ని వెదకినందువల్ల నీకేమి ప్రయోజనం? అదేమి చూడక నన్ను రక్షించుము దేవదేవా!

ప్రభూ! నావెలి (శరీరం బయట) నీవే వున్నావు. నాలోనా (నా అంతరాత్మలోనూ నీవే వున్నావు.) అందుకనే నేనేం వేడుక చేసికోగలిగినా అది నీ వల్లనే. నాకు నీ కరుణ కలకాలమూ వుండాలయ్యా! ఓ శ్రీవేంకటేశ్వరా! ఇల (ఈ లోకంలో) నేను నీవు యేలుకొంటున్న బంటును. ఇంతేనయ్యా! నా నెలవు (గమ్యము) తప్పించక (చెడగొట్టక) రక్షించుము తండ్రీ!

**పద్యవివరణ:**

కం|| **నారాయణా నమో నమొ**
**ఆరూఢిగ విన్నపముల నాలింపుమయా**
**నీరూపమునకు సరియా**
**సారింపుము దయను కాచి సంరక్షించన్.**

సంఖ్య: IV/349    రాగం : బౌళిరామక్రియ
కీర్తన : ఎన్నడు నేగందు నిందు నిందిరాపతి నీవే

**బౌళిరామక్రియ**

**45 ఎన్నఁడు నేఁగందు నిందు నిందిరాపతి నీవే**
**కన్ను లెదుటనుండి కరుణింతుగాక** ॥పల్లవి॥

**పొడమినయట్టె నిన్ను పొంచికొలిచేనంటే**
**కడు నాకప్పుడు వివేకము చాలదు**
**అడరి యంతటిమీఁదనైనాఁ దెలియఁబోతే**
**వడి జవ్వనమదము వశమిందుగాదు** ॥ఎన్నఁడు॥

**వెనక నేఁ బ్రౌఢనై విరతిఁ బొందేనంటే**
**ధనవాంచ నేమియుఁ దడవనీదు**
**తనువు ముదిసి నీకుఁ దపముసేసేనంటే**
**వొనర నేమిటికి వోపికలేదు.** ॥ఎన్నఁడు॥

**శ్రీవేంకటేశ యీసిలుగులఁబెట్టనేల**
**కైవశమై నీవు గలిగుండఁగా**
**నీవే కృపసేసి నేఁడిటుగావకున్న**
**పావనమైన యీ పదవెందుఁగద్దు** ॥ఎన్నఁడు॥ **349**

**ఉపోద్ఘాతము:**

ఓ ఇందిరాపతీ! నిన్ను నేనెప్పుడు కనులారా గాంచెదనయ్యా? నీవు నా కన్నులెదుటనే వుండి కరుణింతువుగాక అంటున్నారు అన్నమయ్య. బహు సుందరమైన ఈ కీర్తనలో నీవు నాకు కనపడంగానే కొలిచి ఆరాధించెదనంటే అప్పుడు నాకు స్పృహవుంటుందో వుండదో? నా వివేకము చాలుతుందో చాలదో... ఇట్లా నాకు అన్నీ సందేహాలే. పైగా కామక్రోధ మోహావశవర్తనుడను. చూస్తుండగానే యవ్వనం పోయి ప్రౌఢనై చివరికి ముదుసలినయ్యాను. మృత్యువెప్పుడు యే మలుపులో వస్తుందో తెలియదు. ఓ వేంకటేశ్వరా! ఇంకా నన్నెందుకు సిలుగుల బెట్టెదవయ్యా? పావనమైన నీ దివ్యపదవి నివ్వవయ్యా!





**తాత్పర్య వివరణ:**

ఓ ఇందిరా రమణా! ఇందు (ఇక్కడ) నేను నిన్ను ఎన్నడు గందునయ్య! నీవే నా కన్నుల యెదుట కనబడి కరుణించెదవు గాక!

బాల్యంలో నీవు ప్రత్యక్షమైనపుడు వేచి నిన్ను కొలిచేనంటే నాకప్పుడు స్పృహ వివేకము చాలదు. పోనీలే ఆ తరువాతనైనా నీ గురించి తెలుసుకొందామా అంటే నా యౌవన మదమును వశములో వుంచుకోవటం సాధ్యపడుటలేదు. మరి నేనేం చేయాలి ప్రభూ!

సరే! పోనీలే ప్రౌఢనయ్యాక విరతి (విరక్తి) సంపాదిద్దాములే అనుకొన్నాను. కానీ విపరీతమైన ధనవాంఛ నన్ను పట్టుకొని తడవనీదు (నన్ను ప్రశాంతంగా వుండనియ్యదు) సరే! పోనీ నా శరీరం ముసలిదయ్యాక వేరే పనేమీ లేదు కాబట్టి నీకోసం తపస్సు చేద్దామనుకొన్నాను. కానీ ఇప్పుడు చూస్తే నా శరీరంలో వోపికలేనేలేదాయె. ఇప్పుడెట్లా ప్రభూ!

ఓ శ్రీవేంకటేశ్వరా! ఇంకా నన్ను బాధలుపెట్టటం ఎందుకయ్యా? నాకుకైవశమై (స్వాధీనుడవై) నీవుండగా నాకేమి తక్కువ? నీవే నాపైదయచూపి నన్ను రక్షించకపోతే పావనమైన ఈ ముక్తి పదవి నాకెలా దక్కుతుంది ప్రభూ!

**పద్యవివరణ:**

సీ॥ **పొడమిన నిన్నట్టి పొంచి కొల్చేనంటె**
**కలవివేకంబది చాలదాయె**
**ఆపైన తెలియంగ నేపాటుబడబోతె**
**జవ్వనమదమెక్కినివ్వటిల్లె**
**ప్రౌఢనై విరతికి పలుమార్లు యత్నింతు**
**ననిచూడ ధనవాంఛ వినదు నన్ను**
**తనువు ముదిసి నీకు తపముచేసెద నన్న**
**వొనర వోపికయది కానరాదు**

తే.గీ॥ **వేంకటేశ! యీసిలుగుల బెట్ట నేల?**
**ఎన్నడు నిను నేగందును ఇందిరేశ!**
**కన్నులెదుటనే నీవుండి కరుణజూడు**
**పావనంబైన పదవిది ఎవనికబ్బె?**

సంఖ్య: IV/348   రాగం : బౌళి
కీర్తన : ఏమిసేయుదు నింతయు నీమాయ

**బౌళి**

**46 ఏమిసేయుదు నింతయు నీమాయ**
**సామజవరద నా చందమిది ॥పల్లవి॥**

**జలములోపలనున్నచందురునీడవలె**
**నలుగడలఁ గదలీ నామనసు**
**పెలుచ మేఘములు గప్పిన సూర్యునివలె**
**వెలుఁగదు నాలోని విజ్ఞానము ॥ఏమి॥**

**కడఁగి యాకసమున గాలియణఁగినట్లు**
**వడిఁగానరాదు నా వైరాగ్యము**
**ముడిగిముత్తెపుఁజిప్పముత్యమువిధంబున**
**జడిసీ నాలోని సాత్వికము ॥ఏమి॥**

**యిప్పుడిట్టె శ్రీవేంకటేశ నీకృపవలె**
**పుప్పతిల్లె నిజభక్తి యొక్కటై నీపై**
**కప్పిననీసేవవలెఁ గన్న నిధానమువలె**
**అప్పసమై నిలిచె బ్రహ్మానందము ॥ఏమి॥ 348**

**ఉపోద్ఘాతము:**

సామజవరదుడు అంటే గజేంద్ర సంరక్షకుడు అని అర్థం. ఓ గజేంద్ర సంరక్షకా! నా విధానాలు మార్చుకోలేకపోతున్నాను. నేనేమి చేస్తున్నానో నాకే తెలియటం లేదు. పుణ్యమో పాపమో చేసేస్తున్నాను. నా మనస్సు నిలకడ లేనిది. విజ్ఞానము వెలుగనే వెలగదు. ఆకాశంలో యెత్తుకుపోయినకొద్దీ గాలి వేగము క్షీణిస్తుంది. నా వైరాగ్యం కూడా అంతే వైర్యాగం వున్నదిగాని దానికి బలం లేదు. నా సాత్విక బుద్ధి ముత్యపు చిప్పలోని ముత్యంవలే వుందిగానీ శోధిస్తేనే కనబడుతుంది. ఓ





శ్రీవేంకటేశ్వరా! నీపై నిజభక్తి నీకృపవల్లే కలిగింది. నీసేవే నానిధానము. అదే బ్రహ్మానందము అంటున్నారు అన్నమయ్య.

**తాత్పర్య వివరణ:**

సామజవరదా! (గజేంద్రసంరక్షకా) నా చందమిది (నా జీవన విధానము ఇదే). దీనిని మార్చుకోలేను. ఏమి సేయుదు (ఏమి చేయగలవాడను?) ఇదంతా నీ మాయ. దీన్ని నెగ్గడం నాకు సాధ్యమా?

నీటిపై చంద్రుని నీడ నిశ్చలంగా వుంటుందా? అది నలుగడల గదలీ (అన్నివైపులా కదలిపోతూనే వుంటుంది కదా!) నా మనస్సుకూడా అంతే. అతిచంచలమైనదీ, పట్టురానిదీనూ. పెలుచ (నిలకడలేని) మేఘాలు కప్పిన సూర్యుని ప్రకాశం ఒకసారి హెచ్చి ఒకసారి తగ్గుతుంటుంది. అలాగే నాలోని విజ్ఞానము ఒకసారి బయటకు వస్తుంది, ఒకసారి స్తబ్దుగా వుంటుంది. నేనేమి చేయగలను?

అనంతాకాశంలో గాలి తన విజృంభణ చూపక అణిగియుంటుంది. అలాగే నా వైరాగ్యం మెల్లగా నడుస్తున్నదే గాని దానిలో 'వడి' (వేగము) ఏమాత్రమూ లేదు. నీరధిలో మునిగివున్న ముత్యపు చిప్పలోని ముత్యమువలె, నాలోని సాత్విక బుద్ధి పొరల మాటున నిబిడీకృతమైయున్నది.

ఓ శ్రీవేంకటేశ్వరా! ఇప్పుడు నీ కృపనాపై ఇట్టే కలిగినాలో అంతర్లీనమైయున్న నీపై నిజభక్తి ఒక్కటే వుప్పతిల్లినది (పుట్టినది). నీసేవా భాగ్యము నన్నుకప్పివేసినది. నీవునా కన్నులయెదుటనున్న నిధానము (నిక్షేపము) వలెనున్నావు. మరి ఆపైన బ్రహ్మానందము నాకు అప్పసమై (శాశ్వతమై)నిలిచినది.

**పద్యవివరణ:**

కం॥ **సామజవరదా! ఇంతయు**
**నీమాయయె పోవునాదు నిజచందములున్**
**ఏమిటి సేయుదునయ్యా!**
**పూమాలల వేంకటేశ పురుషోత్తముడా!**

సంఖ్య: IV/266     రాగం : పాడి
కీర్తన : కలదొక్కటే గురి కమలాక్ష నీ కరుణ

**పాడి**

**47 కలదొక్కటే గురి కమలాక్ష నీ కరుణ**
**యిల నేనెట్టుండినాను యెంచకుమీ నేరమి** ॥పల్లవి॥

**మనసులోనికి గురి మాధవ నీ పాదాలు**
**తనువుపై గురి నీ సుదర్శనము**
**కనుచూపులకు గురి కమలాక్ష నీ రూపు**
**పను లెన్నిగలిగినఁ బట్టకు నా నేరమి** ॥కల॥

**చేతులు రెంటికి గురి సేసేటి నీ పూజలు**
**నీతి నా నాలికగురి నీ నామము**
**కాతరపునుదుటికిఁ గల తిరుమణి గురి**
**పాతకపునావలనఁ బట్టకుమీ నేరము** ॥కల॥

**యిహపరాలకు గురి యీ నీ శరణాగతి**
**సహజ మాత్మకు గురి సంతతభక్తి**
**మహిలో శ్రీవేంకటేశ మన్నించి నన్నేలితివి**
**బహువిధముల నింకఁ బట్టకుమీ నేరమి** ॥కల॥ **266**

**ఉపోద్ఘాతము:**
'గురి' అంటే లక్ష్యము అని అర్థము. యావత్ సృష్టికి ఒక్కటేగురి. అది కమలాక్షుడైన శ్రీహరి కరుణను సంపాదించుట. నేను దాన్ని సంపాదించటానికి కృషి చేస్తున్నాను. నేనెట్లావున్నా నా నేరము లెంచకుము ప్రభూ! అంటున్నారు అన్నమయ్య. మానవుని జీవితంలో ఇహపరాలు రెండూ ముఖ్యమైనవే. ఇవి రెండూ సాధించవలెనంటే అంత సులువైన విషయం కాదు శ్రీవేంకటేశ్వరుని శరణాగతి ఒక్కటే ఆ రెంటికీ గురి. సహజానందం పొందాలనుకున్న ఆత్మకు గురియేది? స్వామిపై సతతము భక్తి వుండటమే.





**తాత్పర్య వివరణ:**

ఓ కమలాక్ష (పద్మనయనా!) మాకు ఒక్కటే గురి (లక్ష్యము) కలదు. అదే నీ కరుణ సంపాదించుట. ఓ ప్రభూ! ఈ ప్రపంచంలో నేనెట్లావున్నా నాపై నేరములెంచకుమా (నా తప్పులనెంచకు స్వామీ!)

ఓ మాధవా! నామనసు నిలుపడానికి గురి, నీ పాదకమలములు. నా తనువు (శరీరం) క్షేమంగా వుండటానికి కారణం నేను ధరించిన నీ సుదర్శన చక్రముద్రలు. ఓ కమలాక్ష నేను అంధుణ్ణి కానందుకు సంతోషిస్తున్నాను ఎందుకంటే కనుచూపులకు గురియైన నీ మనోహరరూపం నాకళ్ళెదుటే వున్నది. స్వామీ! ఈ లోకపాలనవల్ల నీకు క్షణం తీరదు. దొరికిన ఆ కాస్త సమయం నానేరాలెంచుటతో గడిపేయకు.

నాకు రెండు చేతులనిచ్చావు. ఎందుకు? వాటి గురి నీ పూజసేయుట. అందుకే రెండు చేతులనిచ్చావు. నీతిగల నా నాలుక లక్ష్యము నీ నామోచ్ఛరణము. కాతరపు (దృష్టికి లోనయ్యే) నా నుదుటికి గురి దానిపై గల నీ తిరుమణి (నీ పంగనామములు). నేను పాపినే ఒప్పుకొంటాను. కానీ వూరకనే నా నేరములెంచి నన్ను వేరు చేయకు ప్రభూ!

దేవా! మానవుడు ఇహపరములు రెండూ సాధించవలెనంటే గురి నీశరణాగతి. సహజ స్థితిలో వున్న నా ఆత్మకు గురి నీ సంతత భక్తి (నిరంతరమైన భక్తి). ఓ శ్రీవేంకటేశ్వరా! ఈ లోకంలో నన్ను మన్నించి నన్ను పరిపాలించితివి. ఇంకా బహువిధములైన నా నేరాలు యెంచి యేమి ప్రయోజనం? వద్దు తండ్రీ!

**పద్యవివరణ:**
ఆ.వె॥ **కలదు 'గురి' యొకటియె కమలాక్ష! నీ కృప**
**యెంచవలదు నేరమెట్టులున్న**
**వేంకటేశ! నాదు వినతి మన్నించావు**
**దేనికేది 'గురియొ' వినుము నేడు.**

సంఖ్య: III/159 రాగం : మలహరి
కీర్తన : సర్వేశ్వరా నీకు శరణుచొచ్చితిమి

### మలహరి

**48 సర్వేశ్వరా నీకు శరణుచొచ్చితి మిదే**
**వుర్విలోన నేమెంచేవుపమ లేమున్నవి** ||పల్లవి||

**వెలయ నేమిటికైనా వెరవకుండేనంటే**
**యెలమి ధైర్యము నీవియ్యక లేదు**
**బలిమి చూపెద నేపట్టుననైనానంటే**
**చెలఁగి నీవే లోనిచేతనాత్మకుఁడవు.** ||సర్వే||

**జగములోపల నేనెచ్చరికై వుండేనంటే**
**అగపడి బుద్ధి నీవియ్యక లేదు**
**పగటుసంసారముభ్రమ విడిచేనంటే**
**మగటిమిగల నీవు మాయానాథుఁడవు.** ||సర్వే||

**కేవల మీపుట్టుగును గెలిచివుండేనంటే**
**ఆవేళ నీవు ముక్తియ్యక లేదు**
**శ్రీవేంకటేశ్వర నీకు చేకానుకిచ్చేనంటే**
**లావుసంపదల నీవు లక్ష్మీనాథుఁడవు** ||సర్వే|| **159**

**ఉపోద్ఘాతము:**

ఇది శరణాగతి కీర్తన అని పల్లవిని చూస్తేనే అర్థమవుతున్నది. కానీ ఇందులో మెలికయేమంటే వుర్విలో నేమెంచే వుపమలేమున్నవి అనే తదుపరి వాక్యం. అంటే, ఈ భూలోకంలో మేము దేనితో పోల్చుకొని మా గురించి అసంతృప్తి పడవలెను? మేము సర్వేశ్వరుడైన నీకు (శ్రీవేంకటేశ్వరునికి) శరణుచొచ్చినాము. ఇక మాకు అన్యముల గురించిన





చింతయేల? నీవెంత ఉదారుడవంటే మేమిచ్చే చిన్న కానుకలకే మాకు అంతులేని సంపదలనిస్తున్నావు అంటున్నారు అన్నమయ్య.

**తాత్పర్య వివరణ:**

ఓ సర్వేశ్వరా! ఈ వుర్విలోన (భూమిమీద) మమ్ము రక్షించగలవారెవ్వరూ లేరు. అందుకే నీకు ఇదే శరణుచొచ్చితిమి. నేము (మేము) యెంచే ఉపమలేమున్నవి (మేము దేనితో పోల్చుకొని మాగురించి అసంతృప్తి పడవలెను?)

స్వామీ మాది ఏపాటి సామర్థ్యమయ్యా? వెలయ నేమిటికైనా (దేనికైనా) భయపడకుండ వుండాలంటే మాకు ధైర్యము నీవియ్యకుండా రాదు. ఏ పట్టునైనా (ఎక్కడైనా) నాబలము చూపించి అందర్నీ వశపరచుకొందామంటే నావల్లనేమవుతుంది? నాకు చేతనత్వం కలిగించే చేతనాత్మకుడవు నీవే కదా! నీవు లేకపోతే నాలో చైతన్యంయేదీ? అట్టి నీకు శరణుచొచ్చి, నా అశక్తత నొప్పుకొంటాను.

సరే! ఈ జగములో నేనెచ్చరికై (సావధానుడనై) వుంటానులే అనుకొంటే అది మాత్రం నావల్ల అయ్యేపనియా? నాకు మంచీ చెడూ విచక్షణ నిచ్చే బుద్ధి నీ వరప్రసాదమే. నీవియ్యక ఆబుద్ది మాకు రానేరాదు. సగటు సంసారము (లావణ్యములొలికే ఈసంసారం) యొక్కభ్రమలు వదలివేద్దామా అంటే సర్వ సమర్థుడవైన నీవే మాయానాథుడవు. నీకృపలేక నేనీసంసారపు మాయనెలా నెగ్గను? మరి నేను నీకిచ్చేదేమిటి?

అవన్నీ యెందుకు, పునరావృతమైన ఈ పుట్టుకలను గెలిచి తిరిగి జన్మలేక వుందామంటే నాకు ఈ జన్మలనుంచి ముక్తినియ్యవలసిన వాడివి నీవే. అదంతా యెందుకు? ఓ శ్రీవేంకటేశ్వరా! నీకు చేకానుకలు (మొక్కుబడుల) నిచ్చానంటే నీవు లక్ష్మీనాథుడవైనందున లావు సంపదలు (అంతులేని సంపదలు) నీవిచ్చేవే కదా!

**పద్యవివరణ:**

తే.గీ|| **అరసి సర్వేశ్వరా నీకు శరణమంటి**
**ఉర్వి నేనెంచవలసిన ఉపమలేవి?**
**చిన్ని కానుక నీకిచ్చువున్నతునకు**
**లావు సంపదనిచ్చేవు లక్ష్మీరమణ**

సంఖ్య: III/173  రాగం : మాళవిగౌళ
కీర్తన : నీకు నాకు నెట్టుగూడె నీ వెట్టు నన్నేలితివి

మాళవిగౌళ

**49 నీకు నాకు నెట్టుగూడె నీ వెట్టు నన్నేలితివి**
**యీకరుణకే మొక్కితి నిందిరారమణా.** ॥పల్లవి॥

**కమలాక్ష నీ వనంతకల్యాణగుణనిధివి**
**అమితదుర్గుణరాసి నన్నిటా నేను**
**అమరంగ స్వతంత్రుండ వటు నిన్ను నెంచితేను**
**తమి నించుకంతా స్వతంత్రుండ నేం గాను.** ॥నీకు॥

**దేవ నీవైతే సర్వదేవరక్షకుండవు నే**
**జీవుండ నింద్రియాలం బెంచేవాండను**
**ఆవల బ్రహ్మాండాల కన్నిటాం బొడవు నీవు**
**భావించ నే నణువై పరగేటి వాండను** ॥నీకు॥

**నానార్థసంపన్నుండవు నావల్ల నేమి గంటివి**
**ఆనుక నాయంతర్యామివై పాయవు**
**శ్రీనిధివి నీవైతే శ్రీవేంకటాద్రిపతివి**
**దీనుండ నొకండ నేను ద్రిష్టించి కాచితివి.** ॥నీకు॥ **173**

**ఉపోద్ఘాతము:**

ఓ ఇందిరారమణా! నీకు నాకు ఎట్లా కుదిరినదయ్యా? నన్ను మన్నించి నీవెట్లు నన్నేలితివి స్వామీ! నీవు ఇంత కరుణామూర్తివి కాబట్టే నేను నీకు మొక్కుతూ వుండిపోయాను అంటున్నారు అన్నమయ్య. భక్తిజాలువారే ఈకీర్తనలో తానెంత అధముడో తెలియజెప్పుకొంటూ స్వామి అనంత కళ్యాణగుణనిధి అని కీర్తిస్తున్నారు. సర్వదేవతలను రక్షించేవాడు





ఊర్ధ్వధవుడే. ఆయన బ్రహ్మాండాలకన్నా పొడవు, మరి తాను అణు పరిమాణంకల అర్భకుడనంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ ఇందిరా పతీ! నీకూ నాకూ యెట్లా కూడెను (కుదిరినది?) నీవే రీతి నన్ను అనుగ్రహించావు ప్రభూ! నీవింత కరుణామయుడవు కాబట్టే నేను నీకు శరణని మొక్కుతున్నాను.

స్వామీ! నీకూనాకూ ఒక్కపోలిక కూడా లేదయ్యా! ఓ కమలాక్షా! నీవు అనంతమైన కళ్యాణగుణములు నిధిగా గలవాడవు. మరి నేనో! నేను అన్నిటా (అన్నివిధములా) అమితమైన దుర్గుణములు కుప్పవోసిన దుర్మార్గుడను. ఎంచి చూస్తే నీవు సర్వస్వతంత్రుడవు. మరినేనో? మిక్కిలి అస్వతంత్రుడను. కొద్దిపాటి స్వతంత్రము కూడా నాకు లేదు.

నీవు దేవదేవుడవు. సర్వ దేవతలకు రక్షకుడవు. మరి నేనో? ఇంద్రియబద్ధుడనైన జీవుడను. నీవు అనంతకోటి బ్రహ్మాండాలకు ఆధారభూతుడవు. ఆ బ్రహ్మాండాలకే అంతుచిక్కని అన్నివిధములా పొడవైన వాడవు (ఉన్నతుడవు). మరి నేనో? భావించి చూస్తే అణురూపుడనై వుండేవాడను. నిన్ను నన్ను పోల్చుటెట్లు? నీవెక్కడ నేనెక్కడ?

ప్రభూ! నీవు అనేకవిధములైన ఐశ్వర్యములు, సంపదలు కలవాడవు. నీవు లక్ష్మీరమణుడవు. నావల్లనేమిగంటివి? (నావల్ల నీకేమి ప్రయోజనము?) అయినా నాపై కరుణతోనా అంతర్యామివై నన్ను వదలక వుంటావు. నీవు శ్రీవేంకటాద్రిపతివి. మరి నేనో? నేను ఒక దీనుడను. నీవే నాపై దయతలచి ద్రిష్టించి (చూచి) కాచితివి (రక్షించితివి).

**పద్యవివరణ:**

ఆ.వె॥ **ఎట్టు గూడెమనకు ఏలితివీవెట్లు?**
**కరుణ కొరకె మొక్కి చేరినాను**
**శ్రీనిధివినువైతె శ్రీవేంకటాద్రీశ!**
**నన్ను దీనుడంచు యెన్నవలదె?**

సంఖ్య: III/168 రాగం : లలిత
కీర్తన : ఎట్టున్నదో నీచిత్తమెదురాడ నే వెఱతు

**లలిత**

**50** ఎట్టున్నదో నీచిత్త మెదురాడ నే వెఱతు
గట్టిగా హరి నీమాయ కడవఁగరాదు. ॥పల్లవి॥

నిచ్చ పతితులఁజూచి నేను సంసారినై యుందు
అచ్చపుసన్యాసులఁ జూ చటువలె నయ్యేనందు
హెచ్చి మోచివచ్చితేను యెక్కడిగొడవ యందు
ఇచ్చట నిశ్చలబుద్ధి యెందూ నేఁ గానను. ॥ఎట్టు॥

కర్ములఁ జూచొకవేళ కర్మము నేఁ జేయఁబోదు
మర్మపుజ్ఞానులఁ జూచి మంచిదందును
అర్మిలి రెండూఁ జూచి అంతలో సందేహింతు
నిర్మలమయినబుద్ధి నేనెందుఁ గానను. ॥ఎట్టు॥

వారణాసి వోఁజూచి వారివెంటఁ దగులుదు
తేరి కొంతదవ్వు వోయి తిరుగుదును
నేరిచి శ్రీవేంకటేశ నీవే నన్నుఁ గాచితివి
యీరీతిఁ దేరినబుద్ధి యెందూ నేఁ గానను. ॥ఎట్టు॥ **168**

**ఉపోద్ఘాతము:**

మన యజమానికి ఏదన్నా చెప్పుకోవాలంటే ఆయన మనస్సు యెట్లావున్నది? సంతోషంగా వున్నాడా? కోపంగా వున్నాడా అని ఆయన భృత్యులు తెగమధనపడిపోతుంటారు. అదే అంటున్నారు అన్నమయ్య. ఓ శ్రీహరి నీమాయను నెగ్గటం మావల్ల అయ్యే పనికాదు. నిత్యమూ నా చుట్టూవున్న పతితులను చూసి భ్రమపడి నేనూ సంసారినైయుందును. అదే స్వచ్ఛమైన సన్యాసులవెంట తిరిగితే ఇట్లా అయ్యేదా? వీరందరి బాధ్యతనాపై వదలివేశారు. ఇదెక్కడి గొడవ వీరెవరికైనా నిశ్చలబుద్ధి వుందని నేను అనుకోను. కాశీ వెళ్ళేదనని తలచి కొంతదూరం వెళ్ళి తిరిగి వచ్చేశాను. ఓ





శ్రీవేంకటేశ్వరా! పోనీలే వీడు అర్భకుడు అని నువ్వే నన్ను గాచినావు అంతేగాని తేరినబుద్ధి నాకు అబ్బనేలేదు.

**తాత్పర్య వివరణ:**

ఓ దేవా! నీ చిత్తము (అభీష్టము) యెట్లావున్నదో తెలియదు. నీకు యెదురాడ (ఎదురు చెప్పుటకు) నేను వెఱతును (భయపడుతున్నాను). శ్రీహరీ! నీమాయను గట్టిగా (ధైర్యంగా) కడవరాదు (దాటనసాధ్యము).

ప్రభూ! నా చుట్టూవున్న నిత్యపతితులను చూచి ఇదే బాగుందనే భ్రమతో నేనూ సంసారినయ్యాను. మరి స్వచ్ఛమైన సన్యాసులను చూచి వారివలెనుంటే బాగుండేది కదా! వీరంతా బాధ్యత వదలి తిరుగుతున్నారా? ఇదెక్కడి గొడవ ప్రభూ! ఇచ్చట యెవ్వరికీ నిశ్చలమైనబుద్ధి లేదు. యెందునూ కానరాదు. మరి వీరు ఇక నీమాయనెట్లు తరింతురు?

ఒక్కొక్కసారి కర్ముల (కర్మయందు ప్రీతివున్నవారి) చూచి నేనుకూడా కర్మలనాచరించెదనని నిశ్చయించుకొంటాను. కాని జ్ఞానులను చూడంగానే జ్ఞానమార్గమే కర్మమార్గముకంటే, మంచిదనుకొంటాను. రెండిటిని పోల్చి తర్కించుకొని అంతలోనే సందేహం పొందుతాను. ఇన్నీ చేస్తాను కానీ నిర్మలమైన బుద్ధిని నేనెందునూ కనుగొనను.

ఒక్కొక్కసారి కాశీనగరంవెళ్ళి జన్మరాహిత్యం పొందుదామని నేనూ బాటసారినై కాశి పయనమవుతాను. కొంత దూరం పోగానే మనస్సు మార్చుకొని తిరిగి ఇల్లుదారిబడతాను. నా ఈ అనిశ్చలబుద్ధి చూచి ఓ శ్రీవేంకటేశ్వరా! నీవే నన్ను కాపాడినావు. ఈరీతి తేరిన (పక్వమైన) బుద్ధిని నేను యెందునూ కానను.

**పద్యవివరణ:**

కం॥ **నీచిత్తం బెట్టున్నదో**
**నేచెప్పగనెదురుమాట నే వెఱతునయా!**
**ఏ చొప్పున నీమాయను**
**పేచీలేకనె తరింతు వేంకటనాథా**

సంఖ్య: III/186 రాగం : రామక్రియ
కీర్తన : ఎదిరించి పోట్లాడనెవ్వరితరము

## రామక్రియ

51 ఎదిరించి పోట్లాడ నెవ్వరితరము లిఁక
త్రిదశవంద్యుఁడు హరిఁ దేరిచూడఁగలరా. ॥పల్లవి॥

ఘూత మీస మదరితే గగ్గులకాడవుదురు
యీతఁడు దలచూపితే నెదిరించ రరులు
ఆతురాన గొరిశరాయడికి నోపఁగ లేరు
చేతిగోరు మీటితేనే ఛిన్న భిన్న మవుదురు. ॥ఎది॥

పైపై నితఁ డడుగిడ పాతాళానఁ గుంగుదురు
కోపించినంత నెత్తురుగుండాలపాలౌదురు
తూపు చేత నంటితేనే తుత్తుమురై పారుదురు
రాపునీలికాశ గంటే రణభీతి గొందురు. ॥ఎది॥

మంతన మీతఁ డాడితే మానముగోలుపోదురు
కొంత గుఱ్ఱ మెక్కితేనే గుంటఁగూలిపోదురు
యింతటా శ్రీవేంకటేశుఁ డెక్కడఁ జూచినఁ దానే
వింతప్రతాపముతోడ విఱ్ఱవీఁగీ నిదివో. ॥ఎది॥ 186

**ఉపోద్ఘాతము:**

ఇది దశావతార వివరణ కీర్తన. నాకు ఈ కీర్తనలు అంటే యెంతో ఇష్టం. అన్నమయ్య చమత్కారం ఇటువంటి కీర్తనలలో





సుస్పష్టమవుతుంటుంది. “పైపైనితడడుగిడ పాతాళమునగుంగుదురు” – అంటే యేమిటి? పైనున్న దివ్యలోకాలను ఒక పాదముతోటి పై కనుపించే భూమినంతా, ఇంకొక పాదముతోను ఆక్రమించి, బలితలపై తన అడుగుపెట్టి పాతాళమునకు తొక్కితే కుంగుదురు. అంటే త్రివిక్రమావతారాన్ని ప్రశంశిస్తున్నారన్నమాట. ఎంత నిగూఢంగా వున్నదో చూశారా? ఇలా దశావతారాలనూ నిగూఢంగానే అందించారు. అందుకే విస్తృతమైన వివరణ ఇద్దామని సంకల్పం కలిగింది. ఎంత వివరిస్తే అంత వుంది. త్రిదశవంద్యుడు అంటే యేమిటి? బాల్యము, కౌమారము, వృద్ధాప్యము అని మూడు దశలు నరుని జీవితంలో ముఖ్యమైనవి. స్త్రీతో సంసారం చేయడం బాల్య వృద్ధాప్యాలలో నిషిద్ధం. ఆట పాటలతో కాలం గడపటం బాల్యంలో మాత్రమే చేయాలి. ఏజోక్యం లేకుండా నిశ్చింతగా దైవధ్యానం వృద్ధాప్యంలో ఉత్తమం. కానీ ఈ త్రిదశలలోనూ చేయదగిన పని శ్రీహరి శరణాగతి. అందుకనే ఆ శ్రీహరి త్రిదశవంద్యుడు అంటున్నారు. మరి ఇక జాగ్రత్తగా చదవండి.

**తాత్పర్య వివరణ:**

నేను ఎదిరించి యెవ్వరితో పోట్లాడను? ఈ దేవదేవునితో యెదిరించి నిలవటం యెవ్వరితరమవుతుంది? ఈ శ్రీహరి త్రిదశవంద్యుడు (బాల్యం, కౌమారం, వృద్ధాప్యం అనే మూడు దశల్లోనూ పూజనీయుడు.) ఈయనను తేరిపార చూడగల సామర్థ్యం యెవరికుంటుంది?

**“ఘూతమీసమదిరితే గగ్గులకాడవు దురు”–**

దెబ్బతీయగల మీసము చలించితే శత్రువులందరూ గగ్గులుకాడ (ధాన్యములేని కంకులవలె నిరుపయోగమైపోవుదురు.

**“ఈతడు దలచూపితే నెదిరించ రరులు” – మత్స్యావతారం**

దాచుకొనియున్న తన తలను ఇతడు వెలికిబెట్టి చూపితే అరులు (శత్రువులు) యెదిరించరు. కూర్మావతారము వర్ణించబడింది.

**"ఆతురాన గొరిశరాయుడికి నోపగలేరు" -**

గొరిశరాయుడు గోతులు తవ్వే మొనగాడిని, ఆతురాన (వేగమున) ఓపగలేరు (సహించలేరు). వరాహావతారము వర్ణించబడినది.

**"చేతిగోరు మీటితేను ఛిన్నభిన్నమవుదురు" -**

ఈయన తన చేతిగోరు మీటినాడంటే రాక్షస మూకలు ఛిన్నాభిన్నము (ముక్కలు ముక్కలు) అయిపోతారు. నృసింహావతారము

**"పైపై నితడడుగిడిన పాతాళాన గుంగుదురు".**

ఒక పాదము ఆకాశముపై ఒక పాదము భూమిపై ఇతడు అడుగుపెట్టి ఏమాత్రము సందులేక వ్యాపించి మూడవ పాదం ఎక్కడుంచనని అడిగాడు వామనుడు బలి చక్రవర్తిని. ఆయన అభ్యర్థన మన్నించి మూడవ పాదం బలిశిరస్సుపైనుంచి పాతాళాన గుంగునట్లు తొక్కేశాడు. తరువాత అతనిని రసాతలమునకు అధిపతిని చేశాడు. త్రివిక్రమావతారం వర్ణించారు.

**"కోపించినంత నెత్తురు గుండాలపాలౌదురు"-**

ఈయన ఆగ్రహిస్తే శత్రువులైన రాజుల మూకలు నెత్తురు మడుగుల పాలై మరణించెదరు. పరశురామావతార వర్ణన.

**"తూపుచేత నంటితే తుత్తుమురులై పారుదురు"-**

ఈయన తూపు (బాణముకొన) చేత అంటితేనే (తగులునట్లు వేస్తే) శత్రువులు తుత్తుములై పొడిపొడి అయిపోదురు. శ్రీరామావతారము.

**"రాపు నీలికాశగంటే రణభీతి గొందురు"-**

రాపిడి కలిగించు నీలి వస్త్రమును చూడగానే యుద్ధభయంతో యెప్పుడు పారిపోదామా అని చూస్తారు. బలరామావతారము వర్ణన.





**"మంతన మీతడాడితే మానముగోలుపోదురు" -**

ఈతడు మంత్రాంగము చేస్తే త్రిపురాసురుల భార్యలు మానము గోల్పోవుదురు. బుద్ధావతారము.

**"కొంత గుఱ్ఱమెక్కితేనే గుంట గూలిపోదురు". -**

ఈయన కొంత (తీక్షణమైన) గుఱ్ఱమునెక్కితే దుర్మార్గులు గుంటలలో కూలిపోతారు. కల్కి అవతారము వర్ణన.

ఇప్పుడు శ్రీవేంకటేశ్వరుడు ఎక్కడ చూచినా తానేయై వింత గొలుపుప్రతాపముతో విఱ్ఱవీగుచున్నాడు (విజృంభించుచున్నాడు).

**పద్యవివరణ:**

చం॥ **ఎదురుగు నిల్చి పోరుటకు**

**ఎవ్వరిచేతగు ముజ్జగంబులన్**

**త్రిదశల వంద్యుడీ హరియె తేరి**

**పరాత్పరుచూడ శక్యమే?**

**ఇదిదశరూపముల్ గొనిన**

**ఈ తిరువేంకటరాయవర్ణనే**

**అదనుగ అన్నమార్యుడిది**

**అద్భుత శైలిని జెప్పె ధన్యుడన్.**

సంఖ్య: IV/434     రాగం : శోకవరాళి
కీర్తన : నడవరో జడియక నవ్య మార్గమిదె

### శోకవరాళి

52 **నడవరో జడియక నవ్యమార్గమిది**
**మదుఁగిది వైష్ణవమార్గ మిది** ॥పల్లవి॥

**ఘనశుకముఖ్యులు గన్న మార్గ మిది**
**జనకాదుల నిశ్చలమార్గ మిది**
**సనత్కుమారుఁడుజరపుమార్గ మిది**
**మనువుల వైష్ణవమార్గ మిది** ॥నడవ॥

**నలుగడవసిష్ఠు నడుచు మార్గమిది**
**యిల వేదవ్యాసులమార్గం బిది**
**బలిమిగలుగుధ్రువపట్టపు మార్గము**
**మలసినవైష్ణవమార్గ మిది** ॥నడవ॥

**పరమమార్గం బిదె ప్రపంచమార్గము**
**గురుమార్గం బిదె గోప్య మిదే**
**గరిమెల శ్రీవేంకటపతి మాకును**
**మరిపెను వైష్ణవమార్గ మిదే** ॥నడవ॥ **434**

**ఉపోద్ఘాతము:**

ఓ జనులారా! మీరు వైష్ణవమార్గాన్ని యెన్నుకొన్నారు. దీని ప్రధాన లక్షణమే “మదుగు” (వినమ్రత). ఇది నవ్య మార్గము (నూతన మార్గము). అయినా భయంలేదు. మీరు జడియక (భయపడక) ఆ మార్గంలో నడవండి అంటున్నారు అన్నమాచార్యులవారు. విశిష్టాద్వైత మతాన్ని చేపట్టిన అన్నమయ్య ఆ మతాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు. ఇది





ప్రపంచ మార్గము కూడా. భగవంతుని అనుగ్రహం పొందటానికి సన్యసించనక్కరలేదు. సంసారములో వుంటూనే నిస్సంగుడై మోక్షం సంపాదించవచ్చును. ఇది భక్తి మార్గం. శ్రీవేంకటేశ్వరుని కృప వుంటే ఏదైనా సాధించవచ్చును అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ జనులారా! ఇది ఈ (వైష్ణవము) నవ్యమార్గము (నూతన మార్గము) మీరు జడియక (భయపడక) దీనిలో నడవరో. ఇది మదుగు (వినమ్రత)కు ప్రాధాన్యమిస్తుంది. ఇది వైష్ణవమార్గము.

ఈ మార్గమునే ఘనులైన శుక మహర్షి కూడా దర్శించారు. ఇది జనకరాజర్షి యెన్నుకొన్న నిశ్చలమైనమార్గము. సనత్కుమారుడు (సనక సనందాదుల తోటి ఋషి) జరిపినమార్గము. మనువులందరూ ఎన్నుకొన్నది ఈ వైష్ణవమార్గమునే. ఇది అంత పురాతనమైనదేకాక నిత్య నూతనమైనది కూడా. అందుకనే వైష్ణవము అతి విశిష్టమైన భగవత్సేవ.

ఈ వైష్ణవమార్గము బాహాటంగా వసిష్ఠుడు నడిచి చూపిన మార్గము. వేదవ్యాసుడు కూడా ఈ ఇలలో యెంచుకొని పయనించిన మార్గము ఇదే. ధ్రువునికి ధ్రువపట్టము (ధ్రువనక్షత్రం అయ్యే అదృష్టం) కల్పించినదీ మార్గమే. ఇది మలసి (విజృంభించిన) విష్ణుమార్గము.

ఈ వైష్ణవము మనము నిత్యమూ నివసించే ప్రపంచములోని అతి శ్రేష్టమైన మార్గము. ఇది అతి గోప్యమని మా గురుదేవులు బోధించిన మార్గము. గరిమెల (మహిమాన్వితుడైన) శ్రీవేంకటేశ్వరుడు మమ్మ్మ నిలిపినది ఈ వైష్ణవ మార్గములోనే. ఇందులోనే ఆయన మమ్మ్మ అలవాటుచేశాడు.

**పద్యవివరణ:**

కం॥ **జడియక నడువరొ మీరలు**
**పుడమిని నవ్యంబిదైన పుణ్యుల బాటే**
**మదుగిది వైష్ణవమార్గము**
**విడువక విఖ్యాతులెంచు విష్ణుని మార్గం.**

సంఖ్య: IV/486 రాగం : లలిత
కీర్తన : బిరుదు బంటితడు పెద్ద హనుమంతుడు

**లలిత**

**53 బిరుదు బంటితఁడు పెద్ద హనుమంతుఁడు**
**సిరులతో రామునికి సీతాదేవికిని ॥పల్లవి॥**

**మూఁడులోకములుఁ దుదముట్టఁ బెరిగినవాఁడు**
**వాఁడె హనుమంతదేవరఁ జూడరో**
**పోఁడిమి దైత్యులగెల్చి పూఁచి చేయెత్తుకున్నాఁడు**
**వాఁడి ప్రతాపముతోడ వాయుజుఁడు ॥బిరుదు॥**

**ధ్రువమండలము మోవఁ దోఁక యెత్తుకున్నవాఁడు**
**సవరనై పెనుజంగ చాఁచుకున్నాఁడు**
**భువిఁ గవచకుండలంబులతోఁబుట్టినవాఁడు**
**వివరించ నేకాంగ వీరుఁడైనవాఁడు ॥బిరుదు॥**

**పెనచి పండ్లగొల పిడికిలించుకున్నాఁడు**
**ఘనుఁ డిన్నిటా స్వామికార్యపరుఁడు**
**వినయపు శ్రీవేంకటవిభునికి హితవరి**
**యెనసి మొక్కఁగదరో యెదుట నున్నాఁడు ॥బిరుదు॥ 486**

**ఉపోద్ఘాతము:**

'బిరుదుబంటు' అంటే ధీరుడైన బంటు అని అర్థం. అతి పెద్దగా కనుపించుచున్న ఈ హనుమంతుడు రామునికి సీతాదేవికి తిరిగి సిరులు సమకూర్చిన మహానుభావుడు అంటున్నారు అన్నమయ్య. మూడు లోకములు తుదముట్ట అంటే, ముల్లోకాల అంతుదాటి పెరిగిపోయాడు చూడండయ్యా అంటున్నారు. ధ్రువమండలాన్ని కూడామోస్తాడా అన్నట్లు



హరి నీమయమే అంతాను

పెరిగిపోయాడు. సూదిదేలిన పండ్లుగల ముళ్ళ గదను ధరించి దానవులను చీల్చి చెండాడాడు. గొప్ప స్వామి కార్యదీక్షాదక్షుడు. ఇవన్నీ అటుంచి ఎప్పటికీ ఇతడు శ్రీవేంకటేశ్వరునికి హితవరి బంటే.

**తాత్పర్య వివరణ:**

ఓ భక్తులారా! మనయెదుటనున్న ఈ పెద్దహనుమంతుడు, బిరుదు బంటు (ధీరుడైనబంటు). శ్రీరామచంద్రునికి, సీతాదేవికి తిరిగి (మరల) సిరులు సమకూర్చిన నమ్మిన బంటు.

మూడులోకములు తుదముట్ట (అంతుదాటి) పెరిగిపోయినాడు చూడండయ్యా! వాడే హనుమంతదేవర. దైత్యుల (రాక్షసుల) గెల్చి పూచిన (అలరిన) తన చేతిని ఎత్తుకొని నిలుచునియున్నాడు. ఈ వాయునందనుడు, వాడి (తీక్షణమైన) ప్రతాపముకలవాడు.

ఈ మారుతి ఒకసారి ధ్రువమండలాన్ని తనతోకతోనేమోసెదనని తోక యెత్తుకొని నిలుచున్నాడు. సవరనై ఈపని సాధించుటకు తన పెద్ద పంగను చాచుకొని నిలుచున్నాడు. భూమిపై కవచకుండలములతో జన్మించిన ఇతడు వివరించవలెనంటేఏకాంగవీరుడు ఈ హనుమంతుడే. మరి ఈయన అసహాయ శూరుడు కదా!

పెనచి (బిగించిపట్టుకొని) పండ్లగోల అనే ముళ్ళగదను పిడికిలించుకొన్నాడు (పిడికిలితో పట్టుకొన్నాడు). ఈ ఘనుడు, ఇన్నిటా స్వామికార్య నిర్వాహకుడు. వినయవంతుడైన ఈ హనుమంతుడు శ్రీవేంకటపతికి హితవరి (హితమును) కలిగించువాడు. మన యెదుటనే వున్న ఈ హనుమంతునికి మొక్కగదరో.

**పద్యవివరణ:**

ఆ.వె॥ **బిరుదు బంటు యితడు పెద్ద హన్మంతుడు**
**సిరులరామతోటి సీతగలిపె**
**ఇతడు వేంకటపతి హితవరి బంటాయె**
**యెనసి మొక్కగదరొ యెదుట నుండి.**

సంఖ్య: IV/502 రాగం : పాడి
కీర్తన : ఎంతప్రతాపమువాడు యెంతటినేరుపరి

**పాడి**

**54 ఎంతప్రతాపమువాఁడు యెంతటినేరుపరి**
**యెంతని పొగడవచ్చు నీరాముని ॥పల్లవి॥**

**వాలినొక్క కోలనేసి వారిధి గట్టినవాఁడు**
**తాలిమితో సుగ్రీవుని లాలించినాఁడు**
**పాలించి విభీషణునిఁ బట్టముగట్టినవాఁడు**
**యేలుమని లంకకెల్లా నీరాముఁడు ॥ఎంత॥**

**కుచ్చి పర (?) మొండెముగా కుంభకర్ణుఁ గొట్టినాఁడు**
**హెచ్చి రాకాసులఁ జంపె నీరాముఁడు**
**తచ్చి రావణాసురునితలలు చెండాడినాఁడు**
**ఇచ్చకొలఁదుల నిట్టె యీ రాముఁడు ॥ఎంత॥**

**సీతతో విమానమెక్కి చేరి యయోధ్యకు వచ్చి**
**యీతలఁబట్టమేలినాఁ డీరాముఁడు**
**శ్రీతరుణితోఁగూడి శ్రీవేంకటేశుఁడైనాడు**
**యీతఁడే దరిసించరో యీరాముఁడు ॥ఎంత॥ 502**

**ఉపోద్ఘాతము:**

శ్రీరామచంద్రునిపై అన్నమయ్య చెప్పిన చక్కటి కీర్తననాస్వాదించండి. ఈ శ్రీరాముడు ఎంత ప్రతాపశాలి, ఎంత నేర్పరి? ఈయనను ఎంతని పొగడుదును అని రామకథను మరొక్కసారి పునశ్చరణ చేస్తున్నారు. సీతాసమేతుడైన ఆ రామచంద్రుడే నేడు శ్రీతరుణితో గూడిన శ్రీవేంకటేశ్వరుడైనాడు ఈయనను దర్శించండయ్యా! అంటున్నారు. కుచ్చి అనే వికృత శబ్దానికి కూర్చి అనేది ప్రకృతి. అయివుండవచ్చును.





కుంభకర్ణుని మొండెము కూర్చినది పడిపోయిందని నా భావన. ఇది కాక మరొక భావన అన్నమయ్యది అయివుండవచ్చును.

**తాత్పర్య వివరణ:**

ఈ శ్రీరాముని ఎంతని పొగడవచ్చును. ఇతగాడు యెంత ప్రతాపశాలి!! యెంత నేర్పరి!!

ఈ రాముడు, వాలిని ఒక కోలనేసి (ఒకే ఒక బాణంతో) మట్టుబెట్టినాడు. సముద్రంపై లంక జేరుటకు వారధి (వంతెన) కట్టినాడు. తాలిమితో (ఓర్పుతో) సుగ్రీవుని ఊరడించినాడు. విభీషణుడు తననాశ్రయించి శరణంటే పాలించి (రక్షించి) లంకానగరమునకు పట్టాభిషిక్తునిగా అనుగ్రహించినాడు. ఇంత ప్రతాపముగలవాడు కనుకనే అట్టి ఘనకార్యములను చేయగలిగినాడు.

కుంభకర్ణుని మొండెము కుచ్చిపర (కూర్చినది) పడిపోవునట్లు కొట్టినాడు (బాణముతో) తెంచివేసినాడు. అతిశయించి లంకలోని రాక్షసమూకలను చంపివేసినాడు. ఈ శ్రీరాముడు తచ్చి (పరిహాసముగా) రావణాసురుని పదితలలను ఇట్టె ఇచ్చకొలదుల చెండాడినాడు (ఇష్టము వచ్చినట్టు చీల్చి చెండాడినాడు). ఈ శ్రీరాముడు రణరంగ ధీరుడు.

ఆ తరువాత శ్రీరాముడు పుష్పక విమానమెక్కి అయోధ్యను చేరినాడు. ఈతల (ఈ అయోధ్యలో) పట్టాభిషిక్తుడై రాజ్యాన్ని పరిపాలించినాడు. నేడు తిరుమలలో ఆ మహానుభావుడే శ్రీవేంకటేశ్వరుడై శ్రీదేవితో గూడి ఈతడే వెలసినాడు. ఈయనే శ్రీరాముడు కూడా. ఈయనను దర్శించి తరించండి.

**పద్యవివరణ:**

తే.గీ॥ **ఎంత వీరప్రతాపుడు ఎంతమేటి!!**
**ఎంతపొగడను రాముని ఇతడు దాత**
**రామకథ జెప్పి తిరుమలరాయడైన**
**ఆతడేయని మెచ్చెను అన్నమయ్య.**

సంఖ్య: IV/447 రాగం : లలిత
కీర్తన : నిఖిల మింతయుమేలు నేనే తీలు

**లలిత**

**55 నిఖిలమింతయు మేలు నేనే తీలు**
**మఖరక్షకుఁడ నన్నుమన్నించవే** ||పల్లవి||

**నిండును జలనిధులైనా నెతి నేటిమొత్తములచే**
**నిండదు నామనసైతే నిచ్చా యాసల**
**పండును లోకములోని బహువృక్షతతులైనాఁ**
**బండదు నామనసైతే బహువిషయముల** ||నిఖిల||

**తనియుఁ బసురమైన ధరణిఁ గసవు మేసి**
**తనియదు నామనసు ధనకాంక్షల**
**వొనరఁ గారుచిచ్చైనా నొకవేళ శాంతిఁబొందు**
**పొనిగియేపొద్దు శాంతిఁబొందదు నామనసు** ||నిఖిల||

**లోకములోఁ గఠినపులోహమైనాఁ గరఁగును**
**కైకొని నామతి గరఁగదు భ్రమసి**
**యీకడ శ్రీవేంకటేశ యేలితివి నన్ను**
**నీకే శరణంటి నెమ్మదిఁ గావఁగదే** ||నిఖిల|| **447**

**ఉపోద్ఘాతము:**

"తీలు" అంటే అనర్థదాయకుడు అని అర్థం. "మఖరక్షుడు" విశ్వామిత్రుని యాగమును సంరక్షించినవాడా అని అర్థం. నిఖిలము అంటే సర్వమూ అని అర్థం. ఓ విశ్వామిత్ర యాగ సంరక్షకా! ఈ సృష్టిలో సర్వమూ ఉత్కృష్టమైనదే.నీ సృష్టిలో నేనొక్కడనే అనర్ధదాయకుడను.





దేవదేవా! నన్ను మన్నించవే అంటున్నారు, అన్నమయ్య. పైకి తేలికగా కనుపించినా బహు క్లిష్టమైన కీర్తన ఇది. జాగ్రత్తగా చదవండి.

**తాత్పర్య వివరణ:**

ఓ శ్రీహరీ!నిఖిలమింతయు ఈ సృష్టిలోని సర్వమూ మేలైనదే.ఇది నీ ఉత్పత్తి కదా! నేనే తీలు (నేను అనర్ధదాయకుడను). నేను ఎన్నో చేయరానిపనులు చేశాను. ఓ మఖరక్షకా! (విశ్వామిత్రుని యాగసంరక్షకా!) నన్నుమన్నించుము ప్రభూ!

బాగుగా ప్రయత్నిస్తే ప్రపంచములోని జలనిధుల (సముద్రములన్నీ) నిండింపవచ్చును కానీ, ఇచ్ఛా ఆసల (కోరిక ఆశలతో)తృప్తిచెందని నా మనస్సు యెన్నటికీ నిండదు. లోకములోనున్న అనేకములైన వృక్షముల మీదనున్న పండ్లన్నీ పండవచ్చును గాక! అనేక విషయములలో ఆసక్తిగొన్న నా మనస్సు మాత్రం పండనే పండదు.

ఈ ప్రపంచంలో పసరమైనా (పశువు కూడ) కసవుమేసి (గడ్డితిని) తనియ (తృప్తి చెందుతుంది). కానీ ధన కాంక్షతో సతమతమయ్యే నా మనస్సు మాత్రం తనియదు (తృప్తి చెందుటలేదు). ఒనర (అతిశయించిన) కారుచిచ్చు (దావానలము)కూడా శాంతి పొందవచ్చును. కానీ నా మనస్సునిస్తేజమై యెన్నటికీ శాంతిని పొందదు.

లోకములో కఠినాతికఠినమైన లోహమునైనా కరిగించవచ్చును. కానీ ఎంత ప్రయత్నించినా భ్రమసిన (భ్రమలలోవున్న)నా మనస్సుమాత్రం కైకొని (ఎంత ప్రయత్నించినా) కరుగుట లేదు.ఇట్టివేళ ఓ శ్రీవేంకటేశ్వరా! నాపై దయదలచి నన్ను స్వీకరించితివి. ఇక నీకే శరణు అన్నానయ్యా! నెమ్మదిగా నన్ను కూడా కావగదే (అనుగ్రహింపుము) ప్రభూ!

**పద్యవివరణ:**

కం|| **నిఖిలంబింతయు మేలగు**
**మఖరక్షక! నేనెతీలు మన్నించగదే!**
**సుఖముగ నీ శరణార్థుల**
**సఖుడై కాపాడుమయ్య సనక మునినుతా!**

సంఖ్య: IV/455 రాగం : వరాళి
కీర్తన : ఎరిగీ నెరగదు యేమి సేతు మతి

**వరాళి**

**56 ఎరిఁగీ నెరఁగదు యేమి సేతు మతి**
**హరిదాస్యం బదియే సుఖము** ||పల్లవి||

**వెతలఁబొరలేఘనవిభవముకంటే**
**అతిపేదరిక మది సుఖము**
**గతి నెరవుల సింగారముకంటెను**
**సతమగుతననిచ్చలమే సుఖము** ||ఎరిగీ||

**పలుబాములఁబడు పగలిటికంటే**
**తెలిసి నిద్రించు రాతిరి సుఖము**
**అలమట గడించు నమృతముకంటే**
**కలపాటి తనకు గంజే సుఖము** ||ఎరిగీ||

**పరపీడలొసఁగు భవమునకంటే**
**ధరఁ బొడమనిచందము సుఖము**
**గరిమల శ్రీవేంకటపతి నీకే**
**శరణని యెడి నాజన్మమే సుఖము** ||ఎరిగీ|| **455**

**ఉపోద్ఘాతము:**

నేనేమి చేయగలవాడను. నామతి ఈ సత్యము నెరుగదాయె? అలాగని అసలెరుగనిదా అంటే దానికి పూర్వసంస్కారము వలన కొంత తెలుసును హరిదాస్యంకంటే సుఖకరమైనది లేదు. ఘనవైభవములనుభవించేవాడు ఒకనాటికి వెతలను బొందక తప్పదు. మరి అటువంటప్పుడు హరిదాస్యములో పేదరికం అనుభవించినా సుఖమే కదా! అంటున్నారు





అన్నమయ్య. పగద్వేషంవల్ల బాములు (జన్మలు) తప్పవు మరి అటువంటి ద్వేషంతో గడిపే పగలు కంటే ఈ సత్యం తెలిసి నిద్రించే రాతిరే సుఖము. ఇవన్నీ యెందుకు శ్రీవేంకటేశ్వరుని శరణనియెడి నా జన్మయే ధన్యము అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఏమిసేతు? (నేనేమి చేయుదును). నా మతి (మనస్సు) యెరిగీ యెరుగదు (ఒకప్పుడు తెలుసుకొంటుంది, ఒకప్పుడు తెలుసుకోదు) హరి దాస్యముకంటే సుఖవంతమైనది లేదు.

ఘనవైభవములను అనుభవించేవాడు ఒకనాటికి వెతలు బొందక తప్పదు. అటువంటి వైభవాలకంటే హరిభక్తుడై అతి పేదరికం అనుభవిస్తే అది సుఖమే కదా! గతి తప్పిన శృంగారముకంటే సతమగు (శాశ్వతమైన) తన మానసిక నిశ్చలత్వమే సుఖము. ఆ నిశ్చలత్వము ఇచ్చే సుఖము నిలకడ కలిగినది.

అనేక బాముల బడు (జన్మలను పొందు) పగలు ద్వేషాలకంటే, నిద్రలో ఏద్వేషమూ వుండదనే యెఱుకగల రాతిరియే సుఖము. అలమట (చింతలో) గడించే అమృతముకంటే తనకు దొరికినంతలో గంజియైనా అమృతమువలె సుఖవంతమైనదే.

పరులను పీడించే భవమునకంటే (జన్మకంటే) ధరలో (పుడమిలో) పుట్టక యుండుటయే సుఖము. గరిమల (మహిమాన్వితుడవైన) ఓ శ్రీవేంకటేశ్వరా! నేను నీకే శరణుజొచ్చాను. నిన్ను శరణు పొందిన నా జన్మమే సుఖము.

**పద్యవివరణ:**

ఆ.వె|| **ఏమిసేతుమనసు యెరిగియు నెరుగదు**
**హరికి దాసుడగుటె అమిత సుఖము**
**వేంకటపతి నీకు ఇంక శరణమంటి**
**నాదు జన్మ సుఖము నన్ను వినుము.**

సంఖ్య: IV/487 రాగం : దేవగాంధారి
కీర్తన : నమ్మితిజుమ్మీ వోమనసా నాకే హితవయి మెలంగుమీ

## దేవగాంధారి

**57** **నమ్మితిఁజుమ్మీ వోమనసా నాకే హితవయి మెలంగుమీ**
**ముమ్మాటికి నేఁ జెప్పితిఁజుమ్మీ మురహరునామమే జపించుమీ ॥ పల్లవి॥**

**తలఁచకుమీ యితరధర్మములు తత్వజ్ఞానము మఱవకుమీ**
**కలఁగకుమీ యేపనికైనను కడుశాంతబుననుండుమీ**
**వలవకుమీ వనితలకెప్పుడు వైరాగ్యంబున నుండుమీ**
**కొలువకుమీ యితరదైవముల గోవిందునినే భజించుమీ ॥నమ్మి॥**

**కోరకుమీ దేహభోగములు గొనకొని తపమే చేకొనుమీ**
**మీరకుమీ గురువులయానతి మెఱయఁ బురాణములే వినుమీ**
**చేరకుమీ దుర్జనసంగతి జితేంద్రియుఁడవై నిలువుమీ**
**దూరకుమీ కర్మఫలంబును ధ్రువవరదునినే నుతించుమీ ॥నమ్మి॥**

**వెఱవకుమీ పుట్టుగులకు మరి వివేకించి ధీరుఁడవగుమీ**
**మఱవకుమీ యలమేల్మంగకుమగఁడగు శ్రీవేంకటపతిని**
**కెఱలకుమీ మాయారతులను కేవలసాత్వికుఁడవుగమ్మీ**
**తొఱలకుమీ నేరములను సింధురక్షకునినే సేవించుమీ ॥నమ్మి॥ 487**

**ఉపోద్ఘాతము:**

మన పెద్దవాళ్ళు యేదన్నా హితబోధనుకానీ మంచిమాటను కాని ముచ్చటగా మూడుసార్లు చెప్పమన్నారు. అప్పటికీ అవతలవాడ మనమాట వినకపోతే దాన్ని అక్కడితో వదలివేసేవారు. మురహరియైన, శ్రీహరి నామము జపించమని ముమ్మాటికి నేజెప్పాను ఓ మనసా! నిన్ను నమ్మాను సుమా! నన్ను మోసం చేయక హితవుగా ప్రవర్తించు. తరించు అంటున్నారు అన్నమయ్య. ఈ కీర్తనలో ఆనాటి తెలుగు పదాలకి నేటి తరానికి నిఘంటువు





లేక భావమే తెలియదు. కెఱలకుమీ మాయారతుల, తొఱలకుమీ నేరములను, సింధురక్షకుడు వంటిమాటలకి మనం మూగపోవలసినదే.

**తాత్పర్య వివరణ:**

ఓ మనసా! నిన్ను నేను నమ్మాను సుమా? కాబట్టి నాకు యెప్పుడూ హితము కలిగిస్తూనే వుండుము. నామాట విని సుఖముగా గడుపుము. మురహరుడైన శ్రీహరి నామమును జపించుము. ముమ్మాటికీ నేను జెప్పేది నీ మంచికే.

ఓ మనసా! ఇతర ధర్మములను గురించి ఆలోచించకుము. తత్త్వజ్ఞానమును అలవరచుకొనుము. కలగక (సంకోచించక) యేమిజరిగినా శాంతముగానుండము. శ్రీహరిని దక్క అన్యదేవతలను ఆరాధించకుము. స్త్రీలకోసం వలవక (వెంపర్లాడక) వైరాగ్యము కలిగియుండుము. గోవిందునే భజింపుము.

ఓ మనసా! శారీరక భోగములను కోరకుము. ప్రయత్నించి తపస్సమాధిలో సమయము గడుపుము. గురువులయానతిని దాటవద్దు. అతిశయముగా పురాణ పఠనము పురాణ శ్రవణములతో సమయమును గడుపుము. దుర్మార్గుల సహవాసం చేయవద్దు. ఇంద్రియములను జయించి ఈశ్వర ప్రాప్తికై ప్రయత్నించుము. కర్మఫలం శ్రీహరి నిర్ణయం. నాకు దుష్ఫలితం వచ్చిందని దైవదూషణ చేయక ధ్రువవరదుడైన నారాయణుని ప్రార్థించుము.

ఓ మనసా! జన్మలు తప్పవని భయపడకుము. వివేకముతో ధీరుడవై మెలంగుము. అలమేల్మంగా వల్లభుడైన శ్రీవేంకటేశ్వరుని యెన్నటికీ మఱువవద్దు. మాయలో ముంచు మురిపాలలో కెఱలకుమీ (అతిశయించకుము). సాత్విక భావములతోనుండుము. నేరములను తొఱలకుము చేమార్పిడిగా చేయకుము. సింధు రక్షకుని (గజేంద్రవరదుని) బాగుగా సేవింపుము.

**పద్యవివరణ:**

కం॥ **నమ్మితిజుమ్మీ మనసా**
**సొమ్ముగ నాకిపుడు హితవు జూపమెలగుమీ**
**ముమ్మాటికి నేజెప్పితి –**
**జుమ్మీ మురవైరిపేరు సుఖము జపించన్**

సంఖ్య: III/228 రాగం : దేశాక్షి
కీర్తన : నారాయణ నీదాసుల నడకలివి

## దేశాక్షి

**58 నారాయణ నీదాసుల నడకలివి**
**ధారుణి నిదేపనై తగులఁగవలెను. ||పల్లవి||**

**ఆతుమలో హరిమీఁది ఆందోళనమే వలె**
**చేతికి లోఁగాకుంటేను చింతించవలె**
**ఆతనిఁ జూచేయందుకు నాసలఁ బొరలవలె**
**రీతి నిదెప్పుడు విచారించుకొనవలెను. ||నారా||**

**నీలవర్ణుకథలకు నివ్వెరగు నొందవలె**
**ఆలకించి యందు భ్రమయఁగవలెను**
**తాలిమితో మహిమలు దలపోసుకొనవలె**
**వేళ వేళ ధ్యానించి వెదకఁగవలెను. ||నారా||**

**చేరి శ్రీవేంకటేశు సేవించుకుండఁగవలె**
**గారవాన సదా మఱుగఁగవలెను**
**ఆరసి పెద్దల నన్నీ నడుగుచుండఁగవలె**
**నోరునిండా నేపొద్దూ నుతియించవలెను ||నారా|| 228**

**ఉపోద్ఘాతము:**

ఓ నారాయణుడా! నీదాసుల నడవడి ఎలా వుంటుందంటే, ధారుణిలో ఇదే పనియా అన్నట్లు తగులగ వలెను, అంటున్నారు అన్నమయ్య. ఈ కీర్తనలో శ్రీహరి దాసులు చేయవలసిన పనులేవియో చేయకూడని పనులేవియో వివరిస్తున్నారు. అంతమాత్రాన ఇది తేలికగా అర్థమయ్యే కీర్తన అనుకుంటే పొరబాటే. నీలవర్ణు కథలకు నివ్వెరగు నొందవలెను





అంటే శ్రీహరి కథలను వింటూ పారవశ్యమును పొందాలి అని అర్థం. ఇటువంటి మాటలు కోకొల్లలు ఈ కీర్తనలో.

**తాత్పర్య వివరణ:**

ఓ నారాయణుడా! నీ దాసుల నడకలివి (నడవడి ఈ విధముగా వుంటుంది). ధారుణి (ఈ ప్రపంచంలో) ఇదే పనై తగులగ వలెను. (ఈ శ్రీహరి పాదదాస్యమొక్కటియే పనియా అన్నట్లు ఆ ఒక్కపనిలోనే నిమగ్నమైయుండవలెను.)

ఆత్మలో శ్రీహరిమీద ఆందోళనమే (వ్యాకులతే) ఉండవలెను. ఆ శ్రీహరి నీకు స్వాధీనుడు కాకుంటే దుఃఖించవలెను. ఆతని దర్శనం కాలేదేయని విచారించి దానికై ఆశతో గడుపవలెను. ఒకే పద్ధతిలో జరిగింది పునశ్చరణ చేసికొంటూ ఇక ఆపై ఏమి చేయవలెనా అని విచారించుకొనవలెను.

నీలవర్ణుడైన శ్రీహరి భాగవత కథలను వింటూ నివ్వెఱగు (పారవశ్యము) నొందవలెను. ఆలకించిన మీదట అంతటితో వదిలేయక అందే భ్రమయగవలెను (వాటిని పునశ్చరణ చేసికొంటూ అందే సంచరించవలెను). తాలిమితో (క్షమాగుణంతో) పరులను ఆదరిస్తూ శ్రీహరి మహిమలను తలచుకొంటూ వుండవలెను. వేళవేళా (ప్రతిపూటా) ధ్యానించి శ్రీహరిని వెదకవలెను.

చేరి (తిరుమల చేరుకొని) శ్రీవేంకటేశుని, సేవించుక + ఉండవలెను (సేవిస్తూ ఉండిపోవాలి). సదా (యెల్లప్పుడూ) గారవాన (గౌరవముతో) మఱుగగవలెను (సంతోషముతో నుండవలెను). పెద్దవారిని దర్శించి భగవత్ సంబంధమైన విషయములను అడుగుచుండవలెను. ఏపొద్దూ (వేళనైనా) నోటినిండా శ్రీహరీ అని పలుకుచూ ఆయనను ప్రార్థించవలెను.

**పద్యవివరణ:**

కం|| **నారాయణ నీదాసుల**
**మీరిన నడకలు యివేలె మించినవియవే**
**శ్రీరమణీ పరిపాలక**
**ధారుణితగులంగవలెను తనపని యిదియై.**

సంఖ్య: III/203 రాగం : లలిత
కీర్తన : తెగక పరమునకు దెరువు లేదు

**లలిత**

**59 తెగక పరమునకుఁ దెరువు లేదు**
**పగయెల్లా విడువక భవమూఁ బోదు.** ॥పల్లవి॥

**కన్నులయెదుటనున్న కాంచనముపై మమత**
**వున్నంతదడవు మోక్ష మొనగూడదు**
**అన్నముతోడిరుచులయలమట గలదాఁకా**
**పన్ని నసుజ్ఞానము పదిలము గాదు.** ॥తెగ॥

**పక్కనున్న కాంతలభ్రమగలకాలము**
**మిక్కిలి శ్రీహరిభక్తి మెరయలేదు**
**వెక్కసపుసంసారవిధి నున్నంతదడవు**
**నిక్కి పరమధర్మము నిలుకడ గాదు.** ॥తెగ॥

**చిత్తములోపలిపలు చింతలు మానినదాఁకా**
**సత్తుగా వైరాగ్యము సమకూడదు**
**యిత్తల శ్రీవేంకటేశుఁ డేలినదాసులకైతే**
**హత్తి వైకుంఠపదవి అప్పుడే కలదు.** ॥తెగ॥ **203**

**ఉపోద్ఘాతము:**

తెగకపరమునకున్ తెరువు లేదు అంటున్నారు అన్నమయ్య. పరమును పొందే మార్గమే లేదట, తెగక. ఏది తెగక అంటే ఏది తిగిపోకుండా పరమున దారే లేదు? ఇహముతెగిపోకుండా. ఇహలోకంలోని భోగాలను వదలివేయాలి. భక్తివైరాగ్యాలు అలవరచుకోవాలి. మోక్షాపేక్షలో జీవితాంతం గడపాలి. పగనంతా వదలిపెట్టక భవమూ (పుట్టుకలూ) వదలిపెట్టవు, అంటున్నారు. తరువాత ఏమేమి వదలక ఏమేమి కావో





వివరించారు. అయితే శ్రీవేంకటేశుని దాసులకు మాత్రం వైకుంఠపదవి కూడా ఎప్పుడు కావాలంటే అప్పుడే సిద్ధముగా వుంటుంది, అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ ప్రజలారా! తెగక (ఇహమును త్రెంచివేయక) పరమునకు (దివ్యలోకప్రాప్తికి) తెరువులేదు (మార్గమే లేదు). పగయెల్లా విడువక (ప్రతీకార వాంఛతో కూడిన ద్వేషభావమును విడిచిపెట్టక) భవమూ (మరుజన్మా) పోదు (వదలదు).

మనకన్నులయెదుటనే వున్న కాంచనముపై (బంగారము మీద) మమత (ప్రేమ) వున్నంత వరకు మోక్షము (ముక్తి) ఒనగూడదు అన్నము ప్రాణము నిలుపుకొనుటకు తినవలెను. రుచులు మరుగుటకు కాదు. రుచులయలములు (యావు), వున్నంత వరకు, పన్నిన సుజ్ఞానము (సుస్థిరమైన మంచి జ్ఞానము) పదిలముగాదు (భద్రముగా వుండదు).

స్త్రీల పక్కన గడుపుతున్నంతకాలమూ వారిపై పురుషునికి యెన్నో భ్రమలు కలుగుతూనే వుంటాయి. ఆ సమయంలో శ్రీహరి భక్తిపై ధ్యాస కలుగదు. మిక్కిలి ప్రయత్నించినను భక్తి మెరయదు (వెలగదు). వెక్కసమగు (దుస్సహమైన) సంసార తాపత్రయంలో వున్నంతవరకు పరమధర్మము మోక్షప్రాప్తిని పొందే ధర్మవర్తన అలవడదు. దాని గురించి కొద్దిగా తెలిసినా అది నిలకడగా వుండదు.

చిత్తములోపల (మనస్సులోపలి) అనేక చింతలు (దిగుళ్ళు, ఆలోచనలూ) కలుగుతుంటాయి. ఆ చింతను మానివేసినదాకా సత్తుగా (బలంగా) వైరాగ్యం స్థిరపడదు. ఈపై చెప్పినవన్నీ సంసారగత ప్రాణులకు మాత్రమే వర్తిస్తాయి. శ్రీవేంకటేశ్వరుని దాసులకు మాత్రంహత్తి (అద్దినట్లు) వైకుంఠ పదవి అదిక్కడే దక్కితీరుతుంది.

**పద్యవివరణ:**

ఆ.వె॥ **ఇహముతెగక పరముకేదిరా తెరువది**
**పగను వీడకుండ భవము పోదు**
**వేంకటేశుడేలు విష్ణుదాసులకును**
**హరి నెలవు దొరుకును అంతలోనె.**

సంఖ్య: III/232 రాగం : నాట
కీర్తన : కొలిచినవారికి గొమ్మని వరములిచ్చీ

**నాట**

**60 కొలిచిన వారికిఁ గొమ్మని వరములిచ్చీ**
**వెలయఁ గలశాపురవీధిహనుమంతుఁడు.** ॥పల్లవి॥

**బెట్టుగా నొకచేతఁ జూపెడి తనప్రతాపము**
**పట్టుకున్నాఁ డొకచేతఁ బండ్లగొల**
**మెట్టుకొన్నవి రాకాసిమెదడుతోడితలలు**
**రట్టడి కలశాపురదిట్టహనుమంతుఁడు.** ॥కొలి॥

**చెచ్చెర వీనుల నాలించేది సురలనుతులు**
**కొచ్చి కొచ్చి తోఁకఁ జుట్టుకొన్నది నింగి**
**తచ్చి చూచేది కన్నుల దాసులమీఁదికరుణ**
**రచ్చ కెక్కెఁ గలశాపురముహనుమంతుఁడు** ॥కొలి॥

**వసుధ మతిలోనిది స్వామికార్యవిశ్వాసము**
**వెసఁ దనపనైనది విష్ణుభక్తి**
**పసగా శ్రీవేంకటేశ బలు నీబంట్లలోన**
**రసికుఁడు కలశాపురముహనుమంతుఁడు.** ॥కొలి॥ **232**

**ఉపోద్ఘాతము:**

కలశాపురవీధిలో వెలసిన హనుమంతుని వైభవాన్ని వర్ణిస్తున్నారు అన్నమయ్య. ఈయన తనను కొలిచిన వారికి ఇదిగోతీసికోండని ధారాళంగా వరములు ఇచ్చేస్తుంటాడట. ఆయన ఒక చేత ఆనాటి తన ఆయుధమైన పండ్లగోలతో కొడితే రాక్షసుల తలలు మెదడుతోసహా చితికిపోయి నేలమీదపడ్డవట. ఆ హనుమ మతిలో స్థిరపడింది స్వామికార్యముపై విశ్వాసము. ఇకపోతే తన పనియేమో విష్ణుభక్తి. ఆ రసాస్వాదనలో





నిష్ణాతుడైనవాడు అని అన్నమయ్య ఉద్దేశ్యం. అన్నట్టు ఈ హనుమ తిరుమలేశుని నమ్మినబంటట.

**తాత్పర్య వివరణ:**

కలశాపురవీధిలో వెలసిన యీ హనుమంతుడు తనను కొలిచిన వారికి (మొక్కినవారికి) కొమ్మని తీసుకోండ(రా అని అనేక వరములను అనుగ్రహించుచున్నాడు.

ఈ స్వామి బెట్టుగా (బింకముగా) ఒక చేయి యెత్తి తన ప్రతాపమును చూపుచున్నాడు. ఇంకొక చేత పండ్లగోల (ముండ్లవలె పండ్లువున్న రాతి గదను) ధరించినాడు. ఆయన ఆపండ్లగోలతో కొట్టినదెబ్బకు రాకాసి (రక్కసుల) మెదడుతోసహా తలలు నుజ్జునుజ్జయి క్రిందపడ్డాయి. కలశాపురంలో వెలసిన ఈ దిట్టమైన హనుమంతుడు రట్టడివాడు (నానారభస చేయువాడు.)

చెచ్చెరవీనుల (నిక్కబొడుచుకున్న చెవులతో తనను దేవతలు స్తుతించే స్తోత్రములను ఆలకించుచున్నాడు. అయినా ఆయన వినమ్రుడైయున్నాడనే సంకేతముగా నింగి పర్యంతం వ్యాపించిన ఆయన తోక కొచ్చికొచ్చి జుట్టుకొని యున్నది (కుచ్చులు చుట్టుకొన్నట్లు బిగుతుగా చుట్టుకొని యున్నది. ఆయన కన్నులను తరచిచూస్తే తనదాసులపై ఆయన చూపేకరుణ గోచరిస్తుంది. రచ్చకెక్కగల ఈ కలశాపురము హనుమంతుడు భక్తసులభుడు.

భూమిపై వున్నంతవరకు ఈయనకు మదిలో నెలకొన్నది (మనస్సులో స్థిరపడినది) స్వామికార్యముపై అచంచల విశ్వాసము. ఇకపోతే విష్ణుభక్తి ఈయనకు వెస (వేగముగా) తనదైనందిన కార్యక్రమమైపోయింది. పసయెప్పునట్లు శ్రీవేంకటేశ్వరుని బలవంతులైన బంట్లలో ఈ కలశాపుర హనుమ గొప్పరసికుడు (సరసప్రియుడు) అంటే కొందరిని ఆట పట్టిస్తుంటాడు.

**పద్యవివరణ:**

చం॥ **కొలిచినవారికీహనుమ కొమ్మని యిచ్చును బల్ వరంబులన్**
**వెలుగుచు నేడు కన్పడెను వీధుల ఈ కలశాపురంబునన్**
**చెలువుగ వేంకటేశ్వరుని సేవతరించెడు యీ మహామహున్**
**తెలియుడు చిత్రమౌరసికధీమణి ఈ హనుమంతరాయుడే.**

సంఖ్య: III/234 రాగం : సాళంగనాట
కీర్తన : కంటిరా వోజనులాల కరుణానిధి యితడు

**సాళంగనాట**

**61 కంటిరా వోజనులాల కరుణానిధి యితఁడు**
**జంట లక్ష్మీదేవితోడ సరుసనున్నాఁడు. ||పల్లవి||**

**వాఁడివో ప్రతాపసుగ్రీవనరసింహుఁ డట్టె**
**మూఁడుమూర్తు లొకరూపై ముంచివున్నాఁడు**
**వేఁడిరక్కసులనెల్ల విదళించివేసినాఁడు**
**పోఁడిమి సురలఁ గాచీ భువనాధీశుఁడు. ||కంటి||**

**ఇరవైనరవిచంద్రు లితనికన్ను లివిగో**
**ధరణి ననంతవేదము లూర్పులు**
**అరుదై చెలఁగె బ్రహ్మాండ మీతనినెలవు**
**నిరతి సనకాదులు నిత్యసేవకులు. ||కంటి||**

**ఘనమైనశంఖుచక్రములతో మెరసీని**
**మనిపె ప్రహ్లాదుని మన్నించె నిదె**
**యెనలేని శ్రీవేంకటేశుఁడై వున్నవాఁడు**
**అనిశము సకలాంతరాత్మ తానైనాఁడు. ||కంటి|| 234**

**ఉపోద్ఘాతము:**

జనులారా! ఇతనిని కంటిరా? ఈతడు కరుణానిధి. తనజంటగా లక్ష్మీదేవితోపాటు తన దగ్గరకు తీసికొని వున్నాడు అంటున్నారు అన్నమయ్య. ఇది ప్రహ్లాదవరదుడైన సుగ్రీవనరసింహునిపై చెప్పిన కీర్తన. ఆగ్రహంతో వేడెక్కిన రాక్షసులను విదలించివేశాడట, ఈ నృసింహుడు. సూర్యచంద్రులిద్దరూ ఈ స్వామికి రెండు కన్నులట. అనంతములైన





వేదములు ఈ నృసింహుని భయంకరమైన ఊర్పులట అంటే ఊపిరి పీల్చుటలు సనక సనందనాదులచే నిత్యమూ సేవలు గొంటాడట. శ్రీవేంకటాద్రిపైన దేవుడు కూడా ఈయనేనంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ జనులారా! ఇతడు (ఈ సుగ్రీవనరసింహుడు) కరుణానిధి (కరుణనిధిగా గలవాడు). తన జంట అయిన లక్ష్మీదేవితో సరసనున్నాడు (దగ్గరయైయున్నాడు). కంటిరా (చూచినారా?)

వాడివో (అదిగో వాడే) ప్రతాపశాలియైన సుగ్రీవ నరసింహుడు. అట్టే (అలాగే) మూడుమూర్తులు (త్రిమూర్తులని ప్రసిద్ధిని గాంచిన బ్రహ్మ విష్ణు మహేశ్వరులు) ఒకే రూపు దాల్చి ఈ సుగ్రీవనరసింహుడైయున్నారు. వేడి (ఆగ్రహంతో వేడెక్కిన) రాక్షసులనెల్లా విదలించివేసినాడీ నరసింహుడు. భువనాధీశుడు అయిన ఈ నరసింహుడు పోడిమి (వాత్సల్యముతో) దేవతలందరినీ రక్షించినాడు.

ఇరవైన (నెలకొనిన) సూర్యచంద్రులే, ఇవిగో ఈ నృసింహుని కన్నుగవ. భూలోకంలో అనంతములైన వేదములే ఈ నరసింహుని ఊర్పులు (ఉచ్ఛ్వాస నిశ్వాసములు). అనంతమైన ఈ బ్రహ్మాండమే ఈ దేవదేవుని వాసస్థానము. విరక్తులైన సనకసనందనాదులు ఈ నృసింహుని నిత్యసేవకులు.

ఈ నరసింహుడు ఘనమైన శంఖ చక్రాయుధములతో మెరసిపోతున్నాడు. ప్రహ్లాదుని మనిపె (రక్షించెను). ఇదేమన్నించెను. ఎనలేని (సాటిలేని) శ్రీవేంకటేశ్వరుడు కూడా ఇతడే. అనిశము (యెల్లప్పుడూ) సర్వాంతరాత్మలలో తానే నెలకొని వున్నవాడు ఈ నరసింహుడు.

**పద్యవివరణ:**

ఉ|| **కంటిరి గా భళా! జనులు కారణజన్ముడు ఈ నృసింహుడే**
**జంటగనున్న లక్ష్మిసతి చక్కగ చెంతనెతోడు నిల్వగా**
**తుంటరి దైత్యమూకలను తుత్తుర చంపె, హిరణ్యుజీల్చుచున్**
**వెంటనె వాని పుత్రునికి వేల్పులతోడుత రక్షనిచ్చెబో.**

సంఖ్య: III/213 రాగం : శుద్ధవసంతం
కీర్తన : లేదందువల్ల దెలివి యెన్నటికిని

## శుద్ధవసంతం

**62** **లే దందువల్లఁ దెలివి యెన్నటికిని**
**నీదయ నాపై నించినఁ గాని.** ‖పల్లవి‖

**అరయఁగఁ బ్రపంచ మలవడినటువలె**
**అరుదగువైరాగ్య మలవడదు**
**తరుణులరతి మతిఁ దలఁచినయటువలె**
**ధర నీసాకారము దలఁచదు మనసు.** ‖లేదం‖

**గొనకొన్న యర్థము గోరినయటువలె**
**కొనయగు మోక్షము గోరదు**
**తనుభోగములకుఁ దగిలినయటువలె**
**తనిసి నీ కథలకుఁ దనియదు మనసు.** ‖లేదం‖

**చలమును బాపము చవియైనటువలె**
**సలితపుణ్యము చవి గాదు**
**సులభ శ్రీవేంకటేశుఁడ నీమహిమిది**
**గలిగితివి నాకుఁ గలఁగదు మనసు.** ‖లేదం‖ **213**

**ఉపోద్ఘాతము:**

అందువలన నాకుయెన్నటికీ తెలివిలేదని సుస్పష్టమైనది. నీదయ నాపై నింపితే కాని నాకు తెలివి రాదని అర్థమైనది అంటున్నారు, అన్నమయ్య. విచిత్రమేమంటే ప్రాపంచిక చింతన అలవడినంత తేలికగా వైరాగ్య చింతన మలవడదు. తరుణుల రతిమతి దలచినట్లు శ్రీహరిసాకార రూపము మనసు తలుచుకోలేదు. మానవుడు ధనమును తేలికగా కోరుకొంటాడు గానీ మోక్షము





కావాలని మాత్రం కోరుకోడు. మత్సర భావన కలిగించే పాపము రుచించినంతగా పుణ్యము రుచించదు. అదే శ్రీవేంకటేశ్వరుని లీల

**తాత్పర్య వివరణ:**

అందువల్ల (ఆ కారణంచేత) నాకుతెలివి యెన్నటికీ లేదని, అందును. నీదయ నాపై నించిన (నిండిన) గానీ నేను ఉత్తీర్ణుడనగుట జరిగేపనికాదు.

అరయగ (పరికించి చూస్తే) ప్రపంచము అలవడినంత (అలవాటు పడినట్లు), అరుదైన వైరాగ్యము మానవునికి అలవడదు (అలవాటు పడదు). స్త్రీలతో రతిక్రీడలు మనస్సులో తలచినంత తేలికగా, భూలోకంలో ఎవ్వడూ శ్రీహరి సాకార స్వరూపమును కన్నులకు కట్టుకొనలేడు. కారణమేమంటే చెడునచ్చినంత తేలికగా మంచి నచ్చదు.

గొనకొని (నిశ్చయించుకొని) అర్థము (ధనము) కాంక్షించినంత సులభంగా నరుడు మోక్షమును కాంక్షింపడు. అది కొనయగు మోక్షమే (చిట్టచివరికి సాధించవలసినదే అయినప్పటికీ) మనస్సు దానిని కోరనే కోరదు. ఈ మనస్సుకి ఇంకొక మాయరోగమున్నది. దానికి భోగాలు రుచించినంత తేలికగా శ్రీహరి కథలపై తనియదు (తృప్తి చెందదు) మనస్సు.

మానవునికి చలము (మాత్సర్యము), పాపము చవియైనట్లు (రుచించినట్లు) సలలిత పుణ్యము (మృదుమధురమైన పుణ్యము) చవిగాదు (రుచించదు). సులభముగా అనుగ్రహించే ఓ శ్రీవేంకటేశ్వరా! ఇదంతా నీ మహిమయే ప్రభూ! నీవు నాకు కలిగితివి (లభించితివి). ఇకపై నామనసు కలగదు (కలత చెందదు) ఎందుకంటే అది నీధ్యాసలోనే వుంటుంది కదా!

**పద్యవివరణ:**

కం|| **లేదందువల్ల తెలివియు**
**నీదయనాపైన నీవు నించినగానీ**
**ఇదె కలిగితివిగ నాకున్**
**మదిగలగదు నిజము నిజము మధువైరిహరీ!**

సంఖ్య: III/219 రాగం : సాళంగనాట
కీర్తన : నీవారైనవారికి నీపై భక్తేకాక

## సాళంగనాట

**63 నీవారైనవారికి నీపై భక్తే కాక**
**భావించనేరక వట్టిభ్రమఁ బడవలెనా.** ॥పల్లవి॥

**కరుణానిధి నీవు గలిగివుండఁగాను**
**తిరుమంత్రమే నాకు దిక్కయివుండఁగా**
**వరుస నాచార్యుఁడు వహించుక వుండఁగాను**
**పరగఁ దపము చేసి బడలఁగవలెనా.** ॥నీవా॥

**కమలాక్ష నీముద్రలే కాచుక నాకుండఁగాను**
**అమరి దాస్యము కాణాచై వుండఁగా**
**తమితోడ వైష్ణవులు దాపుదండై వుండఁగాను**
**తెమలి తీర్థాలెల్లా ద్రిష్టించవలెనా.** ॥నీవా॥

**శ్రీవేంకటేశ్వర నీసేవే గతియై యుండఁగా**
**ఆవటించి నుతి వుపాయమై వుండఁగా**
**తావులనే శరణనేధర్మము రక్షించఁగాను**
**వేవేలు దానాలు చేసి వేఁడుకొనవలెనా.** ॥నీవా॥ **219**

**ఉపోద్ఘాతము:**

నీవారైనవారికి కూడా నీపై భక్తే కుదురుటలేదు. నీమాయకాకపోతే, వారు కూడా నిన్ను భావించనేరక వట్టి (వ్యర్థమైన) భ్రమలో పడిపోవలెనా? ఇదెక్కడి విడ్డూరం అంటున్నారు అన్నమయ్య. హరి భక్తులు కానివారి పరిస్థితి అలా వుందంటే ఆశ్చర్యంలేదు. కానీ మేము హరి శరణాగతులము. ఓ కరుణానిధీ! నీవు కలిగివుండగా, ఓం నమో నారాయణాయ అనే నీ తిరుమంత్రం దిక్కయివుండగా నా ఆచార్యుడు నా భారమువహించుకొని యుండగా నేను





ఏవేవో తపములనుజేసి వడలిపోవుట యెందులకయ్యా? అంటున్నారు. తరచి చూస్తే ఇది అద్భుతమైన కీర్తన అని అవగతమవుతుంది.

**తాత్పర్య వివరణ:**

ఓ దేవా! నీవారైన భక్తులకి నీపై భక్తే కుదరదా? వారికి నీపై భక్తే కాక (కుదరక) భావించనేరక (నీ ఆకారాన్ని భావనలో నిలుపుకోలేక) వట్టి (వ్యర్థమైన) భ్రమలలో బడవలెనా? ఇది తగనిపని ప్రభూ!

ఓ కరుణానిధీ! నీవునాకు కలిగివుండగా నాకు "ఓం నమో నారాయణాయ" అనే నీ తిరుమంత్రమే దిక్కయివున్నది. నాపై అపార కరుణతో వరుసలోనున్నా నాపై దయాగుణం వహించి (పొంది) మా ఆచార్యుడు మాతోడైవుండగా మాకు భక్తి జ్ఞానవైరాగ్యములు వాటంతట అవే కలుగుతాయి. వాటిని మేము గొప్ప తపస్సులతో సాధించనక్కరలేదు.

ఓ కమలాక్షా! నీ శంఖుచక్రముద్రలు నేను నాదేహంపై ధరించాను. దానివలననే నేను పవిత్రుడనయ్యాను. ఆపైన నేను నీ దాస్యము నెంచుకొని అదే కాణాచిగా (ప్రాప్యస్థానముగావుండి నీసేవలో వుండిపోయాను. నాపై తమితోడ (ఆసక్తితో) వైష్ణవులు దాపుదండై (చేరువలోనే వున్న అండదండై) వున్నారు. ఈ భాగ్యము చాలదా? ఇంకా నేను ప్రయాణాలు చేసి తీర్థములన్నీ దర్శించవలెనా? అక్కరలేదు.

ఓ శ్రీవేంకటేశ్వరా! నాకు నీసేవయే గతియై వుండగా ఆవటించి (పొందుపడి) నీనుతి (ప్రార్థన) నిన్ను పొందే నిరుపమాన వుపాయమై యుండగా నన్ను రక్షించేది యేమిటి? నీ శరణాగతి అనే ఒక్క ధర్మమే. ఇవన్నీ నాకుండగా అనేక దానాలు చేసి నిన్ను మోక్షంవేడుకోవలెనా?

**పద్యవివరణ:**

కం॥ **నీవారు అయినవారికి**
**నీవనినన్ నీదుపైన నిలుచును భక్తే**
**భావించనేరకివ్విధి**
**గోవిందా! వట్టి భ్రమల కుందగవలెనా?**

సంఖ్య: III/235 రాగం : ముఖారి
కీర్తన : ఉవిదలాల చూడరే వుద్దగిరికృష్ణుడు

**ముఖారి**

**64 ఉవిదలాల చూడరే వుద్దగిరి కృష్ణుడు**
**నవకపు సెలవులనవ్వుచున్నాడు** ॥పల్లవి॥

**అచ్చపుబాలుఁడై శకటాసురు మర్దించినాఁడు**
**కుచ్చి కాఁగిళ్ల నింతులఁగూడినాఁడు**
**మచ్చిక దోఁగెడుతాను మద్దులు విరిచినాఁడు**
**పిచ్చిలఁ బూతకిచన్ను పీలిచినాఁడు.** ॥ఉవి॥

**పిన్న నాఁడే కోడెలతోఁ బెనఁగి గెలిచినాఁడు**
**యెన్నికగా వేలఁ గొండ యెత్తినాఁడు**
**వెన్నడిని కొండపాము వెస రెండు సేసినాఁడు**
**పన్ని కంసునిమదము భంజించినాఁడు.** ॥ఉవి॥

**పొంచి పెద్దవాఁడై భూభారము దించినాఁడు**
**అంచెఁ బాండవులకు దిక్కైనవాఁడు**
**మించి శ్రీవేంకటగిరిమీఁద నిదె వున్నవాఁడు**
**వంచించక దాసులకు వరాలిచ్చేవాఁడు** ॥ఉవి॥ **235**

**ఉపోద్ఘాతము:**

"సెలవుల నవ్వులు" అంటే పెదవుల మూలల నుండి కనుపించీ కనుపించని చిరునవ్వు అని అర్థం. "నవకపు" అంటే మృదువైన అని అర్థం. ఉద్దగిరి (ఉదయగిరి)లో వెలసిన శ్రీకృష్ణునిపై మధురమైన కీర్తన చెబుతున్నారు అన్నమయ్య.

ఓ ఉవిదలారా చూడండమ్మా! ఈ ఉద్దగిరి కృష్ణుడు మృదువైన దరహాసం గల మోహనాకారుడు అంటున్నారు. ఇక ఆపైన శకటాసురవధ, మద్దిచెట్లను గూల్చి కుబేరుని పుత్రులకు శాపవిమోచనం చేయుట, పూతన వధ, కోడెలతో





పోరి కృష్ణుడు గెల్చుట, గోవర్ధనోద్ధరణము, కంసవధ, భారతయుద్ధం ప్రస్తావిస్తూ మధురమైన కీర్తన వినిపించారు అన్నమయ్య.

**తాత్పర్య వివరణ:**

ఓ ఉవిదలారా! (వనితలారా!) చూడరే (చూడండమ్మా!) ఈ ఉద్దగిరి కృష్ణుడు (ఉదయగిరి కృష్ణుడు) ఎంత అందమైనవాడు. ఇతడు నడకపు సెలవుల (మృదువైన దరహాసముతో) సమ్మోహనంగా నవ్వుచున్నాడు.

అచ్చపు బాలుడై (ఆశ్చర్యము గొలుపు బాలుడై) ఇతడు శకటాసురుని మర్ధించినాడు. కుచ్చి (గుచ్చి) కౌగిళ్ళలో ఇంతులను కూడినాడు. దోగాడే వయస్సులోనే తమ దొడ్డిలోనున్న మద్ది చెట్లను కూల్చి నలకూబర మణిగ్రీవులను గంధర్వ కుమారులకు (కుబేరుని పుత్రులు) శాప విమోచనం కలిగించినాడు. పూతకి పిచ్చిల (పూతన వెఱ్ఱెత్తిపోవునట్లు) చన్నులు పీల్చి ప్రాణాలు హరించినాడు.

పిన్ననాడే (కుర్రవాడప్పుడే) కోడె గిత్తలతో పోట్లాడి గెలుపు సాధించాడు. శ్రేష్ఠుడై తన చిటికెన వేలిమీద కొండనెత్తి (గోవర్ధనపర్వతమెత్తి) గోవులను గోకులమును ఇంద్రుడి వడగళ్ళవాననుండి రక్షించినాడు. వెన్నంటి గోపాలురనుకబళించబోయిన కొండ చిలువ రాక్షసుని రెండుగా నరికి సంహరించినాడు. పూనుకొని కంసుని మదమును భంజించినాడు (నుగ్గు చేసినాడు).

కొన్నాళ్ళకు పెద్దవాడై భూదేవియొక్క భారమును నివారించుటకు భారత యుద్ధమును నడిపినాడు. ఆ యుద్ధంలోనే కాక కడదాకా పాండవులను ఆదుకునే దిక్కు అయినాడు. అన్నిటినీ మించి నేడు ఆ ఉద్దగిరికృష్ణుడే తిరుమల శ్రీవేంకటేశ్వరుడై ఇదే వున్నాడు. ఈయనెటువంటివాడంటే తన దాసులను యెన్నడూ వంచించక అనేక వరములిస్తాడు.

**పద్యవివరణ:**

ఆ.వె॥ **ఉవిదలార! కనుడు ఉద్దగిరిని నెల-**
**కొన్న కృష్ణుడితడు కొలువుడితని**
**నవ్వుచున్నవాడు నవకపు సెలవుల**
**వేంకటగిరిపైన వెలసినాడు.**

సంఖ్య: III/236 రాగం : ఆహిరినాట
కీర్తన : అరుదరు దీగతి యహోబలేశ్వర

**ఆహిరినాట**

**65 అరుదరు దీగతి యహోబలేశ్వర**
**పొరిఁబొరి దాసులు పొగడుట యెట్టు.** ||పల్లవి||

**యెదుటఁ జించితివి హిరణ్యకశిపుని**
**అదె ప్రహ్లాదుఁడు బంటగుటెట్లు**
**కదిసినరుద్రునిగర్వ మడఁచితివి**
**గుదిగొనిదివిజులు కొలుచుట యెట్టు.** ||అరు||

**ఘనసింహాకృతి గైకొనివుంటివీ**
**యెనయఁగఁ గరిఁ గాచినదెట్లు**
**పనివడి కంబమువగుల వెడలితివి**
**మనుజులు పూజించి మరుగుట యెట్లు** ||అరు||

**సరవితో వీరరసమున మించితివి**
**అరయఁగ శృంగారి వౌటెట్టు**
**సిరి వుర మెక్కెను శ్రీవేంకటాద్రిని**
**యిరవుగ నీతొడ యెక్కుట యెట్టు.** ||అరు|| **236**

**ఉపోద్ఘాతము:**

ఇది పైకి కనిపించని, అనిపించని మహాద్భుత కీర్తన. ఇందులోని సాహితీ చమత్కారం చూడండి. ప్రభూ! నీవు చేసిన పనులేమో బహు అరుదైనవి. ఓ అహోబలేశ్వరా! పొరి బొరి (మాటి మాటికీ) నీదాసులు నిన్ను పొగడుట యెట్లు? అంటున్నారు అన్నమయ్య. ఒక పక్కన హిరణ్యకశిపుని చీల్చి సంహరించావు. ఇక వాడికొడుకు నీ శత్రువవాలిగాని నీ ప్రియమైన బంటు





అవటమేమిటి? ఇదెక్కడి వింత. రుద్రుడంతటివాని గర్వము ఖర్వము చేసితివి. ఇక ఆయన పరివారమైన దేవతలు నిన్నెట్లా కొలిచెదరయ్యా! అయినా వారు నీ శరణాగతులైనారు. ఇట్లా సాగుతుందీ కీర్తన.

**తాత్పర్య వివరణ:**

ఓ అహోబలేశ్వరా! ఈ గతి (నీ ఈ పద్ధతులు) బహు అరుదరుదు (చాలా అరుదైన విధానములు). ఇట్టి సంకట పరిస్థితిలో పొరిబొరి దాసులు (మాటిమాటికీ) నీదాసులు నిన్నుపొగడుట యెట్లు సాధ్యమవుతుంది?

ఎదుట (అందరూ చూస్తుండంగానే) హిరణ్యకశిపుని చించితివి (చీల్చి చంపివేశావు). అదె (వాడి కొడుకే అయిన) ప్రహ్లాదుడు నీకు శత్రువు అవ్వాలి కానీ నీ ప్రియమైన బంటు అవటం యేమిటి? నిన్ను యెదరించిన రుద్రుని గర్వమును ఖర్వము చేసినావు. ఇక ఆ రుద్రుని పరివారమైన దివిజులు (దేవతలు) నీకు పగవారవ్వాలిగానీ వాళ్ళే నిన్ను కొలవటమేమిటి?

ఘనమైన సింహాకారమును దాల్చిన నిన్ను చూసి గజేంద్రుడు భయంతో చచ్చిపోవాలిగాని నీవు గజేంద్రవరదుడివవటం యెంత విచిత్రం? ఉన్నట్లుండి స్తంభమును చీల్చుకొని బయటకు వచ్చితివి. నీవు ఎక్కడ యెప్పుడు వెలిసెదవో తెలియదు. ఇకమానవమాత్రులు నిన్ను పూజించి వరములాసించుట యెట్లు?

ఓ అహోబలేశ్వరా! సరవితో (క్రమముగా) నీవు వీరరసమును పోషించుటలో మించిపోతివి. నీవు నరసింహుడివి అది నీకు సహజమే. కానీ అరుదైన శృంగారరసమున నీవు శృంగారివవటం యేమివింత? కానీ ఏమివింతలేదని కొంచెము ఆలోచిస్తే తెలుస్తుంది. నీవు నిజానికి శ్రీవేంకటేశ్వరుడవు అందుకే సిరి (లక్ష్మీదేవి) నీవురమెక్కినది (నీ హృదయాన్నాక్రమించినది). ఇక నీతొడ మీదయెక్కి కూర్చోటమేమి కష్టము?

**పద్యవివరణ:**

కం|| **అరుదరుదీగతి దేవా!**
**ఇరవైన యహోబలాన యిటువుంటివిగా**
**పొరిబొరి దాసులు పొగడుట**
**హరియెట్టగు వేంకటేశుడయిన సరికదా!**

సంఖ్య: III/231 రాగం : దేసాళం
కీర్తన : విశ్వరూప నీమూర్తి వివేకించలేను నేను

## దేసాళం

**66 విశ్వరూప నీమూర్తి వివేకించలేను నేను**
**శాశ్వతుఁడ నీవున్న చందమేమీ నెఱఁగ ॥పల్లవి॥**

**నిబ్బరమై లోకమెల్లా నిండుక వుండుదువట**
**దొబ్బుకొంటాఁ దిరిగేము తోవల నిన్ను**
**వుబ్బి సముద్రమువలెనున్న నీప్రకృతియందు**
**గబ్బినై యీఁదుచున్నాఁడఁ గలఁగకుమీ. ॥విశ్వ॥**

**కడయుమొదలులేనికాలము నీతనువట**
**నడుమ నందుతోనే పెనఁగుచున్నాఁడ**
**అదరి నీ సొమ్ములైన ఆత్మలలో నొకఁడనై**
**చిదుముడి నున్న వాఁడ చిక్కువఱచకుమీ ॥విశ్వ॥**

**పరమున నిహమునఁ బ్రబలియున్నాఁడవట**
**గరిమ సోదించేము కమ్మటి నిన్నుఁ**
**ఇరవై శ్రీవేంకటేశ నిన్నిటా నిన్ను నేము**
**శరణు చొచ్చితి మిఁక చనవిచ్చి కావుమీ. ॥విశ్వ॥ 231**

**ఉపోద్ఘాతము:**

విశ్వరూపుడైన పరమాత్మతో మొఱబెట్టుకొంటున్నారు అన్నమయ్య. ప్రభూ! నేను అజ్ఞానిని.నీమూర్తి యెలావుంటుందో వివేకించలేను (వివేకముతో ఇట్లా వుంటుంది అని చెప్పలేను). శాశ్వతుడవైన ఓ పరమాత్మా! నీవు వున్నటువంటి తీరు యెట్టిదో నేను యెఱగనైతిని, అంటున్నారు.

నిదానంగా ఒకటికి రెండుసార్లు చదివి వివేకిస్తేగానీ ఈ కీర్తన అర్థంకాదు. నీవు వేరే యెక్కడో వైకుంఠంలో వుండవు.ఈ లోకమెల్లా కొద్దిగాకూడా





సందులేకుండా నిండిపోయి వున్నావు. మేము నిత్యమూ నిన్ను దొబ్బుకుంటూ తిరుగుతూనే వున్నాము. తోవలలో నిన్ను తొక్కుకొంటూ వెళ్తున్నాము. అయినా మాకు తెలియటంలేదు. మరి నీ మాయకాకపోతే ఇదేమిటి? అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ విశ్వరూపా! నేను అజ్ఞానిని. నీ మూర్తి (సాకార రూపం) ఇలా వుంటుందని, వివేకించలేను (వివేకముతో తేటతెల్లమగునట్లు వివరించలేను. శాశ్వతుడవైన ఓ పరమాత్మా! నీవు వున్న చందము (తీరు తెన్నులేమిటో కూడా నేనెరుగను.)

నిబ్బరమై (నిదానముగా) వ్యాపించి ఈ లోకమెల్లా అణుమాత్రం సందులేకుండా నిండిపోయి వుంటావట. నువ్వేమో అగోచరుడవు. మేము నిన్ను దొబ్బుకొంటా (తోసుకొంటూ) తోవలలోనేవున్న నిన్ను తొక్కుకుంటూ ఆ సంగతి తెలీక తిరుగాడుతూనేవున్నాము. ఈ ప్రకృతి వుబ్బి (వ్యాపించి) సముద్రమువలె మాచుట్టూ వున్నది. గబ్బినై అర్థంలేని గర్వంతో ఇందులో ఈదులాడుతూనే వున్నాను. ప్రభూ! కలగకుమీ (నన్ను కలతపెట్టవద్దు.)

ఓ దేవా! నీతనువు (శరీరము) ఎట్లా వుంటుందో ఎవ్వరు చెప్పగలరు?నీవు కాలము స్వరూపముగాకలవాడవట. నేను ఈకాలముయొక్క నడుమన దానితోనే పెనగులాడుచుంటిని. మా ఆత్మలన్నీ పరమాత్మవైన నీ సొమ్మేకదా! ఈ ఆత్మలలో వొకడనైన నేను చిదుముడినున్నవాడ. తొట్రుపడుతూ కంగారు కంగారుగా వుండిపోయాను. ఏ జన్మనెత్తుతున్నానో యెందుకుయెత్తుతున్నానో నాకే తెలియదు. అసలే చిక్కులలో వున్న నాకు ఇంకా చీకాకు కలిగించుట యెందులకు ప్రభూ!

ఓ ప్రభూ!నీవు ఇహలోకమునందునూ, పరలోకములందును వ్యాపించివున్నావు. మా ఎదురుగా వున్న నిన్ను యెక్కడవున్నావా అని సోదించెదము (పరిశోధిస్తున్నాము). శ్రీవేంకటాద్రిపైసాకార రూపముతో వెలసియున్నావు. ఇక నీవెట్లావుంటావా అని వూహించుటెందులకు? నిన్ను శరణుచొచ్చి యున్నాము. ఇక అనురాగముతో మమ్ము రక్షింపుము ప్రభూ!

**పద్యవివరణ:**

తే.గీ॥ **విశ్వరూప నీమూర్తి వివేకమొంది**
**నేను వూహింపజాలను నిముషమైన**
**శాశ్వతుడనీవు యుండెడి చందమేమి**
**యెరగనైతిని నిజమిది తిరుమలేశ!**

సంఖ్య: III/237 రాగం : దేసాళం
కీర్తన : నిండు కంతటా నున్నది నీమాయ

## దేసాళం

**67 నిండు కంతటా నున్నది నీమాయ**
**వొండొకరు జనులకు నుపదేశించనేలా.** ॥పల్లవి॥

**నేరకుంటే సంసారము నేరుపునునీమాయ**
**చేరకుంటే గడులోనుచేసుకొను నీమాయ**
**వూర కొడcబడకుంటే వొడcబరచు నీమాయ**
**పోరి బిడ్డలకుతండ్రి బుద్ధి చెప్పవలెనా.** ॥నిండు॥

**నాలికె కారురుచులు నలిc దెలుపు నీమాయ**
**బేలుcడై విరక్తుcడై భిక్షమెత్తించు నీమాయ**
**పాలుమాలేమంకునైనా పనిసేయించు నీమాయ**
**రేలుcబగళ్లొకరు ప్రేరేcపుచుండవలెనా?** ॥నిండు॥

**చొక్కించి నోరుc జేతికి సూటి చూపు నీమాయ**
**పెక్కులాగుల నన్నిటాc బెనగించు నీమాయ**
**వెక్కనపలమేల్మంగవిభుcడ శ్రీవేంకటేశ**
**తక్కకనీమహిమిది తలపించవలెనా.** ॥నిండు॥ **237**

**ఉపోద్ఘాతము:**

ఓ దేవదేవా! నీమాయ అంతటా నిండుకొని యున్నది. అటువంటప్పుడు ఒకరిద్దరు జనులకు వుపదేశించటంయెందుకు? అంటున్నారుఅన్నమయ్య. నాలుకకు ఆరు రుచులు ఒకేసారి తింటున్నాయెలా తెలుస్తున్నాయి? నీ మాయ వల్లనే తెలుస్తున్నాయి. ఒక మోసగాడిని కూడా విరక్తునిజేసి భిక్షాటనతో జీవించునట్లు చేయగలదు నీమాయ. వల్లమాలిన మంకుతనముగలవానిని





కూడా తిండిలేక పనిచేసుకొని పొట్టనింపుకొనేవానిగా చేయగలదు నీ మాయ. ఇక రేయింబవళ్ళు ప్రేరేపించుచుండవలెనా అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ దేవా! అంతటా (అన్నిచోట్లా) నీ మాయ నిండుకయున్నది (నిండిపోయి వున్నది). ఒండొకరుజనులకు (ఒకరిద్దరు వ్యక్తులకు) ఉపదేశించనేల (దాని గురించి వివరించినందువల్ల ప్రయోజనమేమిటి?)

సంసారము యెట్లా చేయాలో నేరకుంటే (తెలియకపోతే) నీమాయే దాన్ని కూడా నేరుపుతుంది. నీ మాయకు చేరకుంటే (లొంగకుంటే) వున్నట్లుండి నీమాయ వారిని లొంగదీసుకుంటుంది. ఒకవేళ ఎవడన్నా నీ మాయకు ఒడబడకుంటే (అంగీకరించకపోతే) బలవంతాన అంగీకరించేటట్లు చేస్తుంది నీమాయ. పోరి (పోట్లాడి) తండ్రి బిడ్డలకు బుద్ధి చెప్పవలసిన పనిలేదు. వారికి నీమాయే అన్నీ నేర్పుతుంది.

ఓ దేవా! మనిషి నాలికకు తీపి, చేదు, కారము, పులుపు, ఉప్పు, వగరు అనే ఆరు రుచులను వేర్పరచి తెలుసుకొనే నేర్పు కల్పించింది నీమాయే. బేలుడైన (మోసకారి అయిన వాణ్ణి) కూడా విరక్తుడిని చేసి బిచ్చమెత్తుకొనేట్లు చేస్తుంది నీ మాయ. పాలుమాలిన (లొంగని మొండివాడిని కూడ) లొంగదీసి వాడిచేత కాయకష్టము చేసేటట్లు ఒప్పిస్తుంది నీ మాయ. రేయింబవళ్ళూ ఎవరో ఒకరు ప్రేరేపించవలసిన పనిలేదు.

చీకట్లో కూడా మనిషి తిండి తినకలడు.వాడి నోటికి సూటిగా వాడిచేయి వెళ్ళేట్లు చూపుతున్నది ఎవరు? నీమాయేనయ్యా! వాటి జీవితకాలంలో అనేక లాగుల (అనుబంధాలతో) పెనగులాడేట్లు చేసేది కూడా నీమాయే. సాటిలేని అలమేల్మంగావిభుడవైన ఓ వేంకటేశ్వరా! ఇది ఎన్నడూ తగ్గని నీ మహిమ. ఇది ఎటువంటిదో తలపించవలెనా (గుర్తు చేయాలా?)

**పద్యవివరణ:**

ఆ.వె॥ **నిండియున్నదయ్య! నిఖిలంబు నీమాయ**
**ఒకరికొకరు జనులకోపినంత**
**ఏల పూని తాము ఇంతుపదేశించ**
**వలెను వేంకటేశ వసుధయందు.**

సంఖ్య: IV/30 (P381)     రాగం : కాంబోది
కీర్తన : తల్లి బాసి బిడ్డలెల్ల దల్లడించినట్టు

**కాంబోది**

**68** **తల్లిఁ బాసి బిడ్డలెల్లఁ దల్లడించినట్టు నా**
**పల్లదా లెవ్వరి పాలయ్యీనో తాము** ||పల్లవి||

**మేదరింటి లంజవోయి మేదినీశుఁ దగులఁగ**
**గోదిలి కువిటులెల్లఁ గుల్లినయట్టు**
**ఆదిగొని నేఁబోయి హరిఁ గొలువఁగ నా**
**గాదిలి కర్మములేడఁ గంటివో (దీనో?) తాము** ||తల్లి||

**కాఁపుటూరి మంగలోజుగడిమీఁది రాజుగాఁగ**
**కాఁపులెల్లాఁ బనిమాసి కందినయట్టు**
**ఆఁపలేక నేఁబోయి హరిఁ గొలువఁగ నా**
**పాపము లెవ్వరి పంచపాలయ్యీనో తాము** ||తల్లి||

**ఒట్టిన మోఁపులు మోవనోపక వూరువిడిచి**
**పెట్టివాఁడు పారిపోఁగా వెదకినట్టు**
**ఇట్టె నేను శ్రీవేంకటేశుఁ గొలువఁగ నా**
**చుట్టము లిందరు నేడఁ జొచ్చేరో తాము** ||తల్లి|| **31**

**ఉపోద్ఘాతము:**

తల్లి వదలిపెట్టిపోతే బిడ్డలు ఆ తల్లి కోసం తల్లడిల్లి పోతారుకదా! అలాగే నాలోని ధూర్తత్వములు వాటిగతేమవుతుందోకదా! అంటున్నారు అన్నమయ్య. ఈ కీర్తనలో అన్నమయ్య ఇచ్చిన ఉదాహరణలు అద్భుతంగా వుంటాయి. ఒక కులట పోయి ఆదేశపు రాజుగారిని తగులుకొంటే వ్యధ చెందినదాని విటులంతా కుళ్ళి కుళ్ళి బాధపడ్డారు. అదే విధంగా శ్రీకారం చుట్టి నేను శ్రీహరిని కొలుచుట మొదలుపెట్టగానే ప్రేమతో నావెంట తిరిగే కర్మములు





తాము యెక్కడికి మాయమయ్యాయో? అంటున్నారు. చూశారా యెంత చమత్కారంగా చెప్పారో!

**తాత్పర్య వివరణ:**

ప్రభూ! నాపల్లదాలు (ధూర్తత్వములు) తాము యెవ్వరి పాలయ్యీనో (ఎవరి పాలబడతాయో కదా!) వాటిగతి తల్లి వదలిపెట్టిపోయిన బిడ్డలమాదిరి అయింది. ఆ బిడ్డలెలా తల్లడిల్లిపోతారో నాలోని ధూర్తత్వములు కూడా కకావికలైపోయాయి.

మేదరింటిలంజ (కులటయైన ఆడుది) మేదినీశు (ఆ దేశపు రాజుగారిని) తగులుకొంటే, గోదిలి (బాధపడిన) కువిటులెల్లా (దాని దుర్మార్గులైన విటులందరూ, గుల్లినయట్లు (కుమ్మకొన్నట్లు) ఆదిగొని (శ్రీకారం చుట్టి) నేను పోయి శ్రీహరిని కొలచుట మొదలుపెట్టగానే నా ప్రియమైన కర్మములన్నీ తాము యెక్కడికి మాయమయ్యాయో కదా!

కాపుటూరి (కాపులున్న ఊరిలోని) మంగలోజు (మంగలి ఉపాధ్యాయుడు) గడిమీద రాజుగా (తమ సీమకు రాజు అయిపోయాడు). దానితో ఆ వూరి కాపులందరూ తమపని వదలివేసి కందినయట్లు (తాపము చెందారు). అదే విధంగా, ఇక ఆగలేక నేను పోయి శ్రీహరిని కొలుచుట మొదలుపెట్టగానే నా పాపములన్నీ పోయి ఎవ్వరి పంచను చేరాయో కదా!

ఒట్టిన మోపులు మోవనేరక (పైబడ్డ పనిభారం తట్టుకోలేక) ఒక వెట్టివాడు పారిపోయాడు. అయితే ఆ వూరి వాళ్ళు వాణ్ణి వదలిపెడతారా? వెదకి పట్టుకొని పని చేయించుకొంటారు. నా చుట్టాలు కూడా అంతే నన్ను వెదకి పట్టుకొంటున్నారు. ఒకసారి నేను శ్రీవేంకటేశ్వరుని శరణని కొలువగానే నాకు వారి పీడవదిలింది. వారంతాయెక్కడకు పోయారోగాని నన్ను వదలిపెట్టారు.

**పద్యవివరణ:**

కం|| **ఎవ్వరి పాలయ్యేనో**
**ఇవ్వలనాపల్లదాలు ఇందరవిభుడా!**
**ఎవ్విధితల్లిని బాసిన**
**సవ్వడిపిల్లలును యెట్లు చరియింతురొకో!**

సంఖ్య: IV/507 రాగం : శంకరాభరణం
కీర్తన : ఎంత భాగ్యవంతులమో యీతని బొడగంటిమి

**శంకరాభరణం**

**69** **ఎంత భాగ్యవంతులమో యీతనిఁ బొడగంటిమి**
**చెంతనుండి మమ్మునేలే శ్రీ విట్ఠలేశుఁడు** ॥పల్లవి॥

**తుంగభద్రాతటమున తొంటిపరబ్రహ్మము**
**అంగవించి సాకారమైవున్నాఁడు**
**సంగతితో రుక్మిణియు సత్యభామల నడుమ**
**చెంగలించీ మహిమల శ్రీ విట్ఠలేశుఁడు** ॥ఎంత॥

**అందపుఁ బైఁడిమేడలో నాదిమూర్తియైన దేవుఁ-**
**డందరికిఁ బ్రత్యక్షమై యున్నాఁడు**
**సందడించి గోపికాజనములతోడుత**
**చెంది వున్నాఁడిదివో శ్రీ విట్ఠలేశుఁడు** ॥ఎంత॥

**వెలసి వనాలలోన వేదవేద్యుఁడైన హరి**
**అలరి కృష్ణావతారమై యున్నాఁడు**
**యెలమి శ్రీవేంకటేశుఁ డితఁడే పదారువేల**
**చెలులతోఁ గూడినాఁడు శ్రీ విట్ఠలేశుఁడు** ॥ఎంత॥ **507**

**ఉపోద్ఘాతము:**

ఆహా! మేము యెంత భాగ్యవంతులమో కదా! యితని దర్శన భాగ్యము కలిగినది. ఈ శ్రీ విట్ఠలేశుడు మా సమీపమునేయుండి మమ్ము యేలినాడు అంటున్నారు అన్నమయ్య. ఈ విట్ఠలేశ్వరుడు తుంగభద్రా నదీతీరమున వెలసిన అనాది పరబ్రహ్మమట. నేడు అదే పరబ్రహ్మ సాకరరూపముతో వున్నాడు. రుక్మిణీ సత్యభామల నడుమ మహిమల విరజిమ్ముతూ





చెంగలించినాడు అంటున్నారు. పదహారువేల మంది చెలులతో కూడిన ఈ శ్రీవిట్ఠలుడే తిరుమల శ్రీవేంకటేశ్వరుడూను అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఆహా! మేము యెంత భాగ్యవంతులమో కదా! మేము ఈతనిని పొడగంటిమి (దర్శించగలిగాము). ఈ శ్రీ విట్ఠలేశ్వరుడు చెంతనుండి (మా సమీపముననే వుండి) మమ్ము యేలినాడు (పరిపాలించుచున్నాడు).

ఈయనెవరనుకొన్నారు, తుంగభద్రానదీ తీరమున వెలసిన తొంటె పరబ్రహ్మము (అనాది పరబ్రహ్మస్వరూపుడు). సంగతితో (చేరువయై తన భార్యలైన రుక్మిణీ సత్యభామల నడుమ చెంగలించీ (అతిశయించుచూ) తన మహిమలను ఈ శ్రీవిట్ఠలేశుడు ప్రదర్శించుచున్నాడు.

అందమైన పైడిమేడలో (బంగారు భవంతిలో) ఆదిమూర్తియైన ఈ విట్ఠలదేవుడు అందరికీ ప్రత్యక్షమైయున్నాడు. సంగడించి (జతయై) గోపీవనితలతో కూడి ఇదివో ఈ శ్రీ విట్ఠలేశుడు ఆ గోపికలతో (చెంది యున్నాడు) పొందుతో వున్నాడు.

వేదములద్వారానే గోచరుడైన శ్రీహరి నేడు ఈ అడవులలో వెలసి మనకు గోచరమగుచున్నాడు. నేడు ఈ శ్రీకృష్ణావతారముతో తన లీలలను ప్రదర్శించుచున్నాడు. ఒకటి గమనించారా? ఎలమి (సంతోషముతో) ఇతడే తిరుమల శిఖరాలపై శ్రీవేంకటేశ్వరుడై యున్నాడు. ఈ శ్రీవిట్ఠలేశుడు నరకాసురుని వధానంతరం అతను చెఱబట్టిన పదారువేల రాచకన్నెలను చెఱవిడిపించి వారందరి కోరిక మేరకు వారిని ఒకేసారి పరిణయమాడాడు. ఆ చెలులతో కూడియున్నాడు.

**పద్యవివరణ:**

ఉ॥ **ఎంతటి భాగ్యవంతులమొ ఈతనినే పొడగంటిమీ యెడన్**
**చెంతలనుండి మమ్ముయిటు శ్రీవిఠలేశుడయేలినావుగా**
**పొంతనెపైడిమేడలను పూని వసించితి వాది మూర్తివై**
**వింతగ వేంకటేశ్వరుడె విఠ్ఠలనాథుడు వేల భామలై.**

సంఖ్య: IV/46 (P392)  రాగం : మేచబౌళి
కీర్తన : అచ్చపురాల యమునలోపల

**మేచబౌళి**

**70 అచ్చపు రాల యమునలోపల**
**ఇచ్చగించి భుజియించితి కృష్ణ** ॥పల్లవి॥

**ఊరుఁగాయలును నొద్దికచద్దులు**
**నారగింపుచు నందరిలో**
**సారె బాలుల సరసాలతోడ**
**కోరి చవులు గొంటివి కృష్ణా** ॥అచ్చ॥

**ఆకసంబున కాపుర ముఖ్యులు**
**నాకలోకపు నాందులును (?)**
**కైకొని యజ్ఞకయ్తి యాతఁడని**
**జోకఁ గొనియాడఁ జొక్కితి కృష్ణా** ॥అచ్చ॥

**పేయలు లేవు పిలువుఁడనుచు**
**కోయని నోరఁ గూఁతలను**
**మాయల బ్రహ్మము మతము మెచ్చుచు**
**చేయని మాయలు సేసితి కృష్ణా** ॥అచ్చ॥ 46

**ఉపోద్ఘాతము:**

ఈ కీర్తనలో "వేంకట" మకుటంకానరాదు. ఈ కీర్తనలో నిఘంటువుకు దొరకని ఎన్నో పదములను భావించవలసి వచ్చింది. కౌమారదశలో యమునా నదీతటమున చద్దులు భుజించుచూ ఊరగాయ పచ్చళ్ళు నంజుకొంటూ అచ్చం ఒక గొల్లపిల్లవాడిలా జీవించాడు శ్రీకృష్ణపరమాత్మ. ఆకసంబున ఖేచరప్రముఖులు, స్వర్గలోకంలో నాందులును (దేవతా పురోహితులు) ఇతడే సర్వయజ్ఞకర్తయని నుతించి నమస్కరిస్తుంటే జోక





కొనియాడి (ఉత్సాహముగా కీర్తిస్తుంటే ఓకృష్ణా! చొక్కితివి (పరవశించితివి), అంటున్నారు అన్నమయ్య. స్వామి, అచ్చం లేగదూడలను కాసే గొల్లవాడిలాగానే "కో"యని కూతవేసేవాడట. ఏమి అద్భుతం!!

**తాత్పర్య వివరణ:**

యమునా నదిలోపలనున్న అచ్చపురాల (స్వచ్ఛమైన రాళ్ళపై కూర్చొని) ఇచ్చగించి (కడు ప్రీతితో) భుజించితివి. ఓ కృష్ణా! నిజమై గొల్లపిల్లవాడి జీవితమును గడిపితివి.

నీవు దేవదేవుడవు. అయినా గొల్లవారితో జీవించుచూ అందరిలోనూ ఒకడవై ఒద్దికతో (వినయముగా) చద్దులు (చద్ది అన్నము) ఊరగాయలు నంజుకొంటూ తిని అందరికీ పెట్టావు. సారె బాలుర (సాటిబాలురతో సరసాలాడుతూ కోరి వారు తెచ్చుకొన్న చద్దులను ఆరగిస్తూ కొత్తకొత్త రుచులు గొంటివి (ఆస్వాదించితివి). కృష్ణా! ఏమి నీ అవతార ఆవిష్కరణము!!

ఆకసంబున (గగనసీమలో) కాపురముఖ్యులు (ఖేచరప్రముఖులు), నాకలోకపు నాందులు (స్వర్గలోకవాసులైన దేవతాపురోహితులు) కైకొని (పూనుకొని), యజ్ఞకర్త యాతడేనని నిన్ను కీర్తిస్తుంటే, జోకగొనియాడ (ఉత్సాహముగా నిన్ను కీర్తిస్తుంటే) ఓ కృష్ణా! చొక్కితివి (ఏమిటిదంతా అని ఆశ్చర్యం నటించావు.)

కృష్ణా! నీవు పేయలను (దూడలను) కాస్తున్నప్పుడు అరె! దూడలు యెక్కడకుపోయాయి, పిలవండి అని పలుకుచూ "కో"యని తననోటితో కూసి వింతగా అరచేవాడివి. బ్రాహ్మణులవలంభించు మతమైన అద్వైతమతమును మెచ్చుకుంటూ దానిని అవలంభించమని బోధించితివి. ఓ కృష్ణా! నీవు చేయని మాయలు చేసితివి (ఇతరులెవ్వరూ చేయని మాయలు చేసితివి).

**పద్యవివరణ:**

ఆ.వె॥ **అచ్చమైన రాళ్ళ యమునా తటములోన**
**ఇచ్చగించి చద్దు లిటుభుజించి**
**ఊరగాయనంజి సురశ్రేష్ఠులనువిని**
**మాయనించినావు మధువిరోధి!**

సంఖ్య: IV/67 (P406)   రాగం : ముఖారి
కీర్తన : నెరబిరుదిన్నిటాను నీ బంటు

**ముఖారి**

**71 నెరబిరుదిన్నిటాను నీ బంటు**
**వొరసె గగనమదివో నీ బంటు** ॥పల్లవి॥

**ముంచిన చుక్కలు మొలపూసలుగాఁ**
**బెంచె మేను పెళపెళనార్చి**
**అంచులు మోవఁగ నబ్జభవాండము**
**నించె నార్భటము నీ బంటు** ॥నెర॥

**గగనలోకములు గడగడ వణఁకఁగ**
**నెగసె హుటాహుటి నీ బంటు**
**మగటిమి మొరయఁగ మందులకొండకు**
**నిగిడి కోయనుచు నీ బంటు** ॥నెర॥

**ఇమ్ముల రఘుపతి హితుఁడై సీతకు**
**నెమ్మన మలరిన నీ బంటు**
**కమ్మర నిదె వేంకటేశ నీచే**
**నిమ్మపండైన నీ బంటు** ॥నెర॥ **67**

**ఉపోద్ఘాతము:**

"నెరబిరుదు" అంటే (అతిశయించిన సమర్థుడు) అని అర్థం. అదిగో నీ బంటు వొరసెగగనము (ఆకాశమును తాకినాడు) అంటున్నారు అన్నమయ్య. హనుమంతుడు శ్రీవేంకటేశ్వరుని నమ్మిన బంటు అని కీర్తిస్తున్నారు. శ్రీవేంకటేశుని చేతినిమ్మపండట అంటే కరతలామలకము అన్నమాట. ఎప్పుడు కావాలంటే అప్పుడు ఉపయోగపడతాడు. నీ బంటు హుటాహుటి



హరి నీమయమే అంతాను

యెగయగా గగనమునవుండే లోకములన్నియు గడగడవణకినవట. ఆయన మందులకొండ దగ్గరకు వెళ్ళి 'కో'యని దానిని తెచ్చాడట.

**తాత్పర్య వివరణ:**

ఓ శ్రీవేంకటేశ్వరా! నీ నమ్మినబంటు అయిన ఈ హనుమంతుడున్నాడే, ఆయన నీ "నెరబిరుదు" బంటు (అతిశయించిన సమర్థుడైన) బంటు. అదిగో ఆకాశంలో నీబంటు ఎలా మెరసిపోతున్నాడో చూడు స్వామీ!

ఆయన గగనసీమలో యెగురుటకు తనకాయాన్ని అమితంగా పెంచివేశాడు. అప్పుడు గగనమున కిక్కిరిసిన చుక్కలు (నక్షత్రాలు) ఆయన మొలనూలు (రత్నాలమొలత్రాటివలె తళతళలాడింది.) పెళపెళనార్చి (పెళపెళమని బొబ్బలుపెట్టి) ఈయన తన కాయమును పెంచాడు. అట్టి భవాండము (బ్రహ్మాండమంతా) పెద్ద ఆర్భటముతో (మ్రోతతో నింపివేశాడు). అప్పుడు ఆయన శరీరం బ్రహ్మాండము అంచులను మోసింది.

అది చూచి గగనముపైనున్న లోకములన్నీ గడగడ వణికినవి. ఆలోకములు ఆశ్చర్యంతో చూస్తుండంగానే హుటాహుటి (అతివేగముగా) ఎగిరాడు. మగటిమిమెరయగ (తన వీరత్వము ద్యోతకమవుతుండగా) మందుల కొండకు (సంజీవని పర్వతము తెద్దామని) నిగిడి (వ్యాపించి) 'కో'యని అరచినాడు నీ నమ్మినబంటు హనుమంతుడు.

ఇమ్ముల (ఇంపుగా) రఘుపతికి హితుడై సీతాదేవికి నెమ్మనము (మనశ్శాంతిని) అలరించిన మహానుభావుడేనీ బంటు. కమ్మర (అటుపైన) ఓ శ్రీవేంకటేశ్వరా! నీచే (నీచేతిలోని) నిమ్మపండైనవాడు నీ బంటు. (పూర్వకాలంలో ఎక్కడికన్నా దూరప్రయాణాలు చేయాలంటే దాహానికి వుపశమనంగా నిమ్మకాయ నీళ్ళు తాగేవారు. నిమ్మపండు మన చేతుల్లోనేవుంటే దిగులే లేదు కదా! అప్పటికప్పుడు వాడుకోగలవాటిని 'కరతలామలకం' అంటారు.

**పద్యవివరణ:**

కం॥ **నెరబిరుదు యిన్నిటను నీ**
**అరచేతిని నిమ్మపండు ఆయెనుహనుమే**
**మెరసెనుగగనంబదివో**
**తిరువేంకటనాథు గొల్చు దీటగు బంటౌ.**

సంఖ్య: IV/70 (P408)      రాగం : శ్రీరాగం
కీర్తన : ఇందిరకు నురముమీదిచ్చిన నాడు

## శ్రీరాగం

72 ఇందిరకునురముమీఁదిచ్చిన నాఁడు
విందువలె హరియిందు విచ్చేసె నాఁడు ॥పల్లవి॥

పరమపదమునందు బహుదివ్యవరణాలు
హరి గరిమలు పొలుపలరు నాఁడు
గరుడఁడు ననంతుఁడుఁ గదిసి సేనేశుఁడు
హరి నిత్యసేవకులైరిందు నాఁడు ॥ఇందిర॥

పాలజలధిలోనఁబవళించి హరి వచ్చి
భూలోకమింతయుఁ జూచి పొగడునాఁడు
పాలించినేలయు మిన్ను బహుదివ్యదేశాలు
గాలించి కోనేటిదరి గైకొంట నాఁడు ॥ఇందిర॥

నరసురోరగులెల్ల నలువంకఁ గొలువంగ
పురవైన వేడుకలఁ బొదలునాఁడు
విరజానదియుఁ దాను వేంకటపతి వచ్చి
పరమపదమిదని పాలించె నాఁడు ॥ఇందిర॥ 70

**ఉపోద్ఘాతము:**

ఇది బహుతేలికగా అనిపిస్తున్న అన్నమయ్య కీర్తన. కాని తరచి చూస్తే ఇది అంత సులువైన కీర్తన కాదు సుమండీ!ఇందులో చరణాల చివరవస్తున్న 'నాడు' అన్న పదమును ఆనాడు అన్న అర్థంతో వివరించవలసి వుంటుంది. ఇందిరకు తన వురముపై చోటు ఇచ్చిననాడు శ్రీహరి విందు స్వీకరించువానివలె యిందు ఈ వైకుంఠమున నాడు విచ్చేసెను. అప్పటినుండి అదే అతని స్థానమైనది. ఈనాటికి విరజానది అనే వైకుంఠంలో పారేనదితో సహా భూమిపైశ్రీవేంకటాద్రి చేరి వేంకటపతియై శ్రీహరి వచ్చినాడు.ఆ





తరువాత ఓ మానవులారా! పరమపదమంటేఇదేనర్రా అని బోధించి పాలించినాడు. వైకుంఠవాసియైన శ్రీహరినే ముగ్ధుని చేసిందంటే ఈ కోనేటిదరి గొప్పతనంఏమని చెప్పగలము?అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

సముద్రరాజతనయ అయిన ఇందిరాదేవిని పరిణయమాడునాడు (వేళ) శ్రీమన్నారాయణుడు పెళ్ళి కానుకగా ఆమెకు తన వురముపై (వక్షస్థలమున) నివాసమునిచ్చినాడు.ఇందు (ఈ వైకుంఠమునకు) ఆమెతో శ్రీహరి, విందువలె (వైభోగముతో) నాడు (ఆవేళ) విచ్చేసె (అరుదెంచినాడు).

ఆయన నివాసమైన పరమపదమునందు(వైకుంఠమున) అనేక దివ్యమైనవర్ణములతో దేదీప్యమానంగా వుంటుంది. ఆయన వైకుంఠ ప్రవేశమునాడు శ్రీహరి గరిమలు (మహిమలన్నియు) పొలుపుఅలరినవి (అతిశయించినవి). అందు (ఆ వైకుంఠమున) గరుత్మంతుడు, అనంతుడు (ఆదిశేషుడు), సేనేశుడు (విష్వక్సేనుడు) శ్రీహరినిత్య సేవకులైరి.

నాటినుండి శ్రీహరి పాలజలధిలో (క్షీరసాగరమున) ఆదిశేషునిపై పవ్వళించుట మొదలుపెట్టినాడు. ఒకనాడు శ్రీహరి భూలోకమును సందర్శించి ఇంతయు దీని అందాలన్నీ తిలకించి ఆ సౌందర్యాన్ని పొగడటం మొదలుపెట్టాడు. చాలాకాలం ఈ నేలను పాలించి ఆకాశంలో కంటే ఇక్కడ అనేక దివ్యదేశాలు వున్నాయని కనుగొన్నాడు.నాడుఈ భూమినంతా గాలించి తిరుమలలో స్వామి పుష్కరిణి అనే కోనేటిఒడ్డు తన స్థానముగా స్వీకరించాడు.

ఆ శ్రీహరిని నరులు, సురులు, ఉరగులు (సర్పములు) నలువంక (అన్నివైపులనుండీ) కొలుస్తుండగా నాడు, పురవైన (మిక్కుటమైన)వేడుకలు (సంతోషములు) పొదలె (వర్ధిల్లినవి). వైకుంఠంలో వుండే విరజానది, స్వామితో వచ్చి ఇక్కడ ఒకనదియై ప్రవహించినది. నాడు ఇదేనర్రా పరమపదము అని శ్రీవేంకటేశ్వరుడై పాలించడం ప్రారంభించాడు.

**పద్యవివరణ:**

తే.గీ॥ **ఇందిరకు తన వురముపై ఇచ్చునాడు**
**విందుగొనువాని వలె హరి! విడిసె నాడు**
**సర్వమును జేరె వేంకట సార్వభౌమ**
**పరమపదమిదియేనని పలికెనాడు.**

సంఖ్య: IV/51 (P395)    రాగం : పాడి
కీర్తన : కలుషపు చీకటి గలుగగను

**పాడి**

**73 కలుషపు చీఁకటి గలుగఁగను**
**వెలుఁగు లోకముల వెలసిన యట్లు** ||**పల్లవి**||

**మునుకొని పాతకములు గలుగఁగఁబో**
**జనులకుఁ బుణ్యము చవులాయ**
**ఇనుము గలుగఁగా ఇందరి యెదిటికి**
**కనకము ప్రమోదకరమైనట్లు** ||**కలుష**||

**జగములోపల విషముగ గలుగఁ బో**
**మిగులఁగ నమృతము మేలాయ**
**వగపు గలుఁగఁగా వడి సంతోషం**
**బగపడుటిందరి కబ్బురమాయ** ||**కలుష**||

**బహుదైవంబుల ప్రపంచవిదులఁ బో (?)**
**మహిమల శ్రీహరి మనసాయ**
**విహగగమనుఁడగు వేంకటేశ్వరుఁడు**
**ఇహమియ్యఁగఁ బరమిచ్చైనట్లు** ||**కలుష**|| **51**

**ఉపోద్ఘాతము:**

లోకమున పాపపు చీకట్లు పొడచూపిన తరువాతనే, అంధకారము పోయి వెలుగు వెలసినది. అట్లే పాతకము తరువాతనే ప్రజలకు పుణ్యము చేయుటయందు ఆసక్తి పెరిగినది. మొదట లోకములో ఇనుమే వుపయోగించబడింది. ఆ తరువాతనే నరులకు బంగారము యొక్క ప్రాశస్త్యము తెలిసి గొప్పఆనందదాయకమైనది. క్షీరసాగరమధనమున మొదట వెలువడినది విషమే. అటుపిమ్మటనే అమృతము పుట్టినది. మొదట దుఃఖము ఆ తరువాతనే





సంతోషము కలుగుతాయి. ముందు అన్య దేవతలపై అనురక్తి కలిగి తగ్గినాకనే శ్రీహరిపై మనసు నిలబడుతుంది. శ్రీవేంకటేశ్వరుడు కూడా ముందు ఇహమునిచ్చాకే పరమునిస్తాడు అంటున్నారు అన్నమయ్య.

**తాత్పర్య వివరణ:**

కలుషపు చీకటి లోకమున గలుగగను (లోకమున పాపపు చీకటి ఆవరించిన పిమ్మట మాత్రమే) వెలుగు (వెలుతురు) వెలసినది (అతిశయించినది). అట్లే ముందు చెడు లోకములను బాధించిన తరువాతనే శ్రీహరి కృప కలుగుతుంది.

మునుకొని (ముందుగా) పాతకము లోకములో చెలరేగిన తరువాతనే జనులకు ఎంతకాలం ఇలా పాపాలు చేస్తాము. పుణ్యకార్యం చేసి పదిమందిచేత మంచి అనిపించుకోవాలనే కోరిక కలుగుతుంది. మొదట లోకములో ఇనుమే వుపయోగించబడింది. ఆ తరువాతనే బంగారము మనిషికి లభ్యమయింది. ఇందరి యెదిటికి వచ్చిన ఆకనకము అంతులేని ప్రమోదము (ఆనందము) నిచ్చింది.

క్షీరసాగరమధనమున ముందు ఆవిర్భవించింది కాలకూటవిషమే. ఆ తరువాతనే అమృతము మిగులుగ (సమృద్ధిగా) మేలాయె (మేలు కలిగించింది). ముందు వగపు (దుఃఖము సిద్ధించుతుంది). అది తట్టుకొని నిలబడినవానికే ఆపైన వడిగా సంతోషము ప్రాప్తిస్తుంది. ఆ సంతోషం కూడా జీవితాంతమూ వుండదు. కష్టసుఖాలు సుఖదుఃఖాలూ కలుగుతూనే వుంటాయి. దీనికి విచారించరాదు.

పైన చెప్పినట్లు కష్టాలు ప్రాప్తించగానే నరులు కకావికలై ప్రపంచంలో తెలిసిన దేవతలనందరినీ ఆశ్రయిస్తారు. పోండి. ఇక వారికేం చెబుతాం? విహగగమనుడు (పక్షులకు రాజైన గరుత్మంతునిపై ప్రయాణించు శ్రీవేంకటేశ్వరుడు ముందు ఇహలోకములో సుఖదుఃఖాలనిస్తాడు. అవి తట్టుకొని ఆయనపై నమ్మకం వుంచితేనే పరమునిస్తాడు (మోక్షప్రాప్తి), కలుగుతుంది.

**పద్యవివరణ:**

కం|| **కలుగగ కలుషపు చీకటి**
**వెలుగులు లోకమున తాము వెలసినయట్లే**
**కలుగగ పాతకమాపై**
**సలలితమగు పుణ్యమనిన చవులూరె హరీ!**

సంఖ్య: IV/359 రాగం : సామంతం
కీర్తన : ఎల్లలోకములవారి కేలిక దానే

**సామంతం**

**74 ఎల్లలోకములవారి కేలిక దానే**
**కొల్లగావరములిచ్చేగురుతైనదైవము ||పల్లవి||**

**కొండల కోనలలోన కోనేటిసరిదండ**
**మెండైనబంగారుమేడలలోన**
**నిండుజవ్వనముతోడినెలంతకౌఁగిటలోన**
**వుండి జగమెల్ల నేలీ నుద్దండదైవము ||ఎల్ల||**

**నాలుగుచేతులతోడ నవ్వులమోముతోడ**
**సోలి సంకుఁజక్రముల సొంపుతోడ**
**నేలమిన్నునొకటైనిలుచున్న రూపుతోడ**
**పాలుపడి మెరసీని ప్రత్యక్షదైవము ||ఎల్ల||**

**సంపదలు కడుమించి చవులతో నారగించి**
**జొంపపు విరులపూజ సొంపుమించి**
**యింపుల శ్రీవేంకటాద్రి నిరవై వున్నాఁడు వీఁడె**
**పంపుడుదేవతలతోఁ బ్రతిలేనిదైవము ||ఎల్ల|| 359**

**ఉపోద్ఘాతము:**

ఈ విశ్వములోనున్న లోకములలో వున్న వారందరికీ ఏలిక శ్రీహరియే సుమండీ! ఈయన యెంత జగత్ప్రసిద్ధుడైన దైవమంటే ఈయన తన భక్తులైనవారికి కోకొల్లలుగా వరములనిస్తాడు అంటున్నారు అన్నమయ్య. మరి భూలోకంలో ఆయన నివాసమెక్కడ? కొండల కోనలలో కోనేటి ఒడ్డునట. అక్కడ బంగారు మేడలో వుంటాడట. ఇంకోచోట కూడా వుంటాడు. రాత్రయితే నిండుయౌవనముతో నున్న నెలత అలమేల్మంగ కౌగిట్లో వుంటాడట. ఇక శృంగారమే ఆయన ప్రవృత్తి అనుకొంటున్నారా?





పొరబాటు. ఈ జగమెల్లనేలే ఉద్దండ దైవము ఈయనే అంటున్నారు. అఖండ సిరిసంపదలున్న ఈ శ్రీవేంకటేశ్వరుడు చవులూరె ప్రసాదములను నైవేద్యంగా స్వీకరిస్తున్నాడట.

**తాత్పర్య వివరణ:**

తానే (ఆ శ్రీవేంకటేశ్వరుడే) ఎల్లలోకములవారికి (చతుర్దశ భువనముల వారికి) యేలిక (ప్రభువు). ఈ దైవము కొల్లగా (విరివిగా) వరములిచ్చే గురుతైన (సర్వశ్రేష్ఠుడైన) మహానుభావుడు.

కొండలు మెండుగావుండే, కోనలలోన (అడవిలో) మెండైన (శ్రేష్ఠమైన) బంగారు మేడవున్నది. దానిలో నిండు జవ్వనముతో (పూర్ణ యౌవనముతో) వున్న నెలత (మన అలిమేల్మంగ) యొక్క కౌగిటిలో నెలకొని జగమెల్లనేలే (విశ్వమునంతా పరిపాలించు) ఉద్దండదైవము (పొడవైన దేవుడు) ఈ శ్రీవేంకటేశ్వరుడే సుమా!

చతుర్భుజములతోడ చిరునవ్వులొలికే ముఖముతోడ శంఖచక్రముల సొపుతోటి (అతిశయముతో) ఆకాశమునేల ఒక్కటై నిలిచిన రూపముతో పాలుపడి (సంప్రాప్తించి) మెరసీని (వెలుగులు విరజిమ్ము) ప్రత్యక్షదైవము ఈ శ్రీవేంకటేశ్వరుడు.

సంపదలు కడునించి (అనేకమైన సిరిసంపదలు) మించినవి (అతిశయించినవి). అటుపై ఈ దేవదేవుడు చవులతోనారగించి (రుచులను ఆస్వాదించుచు భుజించినాడు.) అటు పిమ్మట, జొంపపు (నిరంతరము కొనసాగే) పుష్పపూజ ఆస్వామి అందమును ద్విగుణీకృతము చేసినది. ఈ శ్రీవేంకటేశ్వరుడు ఇంపైన శ్రీవేంకటాద్రి నివాసమైయున్నాడు. పంపుడు (ఆజ్ఞాపింపబడిన) దేవతలతో పూజింపబడుతున్న ఈ దేవుడు ప్రతిలేని (సాటిలేని) దైవము.

**పద్యవివరణ:**

ఉ|| **ఎల్లప్రపంచవాసులకు ఏలిక తానగు వేంకటేశుడే,**
**కొల్లగనిచ్చుగా వరము కోర్కెలదీర్చెడి దైవమీతడే**
**చల్లనికొండలన్ వెలసి చక్కటి పుష్కరిణీ తటిన్ ఇదే**
**తొల్లిటిదైవమై సురలతో ప్రతిలేకయె మించినాడు బో.**

సంఖ్య: IV/523 రాగం : సామంతం
కీర్తన : సమసె రావణుఁడు సమరములోపల

## సామంతం

**75 సమసె రావణుఁడు సమరములోపల**
**అమరులు కడు ముదమందిరి మెరసి** ||పల్లవి||

**బెరగిరి రాముని శరముల కసురలు**
**సురిగిరి పోట్లచురుకునను**
**తొరిగిరి నెత్తుటఁ దునియలు సేసిన**
**తిరిగిరి తరుమఁగ దిక్కులకు** ||సమసె||

**కూలిరి భల్లూకుల ఘోషములకు**
**వాలిరి వాయుజవాలహతి**
**వీలిరి యంగదు వివిధనాదముల**
**తూలిరి సుగ్రీవు దోర్బలమునను** ||సమసె||

**దాఁగిరి లక్ష్మణు దాకకు నులుకుచు**
**వీఁగిరి వనచర వితతికిని**
**పాఁగి శ్రీవేంకటపతి కృపారసమునఁ**
**దోఁగిరి జనులు సంతోసంబునను** ||సమసె|| **523**

**ఉపోద్ఘాతము:**

అన్నమయ్య విరచించిన ఈ కీర్తనలో వీరరసము తాండవిస్తుంటుంది. రఘురామునిచే రావణ సంహారం దీని ఇతివృత్తం. నేను ఈ కీర్తనను ఎన్నుకున్న ముఖ్య ఉద్దేశ్యం ఇందులో దాదాపు ప్రతి చరణంలోనూ ఒక తెలియని తెలుగు మాటవుంది. 'సురగిరి' అంటే తెలుగు పండితుడు కానివాడికి తెలుస్తుందా? ఆనాటి జనులు కూడా నేటివారివలెనే





సంతోసంబున శ్రీవేంకటేశ్వరుని సన్నుతించారట. అందుకే అన్నమయ్య అంటే ఆ ఏడుకొండలవాడికంత ఇష్టం. ఇందులో చాలామాటలకు నిఘంటువుల్లో అర్థాలు దొరకలేదు. సందర్భాన్నిబట్టి భావించవలసి వచ్చింది.

**తాత్పర్య వివరణ:**

సమరములోపల (యుద్ధములో) రావణుడు సమసె (అంతమయ్యాడు). అమరులు (దేవతలు) మెరసి (శోభాయమానంగా) కడుముదమందిరి (విశేషముగా ఆనందించిరి).

అసురలు (రాక్షసులు) రాముని శరములకు (శ్రీరాముని అస్త్రములకు) బెరగిరి (బెదిరిపోయారు). బాణములు వారికి నాటుకొనగా ఆ పోట్లు చురుక్కుమనగా సురగిరి ఎక్కడెక్కడికో పారిపోయి మటుమాయమై పోయారు. తమను తునియలు (ముక్కలు ముక్కలుగా) చేయగా నెత్తురులో తొరిగిరి (పడిపోయారు). దిక్కులు బట్టి తరుముకొస్తున్నట్లు తిరుగులాడారు.

దైత్యులు జాంబవంతుని భల్లూకసేన ఘోషములకు (అరుపులకు) కూలిరి (కొంతమంది భయంతో చచ్చిపోయారు). వాయుజ (హనుమంతుని) వాలహతి (తోకదెబ్బలకు) వాలిరి (పడిపోయారు). అంగదుడు చేసిన అనేక ధ్వనులకు, వీలిరి (విలవిలలాడిపోయారు). సుగ్రీవుడి బలసంపదను చూచి భయంతో తూలిరి (తూలిపడ్డారు).

అసురులు లక్ష్మణుని యెదురుదాడికి ఉలుకుచు (ఉలిక్కిపడుతూ) దాగిరి (పారిపోయి దాగికొన్నారు). వనచరవితతికి (వానర సమూహముల శక్తికి) వీగిరి (బలహీనపడ్డారు). ఆనాడు రావణ సంహారం అట్లా జరిగితే ఈనాడు తిరుమలలో శ్రీవేంకటేశ్వరుడైన రఘురాముని కృపారసమున జనులు సాగి (ఆస్వాదించి), సంతోషములో దోగిరి (దోగాడారు).

**పద్యవివరణ:**

చం|| **సమసెను రావణుండు తనుసంగరమందున బంధుకోటితో**
**అమరులు మోదమంది కడు ఆ రఘురాముని సన్నుతించి మా**
**శ్రమలిటుబాసె ఏలుమిక జానకితోడుత పృథ్వినంతయున్**
**అమలుడు వేంకటేశ్వరుడు ఆయె ప్రసన్నుడు అన్నమయ్యనెన్.**

సంఖ్య: II/206 రాగం : శంకరాభరణం
కీర్తన : కలది యీ మూర్తి వల్ల గతి గనవలెను

### శంకరాభరణం

**76** కలది యీ మూర్తి వల్ల గతి గనవలెను
యిల నిందు నమ్మకుంటే యెందు మరిలేదు ॥పల్లవి॥

కంటిమా బ్రహ్మమును వేంకటపతిఁ గనినట్టు
కంటిమా అవతారాలు కతలె కాక
కంటిమా హృదయములోఁ గలిగిన దైవమును
కంటిమా వైకుంఠము కడవారైనాను ॥కల॥

తెలిసీనా జ్ఞానము యీదేవుని మహిమవలె
తెలిసీనా వేదాలు సందేహమే కాక
తెలిసీనా మాయ యిది యెంత చదివినా
తెలిసీనా ముందరితెరువు వెదకితే ॥కల॥

చిక్కీనా మనసు యీ శ్రీవేంకటేశ్వరువలె
చిక్కీనా ధ్యానము వట్టి చింతలే కాక
చిక్కీనా అనాదినుండి చిగిరించీకాలము
చిక్కీనా పెద్దలుచెప్పే జితమైనశాంతి ॥కల॥ **206**

**ఉపోద్ఘాతము:**

మనకు కలిగిన ఈ మూర్తివల్ల సద్గతి గనవలెను. ఈ భువిపై ఈ స్వామిని నమ్ముకుంటే ఇక సద్గతి యెందునూ మరిలేదు అంటున్నారు అన్నమయ్య. మానవమాత్రులమైన మనకు పరబ్రహ్మ స్వరూపము గోచరమవుతుందా? ఆ శ్రీహరి అవతారాలగురించి విన్నామే కాని కన్నామా యేమన్నానా? హృదయస్థుడైన దైవమును దర్శించుట సాధ్యమా? కడవారైనాను వైకుంఠమును చూచితిమా యేమి? అది సాధ్యమవదు. మరి సులభ సాధ్యమేది? తిరుమలలో శ్రీవేంకటపతి దర్శనం అత్యంత సులభం. ఈ





జన్మకు అది దక్కించుకొన్న చాలదా? అంటున్నారు. ఆ తిరుమలయ్య కృపలేక సుఖమూలమైన శాంతి లభ్యమవదు అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ భక్తులారా! యీమూర్తి (సాకారుడైన ఈ దైవశిఖామణి మూర్తి) వల్లనే భూలోకవాసులమైన మనము గతి (వైకుంఠపదవి) కనవలెను (పొందవలెను). అదిక్కడనే కలది (లభించునది). భూమిపై ఇందు (ఈ ప్రపంచంలో) ఈ స్వామిని నమ్ముకుంటే (శరణాగతినుండకుంటే) యెందు (ఊర్ధ్వ అధోలోకాలలో) ఎందునూ ముక్తిరాదు.

మనము కంటిమా బ్రహ్మము (పరబ్రహ్మయై నిరాకార నిరంజనుడైన వానిని దర్శించగలమా?) కతలె పురాణగాథల రూపంలో శ్రీహరి అవతారాలను వూహించుటయే కానీ నరమృగరూపుని చూడగలమా? మన హృదయంలోనే పరమాత్మ అంతర్యామిగా వుంటాడు కాని మనము ఆత్మ దర్శనం చేయగలమా? వైకుంఠమును, కడవారైనాను (ఇది ఆఖరి జన్మ అయినా) కంటిమా (చూశామా)? ఇదిగో తిరుమల వేంకటపతిని కనినట్లు వాటిని కనగలమా?

ఈదేవుని మహిమ పామరులకు కూడా అనుభవమవుతుంది. కానీ ఆయన గూర్చిన జ్ఞానము అంత సులువుగా కలుగుతుందా? వేదముల ద్వారా ముక్తి పొందాలనుకొంటే సందేహాల పరంపర తప్పించి భగవత్ తత్త్వము తెలుస్తుందా? శాస్త్రములు, వేదాంగములు యెంత చదివినా? భగవంతుడి మాయ యెటువంటిదో అర్థమవుతుందా? ఎంత శోధించినా ముందరి తెరువు (భవిష్యత్తులో ఏ జన్మ వస్తుందో చెప్పగలమా?) అసాధ్యం.

ప్రపంచ తాపత్రయంవున్న వారికి ఈ శ్రీవేంకటేశ్వరునిపై మనస్సు లగ్నమవుతుందా? ఈ నిరంతరమైన చింత (దుఃఖము) కాక స్వామిమీద ధ్యానము కుదురుతుందా? అనంత ప్రవాహంలా వస్తున్న కాలము నడక అర్థమవుతుందా? పెద్దలు చెప్పే చిత్త శాంతి సులభంగా చిక్కుతుందా?

**పద్యవివరణ:**

కం॥ **ఈమూర్తివల్ల సద్గతి**
**నీమముగా గనగనగును నిలుపుచు గురినే**
**ఏమరచి నమ్ముకుంటే**
**స్వామీ! మరిలేదు దారి వసుధజనులకున్.**

సంఖ్య: XV/288   రాగం : లలిత
కీర్తన : నే నన్నిటా గ్రూరుడ నీవే గతిగా వచ్చితి

**లలిత**

**77 నే నన్నిటాఁ గ్రూరుఁడ నీవే గతిగా వచ్చితి**
**మానక న న్నేలుకొని మన్నించ వలెను ॥పల్లవి॥**

**నేరమి సేసినవాఁడు నెమ్మి యింటికి వచ్చితే**
**మారుకొన కన్నియును మఱవవలె**
**కారులు వల్కినవాఁడు గక్కునఁ బంత మిచ్చితే**
**నేరపుల నేస్తములే నెఱపఁగ వలెను ॥నే నన్నిటా॥**

**పగవాఁడైనవాఁడు బంటనని మొక్కితే**
**సొగసి లోఁగొని కృపఁజూడవలెను**
**వెగటున నానదోసి వెఱపుమాలినవాఁడు**
**అగపడి యాజ్ఞవెట్టుమంటే మానవలెను ॥నే నన్నిటా॥**

**ధనమెత్తుకొన్నవాఁడు తానే వచ్చి పనివేళ**
**ననిమొన నిల్చితేఁ జేకొనవలెను**
**వనరి యజ్ఞానమువాఁడ నిన్ను నుతించితి**
**ఘనుఁడ శ్రీవేంకటేశ కావవలె నన్నును ॥నే నన్నిటా॥ 288**

**ఉపోద్ఘాతము:**
ఇది అన్నమయ్య సుపుత్రుడు పెదతిరుమలయ్య రచించిన కీర్తన. దీనినాస్వాదిస్తే ఆయన తండ్రికి తగ్గ కొడుకే అని సుస్పష్టమవుతుంది. ప్రభూ! నేను జన్మతః క్రూరుడనైనందువల్ల నీ భక్తి అంటే యేమిటో తెలియకుండానే పెరిగాను. అప్పుడు నా జీవితంలోకి నీవేగతిగా వచ్చావు. ధన్యుడను. కానీ మానక నన్ను యేలుకొని మన్నించవలెను.





**తాత్పర్య వివరణ:**
ఓతిరుమలేశా! నేనుఅన్నిటా (అన్నివిధములా) క్రూరుడను (దుర్మార్గుడను) నా ప్రవర్తన మారదు. నీవే గతిగా (దిక్కువలె) వచ్చి, మానక (వదలిపెట్టక) నన్నేలుకొని (నన్ను పరిపాలించి) మన్నించవలెను లేనిచో నాగతి అధోగతియే.

నీపట్ల నేరముచేసినవాడు తనపొరపాటును తెలుసుకొని నెమ్మి (నెమ్మదిగా) నీ ఇంటికి వచ్చితే (వస్తే) మారుకొనక (యాగీ చేయక) అన్నీ మఱచి క్షమించవలెను. కారులు వల్లినవాడు (పరుషవచనములతో నిందించినవాడు) వునట్లుండి తన పొరబాటు గ్రహించి, పంతమిచ్చితే (పట్టుదలలు మఱచి) నీ స్నేహం కోరితే నేర్పు ప్రదర్శించి స్నేహహస్తం ముందుకు చాచాలి. మానవులకే ఇవి ధర్మాలైతే పరమాత్మవు నీకు వేరే చెప్పవలెనా?

నీవు ద్వేషించే పగవాడైనా "దాసోహం" అని నీకు మొక్కితే తను నీ బంటునని ఆశ్రయిస్తే, సొగసి (ఇంపుగా) లోపలికాహ్వానించి దయ చూపించవలెను. వెఱపు మాలినవాడు (బరితెగించినవాడు) వెగటున (ద్వేషముతో) నానదోసి (పనివేళా) నీయెదుట బడి ఆజ్ఞాపించి, పెట్టమంటే (నీదగ్గరవున్న ధనం అక్కడ పెట్టమంటే) వానిని మన్నించవలెను. ఇవి నరజాతి కారుణ్య ధర్మాలు. నీవు దేవదేవుడవు అది నీ ధర్మముకంటే నీ స్వభావము.

నీధనమునెత్తుకొని వెళ్లినవాడు తానే పనివేళా వచ్చి నీ కత్తిమొనయెదుట నిలచి తనను క్షమించమంటే వాడిని త్యజించి నిరాకరించరాదు. వ(ఒ)నరి (అతిశయించి) నేను అజ్ఞానిని. నిన్ను నుతించగానే, నేనూ ఘనుడనైపోయాను ఓ శ్రీవేంకటేశా! నన్నునూ కాపాడవలెను తండ్రీ! యేలుకొని మన్నించవలెను, అంటున్నాడు పెదతిరుమలయ్య. మనకు అపకారము చేసినవాడు తన తప్పు తెలుసుకొని మన ఇంటికి వచ్చి క్షమాపణ అడిగితే వాడిని యెదిరించక అన్నియు మరచి ఆదరించవలెను. పరుషవచనములతో నిందించినవాడు వున్నట్లుండి తన పగ వదిలేస్తే, వాడిని దెప్పక స్నేహము పంచవలెను అంటున్నారు.

**పద్యవివరణ:**
తే.గీ॥ **నేను అన్నిటా క్రూరుడ నీవెగతిగ**
**వచ్చితిని నన్ను మన్నించవలెను గాక!**
**మానకయె నన్ను యేలుము మదన జనక!**
**ఘనుడ! శ్రీవేంకటేశ్వర! కావవయ్యా!**

సంఖ్య: II/44 రాగం : ధన్యాసి
కీర్తన : హరిదాసులతోడ నల్పులు సరెనరాదు

**ధన్యాసి**

**78 హరిదాసులతోడ నల్పులు సరెన రాదు**
**గురుఁడు శిష్యుఁడుననే గుతిదప్పుఁగానా ॥పల్లవి॥**

**కోరి ముత్యపుఁ జిప్పలఁ గురిసిన వానయు**
**సారెఁ బెంకులలోవాన సరియౌనా**
**శ్రీరమణుఁ డిన్నిటానుఁ జేరియుంటే నుండెఁగాక**
**సారెకుఁ బాత్రాపాత్రసంగ తింతాలేదా ॥హరి॥**

**మలయాద్రిమాఁకులును మహిమీఁదిమాఁకులును**
**చలమున నెంచిచూడ సరియౌనా**
**అలరి దేవుఁడు అంతర్యామియైతే నాయఁగాక**
**తెలియఁగ క్షేత్రవాసి దిక్కులందు లేదా ॥హరి॥**

**అమరులజన్మములు నసురలజన్మములు**
**జమళిఁ బుట్టినంతలో సరియౌనా**
**అమరి శ్రీవేంకటేశుఁ డాతుమైతే నాయఁగాక**
**తమితో నధికారిభేదములు లేవా ॥హరి॥**

**ఉపోద్ఘాతము:**

హరిదాసులెక్కడ? అల్పులైన కామక్రోధపరితప్త మానవాళి యెక్కడ? గురుడు శిష్యుడు అన్న తేడా లేవా? ఇద్దరూ ఒక్కటే యెట్లా అవుతారు? అలా అనుకొనే లక్ష్యమే దోషభూయిష్టము, అంటున్నారు అన్నమయ్య. ముత్యపు చిప్పలోపడ్డ చినుకే ముత్యమవుతుందికాని పెంకులలో కురిసిన చినుకు ముత్యమవుతుందా? రెండు చినుకులు సమానమవుతాయా? శ్రీరమణుడు ప్రతి ప్రాణిలో జేరియుండుగాక, అంతమాత్రాన పాత్ర





అపాత్రుల మధ్య అంతరం లేదా? ఇదేమి చోద్యం. మలయపర్వతంమీద వుండే చందనపు చెట్లు భూమిమీదున్న మాకులు రెండూ ఒకటేనా? రాక్షసజన్మలకు సురశేఖరుల జన్మకు తేడా లేదా? అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

హరిదాసులతో అల్పులైన కామక్రోధపరితప్త మానవులు సరెనరాదు (సరియని అనరాదు). గురుడు శిష్యుడు సమానమనే గుతి (ఆలోచనే) తప్పు (లోపభూయిష్టము).

బహు అరుదైన ముత్యపు చిప్పలలో కురిసినవాన, సారె సామాన్యమైన పెంకులలో కురిసిన వాన సరియౌనా (సమానమవుతాయా?) శ్రీరమణుడు ఇన్నిటాను (ఈ సమస్త జీవులలో) చేరియుంటే ఉండుగాక, అంతమాత్రాన పాత్రుల అపాత్రులమధ్య అంతరం లేదా? ఏమిటీ విడ్డూరము? హరి భక్తులు పామరులు ఒకటే యెలా అవుతారు?

మలయ పర్వతము మీదనున్న చందన వృక్షాలకు భూమిపైనున్న అసంఖ్యాకమైన మానులును చలమున తొందరపాటులో యెంచి చూస్తే సరిసమానమవుతాయా? దేవుడు (పరమాత్మ) అలరి (అతిశయించి) అందరిలో అంతర్యామియైతే అయివుండవచ్చుగాక! ఆయన నెలకొన్న క్షేత్రాలలో (తనువులలో) తేడా, దిక్కులందు (జగత్తులో) లేదా?

దేవతల జన్మలకు దైత్యుల జన్మలకు జమళిపుట్టి నంతలో (ఒకే తండ్రికి పుట్టినంత మాత్రాన) సమానమయ్యాయా? మొదటి వారు హరి భక్తులైతే రెండవవారు హరి విముఖుడుకాలేదా? అందరిలోను శ్రీవేంకటేశ్వరుడు ఆత్మరూపుడై వుంటే వుండవచ్చుగాక! అధికారికీ వేరొక అధికారికి మధ్యభేదమే లేదా?

**పద్యవివరణ:**

కం॥ **హరిదాసులతో నల్పులు**
**సరియననెట్లాను? గురుని సరిశిష్యుండా?**
**గురితప్పిన అంతరమున**
**అరయన్ అధికారి భేదమది లేదె హరీ!**

సంఖ్య: III/113 రాగం : ధన్నాసి
కీర్తన : అంతవాని కింతసేయ నమరునటే

ధన్నాసి

79 అంతవాని కింతసేయ నమరునటే
వింతలు యీ సుద్దులకే వెరగయ్యీ మాకు ||పల్లవి||

కదిసి బ్రహ్మాండములు గర్భములో నున్న దేవుఁ-
డిదె దేవకిగర్భాన నెట్టుపుట్టెనే
అదె మఱ్ఱాకుమీఁదట నటు పవ్వళించువాఁడు
యెదుట యశోదచేత నెట్టు వినోదించీనే ||అంత||

అడుగులుమూఁట లోకా లటు గొలచినవాఁడు
బడిబడి రేపల్లెఁ బారాడీని
అదరి యజ్ఞభాగము లారగించే దేవుఁడు
సడితో వెన్న ముచ్చిలి చవిగొనీ నిదివో ||అంత||

వేదపల్లవములందు విహరించే దేవుఁడు
సాదుగొల్లెతల రతిసంగడిఁ జిక్కె
మోదపువైకుంతాన ముదమందే కృష్ణుఁడు
యీ దెస శ్రీవేంకటాద్రి నిరవాయ నిదివో ||అంత||

**ఉపోద్ఘాతము:**

బాలకృష్ణునిపై మధురమైన కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. రేపల్లెలో ఒక గోపిక ఇంకొక గోపికతో ఈ మాటలంటోంది. అతడు అండపిండ బ్రహ్మాండమును సృష్టించి పోషిస్తున్న పరమాత్మ. తలుచుకుంటే తను సృజించినదంతా క్షణంలో సర్వనాశనం చేయగలడు. అంతవాడు ఈయన. అటువంటి వానికి వెన్నదొంగతనమేమిటి? గొల్లభామలతో చీకటితప్పులేమిటి? పోనేలే వీడుగడుగ్గాయి అనుకుందామంటే వీడే గీతాచార్యుడు. యజ్ఞకర్త, యజ్ఞభోక్త, వైకుంఠాధినాథుడు. వేదములు





చిగుళ్ళు వేసేచోట వింటూ పరవశిస్తుంటాడు, ఈ సుద్దులన్నీ వినాలంటే ఆశ్చర్యమేస్తుంది మాకు ఇవి చెప్పలేని వింతలు, అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ చెలియా! అంతవానికి (సర్వేశ్వరుడైనట్టి వానికి) ఇంతసేయ (ఇటువంటి మానవ సహజమైన అల్లరి పనులు చేయుట) అమరునటే (సరిపడుతుందా?) మాకు ఈ సుద్దులు (ఈ కథలు) వినుటకే వింతలుగా వున్నాయి. వెరగయ్యీను (ఆశ్చర్యముతో కూడిన భయమవుతోంది).

ఈ దేవుడు బ్రహ్మాండములన్నింటిని కదిసి (పొదువుకొని) తన గర్భములో దాచుకొన్నాడు. ఇటువంటి పరమాత్మ ఒక యాదవ స్త్రీ దేవకి గర్భవాసము చేసి శిశువువలె జన్మించడమేమి వింత? సృష్టి జలనిమగ్నమై పోయిననాడు పరమాత్మ శిశువువలె మఱ్ఱాకుపై పవ్వళించి సృష్టియెలా మొదలుపెట్టాలా అని ఆలోచించాడు. అట్టి పరమాత్మ రేపల్లె గొల్లెత అయిన యశోద దగ్గర యెట్లా వినోదించినాడు? ఎంత వింత?

అడుగులు మూట (మూడంటే మూడు అడుగుల్లో) లోకములనన్నింటినీ కొలిచి బలిచక్రవర్తి దర్పమునణచినవాడు రేపల్లె వీధులలో బడిబడి (వడివడిగా) పారాడాడట. ఏమి వింత! అదరి (పూని) యజ్ఞభాగములు దేవతలకు పంచి తాను ఆరగించే శ్రీమన్నారాయణుడు నేడు రేపల్లెలో గొల్లపిల్లలతో ఆడి వెన్నలు దొంగిలించి అందరికీ పెట్టి తానూ తిన్నాడు. ఇదివో వారిలో వెన్నలు చవిగొన్న (రుచిచూచిన) కృష్ణుని కథలు ఎంత వింతగానున్నాయి?

వేద వాఙ్మయము పల్లవించే (చిగుళ్ళువేసే) ప్రతి ఒక్కచోటా ఈ దేవుడు తన్మయత్వంతో వింటూ విహరిస్తుంటాడు. అటువంటి వేదపురుషుడు రేపల్లెలో గొల్లకంపుకొట్టే గొల్లభామలతో రతికేళిలో పాల్గొని వారికి చిక్కి పరవశింపజేశాడు. ఈ కృష్ణుడు వైకుంఠనగరిలో ఆనందిస్తుంటాడు. ఈదెస (నేడు ఈ తిరుమలలో) ఇదిగో శ్రీవేంకటాద్రి ఇరవాయ (ఆయన స్థానమైనది). ఇది యెంత విశేషము!!

**పద్యవివరణ:**

ఉ|| **అంతటివానికింతయును అక్కజమొప్పగయెట్టుకూడునే**
**వింతలు యిట్టి సుద్దులును విప్పలమయ్యెను విన్నమాకునున్**
**కాంతలతోటి గూడి రతి కామన దీర్చెను కోర్కెలేకయే**
**అంతయు వేంకటేశ్వరుని అద్భుత లీలనె అన్నమార్యుడున్.**

సంఖ్య: I/255 రాగం : లలిత
కీర్తన : నీవేకాచెప్ప జూపనీవె నీవేకా

**లలిత**

**80 నీవేకాచెప్ప జూపనీవెనీవేకా**
**శ్రీవిభుప్రతినిధివి సేనమొదలారి** ॥పల్లవి॥

**నీవేకా కట్టెదుర నిలుచుండి హరివద్ద**
**దేవతలఁ గనిపించే దేవుఁడవు**
**యేవంక విచ్చేసినాను యిందిరాపతికి నిజ**
**సేవకుఁడవు నీవెకా సేనమొదలారి** ॥నీవే॥

**పసిఁడిబద్దలవారు పదికోట్లు గొలువ**
**దెసల బంపులు వంపే ధీరుఁడవు**
**వసముగా ముజ్జగాలవారి నిందరిని నీ**
**సిసువులఁగా నేలిన సేనమొదలారి** ॥నీవే॥

**దొరలైన యసురుల తుత్తుమురుసేసి జగ-**
**మిరవుగా నేలితి వేకరాజ్యమై**
**పరగుసూత్రవతీపతివై వేంకటవిభు**
**సిరుల పెన్నిధి నీవే సేనమొదలారి** ॥నీవే॥

**ఉపోద్ఘాతము:**

ఇది శ్రీమన్నారాయణుని వైకుంఠంలో సైన్యాధ్యక్షుడైన విష్వక్సేనునిపై అన్నమయ్య చెప్పిన అద్భుత కీర్తన. "సేనమొదలారి" అంటే సైన్యాధ్యక్షుడని అర్థం. నీవేకా అంటే నీవేకదా! అని అర్థం. నీవేకదా! చెప్పవలెనంటే, నీవే కదా! చూపవలెనంటే, అంటున్నారు. నీవె శ్రీపతి ప్రతినిధివి, ఆయన సైన్యాధ్యక్షుడవు, అంటున్నారు. ఆ తరువాత ఆ 'సేనమొదలారి' అయిన ఆయన బాధ్యతలు అధికారాలు వివరిస్తున్నారు. అధికారం చేపట్టి పొగరెక్కిన అసురులను





తునాతునకలు చేస్తాడట శ్రీహరి సేనాపతి. జగమంతా ఏకరాజ్యమై శ్రీహరి పాలనలోకి రాగానే దానిని విష్వక్సేనుడు ఏలాడట. ఆయన సూత్రవతిభర్తట. శ్రీవేంకటపతి సిరుల రక్షకుడు, పెన్నిధి నీవేనయ్యా! అని కీర్తిస్తున్నారు.

**తాత్పర్య వివరణ:**

నీవేకా (నీవే కదా!) చెప్ప (చెప్పవలెనంటే) శ్రీవిభు ప్రతినిధివి (శ్రీపతి ప్రతినిధివి). నీవేకా (నీవే కదా!) చూపవలెనంటే ఆయన సేన మొదలారివి (సైన్యాధ్యక్షుడవు).

నీవే కదా! శ్రీహరి యెట్టయెదుటే నిలుచుండి దేవతలకు మాత్రమే కనిపించు దేవుడవు. నీ అనుజ్ఞ లేనిదే వారికి శ్రీహరి దర్శన భాగ్యం కాదు. ఇందిరాపతి ఏవంక విచ్చేసినా (ఏ సమయంలో ఏతెంచినా) ఆయన ఆంతరంగిక సేవకుడవు నీవే కదా! ఆయన బాగోగులు చూసుకొనేది. అందుకే కదా! ఆయన నిన్ను తన సేనాపతిని చేసికొనినాడు.

పసిడి బద్దలవారు (బంగారు వేత్రములు లేక బెత్తములును ధరించినవారు) పదికోట్లమంది విష్వక్సేనునికి సహాయకులుగా కొలుస్తుండగా వారిని అన్ని దిక్కులకు పంపి అంతా సక్రమంగా వుందో లేదో తెలుసుకొంటుంటాడు, ఆ ధీరుడు. ముజ్జగముల వారిని (ముల్లోకవాసులను) తన వశము చేసికొని సిసువులుగా (బిడ్డలవలె) ఏలిన సేనాపతి ఈతడే సుమా!

దొరలైన (అధిపతులైన) రాక్షసులను తుత్తురుము (తునకలు తునకలు చేసి) జగములను మిరవుగా (మర్యాదపూర్వకంగా) పరిపాలించితివి. ఆపైన సూత్రవతి అను కన్యను పరిణయమాడినావు. ఆ తరువాత శ్రీవేంకటేశ్వరుని సిరులకు రక్షకుడవై ఆయనకు పెన్నిధివలె నిల్చిన సైన్యాధ్యక్షుడవు నీవే.

**పద్యవివరణ:**

చం॥ **ఇతడట విష్ణుసేనలకు యేలిక అన్నిట సర్వదక్షుడున్**
**ఇతడట దేవతాళికిని యెట్టెదుటన్ కనుపించు ముందుగా**
**ఇతడట ముజ్జగాలగల ఈ హరిభక్తుల బిడ్డలట్లుగా**
**హితవుగజూచు, సూత్రవతి నేలెడి భర్తయు దైత్యవైరియున్.**

సంఖ్య: II/25 రాగం : వరాళి
కీర్తన : అదివో నిత్యశూ (సూ)రులు అచ్యుత నీదాసులు

**వరాళి**

**81 అదివో నిత్యశూ (సూ)రులు అచ్యుత నీదాసులు**
**యెదురులేనివారు యేకాంగవీరులు** ॥పల్లవి॥

**రచ్చల సంసారమనే రణరంగములోన**
**తచ్చి కామక్రోధాలతలలు గొట్టి**
**అచ్చుపుతిరుమంత్రపు టారుపు బొబ్బలతోడ**
**యిచ్చలనే తిరిగేరు యేకాంగవీరులు** ॥అది॥

**మొరసి పుట్టుగులనే ముచ్చుఁబొంజుల కురికి**
**తెరలి నడుములకుఁ దెగ వేసి**
**పొరిఁ గర్మముఁ బొడిచి పోటుగంటులఁదూరి**
**యెరగొని తిరిగేరు యేకాంగవీరులు** ॥అది॥

**వొడ్డిన దేహములనే వూళ్ళలోపల చొచ్చి**
**చెడ్డ యహంకార మను చెఱలువట్టి**
**అడ్డమై శ్రీవేంకటేశునందనుండి లోకులనే**
**యెడ్డలఁజూచి నవ్వేరు యేకాంగ వీరులు** ॥అది॥

**ఉపోద్ఘాతము:**

ఓ అచ్యుతా! నీదాసులు నిత్యశూరులయ్యా. వారి ధీరత్వమునకు వయసుతోనూ అండదండలతోను సంబంధంలేదు. వారు యెక్కడైనా యెదురులేనివారే. పైగా ఏకాంగవీరులు అనగా అసహాయశూరులు అంటున్నారు అన్నమయ్య. అయితే శ్రీహరిదాసుల వీరత్వానికి సామాన్యులైన రాజుల చతురంగ బలములకు తేడా యేమిటంటే, ఇక్కడ పోరాడే సైనికులు సంసార రణరంగంలో అలసిన మానవులు. వారి యుద్ధం అరిషడ్వర్గాలతో వారు యుద్ధంలో ఉత్సాహం కొరకు పెట్టే పెడబొబ్బలు పిచ్చిపిచ్చి





అరుపులు కాదు తిరుమంత్రోచ్చారణ. వారు మనకట్టెదెటే తిరుగుతుంటారు, అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ అచ్యుతా! అదివో నీదాసులు నిత్యశూరులు (ఎల్లవేళలా ధీరోదాత్తులై హరి శరణాగతిలోనే వుంటారు). వారికి ప్రాపంచిక పీకులాటవుండదు. అందువల్ల వారికి యెదురన్నది లేదు. ఒకవేళ ప్రాపంచిక భ్రమలతో పోరాడవలసివస్తే, వారు ఏకాంగవీరులు (అసహాయ శూరులు).

సందోహయుతమైన సంసార రణరంగంలో, వారి యుద్ధము, కామక్రోదాది అరిషడ్వర్గములతో వారు అవంటే జాలిచూపని నిర్దయులు. వాటి తలలు నరికివేస్తారు. వారి ఉత్సాహం "ఓం నమో నారాయణాయ" అనే తిరుమంత్రంతో అనే బొబ్బలతో ఇబ్బడవుతుంటుంది. వారు దేశాటన చేయుటకు శిష్యులను సమీకరించుటవంటి బలహీనతలు లేక ఇష్టానువర్తనులై, ఏకాంగ వీరులై వుంటారు.

మా సైనికులు మామూలు రణరంగ ధీరులేకాదు. ఇటు ముచ్చులతో (దొంగలతో) పోరాడుటలోనూ సిద్ధహస్తులే. అయితే వీరు పోరాడే బందిపోట్లు సామాన్యులు కాదు. వారు జన్మలనే పేరు బొందిన వుద్దండులు. వాటితో తలపడుట కురికి నడుములు తెగవేసి కర్మములనేకత్తులతో పొడిచి వధ్య శాలలో దూరి, నిర్భయులై తిరిగెదరు. వారు అసహాయ శూరులు. వారిని భవబంధములేమీ చేయలేవు.

సాధారణులైన మానవులకు, ఆత్మలు ఒడ్డిన దేహములు (లొంగిపోయిన శరీరములు) అనే వూళ్ళ లోపల చొచ్చి అహంకారమనే చెఱలో బంధించి వుంచటం వలన వారికి శ్రీహరి కృపకు పెద్ద అడ్డమై పోతుంది. లోకులనే అటువంటి యెడ్డెలను (తెలివితక్కువ వారిని) చూచి ఏకాంగవీరులైన హరిదాసులు పకపక నవ్వేరు.

**పద్యవివరణ:**

ఆ.వె॥ **నిత్యశూరులదివొ నీదాసులచ్యుతా!**
**ఎదురులేనివారు యెల్లజగతి**
**ఎడ్డియలను జూచి ఏకాంగవీరులు**
**విరగబడి నగెదరు వేంకటేశ!**

సంఖ్య: II/509      రాగం : బౌళి
కీర్తన : పరమపురుషుడీ బాలుడట

**బౌళి**

**82 పరమపురుషుఁ డీ బాలుఁ డఁట**
**హరవిరుంచులు మొక్కేరదివో వాకిటను** ||పల్లవి||

**దేవుఁ డితఁడు సర్వదేవతల కొడయఁడు**
**వేవేలు వేదములచే వేద్యుఁ డితఁడు**
**దేవకీదేవికి వసుదేవునికిఁ గొడుకాయ**
**ఏ విధము నోఁచిరి వీ రెంత భాగ్యవంతులో** ||పర||

**అంతటాఁదా నున్న వాఁడు అరయ స్వతంత్రుఁడు**
**అంతము నాదియు లేని ఆదిమూరితి**
**వంతుకు యశోదకు నవ్వల నందగోపునికి**
**దొంతరకొడుకైనాఁడు తొల్లి వీరేపుణ్యులో** ||పర||

**ఇందిరావల్లభుఁడు ఇహపరనాయకుఁడు**
**కందువ శ్రీవేంకటాద్రిఁ గాపున్నవాఁడు**
**మందగొల్లెతల కెల్ల మరఁది దా నై నాఁడు**
**ఇందరు నిందరే వీరి కెన్నటి సంబంధమో** ||పర||

**ఉపోద్ఘాతము:**

దేవకీగర్భస్థ శిశువై యశోదాదేవితో అల్లారుముద్దుగా పెరిగి నందుని ఇంట నవ్వులు పూయిస్తున్న ఈ బాలుడు యెవరనుకొంటున్నారు. సాక్షాత్తు పరమాత్ముడు. అదిగో మీకు కనబడరుగాని పరమశివుడు పరమేష్ఠి, ఆబాలుని వాకిట నిలబడి మొక్కుచున్నారు అని అద్భుతంగా శ్రీకృష్ణ రసాయనం త్రాగిస్తున్నారు, అన్నమయ్య. ఇదే కీర్తన యెన్నోసార్లు యెన్నో చిన్న చిన్న మార్పులతో పాడుకొని వుంటాం. పల్లవి మాత్రం మరువలేనిదిగా వుంటుంది.





ఇందిరానాథుడైన ఈతడే మన ఇహపరములకు అధిపతి. నేడు వేంకటాద్రిపై కాపుండి మనరక్షకుడు రేపల్లెలోని గొల్లెతలందరితో ఒకేవావి (చుట్టరికము) వున్నదితనికి. వారికి మరిది. వీరి సంబంధము ఈనాటిదనుకొంటున్నారా?

**తాత్పర్య వివరణ:**

ఓ ప్రజలారా! ఈ బాలుడే, పరమపురుషుడట (పరమాత్ముడట). ఇదిగో ఇతని వాకిటను హరవిరుంచులు (పరమశివుడు, బ్రహ్మదేవుడు) నిలుచుండి వానికి మొక్కుచున్నారు.

దేవుడితడు (ఇతడే పరబ్రహ్మ). దేవతలందరికీ ఒడయడు (నాథుడు) యీతడే. ఈయన తత్త్వము తెలియాలంటే వేదములన్నింటినీ ఆకళింపు చేసికొనవలసిందే. వారి పూర్వజన్మ సుకృతమువలన దేవకీ వసుదేవులకు కన్నబిడ్డయై జన్మించాడు. ఇంత సౌభాగ్యమును స్వంతం చేసికొనుటకు వీరు నోచిన విధమెట్టిదో కదా! వీరెంత భాగ్యంతులో కదా! ఏమని పొగడగలము?

ఈతడు అంతటాతానున్నవాడు (సర్వవ్యాపకుడు). సర్వస్వతంత్రుడైనవాడు. ఆది మధ్యాంతరహితుడు. ఆదిమూర్తి (ఆదిపురుషుడు). వంతుకు (వంతులు కొద్దీ) యశోదనందగోపులను నవ్వులతో ముంచే ఈ బాలుడు దొంతర కొడుకైనాడు (పరంపరగా వచ్చిన పుత్రుడైనాడు). తొల్లింటి వీరే పుణ్యములు చేశారో కదా!

ఈ బాలుడే ఇందిరాదేవి భర్తయట. జీవులకు ఇహపరములనొసగే నాయకుడు ఇతడే. నేడు కలియుగంలో సామర్థ్యముతో శ్రీవేంకటాద్రిని యేలుతున్న శ్రీవేంకటేశ్వరుడితడే. గొల్లెతల మందకెల్ల (రేపల్లె గొల్లభామలకు మూకంతటికీ) తానొక్కడే మరది అయినాడు (చెల్లెలి మగడు అయినవాడు). ఇందరూ యిందరే. వీరితో ఇది ఏనాటి బంధమో కదా!

**పద్యవివరణ:**

చం॥ **అరయగ వీడు బాలుడటె ఆదిమపూరుషుడున్ పరాత్పరుం-**
**డిరుగడ బ్రహ్మయున్‌హరుడు యేపుగమొక్కిరి నిల్చివాకిటన్**
**మురిపెము దీర్చెదేవకికి ముద్దులబిడ్డయశోదకాయెరా**
**తిరుమలరాయడే వెలసె తీర్చినకృష్ణుడు చిత్తచోరుడున్.**

సంఖ్య: I/51 రాగం : ముఖారి

కీర్తన : నదులొల్లవు నాస్నానము కడు

**ముఖారి**

**83 నదు లొల్లవు నాస్నానము కడు**
**సదరము నా కీస్నానము** ॥పల్లవి॥

**ఇరువంకల నీ యేచినముద్రలు**
**ధరియించుటె నా స్నానము**
**ధరపై నీ నిజదాసులదాసుల-**
**చరణధూళి నా స్నానము** ॥నదు॥

**తలఁపులోన నినుఁ దలఁచిన వారలఁ**
**దలఁచుటే నా స్నానము**
**వలనుగ నినుఁ గనువారల శ్రీపాద-**
**జలములే నా స్నానము** ॥నదు॥

**పరమభాగవతపాదాంబుజముల**
**దరుశనమే నా స్నానము**
**తిరువేంకటగిరిదేవ నీ కథా-**
**స్మరణమే నా స్నానము** ॥నదు॥

**ఉపోద్ఘాతము:**

నేను చేసే ఈ స్నానమును నదులుకూడా అంగీకరించవు. నాకీ స్నానము కడు వేళాకోళము వంటిది అంటున్నారు అన్నమయ్య. నా రెండువైపులా నీ తిరుముద్రలు ధరించుటయే నా స్నానము. ఈ





భూమిమీద నీ స్వంత దాసులకు దాసులెవరైతే వున్నారో వారి పాదధూళి నా శరీరంపై ధరించుటయే నా స్నానము. పరమ భాగవతోత్తముల పాదపద్మముల దర్శనమే మా స్నానము. ఓ తిరుమలదేవా! నీ కథా స్మరణమే నా స్నానము అంటున్నారు పదకవితాపితామహులు.

**తాత్పర్య వివరణ:**

నేను చేసే నా స్నానమును నదులు ఒల్లవు (అంగీకరించవు). నాకీస్నానము కడు సదరము (మిక్కిలి వేళాకోళము మరియు హాస్యాస్పదము).

నా ఇరువైపులా భుజములమీద యేచిన (ధరించిన) తిరుముద్రలు దాల్చుటయే నా స్నానము. ఈ భూమిపై నీ స్వంతదాసులకు దాసులైన వారి చరణ ధూళిని దాల్చుటయే నా స్నానము.

శ్రీ గోవిందుని తలచిన వారల (స్మరించుచుండెడివారల) తలచుచుండుటయే నా స్నానము. శ్రీహరిని కనులార దర్శించినవారి శ్రీపాదజలములను నిత్యము తీర్థముగా స్వీకరించుటయే నా స్నానము.

పరమభాగవతులైనవారి పాదపద్మముల యొక్క దరుశనమే (దర్శనమే) నేను ఇష్టపడే నా స్నానము. ఓ తిరువేంకటగిరి దేవా (శ్రీవేంకటేశ్వరా!) పవిత్రమైన పురాణకథా శ్రవణమే, వాటి స్మరణయే నా స్నానము.

**పద్యవివరణ:**

తే.గీ॥ **నదులు నాస్నానమొల్లవు సదరము జుమి!**
**పరమభాగవతుల పాదదరిశనంబె**
**నాదుస్నానము, వేంకట నగనివాస!**
**స్నానమికనాకు నీకథా శ్రవణమొకటె.**

సంఖ్య: II/502 రాగం : శ్రీరాగం
కీర్తన : ఎఱిగితి నమ్మితి నితడు దయానిధి

## శ్రీరాగం

**84 ఎఱిఁగితి నమ్మితి నితఁడు దయానిధి**
**మఱఁగులు మొరఁగులు మరి యిఁకలేవు** ||పల్లవి||

**వేదోద్ధరణుఁడు విశ్వరక్షకుఁడు**
**ఆదిమూర్తి శ్రీ అచ్యుతుఁడు**
**సోదించి కొలిచితి సుముఖుఁడై మమ్మేలె**
**యేదెస మాపాల నితఁడే కలఁడు** ||ఎఱిగి||

**పరమపురుషుఁ డాపన్నివారకుఁడు**
**హరి శాంతుఁడు నారాయణుఁడు**
**శరణంటి మితఁడు చేకొని కాచెను**
**తరవాతిపనులఁ దప్పఁ డితఁడు** ||ఎఱిగి||

**హృదయాంతరంగుఁడు యీశ్వరేశ్వరుఁడు**
**ఇదివో శ్రీవేంకటేశ్వరుఁడు**
**వెదకితి మీతఁడు విడువఁడు మమ్మిఁక**
**తుదకును మొదలికి దొరకినవాఁడు** ||ఎఱిగి||

**ఉపోద్ఘాతము:**

ఓ భక్తులారా! మేము ఇతనిని యెఱిగితిమి, ఆపై ఇతడు అమితదయానిధి అని నమ్మితిమి. మఱగు మొఱగు (చాటుమాటు) మరి ఇక అక్కరలేదు. మేము ఇతనిని బాహాటముగా కొలిచెదము గాక! అంటున్నారు అన్నమయ్య. ఈ కీర్తనలో పల్లవి అర్థంకావటానికి చాలాసేపు పట్టింది. ఇతను వేదములను ఉద్ధరించినవాడు. విశ్వమునకు రక్షకుడు, పరమపురుషుడు, ఆపదలను





నివారించువాడు, అచ్యుతుడు, శాంతమూర్తి, నారాయణుడు, హృదయాంతరంగుడు, ఈశ్వరేశ్వరుడు, అన్నీ ఈయనే. అంతెందుకు ఇతడే శ్రీవేంకటేశ్వరుడని గ్రహించి ఇతనికి శరణంటిమి అంటున్నారు. ఇతనిని విడువము. తుదకు మొదలికిని దొరికినవాడు అంటే ఏమిటి? ఆలోచించండి.

**తాత్పర్య వివరణ:**

ఓ భక్తులారా! ఎఱిగితి (ఇతని నెఱిగితిమి). ఆపై ఇతనిని నమ్మితిమి. ఇతడు దయానిధి అని తెలిసికొంటిమి. మరి ఇక మఱుగులు మొరగులు (చాటుమాటు వ్యవహారాలు) మాకు లేవు.

ఇతడు, వేదోద్ధరణుడు (వేదములను ఉద్ధరించినవాడు). విశ్వరక్షకుడు (సదా ఈ విశ్వమును రక్షించెడివాడు). ఆదిమూర్తి (పురాణపురుషుడు) శ్రీ అచ్యుతుడు (ఎన్నడూ అంతములేనివాడు). ఇతనిని శోధించి తెలిసికొని కొలిచితిమి. సుముఖుడై (అనుకూలుడై) మమ్మేలినాడు. ఇప్పుడు యెటువైపు చూచినా మాపాలిట ఇతడే కలడు ఇది మా భాగ్యము.

అంతేకాదు, యీతడే పరమ పురుషుడు (పరబ్రహ్మ), ఆపన్నివారకుడు (ఆపత్తును నివారించువాడు) శ్రీహరి. పరమశాంతమూర్తి, శ్రీమన్నారాయణుడు. ఈ విధముగా నితనిని తెలిసికొని మేము శరణంటిమి. వెంటనే ఇతడు మమ్ము చేకొని (ఆదరించి) కాచినాడు (రక్షించినాడు). తరవాతి పనులు (శరణాగతరక్షణ, మోక్షమునొసగుట) వంటి కార్యక్రమమును ఇతడు తప్పడు.

ఈతడే హృదయమున అంతర్యామియై, అంతరంగుడుగా వుంటాడు. ఇతడు ఈశ్వరునికే యేలిక. ఇదిగో ఈయనే శ్రీవేంకటేశ్వరుడు ఈతనిని వెదకి కనుగొంటిమి. ఇకపై మేము ఇతనిని విడువము. తుదకును మెదలికి దొరకనివాడు (ఆద్యంతములు కనుగొనలేనివాడు) ఈ మహానుభావుడే.

**పద్యవివరణ:**

కం|| **ఇతడు దయానిధియనినే**
**హితవుగనెఱిగితిని హరిని ఇకనమ్మితిబో**
**ఇతనికి మఱుగులు లేవిక**
**చతురుడ ఓ వేంకటేశ! సప్తగిరీశా!**

సంఖ్య: II/388 రాగం : లలిత
కీర్తన : అంతరాత్మ హరిగలడంతే చాలు

**లలిత**

**85 అంతరాత్మ హరిగలఁ డంతే చాలు**
**యెంత కెంత చింతించనేలా వెరవ** ||పల్లవి||

**వెనకజన్మపుగతి వివరించి నే నెరఁగ**
**అనుగు మీఁదటిజన్మ మది యెఱఁగ**
**ననిచి యీ జన్మము నానాఁటఁ దెలిసేము**
**యెనసి యీ భవముల కేలా వెఱవ** ||అంత||

**నిన్నటిదినముకత నిమిషమై తోఁచీని**
**కన్నుల రేపటిచేఁత కానఁగా రాదు**
**పన్ని నేఁటిదినము మున్ను నోఁచినట్లే**
**యెన్న ఁగ నెందుకు నైనా నేలా వెఱవ** ||అంత||

**పరము నిహము నేఁ బై కొన నా యిచ్చగాదు**
**హరి శ్రీవేంకటపతి యఖిలకర్త**
**శరణంటి నాతనికి స్వతంత్ర మతనిది**
**యిరవైతి నింకా నాకేలా వెఱవ** ||అంత||

**ఉపోద్ఘాతము:**

నా అంతరాత్మలో హరిగలడు. నాకు అంతే చాలు. ఇంక కోరేదేమున్నది? ఎంతకు యెంత చింతించను? వెరవనేల (భీతిల్లుటెందులకు) అంటున్నారు అన్నమయ్య. నా వెనుకటి జన్మయేదో నేను వివరించలేను. ముందువచ్చే జన్మయేదో వూహించనుకూడా లేను. ఈ జన్మలో యేమి జరుగుతున్నదో అక్కడక్కడా దెలిసేము మరి





అటువంటప్పుడు మన అదుపులో లేని భవములకు (పుట్టుకులకు) యెలా వెఱవ అని ప్రశ్నిస్తున్నారు. అఖిలకర్త అయిన శ్రీవేంకటేశ్వరుని శరణంటిమి. అతడు సర్వస్వతంత్రుడు నా భారం ఆయనే చూసుకొంటాడు అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

నా అంతరాత్మలో శ్రీహరివున్నాడు. నాకు ఆ తృప్తి చాలును. ఎంతకు నెంత చింతించను? నాకు వెరవన్‌యేల (భయపడవలసిన అవసరమేమున్నది?)

నా వెనుకటి జన్మపుగతి (యెట్లునడచినదో) వివరముగా నే నెరగను. జరగబోయే ముందటి జన్మలో యేమి అవుతానో అంతకంటే తెలియదు. ననిచి (ఆలోచిస్తే) ఈ జన్మలో యేమి జరుగుతున్నదో కొంత వరకు తెలుస్తున్నది. అటువంటప్పుడు నా అదుపులో లేని పుట్టుకలకు నేను దిగులుపడి ప్రయోజనముంటుందా?

నిన్నటిదినము కత (జరిగినదంతా) నిమిషములో జరిగింది అనే భ్రమ కలుగుతుంది. రేపు యేమి జరుగుతుందో తెలియనే తెలియదు. పన్ని (ప్రాప్తించి) నేటి దినమున జరిగేవన్నీ మున్ను నోచిన తీరుగానే జరుగుతాయి. ఇక యెంచి చూస్తే దేనికోసం మనోవ్యధ బొందాలి? భయమెందుకు?

పరముగానీ (పరలోక ప్రాప్తికాని) ఇహలోక కర్మానుభవముగాని నా చేతిలో లేవు. అవునా? విశ్వకర్త శ్రీ వేంకటేశ్వరుడే. ఆయన ఆజ్ఞావర్తనముననే యేదైనా జరుగుతుంది. ఆయన సర్వస్వతంత్రుడు. అందుకే ఆయన శరణుపొందాను. సుస్థిరంగా వున్నాను. నాకింకా యేమి భయం?

**పద్యవివరణ:**

ఆ.వె|| **అంతరాత్మలోన హరిగలడది చాలు**
**యెంతకెంత చింతయేల వెరవ**
**శరణనంటి నతని స్వాతంత్ర్యమతనిది**
**ఇరవుయైతి నింక యేల వెఱవ?**

సంఖ్య: I/424 రాగం : శంకరాభరణం
కీర్తన : అదె వాడెయిదె వీడె అందునిందు నేగెడి

## శంకరాభరణం

**86 అదె వాఁడె యిదె వీఁడె అందునిందు నేఁగీని**
**వెదకి వెదకి తిరువీధులందు దేవుఁడు** ॥పల్లవి॥

**అల సూర్యవీధి నేఁగీ నాదిత్యునితేరిమీఁద**
**కలికి కమలానందకరుఁడుగాన**
**తలపోసి అదియును దవ్వు చుట్టటిక మని**
**యిలఁ దేరిమీఁద నేఁగీ నిందిరావిభుఁడు** ॥అదె॥

**చక్క సోమవీధి నేఁగీఁ జందురుని తేరిమీఁద**
**యెక్కువైన కువలయహితుఁడుగాన**
**చుక్కలుమోచిన దవ్వు చుట్టరిక మిది యని**
**యిక్కువతో వీధి నేఁగీ నెన్నికైన దేవుఁడు** ॥అదె॥

**యింతుల మనోవీధి నేఁగీ మరుతేరిమీఁద**
**నంతటా రతిప్రియుఁ డటుగాన**
**రంతుల నదియుఁ గానరాని చుట్టరిక మని**
**వింతరీతి నేఁగీ శ్రీవేంకటేద్రిదేవుఁడు** ॥అదె॥

**ఉపోద్ఘాతము:**

తిరుమల తిరువీధులందు దేవుడు రథముపై ఊరేగుతున్నాడు. ఒక రోజు సూర్యవీధిలో (తూర్పు వీధిలో) ఆదిత్యుని రథముమీద వెళ్ళి కమలానంద కరుడైనాడట. ఏమి చమత్కారమండీ. అంత దూరపు చుట్టరికమైనా తనరథముపై సూర్యునిపెట్టుకొన్నాడట శ్రీవేంకటేశ్వరుడు. అలాగే సోమవీధిలో (పడమర వీధిలో) చంద్రప్రభ రథవాహనంమీద పోతూ కువలయహితుడు (అశ్వములనిన ప్రీతికలవాడు శ్రీనివాసుడు. కువలయము అనగా కలువలనిన ప్రీతికలవాడు చంద్రుడు.) అందుచేత నక్షత్రాలు కనబడే ప్రతిచోట చుట్టరికాలు





సమకూర్చుకొన్నాడట. అదెవాడె ఆ సూర్యప్రభమీద వాడే, ఇదెవీడె ఈ చంద్ర ప్రభమీద వీడే దానిమీదా దీనిమీదా వూరేగి వస్తున్నాడు అంటున్నారు అన్నమయ్య.

**తాత్పర్య వివరణ:**

అదెవాడె (అదిగో ఆ సూర్యప్రభ వాహనం మీద వచ్చేది వాడే శ్రీహరి) ఇదె వీడె (ఇదిగో ఈ చంద్రప్రభ వాహనం మీద వచ్చేది వీడే శ్రీహరి). అందునిందు నేగీని (దానిమీదా దీనిమీదా వూరేగివస్తున్నాడు). ఏతిరువీధిలో వున్నాడో ఈ గుంపులో కనుక్కోవటం కష్టం. వెదకి వెదకి దేవుడెందున్నాడో కనుగొనండి.

ఈ దేవునికి తనచుట్టాలంటే విపరీతమైన అభిమానం. ఆలివైపువారు ఆత్మ బంధువులు కదా! ఈయన భార్య కమల. ఆమె కమలవాసిని. ఈ సూర్యుడు కమలానందకరుడు (కమలములను వికసింపజేయువాడు). ఆచుట్టరికానికే కట్టువడి అది సూర్యవీధిలో (తూర్పువీధిలో) ఆదిత్యతేరు (సూర్యరథముపై) యేగీని. ఇందిరారమణుడు సూర్యరథంపై పోతుంటే హారతులిచ్చి మనమూ తరిద్దాం.

చంద్రుడు కువలయా నందకరుడు (కలవపూలు అంటే ప్రీతితో వాటిని వికసింపజేస్తాడు). ఈ శ్రీనివాసుడు కూడా కువలయానందకరుడే అంటే, అశ్వములకు తన కరస్పర్శచే ఆనందము కలిగించువాడు. పైగా ఈయన భార్య లక్ష్మి కూడా క్షీరసాగరపుత్రికే చంద్రుడూ అంతే. ఏమి చుట్టరికమండీ ఇది. చుక్కలు మోచిన దవ్వు చుట్టరికం. (నక్షత్రాలంత దూరపు చుట్టరికం.) ఇక చెప్పేది యేముంది. చంద్రరథంమీద చక్కగా సోమవీధి (పడమర వీధిలో) వూరేగుతున్నాడు. ఎన్నికైన ఈ దేవుడు ఇక్కువ (మక్కువ)తో చంద్రరథముపై వూరేగినాడు.

ఇది చూచి పరవశించిన, రమణుల మనోవీధులలో మన్మథరథముపై పోతున్నాడు ఈ దేవుడు. ఎందుకంటే ఈయన రతిప్రియుడు. అటుగాన (అందుకు). అన్నట్లు మన్మథుడూ రతిప్రియుడే (రతీదేవి భర్త). ఆ రతీమన్మథులు కంటికి కనుపించరు. కానరాని చుట్టరికమైనా, వింతగా శ్రీవేంకటాద్రి వీధులలో వూరేగుతున్నాడు ఈ శ్రీవేంకటేశ్వరుడు.

**పద్యవివరణ:**

కం॥ **అదె వాడె ఇదియు వీడే**
**వదలక అందుననునిందు వచ్చెను హరియై**
**వెదకీ తిరువీధుల యిటు**
**కుదిరిన మూడేసి ప్రభల కొలువరె దేవున్**

సంఖ్య: IV/234 రాగం : పాడి
కీర్తన : అనుచు బొగడ జొచ్చేరదె బ్రహ్మాదులు మింట

**పాడి**

**87 అనుచుఁ బొగడఁ జొచ్చేరదె బ్రహ్మాదులు మింట**
**మొనసి యీ బాలునికే మొక్కేము నేము** ॥పల్లవి॥

**వున్నతపు లోకములు వుదరాన నున్నవాఁడు**
**అన్నువ నీదేవకి గర్భమందు పుట్టెను**
**మన్నించి యోగీంద్రుల మదిలో నుండెడువాఁడు**
**పన్నినపొత్తులలోన బాలుఁడై వున్నాఁడు** ॥అను॥

**పాలజలధిలోన పాయని గోవిందుఁడు**
**పాలు వెన్న లారగించె పైఁడి కోరను**
**వోలిఁ దనవిష్ణుమాయ నోలలాడినట్టివాఁడు**
**చాలి మంత్రసానులచే జలకమాడీని** ॥అను॥

**ముగురువేల్పులకు మూలమైన యట్టివాఁడు**
**తగు బలభద్రునికి తమ్ముఁ డాయను**
**నిగిడి వైకుంఠమున నిలిచి రేపల్లెనుండి**
**యెగువ శ్రీవేంకటాద్రి నిరవాయ వీఁడే** ॥అను॥

**ఉపోద్ఘాతము:**

ఈ బాలుడెవరనుకున్నారు? తన ఉదరములో భువనాలను దాచుకొన్నవాడు. అయినా యీ దేవకీదేవి పొత్తిళ్ళలో వున్న ఈ యోగీశ్వరవంద్యుడు కావాలని ఆమెగర్భవాసమున పుట్టినాడు. పాలసముద్రాన్ని రేబవళ్ళూ విడవని ఈ గోవిందుడు బంగారుగిన్నెలో పాలువెన్నా ఆరగించాడు. తన విష్ణుమాయలో తానే వోలలాడినాడు. మంత్రసానులు స్నానం చేయించగా జలకమాడినాడట. ఎంత వింత! ఈయనే





బ్రహ్మవిష్ణుమహేశ్వరులకు మూలమైన పరబ్రహ్మ స్వరూపుడు. బలరామునికి తమ్ముడు నేడురేపల్లెనుండి వచ్చి వేంకటముననిల్చి శ్రీవేంకటేశ్వరుడైనాడు. అన్నమయ్య బ్రహ్మాదులు ఆ బాలుని కీర్తించారు అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

అనచు (అంటూ) బ్రహ్మాది దేవతలు, మొనసి (పూని) ఈ బాలునికే నేము (మేము) మొక్కేము (నమస్కరించెదమని), మింట (ఆకసమున నిల్చి) అదె బొగడజుచ్చేరు (కీర్తించుటకారంభించినారు).

ఉన్నతమైన లోకములు (చతుర్ధశభువనాలు) తన పొట్టలోవున్నవాడు, అన్నువ (అల్పురాలైన మానవకాంత) దేవకీదేవి గర్భమునందు పుట్టెను. ఎంత వింత! యోగీంద్రులనుమాత్రమే మన్నించి వారి మనస్సులలోనుండు నారాయణుడు పన్నిన (సిద్ధపరచిన) పొత్తిళ్ళలో బాలుడు అయినాడు. ఏమి ఈ జగన్నాటకము? దుష్టశిక్షణకు పరమాత్మ యెంత కష్టపడ్డాడు!

పాల సముద్రమున పవ్వళించి ఆదిశేషతల్పమును పాయని (విడనాడని) గోవిందుడు, కృష్ణుడైన పిమ్మట పైడికోరను (బంగారు గిన్నెలో) పాలు వెన్న ఆరగించేవాడట. నందవ్రజమున యశోదాదేవి ఒడిలో ఓలి (వరుసగా) తన విష్ణుమాయతో పరవశింపజేయువాడు, తానే ఆ మాయకు లోనై మంత్రసానులచేత పురిటిస్నానం చేయించుకొన్నాడు.

బ్రహ్మ విష్ణు మహేశ్వరులని ముగ్గురు వేర్వేరు దేవతలై సృష్టి స్థితిలయకార్యక్రమం నిర్వహించు పరమాత్మ తనసేవకుడైన ఆదిశేషునికే తమ్ముడై బలభద్ర సోదరుడైనాడు. నిగిడి (వ్యాపించి) వైకుంఠముననిలిచెడి నారాయణుడు రేపల్లెనుండి శ్రీవేంకటాద్రిపైకి వచ్చి చేరినాడు. వీడే అమరిన శ్రీవేంకటేశ్వరుడు.

**పద్యవివరణ:**

చం॥ **కనుగొనమూడులోకములు గర్భములోగల దేవకీసుతున్**
**గొనకొని పాలువెన్నలను కొల్లగ్రమింగెడి బాలు గొల్వుడీ**
**తను తీరువేంకటాధిపతి తమ్ముడు రాముని కావ్రజంబునన్**
**అనుచు పొగడ్తలన్ కొలిచిరందరు బ్రహ్మహరాదిదేవతల్.**

సంఖ్య: IV/89 రాగం : బౌళి
కీర్తన : అడ్డములేని నాలిక నాడుదురుగాక భూమి

**బౌళి**

**88 అడ్డములేని నాలిక నాడుదురుగాక భూమి**
**దొడ్డవాఁ డేమి సేసినా దోసమందు నేది** ‖పల్లవి‖

**ఆతుమలో మదనుఁ డయ్యేవాఁడవు నీవే**
**ఆతల నాలిమగఁడు ననే వారలు నీవే**
**ఘాతల పరాంగనఁ గలసితి వని నిన్ను**
**తోతో మునుల కిఁక దూరఁ జోటేదయ్యా** ‖అడ్డ‖

**దేహములోపలనున్న దీపనాగ్నియు నీవే**
**దాహము నాఁకలి నీవే తగు రుచులెల్ల నీవే**
**ఆహా శబరియెంగి లారగించి తనుమాట**
**సోహల నిందించి నవ్వఁ జోటిందునేది** ‖అడ్డ‖

**పుట్టుగు లోపలనున్న భోగము లన్నియు నీవే**
**యిట్టె ఆచారములు హీనాధికములు నీవే**
**గుట్టున శ్రీవేంకటేశ గొల్లఁడవై పుట్టినందు**
**కుట్టిపడి యెవ్వరికి నూహించఁ జోటేది** ‖అడ్డ‖

**ఉపోద్ఘాతము:**

అడ్డములేని నాలికతో అందరూఇష్టమొచ్చినట్లు మాట్లాడుతుంటారు. అందుకనే గొప్పవాడు యేమిచేసినా చెల్లుతుంది. అందులో దోసము యేదీకనబడదు అంటున్నారు అన్నమయ్య. మనుష్యుల ఆత్మల్లో మదనుడై శృంగారం ప్రదర్శించేవాడెవరు? నీవే ప్రభూ! ఆ శృంగారం జరిపే ఆలుమగలు కూడా నీవే. మరి వాళ్ళు చేస్తున్న పని బాగున్నది కాని నీవు పరస్త్రీలతో వ్యభిచరించావని నిన్ను మాటలంటున్నారు. థూ! థూ! ఈ





మునులవంటి గొప్పవాళ్ళకి దూరటానికి (నిందించుటకు) చోటెక్కడుంది అంటున్నారు. ఒకటికి రెండుసార్లు తర్కించాల్సిన కీర్తన ఇది.

**తాత్పర్య వివరణ:**

అడ్డములేని నాలుక కదా!అని అందరూ ఆడుదురుగాక ! (ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే మాట్లాడవచ్చునేమో!) ఎందుకంటే దొడ్డవాడు (గొప్పవాడు) యేమి చేసినా అందులో దోసము యేదీ కనబడదు.

ఓ దైవమా! మానవుల ఆత్మలలో మదనుడైమన్మథ తాపము కలిగిస్తున్నవాడెవరు? నీవే కదా! ఆ తాపమునను భవించే ఆలుమగలు కూడా నీవే. వాళ్ళు అట్లా శృంగారం జరిపితే తప్పులేదు. కానీ నీవు అనేకమంది పరస్త్రీలతో వ్యభిచరించావని నిన్నునిందిస్తుంటారు. తో తో (థూ! థూ!) ఈ మునులవంటి వారికి నిన్ను దూర (నిందించ) చోటెక్కడుందో తెలియదు.)

ఓ పరమాత్మా! మా దేహములలో వేడిమిని పుట్టించే దీపనాగ్ని నీవే. అదే లేకపోతే మరుక్షణమే మరణం వస్తుంది. మా జీవితాంతమూ మాకు దాహము, ఆకలి కలిగిస్తున్నది వేరెవ్వరూ కాదు నీవే.అటువంటి నీకు ఆకలి తీర్చుకోమని శబరి యెంగిలిపండ్లు తినబెట్టిందా? ఆహా!ఈ మాట నీ సోహం (నీవే నేను)అనే భావన ప్రతిపాదిస్తోంది. ఇక నిన్ను నిందించి నవ్వటానికి ఇందుచోటేది (ఆస్కారమేది!)

పుట్టుగులోపల (జన్మలలో) ప్రాప్తించే భోగములన్నీ నీ కృపవల్లనే కలుగుతున్నాయి. ఆ పుట్టుకలో వాడి ఆచారవ్యవహారములన్నీ నేర్పి నిర్వహింపజేసేది నీవే. వాడికి హీనాధిక భావనలన్నీ నీవల్లనే కలుగుతున్నాయి. ఓ శ్రీవేంకటేశ్వరా! నీకు నీవే గొల్లవాళ్ళ వంశంలో పుట్టినందుకు నిన్ను యెవ్వరు నెగ్గింపగలరు. వారికవకాశమేది?

**పద్యవివరణ:**

ఉ‖ **అడ్డము లేనినాలికని ఆడుదురందరు భూమిపై వెసన్**
**దొడ్డగువాడు చేసినను దోసములెక్కకు రాదు యెన్నడున్**
**సొడ్డిడి యెంగిలిన్ శబరి సొంపుగ నోటికి బెట్ట తింటివే**
**వడ్డినిగుంజు సప్తగిరివాస! ప్రభో! ఇవి నీకెజెల్లెబో.**

సంఖ్య: I/280 రాగం : భైరవి
కీర్తన : హరి గొలిచియు మరీ నపరములా

**భైరవి**

**89 హరిఁ గొలిచియు మరీ నపరములా**
**తిరముగ నతనినే తెలియుట గాకా** ||పల్లవి||

**పంకజనాభుని పాదములు దలఁచి**
**యింకా మరియొక యితరములా**
**అంకెల నతనినే అతనిదాసులనే**
**కొంకక నిజముగఁ గొలుచుటగాకా** ||హరి||

**పన్నగశయనుని బంట్లకు బంట్లై**
**కొన్నిటిపై మరి కోరికెలా**
**యిన్ని కోరికలు యిదియే తనకని**
**కొన్నది కోలై కోరుటగాక** ||హరి||

**వీనుల వేంకటవిభు నామామృత**
**మూనిన మతి మరియును రుచులా**
**తేనెలుగారెడి తీపు లతని నుతి**
**నానారుచులై ననుచుటగాకా** ||హరి||

**ఉపోద్ఘాతము:**

పరము అంటే అత్యంత శ్రేష్ఠమైనది అని అర్థం. ఏమిటది? మోక్షము. అపరము అంటే మోక్షం దక్కకపోవటం. హరిగొలిచిన వారికి కూడా అపరములా అంటున్నారు అన్నమయ్య. అసంభవం. స్థిరమైన ఆతని తత్త్వం తెలియాలేగానీ, ఒకసారి తెలుసుకొన్నవారికి ఆతని కృప గలుగక మానుతుందా అంటున్నారు. కొద్దిగా భావించక నేను చెప్పిన ఈ వివరణ





తట్టదు. ఒక్కసారి పంకజనాభుని పాదాలను నమ్మినవానికి ఇతరముల గూర్చిన చింత యెందులకు? ఆ జగన్నాథుని అతని సేవకులను ఆశ్రయించినవానికి ఆతని పాదములను కొలుచుచూ వుండటమే మోక్షము. వేంకటేశుని నామామృతం స్వీకరించిన అన్యములు రుచించునా అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

హరి గొలిచిన వారికి కూడా అపరములు (మోక్షము దక్కకపోవటం జన్మ చక్రబంధంలో తగులుకోవటంలాంటివి ఉంటాయా?) తిరముగ (స్థిరముగ) అతనినే తెలియుటయే మోక్షము. అటుగాక వేరొండు కలదా?

పంకజనాభుని నిజపాదదర్శనం అయినవానికి ఇంకా మరియొక ఇతరము మీద (ఇంకొకదానిపై) వ్యామోహముంటుందా? అంకెల (ఆతని ఆధీనులై) ఆశ్రీహరిని, ఆయన దాసులను కొంకక (జంకులేక) కొలిచిన, ఆతనికృప సిద్ధిస్తుంది. ఇందులో యేమాత్రమూ సందేహానికి ఆస్కారం లేదు.

పన్నగశయనుడైన శేషాచల నిలయుని బంట్లకు (భృత్యులకు) బంట్లై (భృత్యులై) వున్నవారు కోర్కెలను జయించిన ఉన్నతులు. అటువంటివారికి కొన్నిటిపై కోర్కె వుంటుందా? ఇన్ని కోరికలున్నవారికి తమకే ఇవన్నీ కావాలని అనుకొని కోలుపోయి ఆ హరిని కోరుటగాక ఇంకా యేమన్నా ప్రయోజనం వుంటుందా?

వీనులవిందుగా వేంకటవిభుని నామామృతమూనిన (ఆస్వాదించిన) మనస్సుకు మరియొకటి రుచిస్తుందా? ఆతని నుతి (కీర్తించుట) తేనెలు గారెడి తీపి పదార్థములను సేవించుటవంటిది. ఆబగా నానారుచులు నంజెడివాడు యేరుచినీ సంపూర్తిగా ఆస్వాదించలేడు.

**పద్యవివరణ:**

కం|| **హరిగొలిచియునూ మరియూ**
**తరుగని అపరముల? ఇంక దయగలిగేనా?**
**తిరమగు ఆతని దెలియక**
**తిరువేంకటరాయుడెట్లు తెలియును మతికిన్.**

సంఖ్య: IV/148    రాగం : గుండక్రియ
కీర్తన : కైకొంటేకాక కమలనాభునియాజ్ఞ

## గుండక్రియ

**90 కైకొంటేకాక కమలనాభునియాజ్ఞ**
**పైకొని యిన్నిటాను బాసివుండనేది** ॥పల్లవి॥

**హరినిర్మితములే అఖిలప్రపంచము**
**తొరలి యేమిటి నిందు దూషించేది**
**ధరణిధరునికి దాసులే జీవు లెల్లా**
**గరిమ నెవ్వరి నిందుఁ గాదనేది** ॥కైకొ॥

**వాసుదేవుకల్పితమే వరసంసారబంధము**
**దోసమంటా యెందెందు దొలఁగేది**
**శ్రీసతీశురచనలే చేకొన్న రుచులెల్ల**
**యీసుతోడ నిందుమీఁద నెట్టురోసేది** ॥కైకొ॥

**గోవిందుమాయలే కూడినట్టి పనులెల్ల**
**వేవేలై యిందు నెట్టు వేసరేది**
**శ్రీవేంకటేశుఁడే చిత్తములో ధ్యానమెల్లా**
**పావనమైతిమి యిఁకఁ బరచింత యేది** ॥కైకొ॥

**ఉపోద్ఘాతము:**

మానవుడు పరమాత్మ చేతిలో కీలుబొమ్మ. ఆ కమలనాభుని ఆజ్ఞలను శిరసావహించక తప్పదు. ప్రయత్నించి ఈ సృష్టినుండి విముఖులై హరిని బాసివుండగ సాధ్యమా? అంటున్నారు అన్నమయ్య. ఈ అఖిల ప్రపంచమూ హరి నిర్మితమే. దీనిలో దేనిని దూషించగలము? జీవులందరూ భూరమణుని దాసులే మరి, ఇక యెవరిని కాదనగలను?





సంసార బంధము సమయనిబంధము. తగులుకొన్నాక దాంట్లో తచ్చాడాల్సిందేగాని తప్పుకొని తొలగుట అయ్యేపనికాదు. శ్రీవేంకటేశుని చిత్తములో నిల్పుటే దారి, అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

కమలనాభుని యాజ్ఞ కైకొంటే కాక (స్వీకరించుట తప్ప) యెవరైనా యేమైనా స్వతంత్రించి చేయగలరా? పైకొని (ప్రయత్నించి) ఇన్నిటాను (ఇన్నిటిలో) ఈతనిని బాసివుండ (వదలివుండనగునా?)

ఈ అఖిల ప్రపంచము హరినిర్మితములే. తొరలి (కలుగజేసికొని), ఇందులో దేనిని దూషించగలను? ఈ ప్రపంచంలోని సమస్త జీవకోటి భూవల్లభుడైన శ్రీహరిదాసులే. గరిమ (చాకచక్యంతో) ఇందుయెవరిని కాదనగలను?

తల్లీదండ్రీ భార్యాబిడ్డలు తోబుట్టువులూ మొదలైనవి విశిష్టమైన సంసారబంధములు. ఇవన్నీ వాసుదేవునిచే కల్పించబడినవే. ఈ బంధము దోషభూయిష్టమని, యెక్కడెక్కడ తప్పుకొని తిరుగగలను? నేను చేకొన్న రుచులెల్లా (ఇష్టాయిష్టములన్నీ) శ్రీసతీవల్లభుని రచనలే (చమత్కారములే). ఈసుతోడ (పక్షపాత వైఖరితో) ఇందుమీద (ఇకమీదట) నెట్టురోసేది (ఏవిధంగా ఛీత్కరించగలను?)

నాకు కూడినట్టి (కుదిరిన) పనులన్నీ గోవిందుని మాయలే. వేవేలై (అనేక విధములుగా) ఇందులోనే (ఈ మాయలోనే) ఎట్లా వేసారిపోయేది? ఇది పనికాదని శ్రీవేంకటేశ్వరుని చిత్తములో ధ్యానించి పావనుడనైనాను. ఇక నాకు అన్యమైన ఆలోచనలెందుకు?

**పద్యవివరణ:**

చం॥ **కమలమునాభిలోగలుగు కంజదళాక్షుని కాదనందుమే**
**అమలుని యాజ్ఞకై కొనక ఆతని నన్నిట బాసివుందురే**
**సమయని బంధమే తగులుసాధ్యము కాదిక తప్పుకొందునే**
**ఇమడగయాత్మలో తిరుమలేశుడు దిక్కని ధ్యానమెంచితిన్.**

సంఖ్య: II/120     రాగం : దేసాళం
కీర్తన : వాదమేల సారెసారె వడి ముక్తి లేదంటా

## దేసాళం

**91 వాదమేల సారెసారె వడి ముక్తి లేదంటా**
**వేదాంతశ్రవణము వెట్టికిఁ జేసిరా** ॥పల్లవి॥

**అరయ జీవుల కెల్లా నభేదమైతే**
**గురుఁడు శిష్యుఁడు లేఁడు కూడ దర్థము**
**సొరిది నాతుమలోన సోహంభావన యైతే**
**సరి మునులదేవపూజలు చెల్లవు** ॥వాద॥

**సహజలీలావిభూతి సర్వము మిథ్యయైతే**
**బహుయాగాదికర్మాల పసలేదు**
**మహిలోని జననాలు మరణాలు మాయమైతే**
**విహితాచారాలు సేయ విధే లేదు** ॥వాద॥

**ఘటన బ్రహ్మము నిరాకారమైతేఁ బఠియింప**
**యిటు పురుషసూక్తాదు లివి మరేల**
**అటు శ్రీవేంకటేశుదాస్యములేక బిగిసితే**
**సటలాడుకొనెడి రాక్షసమత మవును** ॥వాద॥

**ఉపోద్ఘాతము:**

ప్రతిసారీ ముక్తి అనేది వుందని కొందరు లేదని కొందరు వాదులాడుకోవడం యెంత నిష్ప్రయోజనం! మన పెద్దలు ఋషులు వేదాంతశ్రవణము వెట్టి చాకిరీ కోసం చేశారా యేమిటి? దానివల్ల ముక్తి కలిగిందని వారికి తెలియదంవల్లనే అంత శ్రమపడ్డారు అంటున్నారు అన్నమయ్య. జీవులందరూ అభేదమైతే ఒకరు గురువు ఒకరు శిష్యుడు యెందుకయ్యారు? ఇద్దరికీ అభేదమంటే యెంత అర్థంలేని వాదన అది? ఆత్మలో సోహం (నీవేనేను) అనే భావననే సరియైనదైతే మునులు చేసే





దేవపూజలు చెల్లుతాయా చెప్పండి. శ్రీ వేంకటేశుని దాస్యము అనే ముక్తి మార్గము లేదని బిగిసిపోతే, భూమిఅంతా రాక్షసమతమే రాటుతేలుతుంది. దైవారాధనయే వుండదు, అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

సారె సారె (ప్రతిసారి) వడి (శీఘ్రంగా కోరుకునే) ముక్తి (మోక్షము) లేనే లేదంటూ వేదాంత శ్రవణము (వేదవేదాంగముల అధ్యయనం) వెట్టి చాకిరీ కోసం చేశారా? మోక్షాన్ని వారు పొంది యుండకపోతే వేదపఠనం దేనికి?

ఒక్కసారి ఆలోచించండి జీవులన్నీ ఒక్కటే వాటికి భేదము లేదన్నదే నిజమైతే పుట్టినవాళ్ళల్లో ఒక్కడే గురువు యెందుకు అవుతున్నాడు? తక్కిన వారంతా ఆతని శిష్యులెందుకు అవుతున్నారు? భేదముందంటేనే వారి పుట్టుక ఒక్కటికాదని అర్థం. సొరిది (వరుసగా) ఆత్మలో సోహం భావన (అదే నేను అంటే ఆత్మే నేను) అనే భావన వుంటే మునులు చేసే దేవతా పూజలు చెల్లనే చెల్లవు కదా!

పరమాత్మ లీలా విభూతి (వైభవము) మిథ్య అయినట్లయితే, ఇంతమంది లోకంలో యజ్ఞయాగాది కర్మకాండ జరుపుతారా? వాటిలో పస యేముంటుంది? కర్మఫలమే లేకపోతే జన్మలే వుండవు కదా! మరణాల తరువాత ఇక ప్రాణులు పుట్టనే కూడదు. ఇక ఆచారాలు వాటిని నిష్ఠతో పాటించడం యెందుకు? మంచి జన్మకోరేవారే మంచి పనులు చేస్తారు. ఊరకే ఒంటికి శ్రమెందుకు?

బ్రహ్మ నిరాకారమైనా, సాకారమే. యత్ భావం తత్ భవతి. అందుకే పరమాత్మ ప్రస్తుతిలో పురుషసూక్తం మనమంతా చదువుతున్నాం. లేకపోతే నిరాకారుని గొలుచుట యెట్లు? శ్రీవేంకటేశ్వరుని దాస్యమును మరచి, బిగిసితే (నరులు భీష్మించుకొంటే) రాక్షసులు సటలాడుకొంటూ (మాయామయులై) తమ మతాన్ని వ్యాపింపజేస్తారు.

**పద్యవివరణ:**

తే.గీ॥ **వడిగ ముక్తి లేదంటాను వాదమేల?**
**విమల వేదాంత శ్రవణమ్ము వెట్టి కొరకె?**
**విడచి శ్రీపతి దాస్యమున్ బిగిసియున్న**
**రాక్షస మతంబు సటిలాడు రాటుదేలి.**

సంఖ్య: IV/195　　రాగం : శుద్ధవసంతం
కీర్తన : కటకటా యీ ప్రాణి గతిగనుట యెన్నఁడో

## శుద్ధవసంతం

**92 కటకటా యీ ప్రాణి గతిగనుట యెన్నఁడో**
**అటు నా వశముగాదు హరి నీచేఁగాని** ‖పల్లవి‖

**పాపము నెరుఁగుదు బంధము నెరుఁగుదు**
**మాపుదాఁకా నివి నేను మానలేఁ గాని**
**కోపము దుర్గుణ మని కొంతగొంత యెరుఁగుదు**
**తీపుల యాసలఁబడి తిప్ప లేఁ గాని** ‖కట‖

**చూతును దుఃఖాలవారిఁ జూతును బుట్టేవారి**
**యీతల నాకు వెరపు యించుక లేదు**
**గాతల నా మనసెల్లఁ గల్పించిన ట్లవును**
**చేతనైనా చెప్పినట్టు సేయలేఁ గాని** ‖కట‖

**నా వంకఁ గడమగాఁక నా గురుఁడు తొల్లె నన్ను**
**శ్రీవేంకటేశుఁడ నీ చేతి కిచ్చెను**
**దైవ మొక్కఁడవే నీ దాసానుదాసుఁడ నైతి**
**యే విధులు నే నెరఁగ నిటు నిన్నే కాని** ‖కట‖

**ఉపోద్ఘాతము:**

ఈ జన్మమీద రోసిన అన్నమయ్య వేదన జెందుతున్నారు. అయ్యయ్యో! యీ ప్రాణికి మోక్షమెట్లా కలుగుతుందో కదా! ఓ హరీ! ఇక నాకు శక్తి లేదు. నావల్ల కాదు. నీవే దిక్కు. నీచేగాక ఇకనెవరి వల్లా కాదు తండ్రీ! ఏది పాపమో నాకు తెలియును. కానీ పాపాలు చేస్తూనే వున్నాను. ఈ సంబంధబాంధవ్యాలు ఎలా వచ్చి పోతున్నాయో యెరుగుదును అయినా చీకటి పడేదాకా వాటిని వదలను. కొంత కొంత జ్ఞానంవల్ల కోపము దుర్గుణమని యెరుగుదును కానీ తీపి ఆశలు తీరక కోపం దానంతటదే వస్తోంది. అది నా వశంలో వుండటం లేదు.నాతో ఈ భూమిలో పుట్టినవారి దుఃఖం చూసినా నాకు భయం





కలుగటం లేదు. నేనేం చేస్తున్నాను.నా మతికి తోచింది చేస్తున్నా. ఇక పాపపుణ్యాలు రాక మానుతాయా? మరి దారేమిటి?

**తాత్పర్య వివరణ:**

కటకటా! (అయ్యయ్యో!) ఈ ప్రాణి గతిగనుట (కడతేరుట లేక, మోక్షప్రాప్తి నొందుట) యెన్నడో (యెప్పుడోమరి). ఓ శ్రీహరీ నావశముగాదు (ఇక నావల్ల కాదు). నీచేగాని (నీవల్లనే కావాలి).

ప్రభూ! నేను మరీ అంత అయోమయంగాడిని కాదు. నాకూ పాపమంటే యేమిటో తెలుసును. బంధము అని దేనినంటారో తెలుసును. కానీ మాపుదాకా (పొద్దస్తమానమూ) నేను వాటిని పట్టుకొనే వ్రేలాడుతున్నాను. కొంత కొంత జ్ఞానం వుండటం వల్ల కోపము తగని దుర్గుణమని యెరుగుదును. కానీ తీపిఆశలు తీరక తిప్పలేగాక (చీకాకులు కలిగి) కోపము దానంతటదే వస్తోంది.

దేవా! నా చుట్టూ యెన్నో దుఃఖాలు పొందుతున్న వారిని చూస్తున్నాను. ఎంతోమంది పుడుతున్నారు.నిరర్ధకమైన వారి పుట్టుకలు చూస్తూనే వున్నాను. అయినా నా పుట్టుకలో లోపాలునాకు తెలియటం లేదు. నా మనస్సుకు యెట్లా తోస్తే అట్లా చేస్తున్నాను. కానీ ఇంకొకరు మంచి చెప్పినా, నా మతికి యెక్కడంలేదు. ఇంత అస్తవ్యస్తంగా వున్నది నా పరిస్థితి. ఇక దారి యేమిటి?

చివరికి నావల్లగాక నా గురువుని శరణని తొల్లె (ఆదిలోనే) ఆశ్రయించాను. ఆయన దయాళువు. ఆయన శ్రీవేంకటేశ్వరుని చేతికి నన్ను ఒప్పగించారు. నాకు నీవొక్కడవే దైవమని అన్యులు వద్దని నీకు దాసానుదాసుడనైతిని. నాకుఇంకే పద్ధతులూ తెలియవు ఇటునిన్ను తప్ప అన్యులను సేవించను. నీ చిత్తము నా ప్రాప్తము.

**పద్యవివరణ:**

ఉ‖　**పాపమునేనెరుంగనిక బంధమెరుంగను మాననైతినే**
**తీపివి ఆశలన్నియవి తీరక కోపము రేగి లేపుగా ఏపుగ**
**ఏపుగ క్రుందు జన్మలను యేనుతలంచను భీతిజెందనే**
**ఓపికపోయినా గురుని ఒద్దకు జేరితి ఇచ్చె శ్రీహరిన్.**

సంఖ్య: II/305 రాగం : ముఖారి
కీర్తన : ఇటునిను దెలియగ నెంతటివారము

**ముఖారి**

**93 ఇటు నినుఁ దెలియఁగ నెంతటివారము**
**తటుకున నాసలఁ దగులుటగాక** ||పల్లవి||

**నానామూర్తులు నగధర నీరూపు**
**యే నెలవుల ని న్నెటువలెఁ దలఁచుట**
**పూని నీ భావము పొందుగాఁ జెప్పఁగా**
**వీనులు చల్లఁగా వినుటే కాక** ||ఇటు||

**పెక్కునామములు బిరుదు లనంతము**
**లెక్కడ గొలదిగనెన్నెని పొగడుట**
**యిక్కువసేసుక యిందులో నొకటి**
**పక్కన నొకమరి పలుకుట గాక** ||ఇటు||

**వేవేలు గలవు నీ విహారభూములు**
**యే విధమున నెందెందని తిరుగుట**
**శ్రీవేంకటేశా నీ శృంగార మెల్లను**
**సేవించి ముదమునఁ జెలఁగుటగాక** ||ఇటు||

**ఉపోద్ఘాతము:**

ఓ దేవదేవా! ఈ, నీ నానామూర్తులుగా కనుపించే లీలా వినోదం అర్ధం కావాలన్నా వివిధరకములుగా వీనుల విందుచేసే నీ పలుకుల భావము అవగతం చేసికోవాలన్నా, అనేకవిధములుగా నీ అనంతమైన బిరుదులను లెక్కించి పొగడాలన్నా నీసన్నుతిలో ఒకదాని తరువాత ఇంకొక నామము పలుకవలెనన్నా నీవు తిరుగాడిన ఈ విహారభూముల్లో నేనూ తిరుగాడాలన్నా, కనులారా నయనానందకరమైన నీ శృంగారవైభవం



హరి నీమయమే అంతాను

దర్శించాలన్నా ఓ శ్రీవేంకటేశ్వరా! నిన్ను సేవించుటలో ముదమున జెలగవలయును. అప్పుడే సాధ్యము. అటుగాక అది జరిగేపనికాదు. నిన్ను తెలియుటకు మేమేంతవారమయ్యా? అని అంటున్నారు అన్నమయ్య.

**తాత్పర్య వివరణ:**

ఓ దేవదేవా! ఇటునిను దెలియగ (ఈ నీ నానామూర్తులుగా కనుపించే లీలా వినోదము, అర్థం కావాలన్నా) యెంతటివారము? మాకు చేతనైనదేముంది, తటుకున (ఆలోచన లేకుండా) ఆశల పాశంలో దగులుటగాక మరొకటుందా?

ఓ గోవర్ధనధరా! ప్రాణుల రూపములన్నియు నీవే కదా! మరి నిన్ను యెచ్చోటనే రూపములో నిన్ను తలచను (స్మరించమన్నావు?) నీ భావమెట్టిదో జ్ఞానులు బోధిస్తే మా వీనులకు చల్లదనము కలుగునట్లు మేము ఆకర్ణించుటే కాక ఇంకొకటియానందము కలిగించగలదా?

శ్రీహరి సహస్రనామ స్తోత్రప్రియుడు. ఆయన బిరుదులు (సామర్థ్య ప్రశంశలు) అనంతములు (లెక్కింపలేనివి). వీటిని కొలదిగ తక్కువచేసి సంక్షిప్తముగా ఆ శ్రీహరిని పొగడుట యెట్లు? ఈ నామములన్నిటినీ స్తోత్రము చేసేవారు ఒకే వరుసలో ఒకే రాగభావయుక్తముగా ఒక నామము ననుసరించి ఇంకొకటి వచ్చేటట్లు యెలా చదువగలుగుతున్నారు? ఆ మేధ నీవిచ్చినదే.

ఓ సర్వేశ్వరా! నీవు ప్రీతితో విహరించే విహారస్థలములు వేవేలు (పలువిధములుగానుండును.) నీవు యే రూపములో యెందు తిరుగుతుంటావో యెవ్వరు చెప్పగలరు? ఓ శ్రీవేంకటేశ్వరా! నీ శృంగార లీలావైభవాన్ని ఆకళింపుజేసికోవాలంటే అంతకన్నా నిన్ను ముదమున సేవించుట వుంటుందా?

**పద్యవివరణ:**

కం|| **నగధర! నీరూపంబులు**
**అగపడు నానా విధాల అది తెలియుటయా!**
**తెగవడని ఆసద్రెళ్ళిడి**
**వగపుల చీకాకు బడెడి బడుగులము హరీ!**

సంఖ్య: XV/5 రాగం : సాళంగనాట
కీర్తన : ఎక్కడి పురాకృతము యేమి సేసీని

**సాళంగనాట**

**94 ఎక్కడి పురాకృతము యేమి సేసీని**
**యెక్కడా బలువు నీబం ట్లెట్లుండినాఁ జెల్లును** ॥పల్లవి॥

**నీవల్లఁ బుట్టెను బ్రహ్మ నీవు సేసినదే మాయ**
**భావించి నీకుక్షిలోనే బ్రహ్మాండాలూ**
**కావింప నీ వేలికపు కమ్మనినట్టేఁ బనులు**
**దైవమా యిది యెఱిఁగి నీ దాసుఁడ నే నైతిని** ॥ఎక్కడి॥

**భూమి నీదేవులు నీవు పుట్టించిన దమృతము**
**శ్రీమంతుఁడ విన్నిటా నీసేసిన ట్టవును**
**యేమిటివాఁడు యముఁడు యెక్కడి మృత్యువు మరి**
**సామజవరద మీ శరణుచొచ్చితిని** ॥ఎక్కడి॥

**ఏడఁజూచినా నీ దాసు లెక్కడాఁ జెడుట లేదు**
**యీడులేదు శ్రీవేంకటేశ నీకును**
**యేడవిధి యేడస్వర్గ మెక్కడిది నరకము**
**జాడతో నీముద్ర నా భుజముల ధరించితి** ॥ఎక్కడి॥

**ఉపోద్ఘాతము:**

అన్నమయ్య సుపుత్రుడు పెదతిరుమలయ్య చెప్పిన చక్కటి అధ్యాత్మ కీర్తననాలకించి తరించండి. ఓ శ్రీవేంకటేశ్వరా! మిగతావారి సంగతి నాకెందుకు గాని నీ బంట్లకు మాత్రం వాళ్ళ పురాకృత కర్మఫలం గూర్చిన దిగులే అనవసరం. అది వారినేమీ చేయలేదు. బలమైన నీ దాసులు యెట్లావున్నా చెల్లుతుంది స్వామీ! వారికొచ్చిన భయమేమీ లేదు. నీవు వసుంధర భూదేవీవల్లభుడవు. అమృతము నీ సృష్టియే. అందువల్ల నీవుంటే మృత్యుభీతి యెక్కడిది? స్వర్గము, నరకము, విధిలీల వంటి





చింతలు మాకెందుకు? నా రెండు భుజములపై నీ ముద్రలు దాల్చాను నాకు కీడు యెలా జరుగుతుంది అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ దేవదేవా! ఎక్కడి, పురాకృతకర్మలు (సంచిత, ప్రారబ్ధ కర్మలు). అవి నీ దాసులను యేమిసేసీని? (ఏమి చేయగలవు? ఎక్కడా బలువు నీ బంట్లు (ఎక్కడైనా సమర్థులైన నీ దాసులు) ఎట్లా వున్నా చెల్లుతుంది.

నీ సృష్టి కార్యక్రమ నిర్వహణకు నీవు నియమించుకొన్న వారే నీ పుత్రుడు బ్రహ్మ, నీపుత్రిక మాయ. ఈ అండపిండ బ్రహ్మాండమంతా అనంతుడవైన నీకుక్షి (పొట్ట)లో నెలకొని వున్నది. ఈ ప్రపంచంలో పనులన్నీ నీవు కమ్మనినట్లే (నీ ఇష్టప్రకారమే) అవుతాయి. ఎందుకంటే సమస్తమునకు నీవే ఏలికవు. ఈ నిజం గ్రహించిన మీదట ఓ దైవమా! నేను నీ దాసుడనైపోయాను.

ప్రభూ! భూమి (భూదేవి) నీదేవుల (నీదేవేరి). అమృతము నీవల్ల పుట్టినదే. నీవు శ్రీమంతుడవు (శ్రీపతివి). అన్నిచోట్లా నీవు చెప్పినట్లే చెల్లుబాటవుతుంది. నిన్ను కాదనగలవాడా యముడు. మృత్యువు నిన్ను ధిక్కరించి రాగలదా? ఇవన్నీ తెలిసికొన్న నేను నీ దాసానుదాసుడనైనాను ఓ కరిరాజ సంరక్షకా! నన్ను కావుమయ్యా! అని నీ శరణుచొచ్చితిని.

ఆ తరువాత తిరుమల చేరుకొన్నాను. ఇక్కడికి వచ్చి చూద్దునుకదా! ఓ శ్రీవేంకటేశ్వరా! ఏడజూచినా నీ దాసులు యెన్నడూ చెడిపోయినదే లేదు. వారికి యీడు లేదు (వయోపరిమితి వుండదు). నీవు పిలిచినప్పుడు నీదగ్గరకు రావటం, అంతే. విధివ్రాతలు, స్వర్గ నరకములు, వారికి సంబంధంలేని విషయాలు. నేనూ అంతే ఎందుకంటే మేము భుజములపై నీ ముద్రలు ధరించి యున్నాము.

**పద్యవివరణ:**

తే.గీ॥ **భూమి నీదేవి, విశ్వమే తమరి రచన,**
**మృత్యుభీతియా నీవుండ సత్యవచన!**
**స్వర్గ నరకాలు, విధిలీల వంతయేల?**
**నీదుముద్రలు దాల్చిన నేదికీడు?**

సంఖ్య: IV/483 రాగం : గౌళ
కీర్తన : తలచరో జనులు యీతని పుణ్యనామములు

**గౌళ**

**95 తలఁచరో జనులు యీతని పుణ్యనామములు**
**సులభమననే సర్వశుభములు గలుగు ॥పల్లవి॥**

**హనుమంతుఁడు వాయుజుఁ డంజనాతనయుఁడు**
**వనధిలంఘనశీలవైభవుఁడు**
**దనుజాంతకుఁడు సంజీవనీశైలసాధకుఁడు**
**ఘనుఁడు కలశాపుర (కాంత?) హనుమంతుఁడు ॥తలఁచ॥**

**లంకాసాధకుఁడు లక్ష్మణప్రబోధకుఁడు**
**శంకలేని సుగ్రీవసచివుఁడు**
**పొంకపు రామునిబంటు భూమిజసంతోషదూత**
**తెంకినే కలశాపుర దేవహనుమంతుఁడు ॥తలఁచ॥**

**చటులార్జునసఖుఁడు జాతరూపవర్ణుఁడు**
**ఇటమీఁద బ్రహ్మపట్టమేలేటివాఁడు**
**నటన శ్రీవేంకటేశు నమ్మిన సేవకుఁడు**
**పటు కలశాపురప్రాంత హనుమంతుఁడు ॥తలఁచ॥**

**ఉపోద్ఘాతము:**

కలశాపుర హనుమంతునిపై అన్నమయ్య చెప్పిన చక్కటి కీర్తనను ఆస్వాదించండి. ఓ జనులారా! ఈ కలశాపురహనుమంతుని పుణ్య నామములను తలుచుకోండి అని ప్రబోధిస్తున్నారు. ఈయన సులభంగా సర్వశుభములను కలిగిస్తాడని అంటున్నారు. తరువాత కీర్తనలో ఆయన ప్రస్తుతి వున్నది. ఈయన లక్ష్మణునికే యుద్ధనీతిని ప్రబోధించాడట. ఈయన చటులార్జున సఖుడట, అంటే, చలించిపోయిన అర్జునుడు కృష్ణుని గీతాబోధతో జ్ఞానియైన పార్థుని సఖుడట ఈ హనుమంతుడు. ఈ కలశాపుర





హనుమంతుడు జాతరూపవర్ణుడట. అంటే బంగారు రంగు శరీరకాంతితో శోభిల్లెడివాడు అని అర్థం. వచ్చేమన్వంతరములో ఈయన బ్రహ్మపదవి నలంకరించి సృష్టి కార్యక్రమం నిర్వహిస్తాడట ఈ హనుమంతుడు.

**తాత్పర్య వివరణ:**

ఓ జనులారా! యీతని (ఈ కలశాపుర హనుమంతుని) పుణ్యనామములను తలచరో (స్మరించండి). ఈయన అతి సులభంగా సర్వశుభములను కలిగిస్తాడు.

ఈ హనుమంతుడు వాయుజుడు (పవన సుతుడు). అంజనీదేవి సుపుత్రుడు, ఈయనే, ఈయన వనధిని (సముద్రమును) దుమికిన గొప్ప ధైర్యము కలిగిన ఘనుడు. ఈయనకు దనుజులను మర్దించుట అంటే చాలా ప్రీతి. అర్ధరాత్రి పయనించి సంజీవని పర్వతాన్ని కూకటివ్రేళ్ళతో పెళ్ళగించి తెచ్చాడు ఈ హనుమంతుడు. ఈ కలశాపురకాంతనేలేడి హనుమంతుడు ఘన కీర్తిమంతుడు. ఘటనాఘటన సమర్థుడు కార్యదీక్షాదక్షుడు.

ఈ హనుమంతుడు లంకకు పోయి సీతను కని ఆపై లంకానగరమును దగ్ధము చేసి లంకను సాధించినాడు. లక్ష్మణునకు ద్వంద్వ యుద్ధములోని కిటుకులను ప్రబోధించినాడు. సుగ్రీవుడు ప్రతివానరుడు వాలి గూఢచారి అని నమ్మి శంకతో వుండేవాడు. అట్టి సుగ్రీవుడు శంకలేక నమ్మిన సచివుడు (మంత్రి) ఈ హనుమంతుడు. ఈయన పొంకముగల శ్రీరాముని నమ్మినబంటు. సీతకు సంతోషము కలిగించినవాడు. తెంకిన (వాసస్థానము అయిన కలశాపురదేవుడు) ఈ హనుమంతుడు.

ఈ హనుమంతుడు చటులార్జున సఖుడు (విశ్వరూపం చూసి చకితుడైన పార్థుని మిత్రుడు). జాతరూపవర్ణుడు (బంగారు శరీర ఛాయ గలవాడు). రాబోవు మన్వంతరములో బ్రహ్మపదవినలంకరించి సృష్టికర్త అవుతాడు. ఈయన నాట్యప్రియుడైన శ్రీవేంకటేశ్వరుని నమ్మినబంటు. ఈతడు పట్టుదలగల కలశాపురదాపునుండు హనుమంతుడు.

**పద్యవివరణ:**

చం॥ **తలచరొ యీమహామహుని, ధన్యుడు పొందిన పుణ్యనామముల్.**
**సులభము వీనిగొల్చుటయు సొంపుగ గల్గు శుభంబులన్నియున్**
**వెలసెను వాయునందనుడు వీథుల యీ కలశాపురంబునన్**
**కొలిచెను వేంకటేశ్వరుని కూరిమి బంటయి, బ్రహ్మనాబడున్.**

సంఖ్య: II/145 రాగం : రామక్రియ
కీర్తన : ఏలమమ్ము గాసిసేసే రింకా మీరు

**రామక్రియ**

**96 ఏలమమ్ము గాసిసేసే రింకా మీరు**
**కాలముతో నిలిచెను కైవల్యపదవి** ॥పల్లవి॥

**పాపములు హరినామపఠనచేఁ బాపుకొంటి**
**కైపుగఁ జిత్రగుప్తుఁడా కవిలె గట్టు**
**కోపులఁ బుణ్యము లెల్ల గోవిందుని కిచ్చితిమి**
**పూఁపలస్వర్గముత్రోవ భుజవేయరో** ॥ఏల॥

**ఆతుమలో నజ్ఞాన మాచార్యుఁడే పాపె**
**ఆతల జన్మాలవాకి లటు మయ్యరో**
**చేత హరిదాస్యమున జీవన్ముక్తుఁడ నైతి**
**జాతియధర్మములాల సంబంధము విడరో** ॥ఏల॥

**పరమాత్మచింతచేత బదుకు నిశ్చయ మాయె**
**ధరఁ గైవసముగావో తగు చిత్తమా**
**యిరవైన శ్రీవేంకటేశుఁ డేలుకొనె మమ్ము**
**పరదేవతలు మాకుఁ బనిలేదు మీరు** ॥ఏల॥

**ఉపోద్ఘాతము:**

ఈ కీర్తనలో అన్నమయ్య తమకు కైవల్యపదము దక్కిందనీ అది తాత్కాలికమైన కైవల్యం కాదనీ కాలముతో నిలిచి, భూత భవిష్యద్వర్తమాన కాలములలో తమను అలరించే కైవల్యపదము దక్కిందని నమ్మకంగా చెబుతున్నారు. అందుకని ఇంకా మీరు మమ్ముయేల శ్రమపెట్టెదరు మాదారిన మమ్ము వదిలేయండి అంటున్నారు. తన చిత్తము పరమాత్మ చింతతో బ్రతుక నిశ్చయించుకొన్నదని కాబట్టి చిత్తమునకు ఇంకొకదారిలేదనీ తనకు స్వాధీనము కమ్మని తెగవేసి చెబుతున్నారు. మమ్మల్ని శ్రీవేంకటేశ్వరుడే స్వయంగా ఏలుకొంటానంటుంటే ఇంకా మాకు పరదేవతలతో పనేమిటి అంటున్నారు.





**తాత్పర్య వివరణ:**

ఓ పాపకర్మమా! ఓ అజ్ఞానమా! మేము హరినామ సంస్మరణచేత పునీతులమయ్యాము. హరిదాస్యముతో జీవన్ముక్తి పొందాము. మాజోలి మీకెందుకు? ఏల ఇంకా మమ్ము గాసిసేసేరు (శ్రమపెడుతున్నారు)? మాకు కైవల్యపదము దక్కినది. స్వర్గప్రాప్తివలె ఇది తాత్కాలికమైనది కాదు. కాలముతో నిలిచినది.

ఓ పాపములారా! శ్రీహరి నామపఠనముచేత నేను నా పాపములనెల్ల బాపుకొంటి (నిర్మూలించుకొన్నాను). చిత్రగుప్తునివద్ద నీ పాపపుణ్యముల చిట్టా పుస్తకము లెక్కింపులు లేక కవిలెగట్టు (పాతబడిపోయింది.) నా పుణ్యమంతా గోవిందునికి అర్పించితిని. పూపల స్వర్గము (నిస్సారమైన స్వర్గమునకు) బుజవేయరో (సున్నా చుట్టండయ్యా!)

ఓ అజ్ఞానమా! నీవు చిరకాలం నుంచి మా ఆత్మలో తిష్టవేసికొని కూచున్నావు. కాని నేడు మా ఆచార్యుని కృప మాకు కలిగింది. ఆయన మా అజ్ఞానమునంతా బాపినారు (వదలించినారు). ఇకనైనా మా జన్మాలవాకిళ్ళు గట్టిగా మూసి వేయండి. మేమిక వాటిలో ప్రవేశించము. ఎందుకంటే హరిదాస్యము స్వీకరించిన మేము జీన్ముక్తిని పొందాము. వంశపారంపర్యంగా అలవడిన అధర్మవర్తనమా మేము ముక్తులము మీకు మాకు ఏ సంబంధమూ లేదు. ఇక మాదారిన మమ్ము వదలివేయండి.

వినండి. మా గురించి మరొక్కసారి చెబుతున్నాను. మేము మా శేష జీవితమంతా పరమాత్మ చింతలో గడపవలెనని నిశ్చయించుకొంటిమి. ఓ చిత్తమా! ఇక నీ ఆటలు సాగవు. ఇక మాకు కైవసము గావో (స్వాధీనం కాలవలసిందే). ఎందుకో తెలుసా? ఇరవైన (సుస్థిరుడైన) శ్రీవేంకటేశ్వరుడు స్వయంగా మమ్ము యేలుకొంటున్నాడు. ఇప్పుడు చెప్పండి మాకు చిల్లర కోరికలతో పనేమిటి? అవి తీర్చటానికి చిల్లరదేవుళ్ళతో మాకేల? మాదైవం ఆ ఏడుకొండలవాడే.

**పద్యవివరణ:**

కం॥ **ఏలమముగాసి బెడుదురు**
**కాలముతో నిలిచి కలిగె కైవల్యమిదే**
**విలువగు హరిదాస్యముతో**
**తొలగెను పాపాలు ముక్తి త్రోవను కంటిన్.**

సంఖ్య: IV/400 రాగం : తెలుగుగాంబోది
కీర్తన : తెగగోయుటకు హరి దివ్యనామకీర్తనము

**తెలుగుగాంబోది**

**97 తెగఁగోయుటకు హరి దివ్యనామకీర్తనము**
**వెగటునాయుధ మిది విడువకుమీ మనసా** ॥పల్లవి॥

**భవపాశములచేతఁ బట్టువడ్డదేహికి**
**యివలఁ గర్మపాశాలు యివియుఁ గొన్నే**
**తవిలె నాశాపాశతతులవి యొకకొన్ని**
**కవగూడఁ దవిలెను కామపాశములు** ॥తెగ॥

**పమ్మి లోకపురుణానుబంధపు జీవికి**
**యిమ్ముల సంసారబంధా లివియుఁ గొన్నే**
**కమ్మరఁ బుణ్యపాపకలుషబంధాలు గొన్ని**
**సమ్మతించ భోగములే సకలబంధములు** ॥తెగ॥

**శ్రీవేంకటేశ్వరుఁడు చిత్తములో నున్నవాఁడు**
**జీవుఁడు నాతనిలోనే చేకొని పాయఁడు వీఁడె**
**భావించి కొలిచిన పాయును మాయలన్ని**
**దేవుఁ డితని నమ్మిన తీరుఁబో దుఃఖములు** ॥తెగ॥

**ఉపోద్ఘాతము:**

భవపాశములను తెగవేసి కోసేయవలెనంటే మార్గమేమిటి? లేకపోతే ఏమవుతుంది? కర్మపాశము తగులుకొంటుంది. అటుపై ఆశాపాశము కట్టిపడవేస్తుంది. ఆ తరువాత కామపాశము బిగించి ఉక్కిరిబిక్కిరి చేసేస్తుంది. ఇందులో ఏ పాశమునకు కట్టువడ్డా జీవితాంతం విచారించవలసివుంటుంది అంటున్నారు అన్నమయ్య. ఇందుకు అత్యంత సులభమైన మార్గము హరిదివ్యనామకీర్తనము. ఆ సంకీర్తనము గొప్ప ఆయుధము. దాన్ని యెన్నడూ విడువరాదని హితబోధ చేస్తున్నారు. శ్రీ వేంకటేశ్వరుడు తన భక్తుల చిత్తములలోనే నెలకొనివుంటాడు. జీవుడు





ఆయననే ఆశ్రయించి పాయకవుంటాడు. అయితే ఆ భావన వున్నంతవరకు మాయ జీవుణ్ణి ఏమీచేయలేదు. ఒకసారి దేవుడికి ఈ జీవునిపై నమ్మకం కుదరగానే వాడిదుఃఖం పటాపంచలైపోతుంది.

**తాత్పర్య వివరణ:**

భవపాశమువల్ల కలిగే బంధాలను, తెగగోయుటకు (తెగనరకుటకు) ఒక్కటే చక్కని ఉపాయమున్నది. అదియే శ్రీహరి దివ్యనామకీర్తనము. ఇది భవబంధాలను తెంపు వెగటు నాయుధము (చీల్చి చెండాడెడి ఆయుధము). ఓ మనసా దీనిని యెన్నడూ విడువకుమీ (విడనాడవద్దు).

అసలే దేహికి భవపాశము (జన్మబంధము) చేత పట్టుబడవలసి వస్తున్నది. ఇవి చాలనట్లు వీడికి కర్మపాశములు కొన్ని జత అవుతాయి. ఆపై వేరొక కొన్ని ఆశాపాశములు వాటికి గట్టిగా చుట్టుకొంటాయి. వీటన్నిటికంటే మహమ్మారి ఇంకొకటి వున్నది. అదే కామపాశము. యౌవనం వచ్చిన దగ్గరనుంచి చచ్చే దాకా అది మనిషిని విడిచిపెట్టదు. మరి ఇన్ని పాశాలలో తగులుకొన్న జీవికి గతేమిటి?

పమ్మి (అతిశయించి) లోకములోని ఋణానుబంధాలతో కట్టువడిన జీవికి, ఇమ్ముల (విరివియైన) సంసార బంధాలు కొన్ని తగులుకొంటాయి. సరే వీటికి జతగా పాపపుణ్యాచరణములో కొన్ని కలుషముతో కూడిన బంధాలు వెన్నంటుతాయి. అయితే అందరమూ జాగ్రత్తగా గమనించవలసిన సత్యమేమంటే ఈ భోగములవల్ల కలిగేప్రయోజనం శూన్యము. అంతేకాక సకల బంధములు ఆ భోగాసక్తి వలననే కలుగుతున్నాయి.

శ్రీ వేంకటేశ్వరుడు యెక్కడో వైకుంఠంలో లేడు. ఆయన మన చిత్తములోనే వున్నాడు. జీవుడు వేరెక్కడనో వుండడు. ఆ స్వామిలోనే ఆయన అధీనంలో వుంటాడు. ఆయనను యెన్నడూ పాయడు (వదలడు). అట్లా భావించి శ్రీవేంకటేశుని కొలిచిన మాయ నిన్ను సత్వరమే పాయును (వదలును). ఈ దేవుని నమ్మిన ఇక దుఃఖములన్నీ తీరుతాయిపో.

**పద్యవివరణ:**

కం॥ **హరి దివ్యనామ కీర్తన**
**నరుకుచు తెగగోయు భవము నా బంధములన్**
**దొరికిన ఆయుధమును ఇక**
**మరువకునెన్నడును శంకమానుము మనసా!**

సంఖ్య: XV/85 రాగం : సామంతం
కీర్తన : పలుయోనులందు పుట్టి భ్రమసితిని

**సామంతం**

**98 పలుయోనులందు పుట్టి భ్రమసితిని**
**అలర నే నేజాతి ననుకొందునయ్యా ॥పల్లవి॥**

**వెనకజన్మముల నా వేడుకైన కాఁపురాల**
**యెనయు సతులు సుతు లెంద రెందరో**
**మునుకొని యీ జన్మమునఁ గొంద రున్నారు**
**మనసున నెవ్వరి మా వారందు నయ్యా ॥పలు॥**

**ఆదికాలమున నుండి ఆయాదేహాలు మోచి**
**ఆ దెస యేమేలు నా సొమ్మని వుంటినో**
**నాదించి యిప్పుడు గొన్ని నావియనుచు నున్నాఁడ**
**యేది సతమని వుందు యెఱిఁగించ వయ్యా ॥పలు॥**

**అన్నిటా నా బాముచూచి అంతలో శ్రీవేంకటేశ**
**యెన్నరాని విజ్ఞాన మిచ్చితి విట్టె**
**పన్నిన నా మునుపటి పాట్లెల్లా నెంచుకొంటె**
**నన్నుఁజూచి నాలోనే నవ్వువచ్చీ నయ్యా ॥పలు॥**

**ఉపోద్ఘాతము:**

అన్నమాచార్యులవారి ప్రథమ పుత్రుడు తాళ్ళపాక పెదతిరుమలాచార్యులవారు చెప్పిన అధ్యాత్మకీర్తన నాస్వాదించండి. మన పురాకృత కర్మమూలంగా జన్మలు కలుగుతుంటాయి. జన్మతోపాటే బంధుత్వాలు, వాటితో అనుబంధాలు వాటితో లంపటములు కలుగుతాయి. జీవనోపాధికి యేదో ఒక వృత్తిని చేపట్టినందువల్ల మరి కొన్ని లంపటములు తప్పవు. సతీసుతులవల్ల మరికొన్ని కొత్త బంధాలు తప్పవు. ఇవన్నీ చివరికి దుఃఖహేతువే అవుతాయి. ఇట్లా ఒక దేహం తరువాత ఇంకొకటి ధరించీ ధరించి ప్రతిసారీ అదే శాశ్వతమనే భ్రమలో వుంటాను. ఓ వేంకటేశ్వరా కొన్నాళ్ళకి నాపై కరుణతో నాకు





జ్ఞానము నిచ్చావు. అంతకుమునుపు నేను పొందిన పీకులాట తలచుకొంటే విరగబడి నవ్వాలనిపిస్తోంది.

**తాత్పర్య వివరణ:**

ఓ శ్రీవేంకటేశ్వరా! నేనింతకాలమూ పలు యోనులందు (అనేక మాతృగర్భములలో చొచ్చి) ఆ పుట్టుకే నిత్యమని భ్రమసితిని (భ్రమలో వుంటిని). మరి జన్మకొక్క జాతిలో పుట్టాను కదా! ఇప్పుడు నేనే జాతి వాడనంటే యేమి అనుకొందును?

వెనక జన్మలలో నాకు వేడుక కలిగించిన కాపురాలు యెన్నో కలిగినవి. వాటివల్ల ఆయాజన్మలలో సతులు సుతులు యెందరెందరో కుదిరినారు. ఈ జన్మలో కొందరు నాతో సహజీవనం చేస్తూ వున్నారు. మరి ఇంతమందిలో నా మనసున యెవ్వరిని నావారని భావించనయ్యా! అంతా ఎప్పటికప్పుడు మారిపోయేవారే కదా!

అనాదిగా ఆయా శరీరములు ధరించినప్పుడు ఆ శరీరభ్రమతోనే వున్నాను. దానివల్ల ఏమేలు నా సొమ్మయిందో నాకే తెలియుటలేదు. ఈ దేహానికి సంబంధించిన ఇప్పటివైభవములు నావి అని అనుకొంటున్నాను. ఇందులో నాది అనుకోటానికి ఏది శాశ్వతముగా వుంటుంది? నా బుద్ధికి తట్టడంలేదు. కాస్త విడమరచి చెప్పవయ్యా!

అమిత దయాళువైన శ్రీవేంకటేశ్వరుడు నా బాములన్నీ చూచి (నా అగచాట్లన్నిటినీ గమనించి), కరుణించి నాకు తెక్కించలేని విజ్ఞాన సంపదనిచ్చి ఒక జ్ఞానిని చేశాడు. ఓ ఇందిరారమణా! తొలి జన్మలలో అజ్ఞాన నిశీధిలో యెన్నాళ్ళున్నానో నాకే తెలియదు. మునుపటి ఆ అజ్ఞానంలో యెన్ని పాట్లుబడ్డానో నీకే తెలుసు. ఆ పాట్లని తలచుకొని నా అజ్ఞానానికి నేనే నవ్వుకొంటుంటాను. నవ్వు ఆగదు.

**పద్యవివరణ:**

చం॥ **భ్రమసితి పుట్టుకొందితిని పమ్మి అనేకములైన యోనులన్**
**అమరుచు జాతి యేదలయిన అందు రవంతయు బేధముందునా**
**కొమరులు యెందరోవలచు కొవ్వలు లెందరొ జన్మజన్మకున్**
**విమలుడ జ్ఞానమిచ్చితివి వేంకటనాయక ధన్యుడైతిబో!**

సంఖ్య: I/499 రాగం : మలహరి
కీర్తన : ఎట్లయినా జేయుము ఇక నీ చిత్తము

**మలహరి**

**99 ఎట్టయినాఁ జేయుము యిఁక నీ చిత్తము**
**కిట్టిన నీ సంకీర్తన పరుఁడ ॥పల్లవి॥**

**కొందరు జ్ఞానులు కొందరు భక్తులు**
**కొదరు వైరాగ్య కోవిదులు**
**యిందరిలో నే నెవ్వఁడఁగా నిదె**
**సందడి హరి నీ శరణాగతుఁడ ॥ఎట్ట॥**

**జపితలు గొందరు శాస్త్రులు గొందరు**
**ప్రపత్తిఁ గొందరు బలువులు**
**వుపమించఁగ ని న్నొకఁడాఁగా నిందు**
**కపురుల నీ డింగరీఁడ నేను ॥ఎట్ట॥**

**ఆచార్య పురుషులు అవ్వలఁ గొందరు**
**యేచిన సమయులై యేర్పడిరి**
**కాచేటి శ్రీవేంకటపతి నే నైతే**
**తాచి నీ దాసుల దాసుఁడను ॥ఎట్ట॥**

**ఉపోద్ఘాతము:**
"అన్యధా శరణం నాస్తి త్వమేవ శరణం మమ" ప్రభూ! నన్ను నీటముంచినా పాలముంచినా నీ చిత్తము నా భాగ్యము. ఎట్టయినా జేయుము నేను కాదనను. అసలు నేను యెంతటివాడనయ్యా? నేను కిట్టిన (నీకు సన్నిహితుడనైన) నీ సంకీర్తనాపరుడను. అంతకంటే నా విశిష్టత యేమీలేదు, అంటున్నారు అన్నమయ్య. నిన్ను ఆశ్రయించిన వారిలో కొందరు జ్ఞానలు, కొందరు భక్తులు కొందరు వైరాగ్యకోవిదులు





వున్నారు. నేను మాత్రం వీరిలో యెవ్వరినీ కాను. నేను కేవలం నీ శరణాగతుడను. ఇంతే కాక కొందరు నీ జపితులు కొందరు శాస్త్రకారులు, కొందరు శూరులు కూడా వున్నారు. నేను కేవలం నీ డింగరీడు అనదగ్గవాడను. అమిత దయాళువైన మా ఆచార్యులవారు ఓ వేంకటేశ్వరా! నీ దాసులు నేనో? వారి దాసులదాసులకు దాసుడను.

**తాత్పర్య వివరణ:**
ఓ శ్రీవేంకటేశ్వరా! నీ చిత్తము (నీ ఇష్టము). ఎట్టయినా జేయుము. నేనెంతవాడనయ్యా? కిట్టిన (నీకు చేరువయైన) నీ సంకీర్తనాకారుడను.

నీ ఆశ్రితులు యెందరెందరోవున్నారు. వారిలో కొందరు జ్ఞానస్వరూపులు. కొందరు భక్త శిఖామణులు. ఇంకొందరు వైరాగ్యనిష్ణాతులు ఉన్నారు. వారందరూ నీకు ఇష్టులే. నీ ప్రీతిపాత్రులేవారంతా. ఇందరిలో నేను ఎవ్వరినీకాను ప్రభూ! నేను నీ శరణాగతిని పొందిన నీ భక్తుడను. ఏదో నాకు తోచినట్లుగా నీ సంకీర్తనలతో సందడి చేస్తుంటాను.

నీ దయను కాంక్షించేవారిలో కొందరు శాస్త్రకోవిదులుంటారు. కొందరు జపతపములు నిర్వహించే తపశ్శీలురు వుంటారు. కొందరు ప్రపత్తితో (భక్తిపరవశులైన శరణాగతులున్నారు). సోదాహరణంగా చెప్పుటకు నేను ఇందరిలో ఒక్కడినీ గాను. నేను కపురుల (తొట్రుబాట్ల) గల నీ'డింగరీడును' (సేవకుడను).

సరే! అవతల ఇంకొందరు ఆచార్యపురుషులు నిన్ను సేవించుచుందురు. మరి కొందరు మంచి ముహూర్తమైనదేదో కానిదేదో తెలిసిన దైవజ్ఞులై వుంటారు. వారందరినీ కాచేది ఎవరు? ఓ శ్రీవేంకటేశ్వరా! నీవేనయ్యా. నామటుకు నేనైతే నీ దాసులకు దాసుడను. అంతే.

**పద్యవివరణ:**
ఉ॥ **కొందరు భక్తులున్ ధరణి గొందరు జ్ఞాన విరాగులైరిబో**
**కొందరు శాస్త్రకోవిదులు కొందరు దిట్టలుబో ప్రపత్తిలో**
**ఇందరిలోన నెవ్వడను యేను తలంచెదగాను యెవ్వడన్**
**కొందరు శ్రీహరీ! గురులు కొల్చెదవారికి దాసదాసుడన్.**

సంఖ్య: IV/18 రాగం : దేసాళం
కీర్తన : నీకు నీవే వలసితే నీవు నన్ను గాచుకొమ్ము

**దేసాళం**

**100 నీకు నీవే వలసితే నీవు నన్నుఁ గాచుకొమ్ము**
**నాకు వసగానివెల్ల నన్నుఁ బాసీనయ్యా** ||పల్లవి||

**పాపమూల మటు తొల్లి పైకొన్నదేహము**
**పాపము సేయకుండితే పక్కున నేల మాను**
**కోపమే కూడుగఁ గుడిచిన యీ బుద్ధి**
**కోపము విడువమంటే గుణమేల మాను** ||నీకు||

**అప్పు దీర్చ వచ్చినట్టి ఆయపు సంసారము**
**అప్పు దీర్చుకోకుమంటే నది యేమిటికి మాను**
**తప్పు వేయవచ్చి నన్నుఁ దగిలె నీ కర్మములు**
**తప్పులు వేయక సారెఁ దా మేల మాను** ||నీకు||

**పంచమహాపాతకాలే పట్టుకొనేయింద్రియాలు**
**పంచమహాపాతకాలే(ల) బారిఁ దోయ కేల మాను**
**అంచెల శ్రీవేంకటేశ ఆత్మలో నీవుండఁగాను**
**పొంచి నీ కరుణ నన్నుఁ బొదుగ కేల మాను** ||నీకు||

**ఉపోద్ఘాతము:**

ఓ శ్రీవేంకటేశ్వరా! కావాలనుకొంటే నీవే నన్ను రక్షించుకో నాకు వశముగానివన్నీ నన్ను వదలిపెట్టేశాయి, అంటున్నారు అన్నమయ్య. దేహధారణ జరుగుటకు కారణమే పాప పుణ్యాలు అనుభవించటానికి దేహికి శరీరం అవసరమవుటయే. మరి పాపమే చేయని వానికి దేహమెందుకు? ఇంతకాలమూ కోపమే ఆహారంగా బ్రతికిన బుద్ధి ఒక్కసారిగా కోపము





విడనాడమంటే అది జరిగే పనేనా? ఈ సంసారంలో జన్మకలిగిందే అప్పు తీర్చుకోవటం కోసం అప్పు తీర్చుకోవద్దంటే సంసారం ఊరక వుంటుందా? నా మీద తప్పువేద్దామని వచ్చి ఈ కర్మబంధము నన్ను తగులుకొన్నది. ఇక నా మీద తప్పులు వేయకుండా అదెందుకు వూరకుంటుంది, అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ వేంకటేశ్వరా! వలసితే (కావలనంటే) నీకు నీవే నన్ను గాచుకొమ్ము (రక్షించుకో). నాకు వసగానివెల్ల (వశముగానివన్నీ) నన్ను బాసీనయ్య (నన్ను వదలిపెట్టి పోయినవయ్యా!)

నేను నాపైన ధరించిన ఈ దేహము పాపము మూలంగానే నాపాలబడ్డది. ఇక మరి ఈ దేహము పాపము చేయకుండా యేవిధంగా వుంటుంది? ఈ నా బుద్ధివున్నదే, ఇది కోపమే తన ఆహారంగా మెక్కుతుంటుంది. ఇక ఇన్నాళ్ళకు ఇది తగదు నీకోపగుణం మానుకో అంటే అది మానివేస్తుందా?

ఈ సంసారంలో మనమంతా అప్పు తీర్చటానికే పుట్టాము. ఇక్కడికి రాంగానే కర్మబంధాలు తగులుకొన్నాయి. ఇక కర్మబంధాలవల్ల నాకు తగులములైనవారు నన్ను తప్పు పట్టక ఎట్లా వదలిబెడతారు?

నా పంచేంద్రియాలు (కన్ను, ముక్కు, చెవి, నాలుక మరియు చర్మము)వున్నాయే వాటి పనే నాకు పంచమహాపాతకములను అంటగట్టటము. అవి నన్ను వాటిబారినపడవేయకుండా యేలవదలును? ఓ శ్రీవేంకటేశ్వరా, నీవు అంచెలంచలుగా నా ఆత్మలో సుస్థిరుడవైనావు. ఇకపైన నీ కరుణ నాకు కాక మరెవ్వరికి కలుగుతుంది? ఒకసారి నీ దయ కలిగిందంటే ఈ జన్మలో పాపపుణ్యాలు ఇవన్నీ నన్నేం చేస్తాయి?

**పద్యవివరణ:**

తే.గీ|| **పాపమూలమే దేహమ్ము పాపమేల-**
**మానివేయును? వలసితే బూని నన్ను**
**కాచుకొమ్ము, నన్ బాసెను కాకవశము**
**విడిసిఆత్మనీవుంటివి వేంకటేశ!**

## మంగళా శాసనం

1 శ్రియః కాంతాయ కల్యాణ నిధయే నిధయేర్థినామ్
శ్రీవేంకట నివాసాయ శ్రీనివాసాయ మంగళమ్

2 లక్ష్మీసవిభ్రమాలోక సుభ్రూవిభ్రమ చక్షుషే
చక్షుషే సర్వలోకానం వేంకటేశాయ మంగళం.

3 సర్వావయవ సౌందర్య సంపదా సర్వచేతసామ్
సదా సమ్మోహనాయాస్తు వేంకటేశాయ మంగళమ్

4 నిత్యాయ నిరవద్యాయ సత్యానంద చిదాత్మనే
సర్వాంతరాత్మనే శ్రీమద్వేంకటేశాయ మంగళమ్

5 వైకుంఠ విరక్తాయ స్వామిపుష్కరిణీతటే
రమయా రమమాణాయ వేంకటేశాయ మంగళమ్

6 ఎమత్సుందర జామాతృమునిమానస వాసినే
సర్వలోక నివాసాయ శ్రీనివాసాయ మంగళమ్

7 మంగళశాసనపరైః మదాచార్యపురోగమైః
సర్వైశ్చపూర్వైః సత్కృతాయాస్తు మంగళమ్

**పద్మావతీ సమేత శ్రీశ్రీనివాస పరబ్రహ్మణేనమః**





